


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 188

ఆదివారం 28-9-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో దసరా స్ర్కాచ్ కార్డ్ స్కీమ్

సోనోవిజన్ దసరా సేల్‌లో తగ్గించిన 18% GST తో LED TV's, Air Conditioners లభిస్తున్నాయి.దానిపై దసరా తగ్గింపు స్ర్కాచ్ కార్డ్ స్కీమ్‌తో లభించే ధరలు కొనుగోలుదారులను ఆకట్టుకుంటోంది. కార్డ్ స్ర్కాచ్ చేయగా మినిమం 6% చాలా మందికి మరింత ఎక్కువ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పెద్ద కంపెనీల నుండి గృహోపకరణములు అత్యంత విస్తృతశ్రేణిలో లభిస్తున్నాయి. ముఖ్యంగా సోనోవిజన్ స్పెషల్ క్యాష్‌బ్యాక్ ఆఫర్స్‌లో 30000/- వరకు లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత.



దసరా శుభాకాంక్షలు
అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపాఱడి బుచ్చినయమ్మ, దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి ఇచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్
దసరా శుభాకాంక్షలు
LED TV's, Air Conditioners లపై తగ్గించిన 18% GST తో కొనుగోలుచేయండి,
దానిపైన దసరా ప్రత్యేక తగ్గింపు
సోనోవిజన్ దసరా సేల్
LG
Life's Good.
Celebrating Trust Across Generations
Generations change, the celebrations continue with
LG - India's Most Trusted Brand*
CELEBRATION OFFERS
Up to 20%* Cashback (On Select Debit/Credit Cards) Max. up to ₹45000 (On Select Models)
1 EMI FREE* (On Select Models)
0* Down Payment (Rest in EMIs) (On Select Models)
Fixed EMI ₹1499* Onwards (On Select Models)
FREE* MINI REFRIGERATOR worth up to ₹13999* & ₹11999* (On Select Side-by-Side Refrigerators)
LG BEST Care Ask for AMC* *Annual Maintenance Contract
India ka Celebration
CELEBRATION OFFERS
CASHBACK UP TO 20%* Max up to ₹7000 (Applicable on select 10 kg to 21/12 kg machines)
FIXED EMI STARTING FROM ₹888* (Applicable on select 9 kg & above machines)
0* DOWN PAYMENT (Rest in EMIs) (Applicable on select 6.5 kg & above machines)
LG BEST Care
LG 24 x 7 CUSTOMER CARE
08069379999
www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.x.com/lgIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
Scan to know more about LG AI TV
Regd. Office: LG Electronics India Limited, A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PLC220109
*T&C Apply. Unless mentioned otherwise, offers are valid till 31st Oct 2025 or till the stock lasts, whichever is earlier. Offers are available on selected products only, kindly check with store manager for offers before purchase. 3 Year Warranty is applicable on select LG OLED TVs. This includes 1 Year standard warranty and next 2 Year free of Cost promotional warranty. Labour cost is chargeable for 2nd & 3rd year. Cashback up to 26% or max ₹26000 (whichever is lower) is applicable on select TVs and will be posted to the consumer account after 90 days from end of offer period, unless instant cash back is active in the store. Cashback on Credit and Debit card, EMI / Non EMI transactions depends on bank to bank. 1 EMI Off & FIXED EMI (starting from ₹2999) is applicable on select TV models. Cashback & EMIs are at the sole discretion of Bank/Finance Company and is governed by their TnC. LG India Ltd. expressly disclaims any liability in any manner whatsoever. LG Best Care AMC plan starting from ₹18 per day applicable on 106cm (42) OLED TVs for 2 years Platinum plan. For more information on the plans, please visit www.lg.com/in. AMC price mentioned is in Indian Rupee and exclusive of taxes. LG reserves the right to modify, alter, withdraw or extend the offer at any point of time without any prior notice or justification. Offer cannot be clubbed and gifts cannot be redeemed for cash at any point of time. Products are available for purchase without the offers as well. Offer is applicable only on retail sales at select outlets in select cities and may not applicable on institutional sales, B2B, B2C, online channel, E- commerce, Government sales etc. and other modes of sales transactions which do not specifically fall under the category of retail sales. LG decision regarding all matters under offers shall be final and binding and no claims shall be entertained in this regard. All disputes are to be settled /adjudicated in Delhi Courts only. LG shall not be responsible for any loss or damage, if it has to alter, modify or withdraw this offer in compliance with any law, ruling, order, regulation, requirement or instruction of any Central/State Government, or for any other unavoidable reason beyond their control. This offer is subject to Force Majeure conditions including but not limited to Pandemic, Epidemic, and Natural Disasters Etc. Features are subject to change and may vary from model to model. Logos shown in the creative belong to respective trademark owners only. Product images shown are for representative purpose only. Actual products may differ. Products are available without these offers as well. For more information, please visit www.lg.com/in or contact retailer/store manager.
స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులు, అందరికి అభినందనలు
రూ. 1,00,000/- విజేత
శ్రీ పన్నాల అనిరుధ్ గారు
బొటానికల్ గార్డెన్, హైదరాబాద్.
7674076393
రూ. 1,00,000/- విజేత
శ్రీ మణి కుమార్ గారు
దేవినగర్, విజయవాడ.
8008109777
రూ. 1,00,000/- విజేత
శ్రీ బి. బాల వెంకటేశ్వర గారు
మాధవధార, విశాఖపట్నం
8885334220
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి యం. కృష్ణ వేణి గారు
ఆర్.ఆర్.అప్పారావు స్ట్రీట్, విజయవాడ
9618209926
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి పి. కృష్ణ కుమారి గారు
స్నేహపురి కాలని, గాజువాక
8985077199
రూ. 1,00,000/- విజేత
శ్రీ ఆర్. సంతోష్ శివకుమార్ గారు
సాగర్ నగర్, విశాఖపట్నం.
6302643557
రూ. 1,00,000/- విజేత
శ్రీ వక్కా గిరిబాబు గారు
బుచ్చయ్య నగర్, రాజమండ్రి
9347308113
రూ. 1,00,000/- విజేత
శ్రీ పి. శ్రీనివాస్ గారు
సీతమ్మధార, విశాఖపట్నం.
9177701617
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి యస్. సింధుచౌదరి గారు
నెహ్రూ నగర్, ఖమ్మం.
7799756667
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి ఎ. హేమలత గారు
కింగ్స్ కోర్ట్, నెల్లూరు.
9849072387
రూ. 50,000/- విజేత
శ్రీ బి. దీపక్ గారు
కొయ్యన్‌పేట, విజయనగరం.
9666191965
రూ. 50,000/- విజేత
శ్రీ హర్ష రామినేని గారు
క్రాంతినగర్, జీవకోన, తిరుపతి.
8099084808
రూ. 50,000/- విజేత
శ్రీమతి యం. హేమ గారు
బైపాస్ రోడ్, మంగళగిరి.
8885343511
రూ. 50,000/- విజేత
శ్రీ జి. విజయ్ కుమార్ గారు
కూకట్‌పల్లి, హైదరాబాద్.
9885000727
రూ. 50,000/- విజేత
శ్రీ వి. విట్టల్ గారు
బంన్‌వాడ, నిజామాబాద్.
7661803318
రూ. 50,000/- విజేత
శ్రీ యం. వెంకటేశ్వరరావు గారు
చినపరిమి, తెనాలి
8019999059
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్ - 1 ద్వారకా నగర్, వైజాగ్ 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
ద్వారకానగర్ 2వ లైన్, పోలక్స్‌స్కూల్ ఎదురు, వైజాగ్. 8712635857, 858, 859.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
ఇన్నీస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రాజమండ్రి - 4, కోటిపల్లి బస్టాండ్ వి.టి.కాలేజ్ రోడ్ - 9246666212.
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21
ఒంగోలు, బాపూజి మార్కెట్. 9246666329, 9154279911
పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంజనాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
పైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం, గొల్లగూడెం సెంటర్, 8712635854, 55, 56
అమలాపురం, కె.యస్.ఎఫ్. రోడ్, 8712416257, 58, 59.
విజయనగరం 3 లాంతర్ల సెంటర్, 9246666208, 9154281239
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం, రామలక్ష్మణ జంక్షన్, జి.టి.రోడ్. - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
దుర్గా ప్లాజా, యం.జి.రోడ్, పటమట, విజయవాడ. 8712417841, 42, 43.
రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
పాయకాపురం, విజయవాడ. 8712648704, 05, 06.
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు - 1, విజయవాడ. 9100991703, 9154281626
ఎనికేపాడు - 2, చాకలి బజార్ మెయిన్ రోడ్, విజయవాడ.-8712416250, 51, 52.
గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు, 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడిపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
నరసరావుపేట
రైల్వేస్టేషన్ రోడ్, అరండల్‌పేట. 8712648710, 11, 12.
రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43.
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
సూర్యాపేట, కుడకుడ రోడ్. 8712648761, 62, 63
నల్గొండ, ప్రకాశం బజార్. 8712648715, 16, 17.
వరంగల్
అదాలత్ సర్కిల్, హనుమకొండ. 8712648718, 19, 20.
కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్. 8712648707, 708, 709
ప్యారడైజ్ కాలని, షాద్‌నగర్. 8712648701, 02, 03.
మహబూబ్‌నగర్, మెట్టుగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, 8712635851, 52, 53
నిజామాబాద్, వినాయక్ నగర్. 8712648766, 67, 68.
మిర్యాలగూడ, ఆర్‌బిబి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర - 8712635848



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 188

SUNDAY Special | ఆదివారం 28-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆఖరి పోరాటం

41 ఏళ్ల 'ఆసియా కప్' క్రికెట్ చరిత్రలో తొలిసారి భారత్, పాకిస్తాన్ జట్లు టైటిల్ కోసం తలపడుతున్నాయి. ఆదివారం జరిగే తుదిపోరులో అజేయమైన టీమిండియాను అగచాట్లు పడుతూ ఫైనల్ చేరిన పాక్ ఢీకొట్టబోతోంది. -16లో



లబ్... డబ్... లయ తప్పొద్దు!

గతంలో 50, 40లలో కనిపించే గుండెజబ్బులు ఇప్పుడు యుక్త వయసులోనే ఎందుకు వస్తున్నాయో చెప్పే కారణాలూ, నివారణ మార్గాలపై యువతకు అవగాహనను కల్పించే ప్రత్యేక కథనం... -15లో

న్యూస్‌రీల్

ఆదా, ఆదాయం డబుల్



జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు డబుల్ బచత్ (ఆదా), డబుల్ కమాయి (ఆదాయం) కల్పించడానికి బీజేపీ చర్యలు చేపట్టిందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన శనివారం ఒడిశాలో రూ.50 వేల కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు.

- వివరాలు 6లో▶

ఫ్యూచర్ సిటీకి నేడు అంకురార్పణ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 10.30కి శంకుస్థాపన చేయనున్నారు. ఎఫ్‌సీడీఏ పరిపాలన భవనాలకు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూమిపూజ చేస్తారు.

- వివరాలు 7లో▶

అనంత గర్జన!



పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో శత్రువుల కుట్రలను తిప్పికొట్టేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన 'అనంత శస్త్ర' క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయాలని భారత సైన్యం నిర్ణయించింది. రూ.30 వేల కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు.

- వివరాలు 6లో▶

నమ్మి గెలిపిస్తే.. నమ్మక ద్రోహం

కాలం కలిసొచ్చి గెలిచినంత మాత్రాన కారణజన్ములు కాలేరు

'కొలువుల పండుగ'లో బీఆర్‌ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

- పదేళ్లలో ఒక్క గ్రూప్-1 ఉద్యోగం కూడా భర్తీ చేయని బీఆర్‌ఎస్
- వారి కుటుంబ సభ్యుల ఉద్యోగాల గురించి మాత్రమే ఆలోచించారు
- మా ప్రభుత్వంలో 19 నెలల్లోనే 562 గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీ
- గ్రూప్-1 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత
- తల్లిదండ్రులను విస్మరిస్తే జీతం కోసి వారికి ఇస్తామని హెచ్చరిక
- తెలంగాణ మేధాశక్తిని ప్రపంచానికి చాటుదాం: భట్టి విక్రమార్క

17 లో



గ్రూప్-1 టాపర్ లక్ష్మీదీపికకు నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులు

ఇక విదేశీ పర్యాటకుల గమ్యస్థానం తెలంగాణ

- పర్యాటకంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు సాధిస్తాం: సీఎం
- ఏడాదిలోనే రూ.15 వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి

8 లో



విజయ్ ప్రచారసభకు భారీగా హాజరైన అభిమానులు

తమిళనాడులో ఘోరం

విజయ్ ప్రచారంలో తొక్కిసలాట

38 మంది మృతి

25 మంది పరిస్థితి విషమం

మరో 45 మందికి గాయాలు

- మృతుల్లో 8 మంది పిల్లలు, 16 మంది మహిళలు
- కరూర్‌లో విషాదం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- అర్ధరాత్రి ఘటనాస్థలికి సీఎం స్టాలిన్
- నేడు బాధితులకు పరామర్శ

18 లో



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తూ..



మూసారాంబాగ్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

భయపెట్టిన మూసీ

భారీ వర్షాలకు హైదరాబాద్‌లో పోటెత్తిన వరద

- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లెత్తటంతో ఉగ్రరూపం..... నీట మునిగిన పరీవాహక ప్రాంతాలు.. ఎంజీబీఎస్ మూసివేత
- లోలెవెల్ వంతెనలు క్లోజ్.. వాహనాల దారిమళ్లింపు
- వేలమంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- శనివారం సాయంత్రానికి తగ్గిన వరద ఉధృతి
- మంజీర ఉగ్రరూపం.. కొట్టుకుపోయిన ఏడుపాయల గుడి ప్రసాదం కౌంటర్

7 లో



చాదర్‌ఘాట్‌లో డ్రోన్ ద్వారా ఆహార పంపిణీ

రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే మూసీకి వరదలు

- రూ.1.5 లక్షల కోట్ల దోపిడీ కోసమే హైదరాబాద్ ప్రజలను ముంచిండు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు

7 లో

పోలీస్ బలుపుపై ఏపీ హైకోర్టు ఫైర్

గుంటూరు ఎస్పీని పిలిపించి మంగళగిరి సీఐపై కేసుకు ఆదేశం


- విధుల్లో ఉన్న హైకోర్టు డ్రైవర్ లక్ష్మీనారాయణపై సీఐ తీవ్రంగా దాడి
- జడ్జీలకు ఫైళ్లు ఇచ్చేందుకు వెళ్తుండగా వాహనం ఆపి కొట్టిన వైనం
- చెంప కందిపోయేలా పదేపదే దాడి... తీవ్రంగా పరిగణించిన హైకోర్టు వర్గాలు
- తమ ఉద్యోగిపై చెయ్యి వేయడమంటే హైకోర్టుపై వేయడమేనని వ్యాఖ్య
- న్యాయస్థానం పిలుపుతో తెల్లారి ఉదయమే హైకోర్టుకు వచ్చిన ఎస్పీ
- హైకోర్టు డ్రైవర్‌నని లక్ష్మీనారాయణ చెప్పినా పట్టించుకోని పోలీసులు
- పోలీసుల దాడిపై హైకోర్టులో 'కీలక' వ్యక్తిని కలిసిన జడ్జీల డ్రైవర్లు
- లక్ష్మీనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మంగళగిరి పోలీసులు
- కానీ, నిందితుల జాబితాలో 'సీఐ' అని మాత్రమే రాసి అతితెలివి ప్రదర్శన
- హైకోర్టు తీవ్రస్థాయిలో స్పందించడంతో 'సీఐ శ్రీనివాసరావు' అని చేర్పు

14 లో

బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

- పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయలేదు
- రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీ తీర్మానాన్ని కాదనలేం
- అయితే ఆ బిల్లును ఇంకా గవర్నర్ ఆమోదించలేదు
- పెండింగ్‌లో ఉండగా జీఓ ఎలా జారీ చేస్తారు?
- ఈ దశలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను సమర్థించలేం
- అలా అని ఇప్పటికిప్పుడు ఎలాంటి స్టే ఇవ్వలేం
- ఇరువైపులా పూర్తి వాదనలు విని తీర్పు వెల్లడిస్తాం
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా విచారణ చేస్తాం
- చట్ట ప్రకారం తీర్పు మేరకే రిజర్వేషన్ల అమలు
- ప్రతివాదులకు నోటీసులు జారీ
- తదుపరి విచారణ వచ్చే నెల 8కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకని సర్కార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లు ఆమోదం పొందే వరకు ఆగొచ్చు కదా.. పంచాయతీరాజ్ చట్ట సవరణ చేయకుండా జీఓ జారీ చేస్తే రిజర్వేషన్ల పెంపుపై మీ స్ఫూర్తి దెబ్బ తింటుందని కదా అని ప్రశ్నించింది. చట్ట ప్రకారం తాము ఇచ్చే తీర్పుమేరకే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని హైకోర్టు తేల్చి చెప్పింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం తెలిపినా, ఆ బిల్లును మిగతా 8వ పేజీలో ▶

జెడ్పీ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు

ఆదివారం ఎస్ఈసీకి అందే అవకాశం..

ఆ వెంటనే నోటిఫికేషన్?

8 లో

రిజర్వేషన్ల జాబితా అందగానే..



తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు

- విధుల్లో చెడ్డ పేరు తెచ్చే వారిపై చర్యలు ఉంటాయి
- సైబర్ నేరాలు, మత్తు పదార్థాల కట్టడిపై దృష్టి పెడతా
- శిక్షల శాతం పెంచేలా నేర దర్యాప్తు పటిష్టం చేస్తా
- సామాన్యులకు సేవలు అందేలా కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఫోకస్



'సాక్షి' ఇంటర్వ్యూలో కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

"డ్రగ్స్ సమాజానికి ఒక మహమ్మారిలాగా మారాయి. ప్రజల భాగస్వామ్యంతో కలిసి డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాను. అలాగే ప్రస్తుతం సైబర్ నేరాలు సమాజానికి అతిపెద్ద సవాల్‌గా మారాయి. ఈ నేరాల కట్టడికి.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అదేస్థాయిలో పోలీసులు సైతం అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకుంటా.

3 లో


వైఎస్ జగన్ అందరినీ గౌరవించారు

- చిరంజీవిని, సినిమా పరిశ్రమ పెద్దలను సాదరంగా ఆహ్వానించారు
- సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చొరవ చూపారు
- ఏ ఒక్కరినీ అవమానించలేదు
- వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా దుష్ప్రచారం తగదు



పీపుల్స్ స్టార్, హీరో ఆర్.నారాయణమూర్తి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గురువారం కొందరు పెద్దలు చేసిన వ్యాఖ్యలపై మెగాస్టార్ చిరంజీవి స్పందించిన తీరు నూటికి నూరు శాతం సత్యమని సినిమా హీరో, దర్శకుడు, నిర్మాత, రచయిత, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మెగాస్టార్ చిరంజీవితో పాటు తనను కలిసిన సినిమా పరిశ్రమ పెద్దలందరినీ సాదరంగా ఆహ్వానించి, గౌరవించారని అన్నారు. వైఎస్ జగన్ ఎవరినీ అవమానించ లేదని మిగతా 14వ పేజీలో ▶



సీవీ ఆనంద్



సజ్జనార్



చారుసిన్హా

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్
- ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి, విజిలెన్స్ డీజీగా విజయ్‌కుమార్
- ఏసీబీ డీజీగా చారుసిన్హాకు అదనపు బాధ్యతలు
- 23 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం.. ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

3 లో

వ్యవసాయ శాఖ కార్యదర్శిగా సురేంద్రమోహన్

- వాణిజ్య పన్నులకు రఘునందన్‌రావు
- రిజ్వీకి సాధారణ పరిపాలన శాఖ అదనపు బాధ్యతలు
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా ఎం.హరిత
- పలువురు ఐఏఎస్‌ల బదిలీలు...

3 లో


విజయ్ సేల్స్
నమ్మకం ముఖ్యం
www.vijaysales.com
షోరూమ్‌లు ఉదయం 10.00 గంటలకు తెరవబడతాయి
విజయ్ సేల్స్
దసరా పండుగ సంబరాలు
సంతోషం కలిగిస్తాయి
GST భారీగా తగ్గింపు
కొనండి మరియు ప్రయాణించండి ₹3,000* వరకు ఫ్లైట్/సినిమా వోచర్‌తో
Paytm Flight Tickets
TELEVISIONS
RANGE AVAILABLE FROM 32 (80 cm) TO 100 (254 cm)
GST ON TELEVISIONS REDUCED FROM 28% TO 18%
UPTO 26% CASHBACK*
UPTO ₹26,000
OLED QLED QNED NanoCell Mini LED Google TV webOS TIZEN
VISE SONY Haier LG Panasonic SANSUI TCL LLOYD
DEAL OF DAY
VISE 40 QLED Google TV
PRICE ₹16,990
HDB FINANCIAL SERVICES CASHBACK UPTO ₹1,100*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹15,890
ZERO DOWN PAYMENT | EMI ₹2,123 x 8 Months
Panasonic 43 4K UHD Google TV
CASHBACK UPTO ₹3,500
EMI STARTS FROM ₹3,874
SONY 55 4K UHD Google TV
CASHBACK UPTO ₹5,000
EMI STARTS FROM ₹5,500
SANSUI 65 4K QLED Google TV
PRICE ₹44,990
HDB FINANCIAL SERVICES CASHBACK UPTO ₹3,100*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹41,890
DOWN PAYMENT ₹8,998 | EMI ₹4,499 x 8 Months
DAIKIN 3/5 STAR INVERTER AC CAPACITY 1T/1.5 T/2 T
SAMSUNG 3/5 STAR INVERTER AC CAPACITY 1T/1.5 T/2 T
BLUE STAR 3/5 STAR INVERTER AC CAPACITY 1T/1.5 T/2 T
VOLTAS 3/5 STAR INVERTER AC CAPACITY 1T/1.5 T/2 T
GST ON ACs REDUCED FROM 28% TO 18%
SAVE UPTO ₹5,000
FREE 1+4 YEAR ADDITIONAL WARRANTY*
AIR CONDITIONERS START FROM ₹22,990
10 YEAR COMPRESSOR WARRANTY*
FREE STANDARD INSTALLATION*
WIDEST RANGE OF DISHWASHERS
GST ON DISHWASHERS REDUCED FROM 28% TO 18%
STARTING FROM ₹24,990
LG IFB TOSHIBA BOSCH
LLOYD TOP LOAD WASHING MACHINE (7 KG)
PRICE ₹25,990 OFFER PRICE ₹13,499* 5% OFF
UPTO ₹2,000 CASHBACK*
Panasonic FRONT LOAD WASHING MACHINE (8 KG)
PRICE ₹51,500 OFFER PRICE ₹24,990 12.5% OFF
UPTO ₹6,000 CASHBACK*
VOLTAS beko FROST FREE REFRIGERATOR (230 LITRES)
PRICE ₹38,490 OFFER PRICE ₹18,990* 51% OFF
UPTO ₹2,800 CASHBACK*
Midea SIDE BY SIDE REFRIGERATOR (563 LITRES)
PRICE ₹99,990 OFFER PRICE ₹43,990* 56% OFF
UPTO ₹3,500 CASHBACK*
vivo
Y31 5G 6 GB | 128 GB EFFECTIVE PRICE ₹14,999*
Y31 PRO 5G 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹17,499*
SAMSUNG
A17 5G 6 GB | 128 GB EFFECTIVE PRICE ₹17,999*
A36 5G 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹25,999*
oppo
F31 5G 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹20,999*
F31 PRO 5G 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹24,499*
NOTHING
(3A) 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹21,999*
(3A) PRO 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹25,999*
ONEPLUS
NORD CE5 5G 8 GB | 128 GB EFFECTIVE PRICE ₹22,499*
NORD 5 5G 8 GB | 256 GB EFFECTIVE PRICE ₹29,499*
ABOVE PRICES AFTER BRAND CASHBACK*
iPhone 16 (128 GB)
DISCOUNT ₹2,800*
CASHBACK ₹4,000*
OFFER PRICE ₹63,100
EMI STARTING AT ₹5,592
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, XPS, ALIENWARE
• Cashback Upto ₹10,000/-*
• 1 Year Extended Warranty + 2 Year ADP @ ₹1,299/-*
• Canon Printer @ ₹1,999/-*
hp
OMNIBOOK, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cashback upto ₹15,000/-*
• 1st Year ADP Starting @ ₹999/-*
• Fossil Watch @ ₹999/-*
ASUS
ROG, STRIX, ZENBOOK, TUF GAMING, ZEPHYRUS DUO
• Cashback Upto ₹3,000/-*
• Gaming Warranty Starts @ ₹699/-*
• Asus Silent Mouse @ ₹99/-*
MacBook Air
Sky high performance with M4
Starting from ₹79,900*
Upto 24 months No Cost Emi on HDFC BANK
SBI card | ICICI Bank
+ Exchange bonus Up to ₹10,000*
ICICI Bank INSTANT DISCOUNT UPTO ₹12,500* ON CREDIT CARDS NON EMI, CREDIT & DEBIT CARDS EMI TRANSACTIONS
HDFC BANK FESTIVE TREATS INSTANT DISCOUNT UPTO ₹7,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
HSBC INSTANT DISCOUNT UPTO ₹7,500* ON CREDIT CARDS EMI & NON EMI TRANSACTIONS
AMERICAN EXPRESS RBL BANK IndusInd Bank onecard IDFC FIRST Bank SBI card YES BANK BOBCARD pnb DBS HDB FINANCIAL SERVICES kotak
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
ఎఎస్ రావు నగర్ | అత్తాపూర్ | బిహెచ్ఇఎల్ | చాంద్రాయణగుట్ట (హాఫీజ్ బాబా నగర్ మెయిన్ రోడ్డు) | హస్తినాపురం | హయాత్‌నగర్ | జూబ్లీ హిల్స్ | కర్మన్‌ఘాట్ | కొంపల్లి | కొత్తపేట | కొండాపూర్ | కుకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మెహదీపట్నం | మైలార్‌దేవ్‌పల్లి | నాగారం | నాగోల్ | నల్లకుంట | నాచారం | ప్యారడైజ్ | పంజాగుట్ట | పీర్జాదిగూడ (బోడుప్పల్) | ఆర్ సి పురం | షా అలి బండ | సుచిత్ర క్రాస్ రోడ్ | సన్‌సిటీ | టోలిచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హనమకొండ
జూబ్లీ హిల్స్: మెట్రో పిల్లర్ 1684 ఎదురుగా, రోడ్ నం. 36 | ప్యారడైజ్: ఆస్థానీ హోటల్ పక్కన | పంజాగుట్ట: దిగువ గ్రౌండ్ ఫ్లోర్, జిఎస్ సెంటర్ పాయింట్ (హైదరాబాద్ సెంట్రల్) | కొంపల్లి: రాయల్ ఓక్ ఎదురుగా
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier Bank. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *Cashback Applicable Select Banks & Cards

తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు

విధుల్లో చెడ్డ పేరు తెచ్చే వారిపై చర్యలు ఉంటాయి

'సాక్షి' ఇంటర్వ్యూలో కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడే సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. విధుల్లో హద్దు దాటే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అవినీతి అధికారుల విషయంలో ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా వ్యవహరిస్తోందని, ఇటీవల పెరిగిన ఏసీబీ దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. సైబర్ నేరాల కట్టడిలో సైబర్ నేరగాళ్ల కంటే పోలీసులు ముందుండేలా చర్యలు తీసుకుంటానని, సమాజానికి మహమ్మారిలా మారిన మత్తు పదార్థాల ముఠాల పీచమణిచేలా కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. డీజీపీగా శివధర్‌రెడ్డి అక్టోబర్ 1న బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: సైబర్ నేరాలు పోలీసులకు అతిపెద్ద సవాలుగా మారాయి? సైబర్ నేరగాళ్ల విషయంలో మీ వైఖరి?

శివధర్‌రెడ్డి: నిజమే..ఈ రోజుల్లో సైబర్ నేరాలు అతిపెద్ద సవాలుగా మారాయి. సైబర్ నేరగాళ్లు ప్రపంచంలో ఎక్కడో, ఏదో మూలన తాపీగా కూర్చొని మన బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. ఇలాంటి నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి పెడతా. సైబర్ దొంగల కంటే ఒక అడుగు ముందుండేలా మన పోలీస్ వ్యవస్థ తయారు కావాలి. అప్పుడే ఈ తరహా నేరాల కట్టడి, దర్యాప్తు సాధ్యం. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అదే స్థాయిలో పోలీసులు సైతం అప్‌డేట్ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: మత్తు ముఠాల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి? వీటి కట్టడికి ఏ చర్యలు తీసుకుంటారు?

శివధర్‌రెడ్డి: గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం ఇప్పటికే చాలా చర్యలు తీసుకుంటోంది. ఈగల్ టీం కూడా చాలా స్ట్రాంగ్‌గా పనిచేస్తోంది. డ్రగ్స్ సమాజానికి ఒక మహమ్మారిలాగా మారింది. ఒక్క పోలీసుతోనే దీని నిర్మూలన సాధ్యం కాదు. ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున సహకారం కావాలి. వారితో కలిసి డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాను.

సాక్షి: శిక్షల శాతం పెంచేలా దర్యాప్తులో లోపాలు తగ్గించేందుకు, పోలీస్, ప్రాసిక్యూషన్ వ్యవస్థల మధ్య సమన్వయం పెంచేందుకు ఏ చర్యలు తీసుకుంటారు?

శివధర్‌రెడ్డి: నేరస్తులకు శిక్షలు పడితేనే మార్పు సాధ్యం. కన్విక్షన్ రేట్ పెంచడంపై ప్రత్యేకంగా దృష్టి పెడతాను. ఒక నేరం జరిగిన తర్వాత కేసు నమోదు నుంచి నేర దర్యాప్తులో కీలక అంశాలను గుర్తించే వరకు ఏదీ మిస్ కాకుండా, కేసు విచారణలో ఎదుటి అడ్వొకేట్‌కు తప్పులు చిక్కకుండా దర్యాప్తు అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకుంటాం. ప్రాసిక్యూషన్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉంది.



సాక్షి: కొత్త రిక్రూట్‌మెంట్‌లో ప్రత్యేక విభాగాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక అర్హతల ఆధారంగా సిబ్బంది ఎంపిక చేస్తారా?

శివధర్‌రెడ్డి: రిక్రూట్‌మెంట్ సమయంలోనే ప్రత్యేక అర్హతల వారీగా ఉద్యోగాల భర్తీ సాధ్యం కాకపోయినా. రిక్రూట్‌మెంట్ తర్వాత వారికి అవసరం మేరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విధి నిర్వహణలో భాగంగా నాలెడ్జ్ అప్‌డేట్ కావడం..అప్‌గ్రేడ్ కావడం తప్పనిసరి. అందుకు అనుగుణంగా పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు, పోలీస్ అకాడమీలో నూతన టెక్నాలజీపై ఎప్పటికప్పుడు శిక్షణ పొందేలా చర్యలు తీసుకుంటాను. భవిష్యత్‌లో పోలీస్ రిఫ్రెష్‌మెంట్ కోర్సులకు మరింత ప్రాధాన్యత ఉంటుంది. ఇప్పుడు వస్తున్న కొత్త సిబ్బందిలో బీటెక్ చేస్తున్నవారు 30 నుంచి 40 శాతం వరకు ఉంటున్నారు. అలాంటి వారికి ఆయా వింగ్‌లలో ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇతరులకు సైతం వాటిల్లో శిక్షణలు పెంచుతాం.

సాక్షి: పోలీసులపై అవినీతి ఆరోపణలు ఇటీవల పెరిగాయి. కొందరు ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు, సివిల్ తగాదాల్లో తలదూర్చుతున్నట్టుగా తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి? వీరి విషయంలో ఎలాంటి చర్యలు ఉంటాయి?

శివధర్‌రెడ్డి: కొందరు పోలీసులపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నది వంద శాతం నిజం. దానిపైన ఎలాంటి సెకండ్ ఒపీనియన్ లేదు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే పనులు చేసేవారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. వాస్తవం ఏటంటే..హైదరాబాద్ ప్రాంతాలతోపాటు, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి అనేక పెద్ద పట్టణాల్లో రియల్‌ఎస్టేట్ బాగా పెరిగింది. మొదటి నుంచే మన ప్రాంతంలో భూ కమతాల వ్యవస్థ, భూ రికార్డుల వ్యవస్థలో కొద్దిపాటి లోపాలు ఉన్నాయి. ఇలాంటి లోపాలను తమకు అనుకూలంగా మార్చుకొని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి తగాదాలు పోలీస్‌స్టేషన్లకు చేరినప్పుడు వివాదాలకు అవకాశం ఏర్పడుతుంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించే అవకాశం ఏర్పడుతోంది. దీనివల్ల పోలీస్‌శాఖకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. ఇలాంటి అంశాల్లో ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా ఉంది. అవినీతి అధికారులపై చర్యలకు ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. రానున్న రోజుల్లో అవినీతి అధికారులపై సోదాలు మరింత పెరుగుతాయి. ప్రభుత్వానికి, పోలీస్‌శాఖకు చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే వారిని ఉపేక్షించేది లేదు. పోలీస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలోనూ పారదర్శకంగా ఉండే వారికే ప్రాధాన్యం ఇస్తున్నాం.

సాక్షి: బేసిక్ పోలీసింగ్ ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి?

శివధర్‌రెడ్డి: బేసిక్ పోలీసింగ్‌కు నేను అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. విజబుల్ పోలీసింగ్ ఉంటే..ఖాకీ దుస్తుల్లో పోలీసులు కనిపిస్తే తప్పు చేయాలనుకునే వారిలో కూడా భయం వస్తుంది. అక్కడి వారు ఆగిపోయే అవకాశం ఉంటుంది. సామాన్యులకు పోలీస్ సేవలు అందేలా కమ్యూనిటీ పోలీసింగ్‌పై ఫోకస్ పెంచుతా. నా దృష్టిలో సాంకేతికత ఎంత పెరిగినా..బేసిక్ పోలీసింగ్‌ను మరవొద్దు. అందుకే మళ్లీ పోలీస్ మాన్యువల్ ప్రకారం..సిబ్బందికి సైతం ఫిజికల్ ఫిట్‌నెస్ పెంచేలా డ్రిల్ ప్రాక్టీస్, క్రమశిక్షణ తప్పనిసరి చేస్తాం. దీన్ని వల్ల శారక దృఢత్వంతోపాటు వారిని మానసికంగా కూడా దృఢంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటాం.

సత్వరం పెండింగ్ జీతాల చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేటప్పటికి పెండింగ్ జీతాలు, బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు వివిధ కారణాలతో పెండింగ్‌లో పడిన బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. జూలై నెలకు సంబంధించి మల్టీపర్పస్ వర్కర్స్ (పారిశుద్ధ్య కార్మికులు) జీతాలు విడుదల కాగా, మొత్తం రూ.49 కోట్లు వచ్చే సోమవారానికి ఉద్యోగుల ఖాతాల్లో జమ కానున్నాయి. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌జీఎస్) సిబ్బంది జీతాలు కూడా ఆర్థిక శాఖ విడుదల చేసింది. మొత్తం రూ.19 కోట్లు సోమవారానికల్లా వారి ఖాతాల్లో జమ అవుతాయని అధికారవర్గాల సమాచారం.

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్

- హైదరాబాద్ సీపీగా సజ్జనార్
- ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి, విజిలెన్స్ డీజీగా విజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల పోస్టుల్లో కీలక మార్పులు చేసింది. భారీస్థాయిలో బదిలీలు చేసింది. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న సీవీ ఆనంద్‌ను హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించగా.. ఆయన స్థానంలో వీసీ సజ్జనార్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించింది. కీలకమైన నిఘా విభాగ అధిపతిగా ప్రస్తుతం అవినీతి నిరోధక విభాగ హెడ్‌గా ఉన్న విజయ్‌కుమార్‌ను నియమించింది. అవినీతి నిరోధక విభాగానికి చారుసిన్హాను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రవిగుప్తాను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేశారు.

పలువురు ఐపీఎస్‌ల బదిలీలు ఇలా..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
రవిగుప్తా	హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి	(సీజీజీ) ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అండ్ డైరెక్టర్ జనరల్
సీవీ ఆనంద్	హైదరాబాద్ సిటీ సీపీ	హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
శిఖాగోయల్	డైరెక్టర్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో	డీజీ విజిలెన్స్, డైరెక్టర్, టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (ఫుల్ అడిషనల్ చార్జ్)
స్వాతిలక్రా	అడిషనల్ డీజీ ఆర్గనైజేషన్స్, హోంగార్డ్స్	అడిషనల్ డీజీ ఆర్గనైజేషన్స్, హోంగార్డ్స్, డీజీ ఎస్పీఎఫ్ (ఫుల్ అడిషనల్ చార్జ్)
మహేశ్ భగవత్	శాంతిభద్రతల అడిషనల్ డీజీ	శాంతిభద్రతల అడిషనల్ డీజీ, అడిషనల్ డీజీ పర్సనల్ (ఫుల్ అడిషనల్ చార్జ్)
చారుసిన్హా	అడిషనల్ డీజీ సీఐడీ	అడిషనల్ డీజీ సీఐడీ, ఏసీబీ డీజీ (ఫుల్ అడిషనల్ చార్జ్)
అనిల్‌కుమార్	అడిషనల్ డీజీ, ఎస్పీఎఫ్	అడిషనల్ డీజీ ఆపరేషన్స్
వీసీ సజ్జనార్	ఆర్టీసీ ఎండీ	సీపీ, హైదరాబాద్
విజయ్‌కుమార్	అడిషనల్ డీజీ, ఏసీబీ	అడిషనల్ డీజీ, ఇంటెలిజెన్స్
వై.నాగిరెడ్డి	డీజీ, ఫైర్ సర్వీసెస్	ఎండీ, టీజీ ఆర్టీసీ
దేవేంద్రసింగ్ చౌహాన్	కమిషనర్, సివిల్ సప్లయీస్	అడిషనల్ డీజీ, మల్టీజోన్-2
విక్రంసింగ్ మాన్	అడిషనల్ సీపీ, ఎల్ అండ్ ఓ, హైదరాబాద్ సిటీ	డీజీ, ఫైర్ సర్వీసెస్
ఎం.స్టీఫెన్ రవీంద్ర	అడిషనల్ డీజీ, ఆపరేషన్స్	కమిషనర్, సివిల్ సప్లయీస్
ఎం. శ్రీనివాసులు	ఐజీ, సీఐడీ	అడిషనల్ సీపీ, క్రైమ్స్, హైదరాబాద్ సిటీ
తఫ్సీర్ ఇక్బాల్	ఐజీ, మల్టీజోన్-2	జాయింట్ సీపీ, ఎల్అండ్ఓ, హైదరాబాద్ సిటీ
ఎస్ఎం.విజయ్‌కుమార్	డీసీపీ, వెస్ట్‌జోన్, హైదరాబాద్	సీపీ, సిద్దిపేట
సింధు శర్మ	ఎస్పీ, ఇంటెలిజెన్స్	జాయింట్ డైరెక్టర్, ఏసీబీ
డా.వినీత్	డీసీపీ, మాదాపూర్	ఎస్పీ, నారాయణపేట
డా.బి అనురాధ	సీపీ, సిద్దిపేట	డీసీపీ, ఎల్బీనగర్
సీహెచ్ ప్రవీణ్‌కుమార్	డీసీపీ, ఎల్బీనగర్	జాయింట్ డైరెక్టర్, ఏసీబీ
యోగేశ్ గౌతం	ఎస్పీ, నారాయణపేట	డీసీపీ, రాజేంద్రనగర్
సీహెచ్ శ్రీనివాస్	డీసీపీ, రాజేంద్రనగర్	డీసీపీ, వెస్ట్‌జోన్
రితిరాజ్	జాయింట్ డైరెక్టర్, ఏసీబీ	డీసీపీ, మాదాపూర్

వ్యవసాయ శాఖ కార్యదర్శిగా సురేంద్రమోహన్

- వాణిజ్య పన్నులకు రఘునందన్‌రావు
- రిజ్వీకి సాధారణ పరిపాలన శాఖ అదనపు బాధ్యతలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా ఎం.హరిత
- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం రఘునందన్‌రావు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయనకు ప్రభుత్వం రవాణాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. రవాణా శాఖ కమిషనర్ కే సురేంద్రమోహన్‌ను వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. సురేంద్రమోహన్‌కు సహకారశాఖ కమిషనర్‌గా, సహకార సంఘాల రిజిస్ట్రార్‌గా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి ఎం.రఘునందన్‌రావును ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీకి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం హరితను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. వాణిజ్య పనుల శాఖ కమిషనర్ కే హరిత ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శిగా స్థానచలనం పొందారు.







నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును.
కాబట్టి అన్నిటి కంటే ముఖ్యముగా నీ హృదయమును
భద్రముగా కాపాడుకొనుము.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.షష్ఠి ఉ.10.22 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.1.10 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** సా.4.15 నుండి 5.04 వరకు, **అమృత ఘడియలు:** ప.3.30 నుండి 5.13 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం : 5.51
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

శశి థరూర్, (కాంగ్రెస్ ఎంపీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఆటలో– 'పడని'వాళ్లు ఉండరు. తలపడవలసిన వాళ్లు మాత్రమే ఉంటారు. రాజకీయాలైనా అంతే. గెలుపు కోసం ఆటలోకి దిగినవాడు యోధుడైతే, ఓడించటానికే ఆడేవాడు మహాయోధుడు! శ్రీ మోదీజీ నాకెప్పుడూ యోధుడిలా అనిపించరు.

అన్నీ బయటికే అనలేం. కొన్ని అనకుండానూ ఉండలేం. నేను ఉన్నది కాంగ్రెస్ పార్టీలో కనుక, మా వైపూ యోధానుయోధులు ఉండే ఉంటారు కనుక, మోదీజీని నేను 'మహాయోధుడు' అనకూడదు. అనకూడదు కానీ, అనకుండా ఉండలేక పోతున్నాను కనుక, మోదీజీ యోధుడు కాదు అని మాత్రమే అనవలసి వస్తోంది.

జట్టులో కెప్టెన్ అంటూ ఒకరు లేరంటే, జట్టులోని ఆటగాళ్లంతా కెప్టెన్‌కు సమానమైన వాళ్లేనని! ఇది బీజేపీ స్టయిల్.

జట్టు లోని ఆటగాళ్లంతా కెప్టెన్‌కు సమానమైన వాళ్లే అయినప్పటికీ, కెప్టెన్ ఎవరో తేల్చుకోలేక పోతున్నారంటే జట్టులో ఎవరి ఆట వారిదేనని! ఇది కాంగ్రెస్ ట్రెడిషన్!

ఎప్పటిలా ఆటకు ముందే, తన ఆట మొదలు పెట్టేశారు మోదీజీ! నవంబరులో బిహార్ ఎన్నికలు. మార్చిలో బెంగాల్ ఎన్నికలు. ఏప్రిల్‌లో తమిళనాడు ఎన్నికలు.



బిహార్ క్యాంపెయిన్‌కు ధర్మేంద్ర ప్రధాన్‌ని, సి.ఆర్. పాటిల్‌ని, కేశవ్ ప్రసాద్ మౌర్యని; పశ్చిమ బెంగాల్ క్యాంపెయిన్‌కు భూపేందర్ యాదవ్‌ని, విప్లవ్ కుమార్ దేవ్‌ని; తమిళనాడు క్యాంపెయిన్‌కు వైజయంత్ పాండాను, మురళీధర్ మొహల్‌ను పంపిస్తున్నారు మోదీజీ!

'పర్ఫెక్ట్ కాంబినేషన్', 'పర్ఫెక్ట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్' అని ప్రత్యర్థి జట్టు చేత కూడా అనిపించుకోగలరు ఆయన.

బిహార్ వెళ్లే ధర్మేంద్ర ప్రధాన్ యూనియన్ మినిస్టర్. సి.ఆర్. పాటిల్ యూనియన్ మినిస్టర్–కమ్–గుజరాత్ బీజేపీ చీఫ్. కేశవ్ ప్రసాద్ మౌర్య యూపీ డిప్యూటీ చీఫ్ మినిస్టర్.

పశ్చిమ బెంగాల్‌కు వెళ్లే భూపేందర్ యాదవ్ యూనియన్ మినిస్టర్. విప్లవ్ కుమార్ దేవ్ త్రిపుర మాజీ ముఖ్యమంత్రి.

తమిళనాడుకు వెళ్లే వైజయంత్ పాండా పార్టీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్. మురళీధర్ మొహల్ యూనియన్ మినిస్టర్.

ప్రధాన్, యాదవ్... ఓబీసీ ఓట్ల స్ట్రాటజిస్టులు. హర్యానాలో బీజేపీ ప్రధాన్ వల్ల గెలిచింది. మహారాష్ట్రలో యాదవ్ వల్ల గెలిచింది. ఇక మౌర్య, దేవ్, పాండా, మొహల్ సముద్రపు గాలుల్నే మలుపు తిప్పగలిగిన నావికులు!

కాంగ్రెస్ ఇంకా గంగా నది ఒడ్డునే ఉంది! పట్నాలో జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్‌లో బిహార్ ఎన్నికల గురించి ఒక వ్యూహం లేదు. బెంగాల్, తమిళనాడు ఎన్నికల ఊసే లేదు.

"85 ఏళ్ల క్రితం ఇక్కడే ఈ సదాఖత్ ఆశ్రమంలో సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది" అనుకున్నారు. "మళ్లీ ఇన్నేళ్లకు ఇక్కడే సీడబ్ల్యూసీ మీటింగ్ జరుగుతోంది..." అన్నారు.

"85 ఏళ్ల క్రితం అప్పటి ఆ సీడబ్ల్యూసీ మీటింగ్‌కు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అధ్యక్షత వహించారు" అనుకున్నారు. "ఇప్పుడు ఈ మీటింగ్‌కు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహించారు" అన్నారు.

"85 ఏళ్లకు ముందు ఈ ఆశ్రమంలో గాంధీ, నెహ్రూ, రాజేంద్ర ప్రసాద్ వంటి వారు సమావేశం అయ్యేవారు..." అనుకున్నారు. "ఇప్పుడు రాహుల్, కేసీ వేణుగోపాల్, జైరాం రమేష్ వంటివారు హాజరయ్యారు" అన్నారు.

అన్నీ అనుకున్నాక, అన్నీ అన్నాక – "అది స్వాతంత్య్ర పోరాటం అయితే, ఇది రెండో స్వాతంత్య్ర పోరాటం" అని తీర్మానించి ఎటు వాళ్లు అటు వెళ్లిపోయారు!

రెండో స్వాతంత్య్ర పోరాటం, మూడో స్వాతంత్య్ర పోరాటం... అవసరం అయితే ఎన్ని స్వాతంత్య్ర పోరాటాలైనా చేయవలసిందే!

కానీ కాంగ్రెస్... గెలిచే పోరాటం చేయటం లేదు. ఓడించే పోరాటమూ చేయటం లేదు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కబడ్డీ జట్టుతో ఆటకు బిలియర్డ్స్ ప్లేయర్స్‌ని దింపుతూ ఉంటుంది!!

ఈ దుర్యోధన దుశ్శాసన పర్వంలో...



జనతంత్రం



వర్ధెల్లి మురళి

మహాభారత కథలోని గాంధారీ సుతుల్లో ఒకడికి దుశ్శాసను డనే పేరు పెట్టారు వేదవ్యాస మహర్షి. శాసనాన్ని ఖాతరు చేయనివాడని దాని అర్థం. విడమర్చి చెప్పాలంటే సంఘం కట్టుబాట్లను లెక్క చేయనివాడు, పరిపాలనా నియమాలంటే పట్టింపులేనివాడు. ఒక్క మాటలో సంఘ విద్రోహి. నేటి ప్రజా స్వామ్య వ్యవస్థలో ఇటువంటి దుశ్శాసనుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. 'గజానికో గాంధారీసుతుడు... గాంధీ పుట్టిన దేశంలో' అనే డైలాగ్ చాలా కాలం నుంచే తెలుగునాట బాగా పాపులరయింది. ఇప్పుడీ తొండ ముదిరి ఊసరవెల్లిగా మారింది. శాసనాలు చేయవలసిన వారు, పాలకులుగా ఎన్నికైనవారు కూడా దుశ్శాసనావతారాలు ఎత్తుతున్నారు. రాజ్యాంగ నియమాలకూ, చట్టాల సంరక్షణకూ కాపుకాయవలసిన కంచే చేను మేస్తున్నది. ఈ పరిణామానికి కలత చెందినవారు 'మన స్వాతంత్య్రం మేడిపండు, మన ప్రజా స్వామ్యం రాచపుండై'ందని కన్నీరు పెడుతున్నారు.

పౌరుల ప్రాథమిక హక్కులకు అండగా నిలబడవలసిన రక్షకభటులే, వాటి భక్షక భటులుగా మారడంపై ఏపీ హైకోర్టు నిన్న ఒక అసాధారణ నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది. సవీందర్ రెడ్డి అనే ఒక సోషల్ మీడియా యాక్టివిస్టును మఫ్టీ పోలీసులు అరెస్ట్ చేసి, తాము అరెస్టు చేయలేదని సాక్షాత్తూ ఉన్నత న్యాయ స్థానాన్నే తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. హైకోర్టులో ఆ విధంగా బుకాయించిన పోలీసులు అదే రోజు సాయంత్రం ఆయన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అది కూడా హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసే విధంగానే! రిమాండ్ రిపోర్టులోనూ అతని అరెస్ట్ సమయాన్ని రకరకాలుగా నమోదు చేసి హైకోర్టుకు అడ్డంగా దొరికి పోయారు.

గడచిన సంవత్సర కాలంగా పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులపై కనీసం డజను సార్లు హైకోర్టు హెచ్చరికలు చేసింది. అయినా తీరు మారని పోలీసుల వైఖరిపై ఆగ్రహంతో ఉన్న న్యాయస్థానం సవీందర్ రెడ్డి సతీమణి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై చేసిన విచారణలో కూడా వారి దొంగాట తేటతెల్లమవడంతో తీవ్రంగా స్పందించింది. ఈ అరెస్ట్ వ్యవ హారంపై సీబీఐ జాయింట్ డైరెక్టర్ విచారణ జరపాలని ఆదేశిం చింది. రాజ్యాంగం 226వ అధికరణం కింద సంక్రమించిన అధికారం మేరకు ఈ ఆదేశాన్నిస్తున్నామని న్యాయస్థానం స్పష్టం చేసింది.

పౌరుల ప్రాథమిక హక్కులకు ప్రభుత్వం నుంచి గానీ, మరోవిధంగా గానీ ప్రమాదం వాటిల్లిందని హైకోర్టు భావిం చినప్పుడు జోక్యం చేసుకునే అధికారాన్ని అధికరణం 226 కల్పిస్తున్నది. దాన్ని ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో ప్రాథమిక హక్కులకు రక్షణ లేదనే అభిప్రాయం న్యాయ స్థానానికి కలిగిందని భావించవచ్చు. ఇటువంటి కేసులోనే గతం లో కేరళ ముఖ్యమంత్రి కరుణాకరన్ రాజీనామా చేయవలసిన పరిస్థితి కూడా ఏర్పడింది. ఎమర్జెన్సీ సమయంలో కేరళ పోలీసులు రాజన్ అనే యువకుడిని నక్సలైట్ సంబంధాలు న్నాయనే అనుమానంతో మఫ్టీలో వెళ్లి అపహరించారు. అరెస్ట్ చూపలేదు. చిత్రహింసలు పెట్టి అతడిని చంపేశారు. ఎమర్జెన్సీ ముగిసిన వెంటనే రాజన్ తండ్రి కేరళ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు.

హోంమంత్రి ఆదేశాలతోనే తన కుమారుణ్ణి పోలీసులు అపహరించారని ఆయన ఆరోపించారు. ఆ సమయంలో కరుణాకరన్ హోంమంత్రిగా ఉన్నారు. రాజన్‌ను తాము అపహరించలేదని కోర్టులో పోలీసులు తప్పుడు అఫిడవిట్ వేశారు. అప్పటికే రాజన్‌ను చంపేసిన ఆధారాలు జన సామాన్యంలో ప్రచారంలో ఉన్నాయి. ఎమర్జెన్సీ తర్వాత ముఖ్యమంత్రి పీఠమెక్కిన కరుణాకరన్ ప్రభుత్వానికి హైకోర్టు డెడ్‌లైన్ విధించి ఫలానా రోజులోగా రాజన్‌ను హాజరు పరచాలని ఆదేశించింది. చనిపోయిన వ్యక్తిని తీసుకురాలేక పోవడం, ప్రజాగ్రహం వెల్లువెత్తడం, హైకోర్టు తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో గద్దెనెక్కి నెల తిరక్కుండానే కరుణాకరన్ రాజీనామా చేయవలసి వచ్చింది. తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసిన పోలీసు అధికారుల ప్రాసిక్యూషన్‌కు కూడా హైకోర్టు ఆదేశించింది. అదే తరహాలో ఇప్పుడు సవీందర్‌రెడ్డి కేసులో కూడా న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం పోలీసులు చేశారని స్పష్టమైంది.

ఏపీ ప్రభుత్వం పోలీసుల్ని ఉసిగొల్పుతున్నది ఒక్క సోషల్ మీడియా యాక్టివిస్టులపైనే కాదు, రాజకీయ ప్రత్యర్థులపైన మాత్రమే కాదు – 'సాక్షి' వంటి మీడియా సంస్థపై కూడా! దేశంలో మిలియన్ కాపీల సర్క్యులేషన్ దాటిన అగ్రశ్రేణి దినపత్రికల సంఖ్య అన్ని భాషల్లో కలిపి డజన్‌కు మించి లేదు. వాటిలో 'సాక్షి' ఒకటి. ఈ లెక్క 'సాక్షి' చెప్పేది కాదు. దిన పత్రికల సర్క్యులేషన్ల లెక్కలు తీసే 'ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్' (ఏబీసీ) అనే ప్రామాణిక సంస్థ చెప్పే లెక్క. అటువంటి ప్రతిష్ఠాత్మక సంస్థ కార్యాలయాల్లో అర్ధరాత్రి చొరబడి అల్లరి చేయడం, ఎడిటర్ ఇంట్లో దూరి సోదాలు చేయడం, ఎడిటర్‌తో సహా సీనియర్ సిబ్బందిపై అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూడటాన్ని ఎలా అర్థం చేసు కోవాలి? ఈ వైఖరిని ఫాసిజమనాలా? నాజీయిజమనాలా? అధికారం తలకెక్కడమనుకోవాలా అనేది ప్రజలే నిర్ణయిస్తారు.

ఇక పవిత్రంగా ఉండవలసిన శాసనసభల నిర్వహణ తీరు ఎంత శోభాయమానంగా ఉన్నదో కనిపిస్తూనే ఉన్నది. మార్గ దర్శకంగా ఉండవలసిన రూల్ బుక్ అమలులో ఉన్నదా అటక మీద ఉన్నదా అర్థం కాని పరిస్థితి. అన్ రూలీ కామెంట్స్ విశృం ఖలతకు అడ్డు చెప్పే పరిస్థితే లేదు. గురువారం నాటి సభలో చంద్రబాబునాయుడు బావమరిదీ ప్లస్ వియ్యంకుడు, సినీ నటుడైన బాలకృష్ణ ఆంగిక వాచికాభినయాలు చూసిన వారికి దిగ్భ్రాంతి కలిగించాయి. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడైన జగన్‌ను ఉద్దేశించి తూలిన మాట కేవలం అన్ పార్లమెంటరీ మాత్రమే కాదు. పత్రికల్లో రాయడానికి కూడా అభ్యంతరకరమైనది. ఆయనట్లా యథేచ్ఛగా మాట తూలు తుంటే పాలకపక్ష సభ్యులు హర్షధ్వానాలు చేయడం, నవ్వడం, ముఖ్యమంత్రితో సహా పెద్దలెవరూ వారించకపోవడం, సభా ధ్యక్ష స్థానంలో ఉన్నవారు కూడా మిన్నకుండటం చూసిన తర్వాత మెదళ్లను తొలిచే మొదటి ప్రశ్న: రూల్ బుక్ ఎక్కడ?

సభలో లేని ప్రతిపక్ష నేతనుద్దేశించి అవమానకరమైన రీతిలో కామెంట్లు చేస్తూ, వాటికి హర్షామోదాలు వ్యక్తం చేస్తున్న కూటమి సభ్యులు మరోపక్క ప్రతిపక్ష నేత హోదా లేకుండానే జగన్ అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేయడం వెనుక ఉన్న గూడుపుఠాణీ అర్థం కావడం లేదా? ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అవకాశమివ్వకుండా రన్నింగ్ కామెంటరీతో అవమానించాలనే ఎత్తుగడ కాదా? లేకుంటే బాలకృష్ణ చేసిన అభ్యంతరకరమైన కామెంట్స్‌ను రికార్డుల నుంచి తొలగించా లని సభ్యులెవరూ ఎందుకు కోరలేదు? స్వయంగా సభాధ్యక్షులే అప్పటికప్పుడు ఆ నిర్ణయాన్ని ఎందుకు తీసుకోలేదు? అలాంటి నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు గతంలో కోకొల్లలుగా లేవా?

బాలకృష్ణ మాట్లాడటానికి ముందు బీజేపీ సభ్యుడు కామినేని శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీలో ఉంటూ చంద్రబాబు కోసమే పనిచేసే నాయకులు కొందరున్నారని అందరికీ తెలి సిందే! వారిలో కామినేని శ్రీనివాస్ ముఖ్యులు. 'సినిమా పరిశ్రమ నుంచి మాట్లాడటానికి వచ్చినవాళ్లను కలవకుండా జగన్ అవమానించారు, చిరంజీవి గట్టిగా అడగడంతో వచ్చి కలిశార'ని శ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై బాలకృష్ణ స్పందిస్తూ జగన్‌పై అభ్యంతరకర పదప్రయోగం చేశారు. పనిలో పనిగా చిరంజీవిపై తనకున్న వ్యతిరేకతను కూడా బయటపెట్టుకున్నారు. 'ఎవడూ' గట్టిగా నిలదీయలేదంటూ ఆయన్ను కూడా అవమానించే విధంగా మాట్లాడారు. దీనిపై స్పందించిన చిరంజీవి... జగన్ తమను సాదరంగా ఆహ్వానిం చారనీ, ఆయనతో తాము జరిపిన చర్చల ఫలితంగానే అప్పట్లో తన సినిమా, బాలకృష్ణ సినిమాతోపాటు పరిశ్రమకు మేలు జరిగిందనీ ఒక లేఖ ద్వారా తెలియజెప్పారు. ఈ వివరణ తర్వాత విధిలేని పరిస్థితుల్లో కామినేని శ్రీనివాస్ తన వ్యాఖ్య లను రికార్డుల నుంచి తొలగించాలని శనివారం నాడు కోరవలసి వచ్చింది. కానీ, జగన్‌ను ఉద్దేశించి తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ అలా కోరలేదు. సభా నాయకుడు గానీ, సభాధ్యక్షులు గానీ అటువంటి నిర్ణయం తీసుకోలేదు. జగన్‌ను అవమానించాలనే ఎత్తుగడతో పాలక కూటమి పని చేస్తున్నదనడానికి ఇవి నిదర్శనాలే కదా!

ఇక్కడ ఆశ్చర్యం కలిగించే మరో విషయం ఏమిటంటే చిరంజీవిపైన బాలకృష్ణ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలను జనసేన నేతలు ఎవ్వరూ ఖండించకపోవడం! పవన్ కల్యాణ్ జ్వరంతో విశ్రాంతి తీసుకుంటున్నారని వార్తలొచ్చాయి. మిగిలిన వారెందుకు మాట్లాడలేదని జనంలో చర్చ మొదలైంది. ఆ సమయంలో సభలో ఉన్న జనసేన పార్టీకి చెందిన మంత్రి కందుల దుర్గేశ్ కూడా ఏమీ స్పందించలేకపోయారు. పైగా ఎఫ్‌డీసీ ఆహ్వాన పత్రికలో తన పేరును తొమ్మిదో పేరుగా 'ఎవడు' వేశాడని దుర్గేశ్ పట్ల కూడా బాలకృష్ణ దురుసుగానే మాట్లాడారు. సినిమా రంగంలో స్వశక్తితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న చిరంజీవి ప్రస్థానంపై తొలినుంచీ బాలకృష్ణకు ఎంతో కొంత అసహనం ఉన్నదనే విషయం దాచేస్తే దాగేది కాదు.

మహానటుడిగా విశ్వవిఖ్యాతి గాంచిన తండ్రిగారు ముఖ్య మంత్రి అయిన తర్వాతనే సోలో హీరోగా బాలకృష్ణ సినిమా కెరీర్ ప్రారంభమైంది. అంతకుముందు కొన్ని సినిమాల్లో నటిం చినా అవి సోలో హీరో పాత్రలు కావు. దాదాపు బాలకృష్ణ నటజీవితంతో సమాంతరంగానే చిరంజీవి ప్రయాణం సాగింది. సినిమా పరిశ్రమలో ఎవరి అండాదండా లేకుండా, కేవలం స్వయం ప్రతిభతో దూసుకెళ్లి ఎనభయ్యో దశకం చివరి నాటికే అగ్రహీరోగా చిరంజీవి ఎదిగిపోయారు. అప్పటినుంచి ఆయన రాజకీయాల్లో ప్రవేశించే వరకు దాదాపు పదిహేను పదహారేళ్ల పాటు చిరంజీవికి గట్టి పోటీగా బాలకృష్ణే కాదు, మరే హీరో కూడా నిలవలేకపోయారు. కారణం ఏదైనాగానీ, చిరంజీవి ప్రస్తావన వచ్చిన సందర్భాల్లో వెటకారంగానో, అసహనంగానో, అతిశయంతోనో బాలకృష్ణ స్పందించడం జనం గమనించారు. 'రాజకీయాల్లోకి వచ్చిన చిరంజీవి ఏమయ్యాడు?' 'మా బ్లడ్ వేరు, మా బ్రీడ్ వేరు' అంటూ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'లేపాక్షి ఉత్సవానికి చిరంజీవిని పిలుస్తున్నారా' అని ఎవరో అడిగితే 'ఎవర్నో తెచ్చి నెత్తిన పెట్టుకుంటామా?' అని రుసరుస లాడారు. పవన్ కల్యాణ్ అభిమానుల్ని 'అలగా జనం'గా సంబోధించడం కూడా వివాదాస్పదమైంది.

> ఇక్కడ ఆశ్చర్యం కలిగించే మరో విషయం ఏమిటంటే చిరంజీవిపైన బాలకృష్ణ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలను జనసేన నేతలు ఎవ్వరూ ఖండించకపోవడం! పవన్ కల్యాణ్ జ్వరంతో విశ్రాంతి తీసుకుంటున్నారని వార్తలొచ్చాయి. మిగిలిన వారెందుకు మాట్లాడలేదని జనంలో చర్చ మొదలైంది. ఆ సమయంలో సభలో ఉన్న జనసేన పార్టీకి చెందిన మంత్రి కందుల దుర్గేశ్ కూడా ఏమీ స్పందించలేకపోయారు. పైగా ఎఫ్‌డీసీ ఆహ్వాన పత్రికలో తన పేరును తొమ్మిదో పేరుగా 'ఎవడు' వేశాడని దుర్గేశ్ పట్ల కూడా బాలకృష్ణ దురుసుగానే మాట్లాడారు. సినిమా రంగంలో స్వశక్తితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న చిరంజీవి ప్రస్థానంపై తొలి నుంచీ బాలకృష్ణకు ఎంతో కొంత అసహనం ఉన్నదనే విషయం దాచేస్తే దాగేది కాదు. ... కారణం ఏదైనాగానీ, చిరంజీవి ప్రస్తావన వచ్చిన సందర్భాల్లో వెటకారంగానో, అసహనంగానో, అతిశయంతోనో బాలకృష్ణ స్పందించడం జనం గమనించారు.

అసెంబ్లీలో జగన్‌ను ఉద్దేశించి బాలకృష్ణ చేసిన అభ్యంతర కరమైన వ్యాఖ్యల తర్వాత బాలకృష్ణ 'సైకో సర్టిఫికెట్' ఉదంతం కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి రోజుల్లో బాలకృష్ణ ఇంట్లో జరిగిన కాల్పుల ఉదంతం అందరికీ గుర్తుండే ఉంటుంది. బాలకృష్ణ జరి పిన కాల్పుల్లో నిర్మాత బెల్లంకొండ సురేశ్, ఆస్థాన జ్యోతిష్యుడు సత్యనారాయణ చౌదరి తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత కొద్దిరోజులకు అనుమానాస్పద పరిస్థితుల్లో ఓ సెక్యూరిటీ గార్డు చనిపోయాడు. ఆ కేసు సందర్భంగా తనకు మానసిక పరిస్థితి బాగాలేదనే ఒక 'సైకియాట్రీ' సర్టిఫికెట్‌ను కోర్టుకు సమర్పిం చారు. ఈ సర్టిఫికెట్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ కాకర్ల సుబ్బా రావును ఆ తర్వాత కాలంలో ఏబీఎన్ ఛానల్ అధిపతి రాధా కృష్ణ ఇంటర్వ్యూ చేశారు. ఆ సమయంలో బాలకృష్ణకు మీరు సాయం చేశారట గదా?' అని రాధాకృష్ణ ప్రశ్నించారు. 'అవును సాయం చేశాను. చాలా పెద్ద సాయం. అతడిని (బాలకృష్ణను) ఎలా బయటపడేయాలా అని ఆలోచిస్తే 'సైకియాట్రీ' ఆలోచన వచ్చింది. ఇద్దరు నిపుణులతో చర్చించి, ఆ సమయంలో అలా చేయకపోయి ఉంటే తనను తాను కాల్చుకునే పరిస్థితి ఉండేది అనే విధంగా సర్టిఫికెట్ ఇచ్చాం. లేకపోతే ఈ కేసులలో బయట పడేవాడు కాద'ని డాక్టర్ కాకర్ల స్పష్టం చేశారు.

ఇప్పుడు ఇంకో సమస్య ముందుకు వస్తున్నది. బాలకృష్ణకు సైకో సర్టిఫికెట్‌ను వైద్యులు ఇచ్చిన మాట నిజం. దాన్ని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు పరిగణనలోకి తీసుకొని వెంటనే బెయిల్ మంజూరు చేసిన సంగతి నిజం. భారత రాజ్యాంగం 326వ అధికరణం ప్రకారం మతిస్థిమితం లేని వాళ్లకు ఓటు హక్కును నిరాకరించవచ్చు. ఓటు వేసే హక్కే లేనప్పుడు పోటీచేసే అవకాశం ఎలాగూ ఉండదు. ఆర్టికల్ 102 (1బి) ప్రకారం మతిస్థిమితం లేని ప్రజా ప్రతినిధులను అనర్హులుగా ప్రకటించవచ్చు. అయితే ఇందుకు మెడికల్ సర్టిఫికెట్ ఒక్కటే సరిపోదు. ఆమేరకు న్యాయస్థానం నిర్ధారిం చాలి. బాలకృష్ణ కేసులో మెడికల్ సర్టిఫికెట్ ఉన్నది. దాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకున్న ఉదంతం కూడా ఉన్నది. ఆ తర్వాత కాలంలో చికిత్స అనంతరం ఆయన మానసిక స్థితి మెరుగైందని మళ్లీ ఓ మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నారా? అది న్యాయస్థానం దృష్టికి కూడా వెళ్లిందా అనే విషయాలపై సమాచారం లేదు. ఒకవేళ అటువంటిదేమీ జరక్కపోయుంటే ఎవరైనా పిటిషన్ వేస్తే బాలకృష్ణ శాసనసభ్యత్వం రద్దవుతుందా అనే విధంగా సోషల్ మీడియాలో చర్చ నడుస్తున్నది. ఏదో అవసరార్థం సర్టిఫికెట్లు తప్ప బాలకృష్ణకు మతిస్థిమితం లేదని ఎవ్వరూ అనుకోరు. కాకపోతే ఆ ప్రచారంలో ఆయనకూ, ఆయన పార్టీ అధినేతలకూ ఓ సౌలభ్యం ఉన్నది. ఆ ముసుగులో ఎవరినైనా ఏమైనా అనేయవచ్చు. అధినేతలు అనలేని మాటలు బాలయ్య నోట అనిపించవచ్చు. ఇప్పుడు జరిగింది కూడా అదే!

vardhelli1959@gmail.com

అరుదైన మాటల మాంత్రికుడు



ప్రొ॥ ఆర్వీయస్ సుందరం

కన్నడ సాహిత్య ప్రపంచంలో ప్రాచుర్యానికి మారు పేరయిన ఎస్.ఎల్. భైరప్ప ఇక లేరు. 94 ఏళ్ళ సార్థక జీవనాన్ని సాగించిన భైరప్ప కొన్ని దశాబ్దాలుగా లక్షల మంది పాఠకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశారు. కర్ణాటక లోని హాసన్ జిల్లా 'సంతేశివార' గ్రామంలో 1931 ఆగస్టులో జన్మించిన భైరప్ప పుట్టిన ఊరి నీటిదాహాన్ని తీర్చడానికి ఏళ్ళకొద్దీ పోరాడి చివరికి తమ ఊరి ప్రజల చేత అపర భగీరథుడు అనిపించుకున్నారు. మైసూరు విశ్వవిద్యాలయానికి చెందిన మహారాజా కళాశాలలో తత్త్వశాస్త్రంలో బి.ఎ., ఎం.ఎ. పూర్తి చేసుకొని దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉద్యోగం చేసి తర్వాత మైసూరులో స్థిరపడ్డారు. మైసూరులోని ప్రాదేశిక శిక్షణ సంస్థలో చాలాకాలం పనిచేసి 1991లో పదవీ విరమణ చేసి సాహిత్య కృషి కొనసాగించారు.

భైరప్పతో నాకు నాలుగు దశాబ్దాలకు పైగా పరి చయం. ఆయన కళాశాలలో ఆచార్యులుగా ఉన్నప్పుడు అప్పుడప్పుడు కలిసేవాడిని. వారి ఇల్లు కూడా మా ఇం టికి దగ్గరే! కొన్ని సంవత్సరాల కిందటి వరకు పొద్దుటో, సాయంత్రమో నడక సాగిస్తూ నన్ను పలక రించేవారు. నేను పనిచేసిన కన్నడ అధ్యయన సంస్థ సంచాలకులు హా. మా. నాయక గారికి భైరప్ప గారికి స్నేహగౌరవాలు అపరిమితంగా ఉండేవి. అందువల్ల అప్పుడప్పుడు ఆయన మా సంస్థకు కూడా వస్తుండే వారు. భైరప్ప తెలుగు వారికీ కొత్తవారేమీ కాదు. ఆయన 'వంశవృక్షం' నవల 55 ఏళ్ళ క్రితమే తెలుగు లోకి అనువాదమయింది. తర్వాత చలనచిత్రంగా కూడా వచ్చి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూర గొనింది. తర్వాతి కాలంలో 'దాటు', 'పర్వ' వంటి నవ లలు కూడా తెలుగులో వచ్చాయి.

భైరప్ప మొత్తం 24 నవలలు రాశారు. వీటిలో కొన్ని సుదీర్ఘ నవలలు. వీటిలో చాలావరకు భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషులోకి అనువాదమయ్యాయి. కొన్ని దేశం వెలుపల కూడా అచ్చయ్యాయి. ఇలా భైరప్ప పేరు భారతదేశంలోనే కాక ఇతర దేశాలలోనూ పరిచిత మయింది. ఈ రచయిత మితభాషి. చాలావరకు మౌనాన్నీ, ఏకాంతాన్నీ కోరుకునే వారు. అయితే ఏకాంతాన్ని వదలి బయటికి వస్తే మాత్రం వివాదా స్పదమైన వ్యాఖ్యలు చేసేవారు. కన్నడంలో 'నవోదయ', 'నవ్య'



ప్రఖ్యాత కన్నడ రచయిత ఎస్.ఎల్. భైరప్ప (1931-2025)

అనేవి ఆధునిక సాహిత్యంలో రెండు ప్రధాన మార్గాలు. సంప్రదాయబద్ధమైన రచనలు చేసిన కె.వి. పుట్టప్ప, మాస్తి వెంకటేశ అయ్యంగార్, ద.రా. బేంద్రె, పి.టి. నరసింహాచార్ వంటివారు మొదటి వర్గానికి చెందిన వారు. వి.కె. గోకాక్, గోపాలకృష్ణ అడిగ, యు.ఆర్. అనంతమూర్తి, గిరీష్ కార్నాడ్, శంకర మొకాశి పుణేకర్ వంటివారు రెండవ వర్గానికి చెందినవారు. భైరప్ప నవ్య రచయితల మీద నిప్పులు కురిపించేవారు. హిందుత్వపరమైన ఆయన ఉపన్యాసాలనూ, రాజకీయ పక్షపాతాన్నీ ప్రగతి వాదులు తీవ్రంగా నిరసించేవారు. కానీ ఆయన ఎన్ని విమర్శలు వచ్చినా ఎదుర్కొనేవారు.

భైరప్ప అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించే వారు కూడా ఆయన సృజన శక్తిని మాత్రం అంగీకరిం చేవారు. ఆయన నవలలు సృజనాత్మకతకు, గాంభీర్యా నికి స్పష్టమైన ఉదాహరణలుగా నిలిచాయి. ఒక్కొక్క నవల రాయడానికి ఆయన తన శక్తియుక్తు లనన్నిటినీ ధారపోసేవారు. కథకు బలం చేకూరడం కోసం భారత దేశంలో పలుచోట్ల పర్యటించేవారు. విషయాలు సేక రించేవారు. ఆయన ఎంతగా రచనల్లో మునిగిపోయే వారంటే ఆయన్ను కలవడానికి ఇంటి వరకు వెళ్ళిన వారు కూడా ఇంటి లోపలికి వెళ్ళడానికి తటపటా యించేవారు. ఇంత గాంభీర్యం ఉన్న రచయిత జనరంజకంగా ఎలా రాయగలిగారా అని ఆశ్చర్యం వేస్తుంది. విషయ వైపుల్యాన్ని ఆకర్షక శైలిగా మలచ గలిగిన నేర్పు ఆయనది. ఆయన నవలలు వైవిధ్యమయమైన మానవ జీవితానికి వ్యాఖ్యానంలా ఉంటాయి. ఆయన రాసిన 'పర్వ' నవల మహా భారతంలోని పాత్రలను విశ్లేషణాత్మకంగా చూపు తుంది. మహమ్మదీయుల జీవన విధానాన్ని తెలుసు కోవడానికి ఇటీవలే బూకర్ పురస్కారం పొందిన బాను ముష్తాక్‌తో కొన్ని రోజులపాటు మంతనాలు జరిపా రాయన. ఆయన రాసిన అన్ని నవలలోనూ ఈ ప్రామాణికత కనిపిస్తుంది.

ఎస్.ఎల్. భైరప్ప ఎన్నో పురస్కారాలందు కున్నారు. కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి, సరస్వతీ సమ్మాన్ వంటివన్నీ ఆయన్ను వరించాయి. జ్ఞానపీఠ పురస్కారం ఆయనకు లభిస్తుందని ఎన్నో ఏళ్ళుగా కన్నడిగులు ఆశించారు. భారత ప్రభుత్వం 2023లో ఆయన్ను పద్మభూషణ్‌తో గౌరవించింది.

'భీమకాయ' అనే నవలతో 27 ఏళ్ళ వయసులో నవలలు రాయడం ప్రారంభించిన భైరప్ప 86 ఏళ్ళ వయసులో 'ఉత్తరాకాండ' అనే నవల వరకు రాస్తూనే ఉన్నారు. ఈ నవలలు పునర్ముద్రణలు పొందాయి, పొందుతూనే ఉన్నాయి. 'భిత్తి' (గోడ) అనే పేరుతో ఆయన ఆత్మకథను ప్రచురించారు (1996). 'మత దాన', 'గృహభంగ', 'దాటు', 'వంశ వృక్ష', 'పర్వ', 'సాక్షి', 'అంచుయాన' వంటి నవలల ద్వారా పఠితల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న ఎస్.ఎల్. భైరప్ప ధన్యజీవి.

వ్యాసకర్త రచయిత, జానపద పరిశోధకులు

ఇన్ బాక్స్

స్వాతంత్య్ర విప్లవ జ్వాల

మనుషులను చంపగలరేమో కానీ, వారి ఆశయాలను చంపలేరని చాటిచెప్పిన విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్. 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదంతో స్వేచ్ఛాకాంక్షను రగిల్చి, స్వరాజ్య సాధన పోరాటంలో చిరు ప్రాయంలోనే ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యోధుడు. ఆయన పేరు వింటే చాలు యావత్ భారతీయుల రక్తం గర్వంతో ఉప్పొంగుతుంది.



భగత్ సింగ్

1907 సెప్టెంబర్ 28న నేడు పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్ సమీపంలోని ఒక గ్రామంలో భగత్ సింగ్ జన్మిం చారు. రష్యాలో మాదిరిగా భారతదేశంలో కూడా సోష లిస్టు రాజ్యం, సమసమాజం ఏర్పడాలని భావించారు. జైలుకు వెళ్లడానికి ముందూ, జైల్లో ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తున్నప్పుడు కూడా ఆయన విస్తృతంగా మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేసి... మారు పేర్లతో పత్రికలకు రహస్యంగా వ్యాసాలు రాశారు. తన వ్యాసాల్లో ఆయన మతతత్వ ప్రమాదం గురించి దూరదృష్టితో కచ్చితమైన హెచ్చరిక చేశారు. మతవాదుల పట్ల ఉదాసీనత ప్రమాదకరం అని బోధించారు. తనకు గురు తుల్యుడు, తండ్రి సమానులైన లాలా లజపత్ రాయ్ 'హిందూ మహాసభ'కు అనుకూలంగా మారినప్పుడు ఆయన ఘాటుగా విమర్శించారు. భగత్‌సింగ్ కార్య కలాపాలపై లాలా కూడా విరుచుకు పడ్డారు. నన్ను లెనిన్‌లా మార్చడానికి భగత్ సింగ్ ప్రయత్నిస్తున్నాడనీ, అతను రష్యన్ ఏజెంట్ అనీ నిందించారు. అయినప్పటికీ లాలాను బ్రిటీష్ పోలీసులు కొట్టి చంపడాన్ని భగత్‌సింగ్ సహించలేదు. ప్రతిగా బ్రిటిష్ పోలీస్ అధికారిని తుపాకీతో కాల్చి చంపారు.

'విప్లవం అంటే బాంబులు, తుపాకుల సంస్కృతి కాదు. పరిస్థితుల్లో మార్పు తేవడమనే ఒక న్యాయమైన ప్రణాళికపై ఆధారపడి జరగాలి' అంటూ వివరించారు. మతతత్వం పట్ల ఆనాడు కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాల పట్ల భగత్ సింగ్ అసమ్మతి వ్యక్తం చేశారు. ఒక మతానికి చెందిన ప్రజలు పరస్పరం ఇతర మతస్థు లను శత్రువులుగా భావిస్తున్నారనీ, రాజకీయాల నుంచి మతాన్ని వేరుచేయడమే దీనికి పరిష్కారం అనీ, మతం వ్యక్తిగతమైన విషయం కాబట్టి దానిలో ఎవరూ జోక్యం చేసుకోకూడదనీ భగత్‌సింగ్ అన్నారు. మతతత్వాన్ని నిర్మూ లించడానికి ఏకైక మార్గం వర్గచైతన్యమే అని అన్నారు. 'పెంపుడు కుక్కను ఒళ్లో కూర్చోబెట్టు కుంటాం. కానీ, సాటిమనిషిని ముట్టుకుంటే మైలపడిపోతాం. ఎంత సిగ్గుచేటు?' అని 'అఛూత్ కా సవాల్' (అంటరానితనం సమస్య) అనే వ్యాసంలో భగత్ సింగ్ ప్రస్తావించారు. సంకుచిత స్వపక్ష దురభిమానులను భగత్‌సింగ్ ప్రజల శత్రువుగా చూశారు. నేడు దేశంలో వేళ్లూనుకుపోయిన కుల, మత మౌఢ్యాలు పోవాలంటే లౌకిక, ప్రజాస్వామిక శక్తులు భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ ప్రజలను చైతన్య పరచాలి.

– నాదెండ్ల శ్రీనివాస్, మధిర (నేడు భగత్ సింగ్ జయంతి)

సంప్రదాయ వ్యాయామాలతో పోలిస్తే డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్, టీమ్ స్పోర్ట్స్ వేటికవే ప్రత్యేకం. ఇవి శరీరాన్ని ఫిట్‌గా ఉంచడమే కాదు.. ఇవి చేస్తున్నప్పుడు మెదడు చురుగ్గా పనిచేసి జ్ఞాపకశక్తి, శ్రద్ధ వహించడం, సమస్య పరిష్కారం వంటి ఆలోచనా నైపుణ్యాలు మెరుగుపడ్డాయని పరిశోధనలు చెబుతున్నాయి. అంతేకాదు, 'గ్రీన్-మెడిటరేనియన్ డైట్' సైతం ఆలోచనా నైపుణ్యాలను మెరుగుపరుస్తుందని తాజా అధ్యయనంలో తేలింది.



ఈ వ్యాయామాలు.. ఆ ఆహారం!

డ్యాన్స్..: మనసును ఉల్లాసంగా, మెదడును ఆరోగ్యకరంగా ఉంచుతుంది. 'న్యూరోసైన్స్ అండ్ బయోబిహేవియరల్ రివ్యూస్' జర్నల్‌లో ప్రచురించిన ఒక సమీక్ష ప్రకారం డ్యాన్స్ వల్ల వృద్ధుల్లో మెదడు మార్పులకు లోనైందని తేలింది. ఒక సాధారణ డ్యాన్స్ కార్యక్రమం.. నాడీ వ్యవస్థలోని న్యూరాన్లు, ఇతర కణాల మనుగడ, పెరుగుదల, పనితీరును ప్రోత్సహించే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్‌ను (బీడీఎన్‌ఎఫ్) పెంచుతుందని అధ్యయనంలో వెల్లడైంది.



> మెదడును ఉత్తేజపరిచేవి, ఆరోగ్యంగా ఉంచేవీ!
>
> డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్, టీమ్ స్పోర్ట్స్‌తో యాక్టివ్
>
> 'గ్రీన్-మెడిటరేనియన్ డైట్'తో చురుకుదనం

మార్షల్ ఆర్ట్స్: జూడో, కరాటే, తైక్వాండో.. ఈ యుద్ధ కళలు శారీరక శ్రమ, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి అంశాల కలబోత. ఈ కళలకు.. సమయానికి స్పందించడం, శక్తి, కచ్చితత్వం వంటివి చాలా అవసరం. శ్వాసపై నియంత్రణ, దృష్టి కేంద్రీకరించడం వంటి అభ్యాసాల ద్వారా భావోద్వేగ నియంత్రణను కూడా పెంపొందిస్తాయి. ఇటీవలి ఒక అధ్యయనం.. యుద్ధ కళలను అభ్యసించే పిల్లల్లో మెదడు క్రియాశీలతను ప్రత్యేక ప్రక్రియ ద్వారా సమీక్షించింది. అందులో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఇతరులతో పోలిస్తే ఈ పిల్లలు.. జ్ఞాపకశక్తి అవసరమైన పనుల్లో చాలా మెరుగైన పనితీరు కనబరిచారు. యుద్ధ కళలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాకుండా ఆలోచనా నైపుణ్యాలు పెంచడంలోనూ, మానసికంగా దృఢంగా ఉంచడంలోనూ సాయపడతాయట. అంతేకాదు, నలుగురిలో కలిసిపోయే నైపుణ్యాలు పెంచుతాయని, దీర్ఘకాలిక భావోద్వేగ, మానసిక శ్రేయస్సుకూ తోడ్పడతాయని తేలింది.

టీమ్ స్పోర్ట్స్: గతేడాది 'జర్నల్ ఆఫ్ ద అమెరికన్ మెడికల్ అసోసియేషన్'లో ఒక అధ్యయనం ప్రచురితమైంది. అందులో 5-11 ఏళ్ల వయసున్న 880 మంది బాల బాలికలపై చేసిన ఓ అధ్యయనం ప్రకారం.. టీమ్ స్పోర్ట్స్‌లో పాల్గొన్న పిల్లల్లో మెదడు చురుగ్గా పనిచేస్తున్నట్టు తేలింది. శ్రద్ధ, ఒక విషయానికి వేగంగా స్పందించడం, బాగా ఆలోచించి చేయాల్సిన పనుల్లో మెరుగైన పనితీరు ఉంటుందని వెల్లడైంది.

ఇదీ ప్రత్యేకత

డ్యాన్స్, మార్షల్ ఆర్ట్స్, టీమ్ స్పోర్ట్స్ అనేవి అనేక ప్రత్యేకతల కలబోత.	స్థిరమైన నిర్ణయం తీసుకోవడం		నలుగురితో కలిసిపోవడం
	కొత్త పద్ధతులను నేర్చుకోవడం	అనూహ్య కదలికలు	ప్రతిస్పందన, సమన్వయం
	భావోద్వేగ నియంత్రణ	అందుకే డ్యాన్స్ వంటివి మెదడును మరింత చురుగ్గా పనిచేసేలా చేస్తాయని పరిశోధకులు అంటున్నారు.	

ఈ ఆహారంతో..: మనం తీసుకునే ఆహారం, వ్యాయామం వంటివి మన మెదడు వయసును నిర్ణయిస్తాయి. మంచి ఆహారం తీసుకునే, వ్యాయామం చేసే 30 ఏళ్ల వ్యక్తి మెదడు ఎదుగుదల, పనితీరు ఒకలా ఉంటాయి. అదే, అవి సరిగ్గా లేని.. అదే వయసు ఉండే వ్యక్తి మెదడు ఎదుగుదల, పనితీరు మరోలా ఉంటాయి. ఇలాంటి వారిలో జ్ఞాపకశక్తి, శ్రద్ధ వహించడం, సమస్య పరిష్కారం వంటి ప్రధాన ఆలోచనా నైపుణ్యాలు బాగా తగ్గిపోతాయి. 'గ్రీన్-మెడిటరేనియన్' డైట్ ఈ సమస్యకు పరిష్కారమని 'అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్'లో ప్రచురితమైన ఒక అధ్యయనం చెబుతోంది. 'ఆలోచనా నైపుణ్యం క్షీణత'తో సంబంధం ఉన్న కొన్ని ప్రోటీన్లను తగ్గించడం ద్వారా మెదడును రక్షించడంలో ఈ ఆహారం సాయపడుతుందని పరిశోధకులు కనుగొన్నారు.



మూడు గ్రూపులుగా విభజించి..

మెదడు వయసు, పనితీరును ఆహారం ఎలా ప్రభావితం చేస్తుందనే అంశంపై 18 నెలలపాటు చేపట్టిన ఈ అధ్యయనంలో 300 మంది పాల్గొన్నారు. వీరిని మూడు గ్రూపులుగా విభజించి, 3 రకాల ఆహారాలు ఇచ్చారు.

- ప్రామాణిక ఆరోగ్యకరమైన ఆహారం
- తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ కూరగాయలతో కూడిన సంప్రదాయ మెడిటరేనియన్ ఆహారం
- గ్రీన్ టీ, నీటిలో తేలియాడే మొక్క 'మంకై' జోడించిన గ్రీన్-మెడిటరేనియన్ ఆహారం

వీరి రక్తంలో ప్రోటీన్ స్థాయిలను పరిశీలించారు. ఆలోచనా నైపుణ్యం క్షీణత కొన్ని ప్రోటీన్లతో ముడిపడి ఉంటుంది. గ్రీన్-మెడిటరేనియన్ ఆహారాన్ని స్వీకరించిన వారిలో ఈ సమస్యాత్మక ప్రోటీన్లు తక్కువ స్థాయిలో ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

మెడిటరేనియన్ డైట్

మధ్యధరా సముద్రం చుట్టూ ఉన్న స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీ, టర్కీ, మొరాకో, ఈజిప్టు వంటి దేశాలలో నివసించే ప్రజల సంప్రదాయ ఆహారాల నుంచి ప్రేరణ పొందిన మొక్కలతో కూడిన ఆహారం. ఇందులో తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, చిక్కుళ్ళు, గింజలు, ఆలివ్ నూనె ప్రధానమైనవి. చేపలు, పాల ఉత్పత్తులు మితంగా ఉంటాయి. రెడ్‌మీట్, స్వీట్లు చాలా తక్కువగా ఉంటాయి. కేవలం ఆహారం ఒక్కటే కాదు.. దీన్ని కుటుంబంతో కూర్చుని ఆస్వాదించడమూ, అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం కూడా ఈ డైట్‌లో భాగాలే.

\- సాక్షి, స్పెషల్ డెస్క్

టెండర్లు పిలవరు... నిబంధనలు పాటించరు

- కమీషన్లు దండుకునేందుకే ప్రపంచ పర్యాటక దినోత్సవం: మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: టెండర్లు పిలవకుండా, నిబంధనలు పాటించకుండా ప్రపంచ పర్యాటక దినోత్సవం ముసుగులో కమీషన్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరో ప్లాన్ చేస్తోందని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఏకంగా రూ. 15 వేల కోట్ల పనులు అప్పనంగా అప్పగిస్తూ మరో స్కామ్‌కు తెరలేపారని, రూ.లక్షల కోట్లు విలువ చేసే వేలాది ఎకరాల భూములను తన అనుయాయులకు ధారాదత్తం చేసేందుకు రేవంత్ భారీ స్కెచ్ వేశారని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఓపెన్ బిడ్లు పిలవకుండా, అధికంగా బిడ్ దాఖలు చేసిన వారికి పనులు అప్పగించాల్సి ఉన్నా , ఎక్కడా నిబంధనలు పాటించలేదన్నారు. లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్స్, వైన్ యా ర్డు రిసార్ట్స్, లగ్జరీ హోటల్స్, వాటర్ ఫ్రంట్ రిసా ర్ట్స్, అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, థీమ్ పార్కుల అభివృద్ధి పేరిట మీరు చేస్తున్నది ముమ్మాటికీ స్కామేనని, కమీషన్ల దందానే అని ఆరోపించారు. కాగా, బురద రాజకీయాలు మానుకొని, వరద బాధితులను ఆదుకోవాలి హితవు పలికారు.

eTN ప్రకటన నం. మరియు తేది	పని పేరు	అంచనా కాంట్రాక్టు విలువ
EP.No.194/CGM(E)/ Rev. Circle/2025-26, తేది: 04-09-2025 (1వ పిలుపు)	GM(IT) క్రింద RBS, MCC & SWC మాడ్యూల్స్ కొరకు కమర్షియల్ సొల్యూషన్స్ ఇంప్లిమెంటేషన్ కోసం సర్వీస్ ప్రొవైడర్ సెలక్షన్.	--
EP.No.198/CGM(E)/ Rev.Circle/2025-26, తేది: 25-09-2025 (1వ పిలుపు)	GM(IT) వింగ్ క్రింద ప్రస్తుతమున్న జీపీఎస్ వెహికల్ ట్రాకింగ్ డివైజెస్ అండ్ సాఫ్ట్‌వేర్ యొక్క మెయింటెనెన్స్‌తో పాటు HMWSSB యొక్క ప్రస్తుతమున్న అప్లికేషన్స్‌తో ఇంటిగ్రేషన్‌తో మొబైల్ ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ యొక్క డిజైన్, డెవలప్‌మెంట్, టెస్టింగ్, హోస్టింగ్ మరియు మెయింటెనెన్స్.	--
EP.No.177/CGM(E)/ Rev.Circle/2025-26, తేది: 20-08-2025 (2వ పిలుపు)	GM(IT) క్రింద ఒక సంవత్సర కాలానికి కన్స్యూమర్ గ్రీవెన్సులు, సర్వీస్ రిక్వెస్ట్‌లు నమోదుచేయుట, రిడ్రెసల్, రెవెన్యూ కలెక్షన్, గ్రీవెన్సులపై కస్టమర్ ఫీడ్‌బ్యాక్ మరియు SWC సర్వీసెస్ కొరకు HMWSSB కోసం కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్ సెల్ (CRMC) కాల్ సెంటర్ యొక్క మ్యానింగ్, ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్.	రూ.134.73 లక్షలు

అరబిందో ఫార్మా కాలుష్యంపై పీసీబీ తనిఖీలు

- ఫార్మాను తగులబెడతానని జడ్చర్ల ఎమ్మెల్యే హెచ్చరిక



అరబిందో పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న పీసీబీ అధికారులు

జడ్చర్ల/రాజాపూర్: రైతుల పొలాల్లోకి కాలుష్య జలాలు వదులుతున్న అరబిందో ఫార్మా కంపెనీని తగులబెడతానంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరికల నేపథ్యంలో.. శనివారం కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు చేపట్టింది. పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించింది. కాలుష్య జలాలను బయటికి వదిలే అవుట్‌లెట్లను గుర్తించిన అధికారులు.. వెంటనే వాటిని మూసివేయాలని అరబిందో సిబ్బందిని ఆదేశించారు. పరిశ్రమలో నమూనాలను సేకరించారు. పరిశ్రమలో తనిఖీలు చేపట్టిన అధికారులు.. తమ నివేదికలో వాస్తవాలు పొందుపరచకపోతే తాను అన్నంత పని చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసీబీ అధికారులు స్పందించి తనిఖీలు చేసి నమూనాలు సేకరించడంతో ఫార్మా పరిశ్రమను ఆదివారం తగులబెడతామన్న తన నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు.

యూరియా కోసం వెళ్తే పాముకాటు



రైతుకు చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కొడకండ్ల: యూరియా కోసం వచ్చి క్యూలైన్‌లో నిల్చున్న రైతు పాము కాటుకు గురయ్యాడు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద శనివారం జరిగిన సంఘటనపై బాధిత రైతు అందించిన వివరాలివి. సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండలం బోల తండాకు చెందిన ధరావత్ బాలు (50) యూరియా కోసం గ్రోమోర్ కేంద్రం వద్దకు వచ్చి క్యూలో నిల్చున్నాడు. ఈ క్రమంలో బాలు కాలిపై పాము కాటు వేసింది. వెంటనే అతన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు అందుబాటులో లేరు. దీంతో 108 అంబులెన్స్ సిబ్బంది వైద్యం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేటకు తరలించారు.

మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం ధ్వంసం



భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, పరికరాలు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మెట్టగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని శనివారం భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా భారీగా ఆయుధాలు, వాటి తయారీకి వాడే యంత్రాలు, పేలుడు పదార్థాలు, రాకెట్ లాంచర్ల తయారీకి వాడే పరికరాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులు ఆయుధాలు తయారు చేసుకోవడం ఆశ్చర్యానికి గు రి చేస్తోందని ఉన్నతాధికారులు అన్నారు.



బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆరో రోజు శనివారం కాత్యాయిని దేవిగా దర్శనమిచ్చారు. - బాసర



అలంపూర్ జోగులాంబ అమ్మవారు శనివారం ఆరో రోజు కాత్యాయిని దేవిగా దర్శనమిచ్చారు - అలంపూర్



వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారు శనివారం శ్రీ భువనేశ్వరి మాత అలంకారంలో దర్శనమిచ్చారు - హనుమకొండ కల్చరల్



ఇంద్రకీలాద్రిపై శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు - విజయవాడ

సింగరేణి లాభాల వాటాలో 'శ్రీరాంపూర్' ఫస్ట్

- ఈ ఏరియాలో పనిచేసే ఓ కార్మికుడికి అత్యధికంగా రూ.3,27,018 బోనస్
- అధికంగా బోనస్ అందుకునే మొదటి పది మందిలో ఈ ఏరియా నుంచే ఎనిమిది మంది
- అండర్ గ్రౌండ్ కార్మికులకు మస్టర్‌కు రూ.805.37 చెల్లింపు
- లాభాల్లో వాటా ఖరారు చేసిన సింగరేణి సంస్థ
- 29న కార్మికుల ఖాతాల్లో జమ



(ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రకటించిన లాభాల వాటాలో శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసే టింబర్ యార్డ్ వర్క్‌మన్ సుద్దిమల్ల శ్రీనివాస్‌కు అత్యధికంగా రూ.3,27,018 బోనస్ లభించనుంది. అలాగే మొత్తం సింగరేణి వ్యాప్తంగా అధికంగా బోనస్ అందుకునే మొదటి పది మందిలో ఈ ఏరియా నుంచే ఎనిమిది మంది ఉండడం విశేషం. సింగరేణి సంస్థ అందించే లాభాల వాటాలో ఏ విభాగంలోని కార్మికులకు ఎంత మొత్తం బోనస్ వస్తుందన్న వివరాలను శనివారం యాజమాన్యం వెల్లడించింది. దీని ప్రకారం.. మరో టింబర్‌యార్డ్ వర్క్‌మన్ మేషు కిశోర్ రూ.3,20,093, ఎస్టీపీసీ డీవైజీఎం ఎనగందుల శ్యాంరాజ్ రూ.3,13,724, ఆర్జీ-3 ఏరియా జీడీకే-11 సీనియర్ మైనింగ్ సర్దార్ నాగ వేణుగోపాల్ రూ.3,12,897 బోనస్‌గా అందుకోనున్నారు. అలాగే, శ్రీరాంపూర్ ఏరియా ఆర్‌కేఎన్‌టీ గని హెడ్ ఓవర్‌మన్ జక్కినబోయిన సదానందం రూ.3,06,850, ఆర్కే-7 గని ఫోర్‌మన్ మెకానిక్ పుదారి ఉమేశ్‌గౌడ్ రూ.3,06,184, టింబర్ యార్డ్ వర్క్‌మన్ ఈసంపల్లి ప్రభాకర్ రూ.3,05,614, ఆర్కే-5 గని ఎస్‌డీఎల్ ఆపరేటర్ బండారి శ్రీనివాస్ రూ.3,05,334, ఆర్జీ-1 ఏరియా జీడీకే-11 గని అదనపు మేనేజర్ బి.మల్లేశం రూ.3,03,759, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5 గని ఎస్‌డీఎల్ ఆపరేటర్ అటికం శ్రీనివాస్ రూ.3,03,715 అందుకోనున్నారు.

సింగరేణి సంస్థ 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు ఇవ్వనున్నట్లు యాజమాన్యం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సంస్థలో సుమారు 40 వేల మంది కార్మికులకు రూ.802.40 కోట్లు వాటాగా చెల్లించనున్నారు. కాగా, సింగరేణిలో పనిచేసే ఉద్యోగులను యాజమాన్యం వివిధ విభాగాలుగా విభజించింది. ఇందులో అండర్ గ్రౌండ్ కార్మికులకు మస్టర్ (ఒక రోజు హాజరు)కు రూ.805.37 చొప్పున చెల్లించనున్నారు. అంటే అత్యధిక హాజరు నమోదైన వారికి అత్యధిక బోనస్ అందనుంది. ఇక ఓసీ, సీఎస్‌పీ, ఎస్టీపీపీ ఉద్యోగులకు మస్టర్‌కు 637.58, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు రూ.588.53 చొప్పున చెల్లించనున్నారు. ఈ లెక్కల ప్రకారం సింగరేణి యాజమాన్యం లాభాల బోనస్ డబ్బును సోమవారం కార్మికుల ఖాతాల్లో జమ చేయనుంది.

> అండర్ గ్రౌండ్ కార్మికులకు మస్టర్‌కు రూ.805.37

రేచపల్లిలో యువకుడి దారుణ హత్య

- యువతిని ప్రేమిస్తున్నానని సోషల్ మీడియాలో పోస్ట్
- కర్రలతో దాడి చేసిన యువతి కుటుంబ సభ్యులు

సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎదురుగట్ల సతీశ్ (29) అదే కాలనీకి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని, తానే పెళ్లి చేసుకుంటానని, ఆమెను పెళ్లి చేసుకునేందుకు ఎవరూ ముందుకురావొద్దని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయంపై యువతి కుటుంబ సభ్యులు సతీశ్‌ను పలుమార్లు వారించారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో సతీశ్‌కు.. యువతి కుటుంబ సభ్యులకు మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. దీంతో యువతి కుటుంబ సభ్యులు సమీపంలో ఉన్న కర్రలతో అతనిపై దాడి చేశారు. సతీశ్ తల, ఇతర శరీర భాగాల నుంచి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, బీర్‌పూర్ ఎస్సై రాజు పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కిడ్నీలో 1,820 రాళ్ల తొలగింపు

- క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం
- యూరాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి



శస్త్రచికిత్స అనంతరం పరశురాములుతో డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి



కిడ్నీలో నుంచి తొలగించిన రాళ్లు

హనుమకొండ చౌరస్తా: అత్యంత క్లిష్టమైన కిడ్నీ ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ఎదురుగా గల శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో జరిగిన ఈ శస్త్రచికిత్స వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన పరశురాములు.. ఈ నెల 23న కిడ్నీ నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారు. డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి పరీక్షించి కిడ్నీలో అధిక సంఖ్యలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఆ తర్వాత మల్టీట్రాక్ పీసీఎన్‌ఎల్ పద్ధతిలో ఒకే సిట్టింగులో మొత్తం 1,820 రాళ్లను తొలగించినట్లు తెలిపారు. రోగి తమ వద్దకు రాకముందు హనుమకొండ, హైదరాబాద్ లాంటి నగరాల్లో అనేక ఆస్పత్రులను సంప్రదించాడని పేర్కొన్నారు. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను రెండు నుంచి మూడుసార్లు చేయాల్సి వస్తుందని, అయినప్పటికీ రాళ్లు మొత్తం తొలగించే అవకాశం లేదని అక్కడి వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. శస్త్రచికిత్సకు రూ.3.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో రోగి ఆందోళనకు గురైనట్లు తెలిపారు. తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేసి 1,820 రాళ్లు తొలగించామని రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కోలుకున్న తర్వాత 72 గంటల్లో పరశురాములును డిశ్చార్జ్ చేశామని చెప్పారు.

కందుకూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగిఉన్న సిమెంట్ మిక్సర్ మిల్లర్‌ను ఢీకొట్టిన ఆటో
- అక్కడికక్కడే ముగ్గురి దుర్మరణం
- పది మందికి గాయాలు



శ్రీధర్



శ్రీనివాస్



సత్తమ్మ

కందుకూరు: రోడ్డుపై నిలిపి ఉన్న సిమెంట్ మిక్సర్ మిల్లర్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పీఎస్ పరిధిలో శుక్రవారం రాత్రి 12 గంటలకు చోటుచేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు.. యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన 12 మంది రావిర్యాల సమీపంలోని ఫ్యాబ్‌సిటీ వద్ద ఉన్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ కంపెనీలో హౌస్‌కీపింగ్ పనులు చేస్తుంటారు. నిత్యం ఇదే గ్రామానికి చెందిన ఆటోలో డ్యూటీకి వెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగే విధులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. తిమ్మాయిపల్లి గేట్ వద్ద మరమ్మతులకు గురై రోడ్డుపై నిలిపిన డీసీఎం వెనకభాగంలోని సిమెంట్ మిక్సర్ మిల్లర్‌ను ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న సురిగిరి శ్రీనివాస్ (39), పక్కనే కూర్చున్న పంది శ్రీధర్ (26), పంది సత్తమ్మ (49) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గోపలి మంజుల, గోపలి అరుణ, పంది శాంతమ్మ, పంది స్వరూప, పంది హంసమ్మ, పంది జంగమ్మ, పంది లింగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గోపలి మరియమ్మ, పంది రేణమ్మ, సిద్దిగారి లావణ్య స్వల్పగా యాలతో బయటపడ్డారు. పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి, క్షతగాత్రులను హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆటో డ్రైవర్ శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పంది సత్తమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీధర్‌కు వివాహం కాలేదు.

కాళ్లబేరానికి వచ్చిందనే కనికరించాం!

‘సిందూర్’ కాల్పుల విరమణలో మూడో వ్యక్తి ప్రమేయం లేదు

- భారత దాడుల్లో భారీ నష్టం జరగడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది
- అయినా పాకిస్తాన్‌దే విజయమని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు
- ధ్వంసమైన రన్‌వేలు, కాలిపోయిన హ్యాంగర్లు విజయంగా కనిపిస్తున్నాయా?
- ఉగ్రవాద కేంద్రాలను మూసివేసి, ముష్కరులను అప్పగిస్తేనే పాక్‌తో చర్చలు
- ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాక్ వాదనను తిప్పికొట్టిన భారత్



ఐరాసలో మాట్లాడుతున్న పెటల్ గహ్లోత్

ఐక్యరాజ్యసమితి: ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకోవడం వల్లనే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిందంటూ ఐక్యరాజ్య సమితి వేదికగా పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను అదే వేదిక నుంచి భారత్ గట్టిగా తిప్పికొట్టింది. పాకిస్తాన్ సైన్యం కాళ్లబేరానికి వచ్చి ప్రాధేయపడడం వల్లే దాడులు ఆపేశాం తప్ప ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పింది. భారత్, పాకిస్తాన్ ద్వైపాక్షిక వ్యవహారాల్లో మూడోపక్షం జోక్యాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టంచేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి పెటల్ గహ్లోత్ శుక్రవారం సాయంత్రం ఐరాస సాధారణ సభ(జనరల్ అసెంబ్లీ) సమావేశంలో ప్రసంగించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై నిప్పులు చెరిగారు. అర్థంపర్థంలేని అసంబద్ధమైన మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని గొప్పగా కీర్తించడం, ఆకాశానికి ఎత్తేయడం ఆయనకే చెల్లిందని ధ్వజమెత్తారు. పాకిస్తాన్ విదేశాంగ విధానానికి ఉగ్రవాదమే మూలస్తంభంగా మారిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్తాన్ కింద పడినా తనదే పైచేయి అని చెప్పుకోవడానికి ఆరాట పడుతోందని ఎద్దేవా చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిందని, పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలను, శిక్షణ కేంద్రాలను, ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసిందని గుర్తుచేశారు. పెటల్ గహ్లోత్ ఇంకా ఏం మాట్లాడారంటే...

అందుకేనా మీ సంబరాలు?

‘‘ ఈ ఏడాది మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైంది. భారత్‌పై మరిన్ని దాడులు చేస్తామంటూ మే 9 దాకా పాకిస్తాన్ బెదిరింపులకు దిగింది. వెంటనే దాడులు ఆపాలంటూ మే 10న భారత్‌ను పాక్ సైన్యం వేడుకుంది. మూడో వ్యక్తితో సంబంధం లేకుండా నేరుగా సంప్రదించింది. భారత సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో భారీగా నష్టం వాటిల్లడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ కీలక వైమానిక కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ ఫొటోలు బయటకు వచ్చాయి. అవి ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా చూడొచ్చు. భారత్‌పై జరిగిన యుద్ధంలో విజయం సాధించామని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు. పూర్తిగా ధ్వంసమైన రన్‌వేలు, మంటల్లో కాలిపోయిన హ్యాంగర్లు ఆయనకు విజయంగా కనిపిస్తున్నాయా?

ఉగ్రవాదులకు అధికారుల నివాళులా?

పాకిస్తాన్ భూభాగంలోని బహవల్పూర్, మురిద్కేలో ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలు నామరూపాల్లేకుండాపోయిన చిత్రాలు మనమంతా చూశాం. భారత సైన్యం దాడుల్లో కరడుగట్టిన ఉగ్రవాదులు హతమైపోయారు. వారి అంత్యక్రియలకు పాకిస్తాన్ సీనియర్ సైనికాధికారులు, ప్రభుత్వాధికారులు స్వయంగా హాజరయ్యారు. నివాళులర్పించారు. ముష్కరులను గొప్ప వ్యక్తులుగా పరిగణించడం పాకిస్తాన్ విధానమని మరోసారి తేలిపోయింది.

వారిని శిక్షించాల్సిందే

పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను బలి తీసుకున్న ‘ద రెసిస్టెన్స్ ఫ్రంట్’ను ఏప్రిల్ 25న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వెనకేసుకొచ్చింది పాకిస్తాన్ కాదా? పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ భద్రతా మండలి జారీ చేసిన ప్రెస్ స్టేట్‌మెంట్‌లో టీఆర్‌ఎఫ్ పేరును ఎవరు తొలగించారు? డ్రామాలు, అబద్ధాలు నిజాన్ని కప్పిపుచ్చలేవు. పహల్గాం దాడికి కారణమైన ముష్కరులను, వారి పోషకులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించాల్సిందే.


ఉడత ఊపులకు భారత్ భయపడదు

ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టంగా ఉంది. ఉగ్రవాదులను, వారి పోషకులను వేర్వేరుగా చూడడం లేదు. భారత్ దృష్టిలో వారంతా ఒక్కటే. వారిని శిక్షించాల్సిందే. అణుబాంబులు ఉన్నాయని బెదిరిస్తూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే సహించే ప్రసక్తే లేదు. అలాంటి ఉడత ఊపులకు భారత్ ఎప్పటికీ భయపడదు. ఎవరికీ తలవంచదు. భారత్‌తో సమగ్ర చర్చలకు సిద్ధంగా ఉన్నామని షెహబాజ్ షరీఫ్ చెబుతున్నారు. చర్చలు జరగాలని ఆయన నిజాయితీగా కోరుకుంటే ‘తొలుత పాకిస్తాన్ గడ్డపై ఉన్న ఉగ్రవాద కేంద్రాలన్నింటినీ మూసివేసి ఉగ్రవాదులను మాకు అప్పగించాలి. ఆ తర్వాతే చర్చలు. మతోన్మాదం, విద్వేషం, అసహనం అనే రొచ్చులో చిక్కుకున్న పాకిస్తాన్ ఐక్యరాజ్యసమితి వేదికపై విశ్వాసం, శాంతి గురించి బోధనలు చేయడం విచిత్రంగా ఉంది’’ అని పెటల్ గహ్లోత్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదమే తమ విధానమని పొరుగుదేశం ప్రకటించుకుంది

ఐరాస వేదికగా పాకిస్తాన్‌ను కడిగిపారేసిన జై శంకర్

- అలాంటి దేశాల్ని క్షమించేవారికి సైతం ఉగ్ర కాటు తప్పదని హెచ్చరిక



ఎస్. జైశంకర్

న్యూయార్క్: ఐక్యరాజ్యసమితి వేదికగా, ప్రపంచ దేశాల నేతల సాక్షిగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పొరుగు దేశం నైచ్యాన్ని మరోసారి తేటతెల్లం చేశారు. ఒక దేశం ఉగ్రవాదాన్ని తన విధానంగా ప్రకటించుకుందంటూ కడిగిపారేశారు. ఇలాంటి దేశాలను దగ్గరకు తీసుకునే దేశాలు సైతం ఉగ్ర కాటుకు గురికాక తప్పదని జై శంకర్ వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి ఆయన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగించారు. మనం హక్కుల గురించి చెప్పేటప్పుడు ఉగ్రవాదం వంటి తీవ్రమైన సమస్యల్ని కూడా దీటుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గాంలో అమాయక పర్యాటకుల్ని పొట్టన బెట్టుకున్న ఉదంతమే సీమాంతర ఆటవిక ఉగ్రవాదానికి తాజా ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా బిందువుగా తయారైన పొరుగు దేశం నుంచి ఈ సవాల్‌ను భారత్ స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఎదుర్కొంటూనే ఉంది. అంతర్జాతీయ ఉగ్ర సంస్థల్లో ప్రధానంగా ఉండేవన్నీ ఆ ఒక్క దేశం నుంచే పనిచేస్తున్నాయి. ఐరాస ఉగ్రవాదులుగా గుర్తించిన వారంతా ఆ దేశస్థులే’అని జై శంకర్ అన్నారు. పహల్గాం దారుణం నేపథ్యంలో ఉగ్రవాదం నుంచి తన ప్రజలను రక్షించుకునే హక్కును భారతదేశం వినియోగించుకుందని, ఉగ్రవాద సంస్థలను, దోషులను న్యాయం ముందు నిలబెట్టిందని చెప్పారు. ఉగ్రవాదం ఉమ్మడి ముప్పు కాబట్టే దీనిపై జరిగే పోరులో ప్రపంచ దేశాల మధ్య సహకారం ఎంతో అవసరమన్నారు. దేశాలు ఉగ్రవాదాన్ని బహిరంగంగా తమ విధానంగా ప్రకటించినప్పుడు, ఉగ్రవాద కేంద్రాలు ఒక పరిశ్రమ స్థాయిలో పనిచేస్తున్నప్పుడు, ఉగ్రవాదులను బహిరంగంగా కీర్తించినప్పుడు ప్రపంచ దేశాలు నిర్ద్వంద్వంగా ఖండించాలి. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడాన్ని అడ్డుకోవాలి’అని కోరారు. అదే సమయంలో, ఐరాస పనితీరును సైతం ఆయన ప్రశ్నించారు. నేటి అవసరాలకు అనుగుణంగా ఈ అంతర్జాతీయ వేదిక పనిచేస్తుందా అని మనం ప్రశ్నించుకోవాలన్నారు. ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత, శాశ్వతేతర సభ్యదేశాల సంఖ్య మరింత పెరగాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ తన ప్రజలను, వారి ప్రయోజనాలను దేశీయంగా, అంతర్జాతీయంగా పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటుందని తేల్చి చెప్పారు. భారత్ గ్లోబల్ సౌత్‌కు గొంతుకగా ఉంటుందని జైశంకర్ స్పష్టం చేశారు.

కొలంబియా అధ్యక్షుడి వీసా రద్దు చేసిన అమెరికా

వాషింగ్టన్: లాటిన్ అమెరికా దేశం కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వీసాను రద్దు చేస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ శనివారం ప్రకటించింది. పెట్రో నిర్లక్ష్యపూరిత, విద్వేషపూరిత చర్యలే ఇందుకు కారణమని విదేశాంగ శాఖ పేర్కొంది. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలను పట్టించుకోరాదంటూ న్యూయార్క్‌లో జరిగిన ర్యాలీలో అమెరికా సైనికులకు పెట్రో పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. ఈ పరిణామం రెండు దేశాల నడుమ ఉద్రిక్తతలకు కారణమైంది. ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన పెట్రో శుక్రవారం అక్కడి సమీపంలో జరిగిన పాలస్తీనా అనుకూల ర్యాలీలో మాట్లాడారు. ‘అమెరికా సైనికులందరినీ కోరుతున్నా.. మీ తుపాకుల్ని మానవీయతపైకి గురిపెట్టకండి. ట్రంప్ ఆదేశాలను పాటించకండి’ అని కోరారు. కాగా, వీసా రద్దు ఆదేశాలు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో శనివారం తిరిగి తన దేశానికి వెళ్లాక అమలవుతాయా అనే విషయం విదేశాంగ శాఖ స్పష్టం చేయలేదు. ‘ఎలాంటి శిక్ష పడ్డా భయపడను. నేను కూడా యూరప్ పౌరుడినే. అమెరికా వెళ్లడానికి నాకు వీసా అవసరం లేదు’అని అనంతరం పెట్రో సోషల్ మీడియాలో పేర్కొనడం గమనార్హం.

‘అనంత’ గర్జన!

రూ. 30 వేల కోట్ల ప్రాజెక్టుకు రక్షణ శాఖ పచ్చజెండా

- డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన స్వదేశీ క్షిపణి వ్యవస్థ
- పాక్, చైనా డ్రోన్ల పాలిట సింహస్వప్నం

సాక్షి, న్యూఢిల్లీ: భారత వాయు రక్షణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పెంచేందుకు రక్షణ శాఖ మరో కీలక ముందడుగు వేసింది. పాకిస్తాన్, చైనా సరిహద్దుల్లో శత్రువుల కుట్రలను తిప్పికొట్టేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ‘అనంత శస్త్ర’క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయాలని భారత సైన్యం నిర్ణయించింది. సుమారు రూ.30 వేల కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను సైన్యం జారీ చేసింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థను గతంలో ‘క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్’(క్యూఆర్‌ఎస్‌ఏఎం)గా పిలిచేవారు. మొత్తం ఐదు నుంచి ఆరు రెజిమెంట్లకు సరిపడా ‘అనంత శస్త్ర’వ్యవస్థను సమకూర్చుకోనున్నారు. మే నెలలో ‘ఆపరేషన్ సిందూర్’ పేరిట పాకిస్తాన్ డ్రోన్ల కుట్రను భగ్నం చేయడంలో ఈ క్షిపణి వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. ‘అనంత శస్త్ర’అత్యంత అధునాతన, హై-మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్. దీని ప్రత్యేకతలు ఇవే..

- కదులుతూనే శత్రు లక్ష్యాలను గుర్తించి, ట్రాక్ చేయగలదు.
- చాలా తక్కువ సమయంలో ఆగి, వెంటనే క్షిపణులను ప్రయోగించగలదు.
- దీని పరిధి సుమారు 30 కిలోమీటర్లు. రేయింబవళ్లూ పనిచేస్తుంది.
- ఎంఆర్-ఎస్‌ఏఎం ఆకాశ్ వంటి వ్యవస్థలతో కలిసి పనిచేస్తూ వాయు రక్షణ కవచాన్ని మరింత పటిష్టం చేస్తుంది.

‘ఆపరేషన్ సిందూర్’ తర్వాతే ఆమోదం

‘ఆపరేషన్ సిందూర్’సమయంలో పాకిస్తాన్‌కు చెందిన అనేక డ్రోన్లను భారత సైన్యం ఎల్-70, జేయూ-23 ఎయిర్ డిఫెన్స్ గన్‌లతో కూల్చివేసింది. అదే సమయంలో ఆకాశ్, ఎంఆర్-ఎస్‌ఏఎం వాయుసేనకు చెందిన స్పైడర్, సుదర్శన్ ఎస్-400 వ్యవస్థలు కూడా కీలక భూమిక పోషించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం అయిన తర్వాతే ‘అనంత శస్త్ర’ కొనుగోలుకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) పచ్చజెండా ఊపింది. ఈ కొత్త వ్యవస్థతో పాటు సైన్యానికి అత్యాధునిక రాడార్లు, షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, జామర్లు, లేజర్ ఆధారిత ఆయుధాలు కూడా అందనున్నాయి. ముఖ్యంగా పాక్ సైన్యం వాడే తుర్కియే, చైనా డ్రోన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇవి దోహదపడతాయి. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది నేతృత్వంలో రక్షణ రంగంలో స్వదేశీకరణ శరవేగంగా ముందుకు సాగుతోంది. భవిష్యత్తులో ‘జోరావర్’తేలికపాటి ట్యాంకులు, మరిన్ని స్వదేశీ వాయు రక్షణ వ్యవస్థలు సైన్యంలో చేరనున్నాయి.

వచ్చే ఏడాది భారత్‌లో వరల్డ్ సీఫుడ్ కాంగ్రెస్

న్యూఢిల్లీ: మొట్టమొదటిసారిగా వరల్డ్ సీఫుడ్ కాంగ్రెస్(డబ్ల్యూఎస్‌సీ)కి భారత్ ఆతిథ్యమివ్వనుంది. సముద్ర ఆహారం ఉత్పత్తుల్లో ప్రపంచంలోనే ఆరోది, ఆసియాలో రెండో అతిపెద్ద దేశంగా భారత్ కొనసాగుతోంది. రెండేళ్లకోసారి జరిగే ఈ సమావేశం 2026లో చెన్నైలో జరగనుంది. కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు హాజరుకానున్నారు. 1999లో ఏర్పాటైన డబ్ల్యూఎస్‌సీ సమావేశాలు కెనడా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, ఐస్‌ల్యాండ్‌లలో జరిగాయి. ఈ దఫా మన దేశంలో జరగడం అందరికీ గర్వకారణమని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్న పీడీఏ వెంచర్స్ సంస్థ చైర్మన్ ప్రదీప్ దేవయ్య అన్నారు.

ఆదా.. ఆదాయం డబుల్



- కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలకు భారీ లబ్ధి
- జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గాయి
- కాంగ్రెస్ పన్నుల దోపిడీ నుంచి ప్రజలకు విముక్తి కల్పించాం
- ఒడిశా పర్యటనలో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- రూ. 50 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

ఝార్సుగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా లూటీ జరిగిందని, జనం సొమ్మును ఆ పార్టీ దోచుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. తక్కువ ఆదాయం కలిగిన వర్గాల నుంచి కూడా భారీగా పన్నులు వసూలు చేసిందని ఆరోపించారు. లూటీ సంస్కృతి నుంచి దేశాన్ని బీజేపీ కాపాడుతోందని అన్నారు. ప్రధాని మోదీ శనివారం ఒడిశాలో పర్యటించారు. రూ.50 వేల కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ‘అంత్యోదయ గృహ యోజన’ కింద 50 వేల మంది లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఝార్సుగూడ్‌లో ‘నమో యువ సమావేశ్’లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను తొలగించడంతోపాటు జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు డబుల్ బచత్(ఆదా), డబుల్ కమాయి(ఆదాయం) కల్పించడానికి బీజేపీ చర్యలు చేపట్టిందని వివరించారు. కాంగ్రెస్ పాలనలో రూ.2 లక్షల ఆదాయంపైనా పన్ను విధించారని గుర్తుచేశారు. అప్పటి పన్నుల దోపిడీ నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని చెప్పారు. ఆదాయం పెంచుకొని, డబ్బులు ఆదాయ చేసుకొనే కొత్త శకం ఇప్పుడు ఆరంభమైందన్నారు. గతంలో రూ.లక్ష ఖర్చు చేస్తే అందులో రూ.25 వేల పన్నులే ఉండేవని, ఇప్పుడు ఆ పన్నులు రూ.5 వేలకు పడిపోయాయని తెలిపారు. అంటే ప్రజలకు రూ.20 వేలు ఆదా అయినట్లేనని స్పష్టంచేశారు.

చిప్ నుంచి షిప్ దాకా...

తమ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో రైతులు ఎంతగానో లబ్ధి పొందుతున్నారని ప్రధానమంత్రి ఆనందం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనలో ట్రాక్టర్ కొంటే పన్ను కింద రూ.70 వేలు చెల్లించాల్సి వచ్చేదని, ఇప్పుడు కేవలం రూ.40 వేలు చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. వ్యవసాయ పరికరాల ధరలు భారీగా తగ్గిపోయానని గుర్తుచేశారు. పేదలు, అణగారిన వర్గాల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని పేర్కొన్నారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. వారి జీవితాలను మరింత మెరుగుపర్చాలన్నదే తమ ధ్యేయమని ప్రకటించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావడంతో ఒడిశా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పేదరికానికి మారుపేరైన ఒడిశా ఇప్పుడు సౌభాగ్యవంతంగా మారుతోందని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ఆవశ్యకతను ప్రధానమంత్రి వివరించారు. చిప్ నుంచి షిప్ దాకా అన్నింటికా మనం స్వయం సమృద్ధి సాధించాలని, అదే మన సంకల్పమని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

రూ.11 వేల కోట్లతో 8 ఐఐటీల విస్తరణ

ఒడిశాలో ప్రధాని మోదీ పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ఇందులో టెలికమ్యూనికేషన్లు, రైల్వేలు, ఉన్నత విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ గృహ నిర్మాణం తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. రూ.11 వేల కోట్లతో ఎనిమిది ఐఐటీల విస్తరణకు మోదీ శంకుస్థాపన చేశారు. ఐఐటీ-భువనేశ్వర్ భాగస్వామ్యంతో సెమీకండక్టర్ పార్కు నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల్లో నాణ్యత పెంచడానికి ‘మెరిట్’ పథకాన్ని ప్రారంభించారు. ఒడిశా నుంచి గుజరాత్‌కు ప్రయాణించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పచ్చజెండా ఊపారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ స్వదేశీ టవర్లు ప్రారంభం

టెలికమ్యూనికేషన్ల మౌలిక సదుపాయాల రంగంలో ఆధునికతకు పెద్దపీట వేస్తూ బీఎస్ఎస్ఎన్ ‘స్వదేశీ’ 4జీ టెక్నాలజీకి ప్రధాని నరేంద్ర మోదీ ఒడిశాలో శ్రీకారం చుట్టారు. 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రారంభించారు. రూ.37 వేల కోట్లతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ టవర్లను బీఎస్ఎన్ఎల్ నిర్మించినట్లు మోదీ తెలిపారు. టెలికమ్యూనికేషన్ల రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా దేశాల జాబితాలో మనం కూడా చేరామని పేర్కొన్నారు. మన దేశం గ్లోబల్ టెలికం తయారీ కేంద్రంగా ప్రగతి సాధిస్తోందని స్పష్టంచేశారు. 4జీ టెక్నాలజీ విస్తరణతో 2 కోట్ల మందికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలో 30 వేల మారుమూల గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. 4జీ సేవలతో గిరిజన, కొండ ప్రాంతాలకు మేలు జరుగుతుందని వివరించారు. దూరంగా ఉన్న గ్రామాల్లోని పిల్లలు సైతం ఇకపై ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కావొచ్చని సూచించారు. రైతులు పంటల ధరలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని అన్నారు.

సామాజిక, ఆర్థిక సమానత్వం మన ఉమ్మడి బాధ్యత

సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ స్పష్టీకరణ

నాసిక్: సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాల్సి ఉందని, ఇది మనందరి ఉమ్మడి బాధ్యత అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. ఆయన శనివారం మహారాష్ట్రలోని నాసిక్‌లో జిల్లా, సెషన్స్ కోర్టు నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం భారతీయులందరికీ భగవద్గీత, గురు గ్రంథ సాహిబ్ లేదా ఖురాన్ లాంటిదని స్పష్టంచేశారు. రాజ్యాంగం చాలా ముఖ్యమైన పుస్తకమని వివరించారు. ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ అనే సూత్రీకరణ ప్రజలకు రాజకీయ సమానత్వాన్ని ప్రసాదిస్తుందని 1949 నవంబర్ 25న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పినట్లు గుర్తుచేశారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేనిదే రాజకీయ సమానత్వానికి ఎలాంటి విలువ లేదన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంలోనే సామాజిక, ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు.

21 అంశాల ప్రణాళికతో గాజాలో శాంతి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం

వాషింగ్టన్: గాజాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా ప్రభుత్వం 21 అంశాలతో ఒక శాంతి ప్రణాళికను తయారు చేసింది. ఒప్పందం కుదిరిన 48 గంటల్లోగా బందీలందరినీ హమాస్ విడుదల చేయడం, గాజాలోని సైనిక బలగాలను దశలవారీగా ఇజ్రాయెల్ ఉపసంహరించుకోవడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంతో గాజాలో యుద్ధానికి తెర పడుతుందని ట్రంప్ ఆశాభావంతో ఉన్నారు. ఒప్పందం చివరి దశలో ఉందని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం భవిష్యత్తు గాజాలో హమాస్‌కు ఎలాంటి పాత్రా ఉండదు. బదులుగా పాలనా వ్యవహారాలను చూసేందుకు అంతర్జాతీయ కమిటీ, ఒక పాలస్తీనా కమిటీ ఏర్పాటవుతాయి. పాలనా బాధ్యతలను పాలస్తీనా అథారిటీ(పీఏ)కి అప్పగించే విషయంలో ఎలాంటి కాల పరిమితి విధించలేదు. అయితే, పాలస్తీనా అథారిటీకి గాజా బాధ్యతలను అప్పగించడానికి ఇజ్రాయెల్ సుతరామూ అంగీకరించకపోవడం గమనార్హం.

రోజంతా చిన్న గదిలో బంధించారు

రాత్రంతా నిలబడే ఉండాల్సి వచ్చింది

- శాకాహారినైన నాకు గొడ్డు మాంసం ఇచ్చారు
- కారణం చెప్పకుండా అరెస్టు చేసి బేడీలు వేశారు
- అమెరికా నుంచి డిపోర్ట్ అయిన 73 ఏళ్ల పంజాబీ మహిళ ఆవేదన
- ట్రంప్ వచ్చాకే ఈ పరిస్థితి అని హర్జిత్‌కౌర్ కన్నీళ్లు



చండీగఢ్: అమెరికాలో దాదాపు 30 ఏళ్లుగా ఉంటూ.. ఏ ఒక్కరోజు కూడా ఏ తప్పూ చేయని తనను ఆ దేశ ఇమిగ్రేషన్ అధికారులు అత్యంత దారుణంగా భారత్‌కు బలవంతంగా (డిపోర్ట్) పంపేశారని పంజాబ్‌కు చెందిన 73 ఏళ్ల హర్జిత్‌కౌర్ కన్నీటిపర్యంతమయ్యారు. కనీసం తన కుటుంబసభ్యులకు వీడ్కోలు కూడా చెప్పనివ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నారన్న ఆరోపణలతో హర్జిత్‌కౌర్‌ను అరెస్టు చేసిన ఆ దేశ అధికారులు.. కొద్దిరోజుల క్రితం భారత్‌కు తిప్పి పంపారు. ఆమె శనివారం మొహాలీలోని తన సోదరి నివాసంలో మీడియాతో తన ఆవేదనను పంచుకున్నారు. అమెరికా అధికారులు తనతో అత్యంత దారుణంగా వ్యవహరించారని, ఎందుకు అరెస్టు చేశారో కూడా చెప్పలేదని కన్నీళ్లు పెట్టుకున్నారు. కౌర్ స్వస్థలం పంజాబ్‌లోని తార్న్‌తరణ్ జిల్లా పంగోటా గ్రామం. భర్త చనిపోవటంతో ఆమె 1992లో ఇద్దరు కుమారులను తీసుకొని అమెరికా వెళ్లారు. కాలిఫోర్నియాలోని ఈస్ట్‌బేలో స్థిరపడ్డారు. శాశ్వత నివాసం కోసం ఆమె పెట్టుకున్న దరఖాస్తును 2012లో అమెరికా అధికారులు తిరస్కరించారు. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆమె స్థానిక ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) కార్యాలయానికి వెళ్లి హాజరు వేసుకుంటూనే ఉన్నారు. అలాగే ఈ నెల 8న ఐసీఈ కార్యాలయానికి వెళ్లిన ఆమెను రెండుగంటలపాటు కూర్చోబెట్టి.. అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. అధికారుల తీరుపై ఆమె కుటుంబసభ్యులు, స్థానిక సిక్కు ప్రజలు తీవ్ర అభ్యంతరం తెలిపినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవలే ఆమెను భారత్‌కు బలవంతంగా పంపేశారు.

కూర్చునే అవకాశం కూడా ఇవ్వలేదు

మోకాళ్ల సర్జరీ చేయించుకున్న తనను అమెరికా అధికారులు ఒక రాత్రంతా ఓ గదిలో బంధించి కనీసం కూర్చునే సౌకర్యం కూడా కల్పించలేదని హర్జిత్‌కౌర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ‘ప్రతి ఆరు నెలలకు నేను ఐసీఈ ఆఫీస్‌కు వెళ్లి హాజరు వేయించుకునేదాన్ని ఈ నెల 8న అలాగే వెళ్లాను. కానీ, ఏ కారణం చెప్పకుండానే నన్ను అరెస్టు చేశారు. నా కుటుంబసభ్యులకు కనీసం వీడ్కోలు కూడా చెప్పే సమయం ఇవ్వకుండా బలవంతంగా తీసుకెళ్లిపోయారు. నన్ను భారత్‌కు తామే తీసుకెళ్తామని నా కుటుంబసభ్యులు అధికారులకు తెలిపి, విమాన టికెట్లు చూపించినా వాళ్లు పట్టించుకోలేదు. నాకు అమెరికాలో వర్క్ పర్మిట్ ఉంది. ఐడీ, లైసెన్స్ అన్నీ ఉన్నాయి. అయినా అరెస్టు చేశారు’అని వాపోయారు. తనకు ఎదురైన పరిస్థితి ఎవరికీ ఎదురుకావద్దని కన్నీళ్లు పెట్టుకున్నారు. ‘ఏం చెప్పనూ.. ! నా పరిస్థితి ఎవరికీ రాకూడదు. నన్ను అరెస్టు చేసిన తర్వాత అధికారులు నా ఫొటోలు తీసుకొని ఒక రాత్రంతా ఓ గదిలో ఉంచారు. అది చాలా చల్లని ప్రదేశం. నాకు కనీసం కూర్చునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. నా చేతులకు బేడీలు వేసి బంధించి శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి బేకర్స్‌ఫీల్డ్‌కు తీసుకెళ్లారు. మందులు కూడా వేసుకోనివ్వలేదు. నా మొరను ఎవరూ పట్టించుకోలేదు. నేను పూర్తిగా శాకాహారిని. వాళ్లు నాకు గొడ్డుమాంసంతో కూడి భోజనం ఇచ్చారు. దీంతో నేను అది తినలేక చిప్స్, బిస్కట్లతోనే కడుపు నింపుకున్నాను’ అని చెప్పారు. ఖైదీలకు వేసినట్లు నాకు ఓ యూనిఫాం వేసి పంపేశారు. నా మనవడు ‘ఈ డ్రస్‌లో నిన్ను చూడలేకపోతున్నా నానమ్మ’ అని బాధపడ్డాడు అని కౌర్ తెలిపారు.

మళ్లీ అమెరికా వెళ్తా

తాను మళ్లీ అమెరికా వెళ్లగలననే నమ్మకం ఉందని హర్జిత్ కౌర్ తెలిపారు. ‘భారత్‌లో నాకు ఉండటానికి ఏమీ లేదు. నా కుటుంబమంతా అమెరికాలోనే ఉంది. నా స్వగ్రామంలో నా ఇల్లు ఉందో కూలిపోయిందో కూడా తెలియదు. నేను మళ్లీ అమెరికా వెళ్లి నా కుటుంబాన్ని కలుస్తాననే నమ్మకం ఉంది’అని ఆశాభావం వ్యక్తంచేశారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చిన తర్వాతే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

వివక్షాపూరిత టారిఫ్‌లతో వాణిజ్యానికి విఘాతం

బ్రిక్స్ విదేశాంగ మంత్రుల ఆందోళన

ఐక్యరాజ్యసమితి/న్యూయార్క్: విచక్షణారహితంగా టారిఫ్‌లను విధిస్తూ వాణిజ్య నియంత్రణ చర్యలకు పాల్పడటంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటువంటి నిర్బంధపూరిత విధానాలతో గ్లోబల్ సౌత్ దేశాలను అణగదొక్కే ప్రమాదముందని హెచ్చరించాయి. ప్రపంచ వాణిజ్యాన్ని మరింత తగ్గించి, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బ తీసి, అంతర్జాతీయ ఆర్థికవాణిజ్య కార్యకలాపాలలో అనిశ్చితిని కల్పిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి రక్షణాత్మక చర్యలు ప్రస్తుత ఆర్థిక అసమానతలను మరింత తీవ్రతరం చేయడంతోపాటు ప్రపంచ అభివృద్ధి అవకాశాలను ప్రభావితం చేస్తాయని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాలకు హాజరైన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు భారత్ అధ్యక్షతన శుక్రవారం న్యూయార్క్‌లో భేటీ అయ్యారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టనుండటం తెల్సిందే. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అధ్యక్షతన భేటీ జరిగింది. అనంతరం మంత్రులు అమెరికా ప్రభుత్వం, అధ్యక్షుడు ట్రంప్ పేరును ప్రస్తావించకుండా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశం పహల్గాం ఉగ్రదాడిని కూడా ఖండించింది.


పురానాపూల్ వద్ద ఇమ్లీబన్ బస్ స్టేషన్‌కు వెళ్లే దారి ఇలా...


ఇమ్లీబన్ వద్ద బస్ స్టేషన్‌లోకి వెళ్లే బ్రిడ్జిని తాకుతూ వెళుతున్న మూసీ ప్రవాహం


అంబర్‌పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

భయపెట్టిన మూసీ

భారీ వర్షాలకు హైదరాబాద్‌పై పోటెత్తిన వరద

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లెత్తటంతో ఉగ్రరూపం

నీట మునిగిన పరీవాహక ప్రాంతాలు.. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ మూసివేత..

లోలెవెల్ వంతెనలు మూసివేసి.. వాహనాల దారిమళ్లింపు

వేలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు.. వరద పరిస్థితిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

శనివారం సాయంత్రానికి తగ్గిన వరద ఉధృతి.. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలకు ఇద్దరు మృతి

కొట్టుకుపోయిన ఏడుపాయల గుడి ప్రసాదం కౌంటర్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/సాక్షి, రంగారెడ్డి జిల్లా/పాపన్నపేట(మెదక్): హైదరాబాద్ నగరాన్ని మూసీ నది వణికించింది. దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ చూడని విధంగా ఉగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తటంతో శుక్రవారం సాయంత్రం నుంచి నది గట్టుదాటి ప్రవహించింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల గేట్లను ఒకేసారి ఎత్తడంతో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వరద వచ్చి నగరంపై పడింది. దీంతో ఎన్నడూలేని విధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్)ను వరద ముంచెత్తిన విషయం తెలిసిందే. శనివారం కాస్త శాంతించినప్పటికీ వరద ఉధృతి కొనసాగింది. ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేశారు. మూసీ పరీవాహక ప్రాంతాలైన బాపూఘాట్ నుంచి మూసారాంబాగ్ బ్రిడ్జి వరకు అనేక లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, కాలనీలు నీటమునిగాయి. మూసానగర్, శంకర్‌నగర్, మలక్‌పేట తదితర చోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరటంతో దాదాపు 3,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్, మలక్‌పేటలోని పునరావాస కేంద్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనతో కలిసి సందర్శించారు. వరద నీరు చేరటంతో చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ కాజ్‌వేలను మూసివేశారు. మూసారాంబాగ్ కాజ్‌వే పక్కనే నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జిని సైతం వరద నీరు తాకింది. నార్సింగి, హిమాయత్‌సాగర్ వద్ద సర్వీస్ రోడ్డును మూసివేశారు. మంచిరేవుల – నార్సింగి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పూరానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ ప్రమాదకర స్థాయికి చేరింది. శివాలయం నీటమునిగింది. ఆలయ పూజారి కుటుంబం గుడిలోనే చిక్కుకుపోవడంతో హైడ్రా సిబ్బంది క్రేన్‌సాయంతో బయటికి తీసుకొచ్చారు. మూసీ వరద ఉధృతిపై అధికారులతో సీఎం రేవంత్ ఆరా తీశారు. ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు విభాగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

కాస్త తగ్గిన వరద

మూసీ నదికి శనివారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. జంట జలాశయాల నుంచి మూసీలోకి వదులుతున్న వరద 36 వేల క్యూసెక్కుల నుంచి 15 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 9,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 11 గేట్లు తొమ్మిది అడుగుల మేర ఎత్తి దిగువకు 9,284 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌కు ఎగువ నుంచి 7,000 క్యూసెక్కుల వరద వస్తుండగా, నాలుగు గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 6,420 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు

రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో వర్ష బీభత్సం

రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో శనివారం భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీట మునిగాయి. వీర్‌శెట్టిపల్లి, సంగెంకలాన్, జీవన్గీ గ్రామాలను వరద చుట్టుముట్టింది. ఓగిపూర్ సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తూ జుట్టూరు వాగులో చిక్కుకున్న ఇద్దరు లారీ డ్రైవర్లను ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి. కాగ్నా నది ఉధృతికి యాలాల మండలంలోని కోకట్ బ్రిడ్జి తెగిపోయింది. దీంతో తాండూరు, పరిగి, హైదరాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. విశ్వనాథ్‌పూర్ వాగు దాటే క్రమంలో కొందుర్గు మండలం వెంకిర్యాలకు చెందిన లింగమయ్య (42) కొట్టుకుపోయి మరణించాడు. కోట్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన చింతకింది రవికుమార్ (35) కొత్తపల్లి చెరువు అలుగులో కొట్టుకుపోయిన చనిపోయాడు. బషీరాబాద్ మండలం జీవన్గీలోని కాగ్నా ఒడ్డున ఉన్న గోశాలను వరద ముంచెత్తటంతో గోవులను ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సంగారెడ్డి జిల్లాలో శనివారం కూడా భారీ వర్షాలు కురిశాయి. మనూరు మండలంలో 9.2 సెం.మీల వర్షపాతం రికార్డయింది. సదాశివపేట మండలం పెద్దాపూర్‌లో ఉన్న హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు పంప్‌హౌజ్ పూర్తిగా నీట మునిగింది. దీంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడింది. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామ శివారులో రహదారి కొట్టుకుపోవటంతో సదాశివపేట, టేకులపల్లి, అనంతసాగర్, మోమిన్‌పేటల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మునిపల్లి మండలంలో పంటలు నీట మునిగాయి. పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొండాపూర్ మండలంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.


చాదర్‌ఘాట్ కాజ్‌వేను ముంచెత్తిన వరద నీరు


మూసారాంబాగ్ వద్ద నీట మునిగిన ప్రైవేట్ బస్సులు


చాదర్‌ఘాట్ వద్ద రెస్క్యూ సిబ్బంది సేవలు



అంబర్‌పేట వద్ద మూసీ వరద ఉధృతికి నీట మునిగిన వాహనాలు


హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ నిండుకుండలా

శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు వరద

5.77 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- సాగర్‌కు నాలుగు లక్షల క్యూసెక్కులు
- గోదావరి నదిలోనూ క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం


శ్రీశైలం డ్యాం నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్/కన్నాయిగూడెం/ దోమలపెంట: కృష్ణా బేసిన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీటి ప్రవాహం పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఈ ఏడాది తొలిసారిగా 5 లక్షలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా 5,03,100, సుంకేసుల నుంచి 71,136, హంద్రీ నుంచి 3,750 క్యూసెక్కులు మొత్తం 5,77,986 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను ఒక్కొక్కటి 20 అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 4,61,560 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే ఎడమ, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ మరో 64,695 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 5,26,255 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.5 అడుగుల వద్ద 202.0439 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నాగార్జున సాగర్ 26 గేట్లను 10 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 3,76,402 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదనతో మరో 33,373 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 587.30 అడుగులు (305.6838 టీఎంసీలు) ఉంది. భారీ వర్షాల వల్ల ఆయకట్టు పొలాలకు నీటి అవసరాలు తగ్గడం, కాల్వల కరకట్టలు జారిపోయే ప్రమాదం ఉండటంతో సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లే కుడి కాల్వకు మాత్రం 8,023 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. భారీ వర్షాలతో గోదావరిలో నీటిమట్టం కూడా వేగంగా పెరుగుతోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలోని సమ్మక్కసాగర్ బరాజ్‌కు 6,72,140 క్యూసెక్కుల వరద వస్తోంది. బరాజ్ 59 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే మూసీకి వరదలు

- రూ.1.5 లక్షల కోట్ల దోపిడీ కోసమే హైదరాబాద్ ప్రజలను ముంచిండు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు
- తెలంగాణభవన్‌లో 'కాంగ్రెస్ బాకీ కార్డు'పోస్టర్ ఆవిష్కరణ



బాకీ కార్డు పోస్టర్‌తో హరీశ్, కేటీఆర్, తలసాని

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మనస్తత్వంతోనే వేలాది ప్రజల ఇళ్లు, ఆస్తులు మూసీ వరదలో చిక్కుకున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రూ.1.5 లక్షల కోట్ల దోపిడీ కోసమే హైదరాబాద్ ప్రజలను ముఖ్యమంత్రి మూసీ వరదలో ముంచారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌కు వరద ముప్పును తగ్గించేందుకు వందేళ్ల కిందట నిజాం ప్రభుత్వం ఉస్మాన్‌సాగర్, గండిపేట చెరువులను నిర్మించిందని గుర్తు చేశారు. భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు రాగానే, వాటిని ఖాళీ చేసి మూసీ వరద నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందన్నారు. కానీ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో దోపిడీకి పాల్పడేందుకు ఆ ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలన్న దురుద్దేశంతో రేవంత్‌రెడ్డి ఆ చెరువులను ఖాళీ చేయించలేదని కేటీఆర్ ఆరోపించారు. అందుకే చరిత్రలో తొలిసారిగా ఇమ్లిబన్‌ను వరద ముంచెత్తిందన్నారు.

రేవంత్‌ను ఓడించాలని ...

అనుముల బ్రదర్స్ అరాచకాలపై ఆగ్రహంగా ఉన్న కొడంగల్ ప్రజలు ఈసారి ఎలాగైనా రేవంత్‌ను ఓడించాలని కంకణం కట్టుకొని ఉన్నారని కేటీఆర్ తెలిపారు. కొడంగల్‌లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించిన రేవంత్, రాబోయే ఎన్నికల్లో వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమన్నారు. కొడంగల్‌లో స్విచ్ బంద్ చేస్తే ఢిల్లీలో లైట్లు బంద్ అవుతాయని, కొడంగల్‌లో రేవంత్‌రెడ్డికి తొడపాశం పెడితే ఢిల్లీ దద్దరిల్లుతుందన్నారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు..

ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ పార్టీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'ఉద్యమాన్ని ప్రారంభించింది. తెలంగాణభవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ 'బాకీ కార్డు'పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రతి వర్గానికి కాంగ్రెస్ ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందుంచి, రాబోయే పంచాయతీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ బాకీ కార్డులను తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించి, ఇంటింటికీ తీసుకెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

గ్యారంటీ కార్డు గాసిప్ కార్డుగా మారింది: హరీశ్‌రావు

కాంగ్రెస్ గ్యారంటీ కార్డు 'గాసిప్ కార్డు'గా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'కటింగ్ మాస్టర్'గా మారి, కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను కోతపెట్టారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అభయహస్తం అని బాండ్ పేపర్లు పంచారు..కానీ అది అచేతన హస్తమని ఎద్దేవా చేశారు.

నేడు అచ్చంపేటలో జనగర్జన

కేటీఆర్ ఆదివారం అచ్చంపేటలో జరిగే 'చలో అచ్చంపేట..బీఆర్‌ఎస్ జన గర్జన'భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గాన అచ్చంపేటకు బయలుదేరి, మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో ప్రసంగిస్తారు. శంషాబాద్, తుక్కుగూడ, కడ్తాల్, ఆమన్‌గల్, కల్వకుర్తి, డిండి మీదుగా కేటీఆర్ అచ్చంపేట చేరుకుంటారు.

ఫ్యూచర్ సిటీకి నేడు అంకురార్పణ

ఎఫ్‌సీడీఏ, గ్రీన్‌ఫీల్డ్ రేడియల్‌రోడ్డుకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'కి సీఎంరేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఫ్యూచర్‌సిటీలో భాగంగా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట పరిధిలో 2.11 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించతల పెట్టిన ఎఫ్‌సీడీఏ పరిపాలన భవనాలకు, రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ (41.5 కి.మీ.లు) నంబర్–1 రోడ్డుకు సీఎం భూమిపూజ చేస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ(ఫోర్త్‌సిటీ)ని తీర్చిదిద్దనున్నట్లు ప్రభు త్వం ఇప్పటికే ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఏడు మండలాలు, 56 రెవెన్యూ గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల పరిధితో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేసింది.

మొదటి నెట్ జీరో సిటీగా..

ఫ్యూచర్ సిటీని దేశంలోనే మొదటి నెట్ జీరో (కాలు ష్య రహిత) సిటీగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. 15 వేల ఎకరాల్లో సిటీ ఏరియాతో పాటు దానికి ఆనుకుని మరో 15 వేల ఎకరాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఉండటంతో నగరానికి అది గ్రీన్‌లంగ్స్‌గా పని చేయనుంది. ప్రపంచ బ్యాంకు, జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కా బోతున్నాయి. ఫార్మాతోపాటు హెల్త్ కేర్, లైఫ్ సైన్సె స్, ఎడ్యుకేషన్, నాలెడ్జ్–బేస్డ్ పరిశ్రమలు, ఎంటర్‌టైన్‌మెంట్, ఎకో టూరిజం జోన్లుగా ఈ సిటీని విభజించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఈవీ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అత్యంత ప్రాధాన్యమివ్వటం రాబోయే శతాబ్దపు సిటీకి కొత్త సంకేతం. స్మార్ట్ మౌలిక సదుపాయాలు, భవిష్యత్ తరం సాంకేతికతకు ఈ సిటీ సరికొత్త నమూనాగా ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. సిటీ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా సింగిల్ విండో సిస్టమ్ అమలు చేస్తారు. ఎఫ్‌సీ డీఏ కార్యాలయంలోనే భవన నిర్మాణ అను మతు లు, లే అవుట్లకు, పరిశ్రమలకు అనుమతులు జారీ చేయనున్నారు. టోల్ ఫీజు లేకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్ రోడ్లను అనుసంధానం చేస్తారు.

'మదర్ డెయిరీ'లో అనూహ్య ఫలితాలు

- మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు.. బీఆర్‌ఎస్‌కు 2, కాంగ్రెస్‌కు 1
- క్యాంపులోనే కమాల్... పొత్తు చిత్తయింది


గెలిచిన డైరెక్టర్లు వీరే..

సాక్షి, యాదాద్రి/హయత్‌నగర్: మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ స్నేహపూర్వక పొత్తులో లెక్క తప్పింది. మూడు డైరెక్టర్ల స్థానాలకు శనివారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్‌లో జరిగిన ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. ఇరు పార్టీలు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కాంగ్రెస్ 2, ఒక చోట బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను డైరెక్టర్లుగా గెలిపించుకోవాలి. కానీ, అనూహ్యంగా ఇద్దరు బీఆర్‌ఎస్, ఒక కాంగ్రెస్ డైరెక్టర్ గెలుపొందారు. గెలిచిన అభ్యర్థులు సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు.

గెలిచింది వీరే..

మహిళకు రిజర్వు అయిన డైరెక్టర్ స్థానానికి నలుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. కాంగ్రెస్ బలపరిచిన కర్నాటి జయశ్రీకి 176 ఓట్లు రాగా, ఆమె విజయం సాధించింది. జనరల్‌లో ఉన్న 2 డైరెక్టర్ల స్థానాలకు ఐదుగురు బరిలో నిలిచారు. బీఆర్‌ఎస్ మద్దతుతో పోటీ చేసిన రాజాపేటకు చెందిన సందిల భాస్కర్‌గౌడ్‌కు 240, మోత్కూరుకు చెందిన రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డికి 154 ఓట్లు రావడంతో వారిని విజయం వరించింది. అయితే చివరి నిమిషంలో కాంగ్రెస్ తమ అభ్యర్థిని మార్చింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ స్నేహపూర్వక పొత్తుపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్‌పై సామేల్ చేసిన విమర్శలతో కొత్త అభ్యర్థి తెరపైకి వచ్చాడు. సామేల్ సూచించిన తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన కుంచాల ప్రవీణ్‌రెడ్డిని రాత్రి 8 గంటల తర్వాత హయత్‌నగర్ క్యాంపులో ఉన్న నాయకులు మార్చారు. అతని స్థానంలో ఆలేరు నియోజకవర్గానికి చెందిన శీలం వెంకట నర్సింహారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించగా, ఆయనకు 152 ఓట్లు వచ్చాయి. కేవలం రెండు ఓట్ల తేడాతో లక్ష్మీనర్సింహారెడ్డి చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి శీలం వెంకట నర్సింహారెడ్డి ఓడిపోయారు.

క్యాంపులో క్రాస్ ఓటింగ్

మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో బీఆర్‌ఎస్ అనూహ్యంగా ఒక సీటు అదనంగా సాధించింది. కాంగ్రెస్ విభేదాలు కూడా ఆ పార్టీ అభ్యర్థి విజయంపై ప్రభావం చూపాయి. కాగా మూడు సీట్లు తామే గెలిచామని బీఆర్‌ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నాయి. అనూహ్య ఫలితం రావడంతో కాంగ్రెస్ నాయకులు అంతర్మథనంలో పడ్డారు. కాగా డెయిరీ ఎన్నికల్లో ఓట్ల కోసం పోటీ పడ్డ అభ్యర్థులు రూ.వేలల్లో ఖర్చు చేశారని ప్రచారం జరుగుతోంది. ఒక్కో ఓటరు క్యాంపు నిర్వాహకుల ద్వారా రూ.15 వేలు, బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలిచిన అభ్యర్థి రూ.5 వేల చొప్పున ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది.

లాభాల బాటలోకి తెస్తాం: చైర్మన్

మదర్ డెయిరీని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుతో ఒప్పందం చేసుకుంటున్నామని సమాఖ్య చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు.

మంజీరా మహోగ్రం


ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ముందు మంజీరా ఉధృతి

మంజీరా నది కూడా ఉగ్రరూపం దాల్చింది. సింగూరు నుంచి విడుదల చేసిన లక్ష క్యూసెక్కులకు మరో 20 వేల క్యూసెక్కుల వర్షం నీరు తోడవడంతో ఘనపురం ఆనకట్ట పై నుంచి మొత్తం 1.20 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. వరద ఉధృతికి ఏడుపాయల ఆలయం ముందు ఉన్న లడ్డు ప్రసాదం కౌంటర్, క్యూలైన్లు కొట్టుకుపోయాయి. ఏడుపాయల్లో ఉన్న మూడో బ్రిడ్జితో పాటు ఎల్లాపూర్ బ్రిడ్జీలు మునిగిపోయాయి. దీంతో పాపన్నపేట, టేక్మాల్ వాసులకు మెదక్ వెళ్లడానికి దారులు మూసుకుపోయాయి. మెదక్ ఆర్డీఓ రమాదేవి, మెదక్, పాపన్నపేట తహసీల్దార్లు లక్ష్మణ్‌బాబు, సతీశ్ వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు.

కిషన్‌రెడ్డి నిద్ర చేసిన ఇల్లు వరద నీటితో నిండిపోయింది

రాజకీయాలు పక్కనపెట్టి మూసీ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపెట్టాలి: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ నేతలు ఇప్పుడు మూసీ నిద్ర చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు నిద్ర చేసిన ఇల్లు ఇప్పుడు వరద నీటితో నిండిపోయిందని, వారిప్పుడు వెళ్లి ఆ ఇంట్లో నిద్ర చేస్తారా అని ప్రశ్నించారు. అప్పట్లో దొంగ నిద్రలు చేసి ప్రజలను మభ్య పెట్టాలని చూశారని, ఇప్పుడు మాత్రం మూసీ వరద బాధిత ప్రాంతాల్లో బీజేపీ నేతలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆనాడు దొంగ నిద్రలు చేసిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడున్నారని బల్మూరి ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని బీజేపీ నేతలు అడ్డుకున్నారని, ఇప్పటికైనా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కలిసి రావాలని కోరారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బాధితులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలను వినియోగించుకోవాలన్నారు.

క్లుప్తంగా...

ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ షెడ్యూల్ ఖరారు

- ఈ నెల 29వ తేదీ, అక్టోబర్ 1 తేదీల్లో వాదనలు
- ఖరారు చేసిన స్పీకర్



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 29వ తేదీ, అక్టోబర్ 1 తేదీల్లో ఇరు వర్గాల వాదనలు వినేలా షెడ్యూల్‌ను ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిటిషనర్లు కాగా.. ప్రతివాదులుగా ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పేర్లు ఉన్నాయి. ఈ నెల 29న పిటిషనర్లయిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ప్రతివాదులైన ఎమ్మెల్యేల పక్షాన క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు. అక్టోబర్ ఒకటో తేదీన ప్రతివాదులైన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరపున క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ కృషిని ఆదర్శంగా తీసుకోవాలి

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. బాపూజీ అందించిన ప్రజాస్వామిక స్ఫూర్తి, చేసిన త్యాగం మరువలేనిదని గుర్తు చేశారు. ఆయన పేరుతో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, రాష్ట్ర ఉద్యానవన విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేసిందని, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని నెలకొల్పిందని కేసీఆర్ వెల్లడించారు.

డిపాజిట్ల కోసమే బీఆర్‌ఎస్ పగటి వేషాలు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు దక్కించుకోవడానికి బీఆర్‌ఎస్ నేతలు పగటి వేషాలు కట్టబోతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో ఆ పార్టీ నేత కేటీఆర్ కొత్త డ్రామా మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. దళితుడిని సీఎం చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తానని, దళిత బంధు, బీసీ బంధు, గిరిజనబంధు ఇస్తానని చెప్పి.. ఆ హామీలన్నింటినీ పాతర పెట్టిన కేసీఆర్‌పై ఏ కార్డు ఉద్యమం చేయాలని ప్రశ్నించారు. రైతులందరికీ ఎరువులు ఉచితంగా ఇస్తానని మోసం చేసినందుకు, ప్రతిపక్ష నేత హోదాలో జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌లో కూర్చున్నందుకు ఏ ఉద్యమం చేయాలని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్‌రావు, సంతోష్‌రావులు దోచుకుతిన్నారని కవిత చేసిన ఆరోపణలపై నోరు మెదపని వారిపై ఏ ఉద్యమం చేయాలని ఆయన ప్రశ్నించారు.

మిత్రపక్షమైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నిజామాబాద్ సిటీ: కమ్యూనిస్టు పార్టీలెప్పుడూ ప్రజల కోసమే పోరాటాలు చేస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షమైనా రాష్ట్రంలో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. శనివారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏఐటీయూసీ 2వ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలను దోచుకుంటూ దేశ సంపదను కొద్దిమంది బడా కార్పొరేట్ శక్తులకు పంచిపెడుతోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా కమ్యూనిస్టులు చేస్తున్న ప్రజాపోరాటాలు చేస్తున్నారని, బిహార్‌లో ఓట్ చోరీని బట్టబయలు చేశారన్నారు. హమాలీ కార్మికుల వయస్సు 61కి పెంచేలా ప్రభుత్వానికి సూచిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను పెద్దసంఖ్యలో గెలిపించుకోవాలన్నారు.

పెండింగ్ బిల్లులు ఇచ్చాకే ఎన్నికలు

సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు.. స్థానిక ఎన్నికలు జరపొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదినికి తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఎస్ఈసీ కార్యాలయంలో కమిషనర్‌ను జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. తమ పదవీ కాలం ముగిసి ఏడాదిన్నర దాటినా కూడా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకపోవడంతో పలువురు ఆత్మహత్యల బారిన పడే ప్రమాదంలో ఉన్నారని పేర్కొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు

పీఆర్, ఆర్‌డీ డైరెక్టర్ పేరిట గెజిట్ జారీ

రేపు తెల్లవారుజాముకల్లా జిల్లాల్లో రిజర్వేషన్లు సిద్ధం

ఆదివారం ఎస్ఈసీకి పీఆర్‌శాఖ అందించే అవకాశం.. ఆ వెంటనే నోటిఫికేషన్?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ గెజిట్‌ను జారీచేసింది. శనివారం రాత్రి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ డా.జి.సృజన పేరిట రాజపత్రం జారీ అయ్యింది. ఈ గెజిట్‌కు అనుగుణంగా ఎస్టీలకు 4, ఎస్సీలకు 6, బీసీలకు 13, అన్ రిజర్వ్‌డ్‌కు 8 జెడ్పీ చైర్‌పర్సన్ పదవులను రిజర్వ్ చేయగా, అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం పదవులు రిజర్వ్ చేశారు. శనివారం ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ కార్యాలయంలో రాజకీయ పక్షాలతో నిర్వహించిన సమావేశంలో అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లకు సంబంధించిన లాటరీ నిర్వహించారు. తదనుగుణంగా ఆయా కేటగిరీల్లో ఈ పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఆయా కేటగిరీల వారీగా చైర్‌పర్సన్ల పదవులకు రిజర్వేషన్లను పరిశీలిస్తే బీసీలకు 41.96 శాతం, ఎస్సీలకు 19.35 శాతం, ఎస్టీలకు 12.90 శాతం, అన్‌రిజర్వ్‌డ్‌కు 25.80 శాతం దక్కినట్టుగా తెలుస్తోంది. ఈ పదవుల్లో మొత్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 74.20 శాతం రిజర్వేషన్లు ఖరారు కాగా, అన్‌రిజర్వ్‌డ్ (జనరల్) కేటగిరీకి 25.80 శాతం లభించినట్టుగా స్పష్టమవుతోంది.

జిల్లా పరిషత్ పేరు	రిజర్వేషన్ ఇలా...
ఖమ్మం	ఎస్టీ జనరల్
ములుగు	ఎస్టీ ఉమెన్
నల్లగొండ	ఎస్టీ ఉమెన్
వరంగల్	ఎస్టీ జనరల్
హనుమకొండ	ఎస్సీ ఉమెన్
జనగామ	ఎస్సీ ఉమెన్
జోగులాంబ గద్వాల	ఎస్సీ జనరల్
రాజన్న సిరిసిల్ల	ఎస్సీ జనరల్
రంగారెడి	ఎస్సీ ఉమెన్
సంగారెడ్డి	ఎస్సీ జనరల్
జయశంకర్ భూపాలపల్లి	బీసీ జనరల్
కరీంనగర్	బీసీ జనరల్
కుమురంభీమ్ ఆసిఫాబాద్	బీసీ జనరల్
మహబూబ్‌నగర్	బీసీ ఉమెన్
మంచిర్యాల	బీసీ ఉమెన్
నాగర్‌కర్నూల్	బీసీ ఉమెన్
నిర్మల్	బీసీ జనరల్
నిజామాబాద్	బీసీ ఉమెన్
సిద్దిపేట	బీసీ జనరల్
సూర్యాపేట	బీసీ జనరల్
వికారాబాద్	బీసీ జనరల్
వనపర్తి	బీసీ ఉమెన్
యాదాద్రి భువనగిరి	బీసీ ఉమెన్
ఆదిలాబాద్	అన్ రిజర్వ్‌డ్ ఉమెన్
భద్రాద్రి కొత్తగూడెం	అన్ రిజర్వ్‌డ్ జనరల్
జగిత్యాల	అన్ రిజర్వ్‌డ్ ఉమెన్
కామారెడ్డి	అన్ రిజర్వ్‌డ్ జనరల్
మహబూబాబాద్	అన్ రిజర్వ్‌డ్ జనరల్
మెదక్	అన్ రిజర్వ్‌డ్ జనరల్
నారాయణపేట	అన్ రిజర్వ్‌డ్ ఉమెన్
పెద్దపల్లి	అన్ రిజర్వ్‌డ్ ఉమెన్

జిల్లాల్లో రిజర్వేషన్ల కసరత్తు ఇలా...

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పీఆర్‌ఆర్‌డీ స్థానిక సంస్థల్లోని అన్ని పోస్టులకు అంటే... వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలు, జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాలకు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళ, అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో రిజర్వేషన్లకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో అన్ని పదవులకుగాను ఇదే ఫార్ములాను అన్ని జిల్లాల్లోనూ అనుసరిస్తున్నట్టుగా తెలుస్తోంది. జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో జెడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (సీఈవో), జిల్లా పంచాయతీ అధికారులు (డీపీఓ) కలిసి ఆయా స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి దాదాపుగా కొలిక్కి తెచ్చినట్టు తెలుస్తోంది. శనివారం రాత్రి 12 గంటల సమయానికల్లా దాదాపు 15 దాకా జిల్లాల్లో పూర్తిస్థాయిలో రిజర్వేషన్ల జాబితాలు-కంప్లీట్ షేప్‌లో (అన్ని స్థానాలకు) సిద్ధమైనట్టు సమాచారం. కొన్ని జిల్లాల్లో సర్పంచ్‌లు, మిగిలిన జిల్లాల్లో చాలా వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియకు అధిక సమయం తీసుకుంటుండడంతో ఆలస్యం అవుతున్నట్టుగా పీఆర్ కమిషనరేట్‌కు సమాచారం అందుతోంది. 31 జిల్లాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు, పంచాయతీల్లోని ఆయా స్థానాలకు రిజర్వేషన్లు, జిల్లాల వారీగా గెజిట్‌లు అందాక అన్నింటిని పీఆర్ డైరెక్టర్ ఒకసారి సరిచూస్తారు.ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నంలోగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) అందజేస్తే... ఎస్ఈసీ షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలున్నట్టు సమాచారం. ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతోపాటు, రాబోయే మూడురోజుల్లో ఆయా పోస్టులకు నామినేషన్లు కూడా స్వీకరించే అవకాశాలున్నాయి. శనివారం అర్ధరాత్రి లేదా ఆదివారం తెల్లవారుజాముకల్లా ఈ ప్రక్రియ పూర్తి కావొచ్చని పీఆర్ వర్గాల సమాచారం. ఈ కసరత్తు ముగిసిన వెంటనే జిల్లాల వారీగా గెజిట్‌లను సిద్ధం చేసుకొని, మూడేసి గెజిట్ సైన్డ్ కాపీలను పీఆర్ ఆర్‌డీ కమిషనరేట్‌లో అందించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల్లో ఆయా పోస్టులకు రిజర్వేషన్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పీఆర్‌ఆర్డీ డైరెక్టర్ డా.సృజన పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కూడా పీఆర్‌శాఖ పరంగా ఏ మేరకు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయనే విషయాన్ని ఆరా తీసినట్టు సమాచారం.

జాబితా అందగానే...

షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదలకు ఎస్ఈసీ సిద్ధం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుతోపాటు ఎన్నికల తేదీలపై ప్రభుత్వం నుంచి ఎప్పుడు సమాచారం (కాంకరెన్స్) అందినా, వెంటనే షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నద్ధమైంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఓటర్ల జాబితాలు సిద్ధం, రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికలు ఎప్పుడు జరపాలన్న దానిపై స్పష్టత వంటి అన్ని సీక్వెన్సులు, నియమ నిబంధనలు పాటిస్తే ఎస్ఈసీకి ఇతర అభ్యంతరాలు ఏవీ ఉండవని కమిషన్ వర్గాలు పేర్కొంటున్నాయి. రిజర్వేషన్ల ఖరారు ఉత్తర్వులు రాగానే నోటిఫికేషన్ విడుదల చేసి, జిల్లాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేస్తారని సమాచారం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాపరంగా అన్ని స్థానాలకు (వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ) రిజర్వేషన్లు శనివారం అర్ధరాత్రి వరకు సిద్ధం కావొచ్చని తెలుస్తోంది. ఆదివారం పీఆర్ శాఖ నుంచి ఖరారు చేసిన రిజర్వేషన్లు అందిన వెంటనే ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీకే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. అయితే శనివారం సాయంత్రం హౌస్‌మోషన్ రూపంలో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణకు రావడంతో కొంత సందిగ్ధత ఏర్పడింది. ఈ విషయంలో ఏం చేయాలనే దానిపై ఎస్ఈసీ సైతం పునరాలోచనలో పడినా, ప్రభుత్వం ఎన్నికల నిర్వహణతోనే ముందుకెళ్లేలా సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. అందులో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లను ఖరారు చేసిందని చెబుతున్నారు. ఎన్నికలు జరిపేందుకే నిర్ణయిస్తే ఆ తర్వాత హైకోర్టులో ఎదురయ్యే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది తప్ప ఈ విషయంలో ఎస్ఈసీకి ఎలాంటి సంబంధం ఉండదని చెబుతున్నారు.

ఎన్నికల సన్నద్ధతపై ఎస్ఈసీ సమావేశం

ఎన్నికల సన్నద్ధతపై శనివారం ఎస్ఈసీ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సీఎస్ కె.రామకృష్ణారావు, లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, డైరెక్టర్ డా.జి.సృజన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 30లోగా ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయాలంటూ ప్రభుత్వ పక్షాన అధికారులు కోరినట్టు సమాచారం. తమకు రిజర్వేషన్ల జాబితా అందిన వెంటనే షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదలకు సిద్ధంగా ఉన్నట్టుగా కమిషనర్ పేర్కొన్నట్టు తెలిసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పీఆర్, ఆర్థిక, ఎక్సైజ్, రెవెన్యూ, ఇతర శాఖలన్నీ కూడా అన్ని సన్నాహాలతో సంసిద్ధంగా ఉన్నట్టుగా సీఎస్ తెలియజేశారు. ఆయా శాఖలపరంగా చేసిన ఎన్నికల ఏర్పాట్లు, ఇతర అంశాల గురించి పీఆర్, ఆర్థిక, ఇతరశాఖల అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి బాగా ఉందని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకావని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ వివరించినట్టు తెలిసింది. గతంలో మూడు విడతల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించినందున ఈ సారి కూడా మూడు విడతల్లోనే వీటిని జరపాలనే దానిపై దాదాపుగా ఏకాభిప్రాయం వ్యక్తమైనట్టు సమాచారం. సెప్టెంబర్ 30లోగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో...ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయా లేక జీపీ ఎన్నికలా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

బీసీ రిజర్వేషన్.. సువర్ణాధ్యాయం

కొన్ని పార్టీలు కోర్టుకు వెళ్లి ఆపాలని చూస్తున్నాయి: మంత్రి కోమటిరెడ్డి



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం అనంతరం లబ్ధిదారుకు కొత్తబట్టలు పెడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాహుల్ గాంధీ పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, ఇది బలహీన వర్గాలకు ప్రభుత్వం దసరా కానుక అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి నల్లగొండలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం చేసి అమలుకు కేంద్రానికి పంపితే.. అక్కడ బీజేపీ వారు అడ్డుకున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ అమలు కోసమే రెండు సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు ఇప్పుడు న్యాయం జరగకపోతే ఎప్పుడూ జరగదని, అందుకోసమే ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుకు జీవోను విడుదల చేసిందన్నారు. కేసీఆర్ దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మాట తప్పాడని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం బీసీలకు ఇచ్చిన హామీకి కట్టుబడి జీవో తెచ్చారని అన్నారు. కొన్ని పార్టీల నాయకులు కోర్టుకు వెళ్లి బీసీ రిజర్వేషన్ ఆపాలని చూస్తున్నారని, చేతులెత్తి దండం పెడుతున్నా.. అది మానుకోవాలి అని ఆయన కోరారు.

ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(సూపర్‌వైజర్)-గ్రేడ్ 1 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం విడుదల చేసింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 181 ఖాళీలకు 176 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాది జనవరి 6,7 తేదీల్లో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్)-గ్రేడ్1 ఉద్యోగాలకు సీబీఆర్‌టీ పద్ధతిలో అర్హత పరీక్షలు నిర్వహించడం తెలిసిందే.

'స్థానిక' ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం

పద్మశాలీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో మంత్రులు పొన్నం, తుమ్మల



మాట్లాడుతున్న మంత్రులు పొన్నం, తుమ్మల

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి జీవో 9ని విడుదల చేసినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం రవీంద్ర భారతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పురుడు పోసుకున్న అన్ని ప్రజా ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన జీవితం.. తెలంగాణ ఉద్యమం పరస్పరం పెనవేసుకున్నాయని కొనియాడారు. రిజర్వేషన్లను కాపాడుకోవాలని, అందుకోసం బీసీ సంఘాలు ఐక్యంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. పద్మశాలీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే పద్మశాలీలతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కీర్తించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామని, బతుకమ్మ చీరల తయారీతో కార్మికులు నిలదొక్కుకునేలా, చేనేత రంగానికి అండగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కార్పొరేషన్ చైర్మన్లు ఈ అనిల్, మెట్టు సాయి కుమార్, అఖిల భారత పద్మశాలి సంఘం నేతలు కామర్థపు మురళి, అవ్వారి భాస్కర్, జగన్నాథం, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

ఇక విదేశీ పర్యాటకులకు..

గమ్యస్థానం తెలంగాణ

- భారత్-పాక్ యుద్ధం జరుగుతున్న తరుణంలోనూ ప్రపంచ సుందరి పోటీలను విజయవంతంగా నిర్వహించాం
- పర్యాటకంలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు సాధిస్తాం
- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టూరిజం కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.15 వేల కోట్లకుపైగా పెట్టుబడులతో ముందుకొచ్చిన సంస్థలతో ఒప్పందం



శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో దిల్‌రాజు, రమేశ్‌రెడ్డి, భట్టి, జూపల్లి, వాకిటి శ్రీహరి, డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: 'భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో తెలంగాణలో ప్రపంచ సుందరి పోటీలను ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించి చూపాం. తెలంగాణ ఎంత భద్రమైన ప్రాంతమో అది ప్రపంచానికి తెలియజెప్పింది. రాష్ట్రం ఏర్పడక ముందు, రాష్ట్రం వచ్చిన తర్వాత కొనసాగిన ప్రభుత్వ విధానాన్ని మేం కొనసాగిస్తున్నాం. ఇప్పుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా రంగాలలోనే కాదు..తెలంగాణలో పర్యాటక రంగంలో కూడా భారీ పెట్టుబడులు రాబోతున్నాయి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన టూరిజం కాంక్లేవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన ఆయా సంస్థల ప్రతినిధులకు అవగాహన ఒప్పంద పత్రాలను అందజేశారు. 'తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా పర్యాటక విధానం రూపొందలేదు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ దేశాలు, దేశంలోని పలు రాష్ట్రాల పర్యాటక విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి మెరుగైన పర్యాటక విధానాన్ని రూపొందించాం. అది రూపొందిన ఏడాదిలోనే రూ.15 వేల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. ఇప్పుడు రూ.50 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యాన్ని నిర్దేశించాను. దాన్ని కూడా సాధించే సత్తా తెలంగాణకు ఉంది. హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ కోటలాంటి చారిత్రక ప్రాంతాలున్నాయి. రాష్ట్రంలో కవ్వాల్, అమ్రాబాద్‌లాంటి పులుల అభయారణ్యాలున్నాయి. రామప్ప, వేయిస్తంభాల దేవాలయాల్లాంటి ఆధ్యాత్మిక ప్రాంతాలున్నాయి. వెరసి ఇప్పుడు తెలంగాణ ఓ గొప్ప పర్యాటక గమ్యం కాబోతోంది. పాత నగరం ఓల్డ్ సిటీ కాదు, ఒరిజినల్ సిటీ. ఆ ఖ్యాతిని మళ్లీ పునరుద్ధరించబోతున్నాం.'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

వారికెందుకో బాధగా ఉంది: భట్టి విక్రమార్క

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విదేశీ పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో పర్యాటక రంగం పురోగమిస్తుండటంతో కొందరికి ఎందుకో బాధగా ఉంటోందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. భాష, ప్రాంతం అన్న భేదం లేకుండా అందరినీ అక్కున చేర్చుకుంటున్న తెలంగాణ, ఇప్పుడు విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే రీతిలో ముందుకు సాగబోతోందన్నారు. రెండు జీవనదుల మధ్య వెలిసిన ఈ దక్కన్ పీఠభూమి ఇప్పుడు ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

– తెలంగాణ పర్యాటక రంగంలో కొత్త యుగం ప్రారంభమైందని పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక రంగం అంటే కేవలం దర్శనీయ స్థలాలకే పరిమితం కాదని, రాష్ట్రాన్ని ఆర్థిక శక్తిగా, ఉపాధి కల్పనగా మార్చటానికి దోహదం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, డీజీపీ జితేందర్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి, నిథిమ్ డైరెక్టర్ వెంకటరమణ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ ఎండీ ప్రియాంక తదితరులు హాజరయ్యారు. అనంతరం 37సంస్థలతో పర్యాటక శాఖ పెట్టుబడికి సంబంధించిన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి దోహదం చేసిన హోటళ్లు, రిసార్టులు, సోషల్ మీడియా, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీల్లో ఉత్తమ పురస్కారాలను అందజేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై అంత తొందరెందుకు?

▶ మొదటి పేజీ తరువాయి

ఇంకా గవర్నర్ ఆమోదించలేదని స్పష్టం చేసింది. బిల్లు పెండింగ్‌లో ఉండగా, జీఓ ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ దశలో రిజర్వేషన్ల పెంపును ఆమోదించలేం.. అలాగని ఇప్పటికిప్పుడు ఎలాంటి నిలిపివేత ఆదేశాలు జారీ చేయలేమని చెప్పింది. ఇరువైపులా పూర్తి వాదనలు విని.. తుది ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా వేసింది. ఆలోగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినా పిటిషన్లు ముందే దాఖలు చేసినందును మెరిట్ ఆధారంగా విచారణ చేస్తామని చెప్పింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను కొట్టివేయాలని కోరుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితోపాటు మరొకరు హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజే సూచన మేరకు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది.

చట్టప్రకారం 50 శాతానికి మించొద్దు

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంచారు. ఇప్పటికే ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లున్నాయి. తాజా పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 67కు చేరాయి. ఇది సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం. ఆర్టికల్ 200 ఉల్లంఘనే. మొత్తం వర్టికల్ రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, కృష్ణమూర్తి, వికాశ్‌కిషన్ గవాయ్.. కేసుల్లో అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 28ఏ ప్రకారం కూడా పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు. చట్ట సవరణ చేయకుండా జీఓతో రిజర్వేషన్ల పెంపు చెల్లదు. బీసీ రిజర్వేషన్లు 35 శాతానికి పెంచుతూ 2018లో జీఓ ఇచ్చినా.. ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది'అని పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదు కదా అని ప్రశ్నించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని మయూర్‌రెడ్డి చెప్పారు. రిజర్వేషన్ల పెంపుతో ఎస్సీలకు ఏం ఇబ్బందని.. మీ కోటా అలాగే ఉంటుందని కదా అని ధర్మాసనం అడిగింది. జనరల్ కోటాలో అవకాశం తగ్గుతుందని ప్రభాకర్ బదులిచ్చారు. ప్రధానంగా పిటిషన్లు వేసింది రిజర్వేషన్లతో ఇబ్బంది గురించి కాదని.. రాజ్యాంగ ఉల్లంఘనపైనేనని వెల్లడించారు.

పెంపు రాజ్యాంగ ఉల్లంఘనే...

రాజకీయ పార్టీలతో ఈ ఎన్నికలకు సంబంధం ఉండదు కదా అని ధర్మాసనం అడగ్గా.. పార్టీలు బలపరుస్తాయని ప్రభాకర్ చెప్పారు. ఎన్నికల్లో ఎవరు అభ్యర్థి అయినా ప్రజలే కదా ఎన్నికయ్యేది అని ధర్మాసనం పేర్కొంది. అలా భావిస్తే జీఓనే అవసరం లేదని, రాజ్యాంగం కొన్ని హద్దులు విధించిందని ప్రభాకర్ అన్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 శాతం చట్ట విరుద్ధంగా పెంచడం రాజ్యాంగ ఉల్లంఘనే అని మయూర్‌రెడ్డి అన్నారు. జీఓను అన్ని పార్టీలు సమర్థిస్తున్నట్టుంది.. ఏ పార్టీ వ్యతిరేకిస్తున్నట్టు లేదు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకగ్రీవ తీర్మానం చేశాయని అడ్వొకేట్ జనరల్ చెప్పారు. 'బీసీ రిజర్వేషన్ల కోసం కమిషన్ వేసి జనాభాపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. దాదాపు 53 శాతం బీసీ జనాభా ఉన్నందున 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆ బిల్లును గవర్నర్‌కు పంపాం. గవర్నర్ ఆమోదం తెలిపాల్సి ఉంది. నోటిఫికేషన్ ఇచ్చినా, ఎన్నికల నిర్వహణకు దాదాపు 45 రోజుల సమయం పడుతుంది. ఇంత అత్యవసరంగా హౌస్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదు. దసరా సెలవుల తర్వాతకు వాయిదా వేయండి'అని కోరారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత పిటిషన్ వేయడం సాధ్యం కానందునే అత్యవసర పిటిషన్లు వేశామని ప్రభాకర్ చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఆగొచ్చు కదా, గతంలో గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీఓ జారీ చేసిన ఘటనలు ఉన్నాయా అని ఏజీని ప్రశ్నించింది. హైకోర్టు.. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించిందని, అందుకే త్వరగా ప్రక్రియ చేపడుతున్నామని ఏజీ బదులిచ్చారు. ఎన్నికలు నిర్వహించమని మాత్రమే హైకోర్టు చెప్పిందని.. రిజర్వేషన్లు పెంచమని కాదని ప్రభాకర్ నివేదించారు. తమిళనాడు రిజర్వేషన్ల పెంపును కూడా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత..

ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకొని.. రేపటి వరకు అవకాశం ఇస్తాం.. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకొని నోటిఫికేషన్‌పై సమాచారం ఇవ్వాలని లేదా ఇప్పుడే అడిగి చెప్పాలని సూచించింది. 10 నిమిషాల తర్వాత హాజరైన ఏజీ ఉన్నతాధికారులు అందుబాటులో లేరన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు గవర్నర్ వద్ద బిల్లుపై 3 నెలలు ఆగితే నష్టమేముందని, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించొచ్చు కదా.. అప్పుడు రిజర్వేషన్లపై ఎలాంటి పిటిషన్ దాఖలు కాదు అని ధర్మాసనం అభిప్రాయపడింది. తాము ఇప్పుడు నిలుపుదల ఉత్తర్వులిస్తే ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపునకు చేసిన ప్రయత్నమంతా వృథా అవుతుందని వ్యాఖ్యానించింది. పిటిషన్లలో తీర్పు వచ్చే వరకు నోటిఫికేషన్ వాయిదా వేయాలని ఆదేశించాలని ప్రభాకర్ కోరారు. ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘనపైనే పిటిషన్లు వేశామని మరోసారి స్పష్టం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇప్పటికిప్పుడు జీఓ 9పై ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025


నీట మునిగిన బాపూ ఘాట్


చాదర్‌ఘాట్ లో లెవల్ బ్రిడ్జి వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి పొన్నం తదితరులు

60 ఏళ్ల తర్వాత జంట జలాశయాలకు భారీ వరద

జంట జలాశయాలకు 60 ఏళ్ల తర్వాత భారీ వరద పోటెత్తిందని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. కేవలం 5 గంటల్లో రికార్డు స్థాయిలో 40 వేల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహాన్ని విజయవంతంగా నియంత్రించి జంట జలాశయాల రక్షణతో పాటు మూసీ నదిలో అదనపు నీటి విడుదలను నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు గేట్లను దశల వారీగా ఎత్తినట్లు ఆయన వివరించారు.

పునరావాస కేంద్రాలకు 1,467 మంది తరలింపు

మూసీ వరద బాధితుల కోసం 10 ప్రత్యేక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. మలక్‌పేట్, అంబర్‌పేట్, గోషామహల్ సర్కిళ్ల పరిధిలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలకు ఇప్పటి వరకు 1,467 మంది బాధితులను తరలించినట్లు చెప్పారు.


బోటు ద్వారా మూసీ వరద ప్రాంతాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సహాయక చర్యలు


మూసారాంబాగ్ వంతెన వద్ద మూసీ ఉధృతి

ఐదేళ్ల తర్వాత రికార్డు స్థాయిలో..

ఐదేళ్ల తర్వాత మూసీకి రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరింది. జంట జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో మూసీ ఉప్పొంగింది. 2020 అక్టోబర్‌లో భారీ వర్షాలు కురిసి జంటజలాశయాలు నిండకుండలా మారడంతో గేట్లు ఎత్తి దిగువకు 40 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తాజాగా 36 వేల క్యూసెక్కుల నీటికి మూసీకి ఇరువైపులా అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. 30 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా వరద రావటంతో పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి.

మూసీ మహోగ్రరూపంతో భీతావహం

- నది పరీవాహకం అంతటా అల్లకల్లోలం
- ఎంజీబీఎస్, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధం
- బిక్కుబిక్కుమంటూ దిక్కుతోచని స్థితిలో బాధితులు
- వంతెనల వద్ద నీటి ఉధృతి.. రాకపోకల నిలిపివేత
- వాహనాల మళ్లింపుతో చక్రబంధంలో ట్రాఫిక్
- అతలాకుతలంగా మారిన మహా నగరం
- పండగకు సొంతూరు వెళ్లే ప్రయాణికుల అష్టకష్టాలు

కన్నీటి ఉప్పెన

జంట జలాశయాల గేట్ల ఎత్తివేతతో వరద బీభత్సం

వరద అంచనాలో నిర్లక్ష్యం..

జంట జలాశయాల ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా.. వరద అంచనా వేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంతెనలపై వరద పారుతున్నా ఆర్టీసీ అధికారులు ఎంజీబీఎస్‌లో బస్సులను అనుమతించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


చాదర్‌ఘాట్ పరీవాహక ప్రాంతంలో ఇళ్లను చుట్టుముట్టిన వరద

సాక్షి, సిటీబ్యూరో

జంట జలాశయాల నుంచి వచ్చిన నీటి ఉధృతితో మూసీ మహోగ్రరూపం దాల్చడంతో దీని పరీవాహక ప్రాంతాలు అల్లకల్లోలంగా మారాయి. బాపూ ఘాట్ నుంచి మూసారాంబాగ్ బ్రిడ్జి వరకు ఇరువైపులా నీట మునగడంతో 24 గంటల పాటు మహా నగరం అతలాకుతలమైంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మూసీ వరద ఉధృతికి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నీట మునిగింది. వరద నీటిలో చిక్కుకున్న ప్రయాణికులను హైడ్రా రెస్క్యూ సిబ్బంది వీరిని సురక్షితంగా బయటికి తరలించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. నీట మునిగిన మూసీ పరీవాహక ప్రాంతాలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి. మరోవైపు ఆర్టీసీ బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసింది. జిల్లాల నుంచి వచ్చే బస్సులను శివారులోనే నిలిపి అక్కడి నుంచే రాకపోకలు మళ్లించారు. దసరా పండగకు సొంతూరు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వంతెనలపై వరద ప్రవాహం

మూసీ నదిపై ఉన్న పలు వంతెనలపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించింది. చాదర్‌ఘాట్ లోలెవల్ వంతెన, మూసారాంబాగ్ వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో వంతెనల పైనుంచి రాకపోకలను నిలిపివేశారు. మూసారాంబాగ్ బ్రిడ్జి పక్కనే నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జిని సైతం వరద నీరు తాకింది. నార్సింగి, హిమాయత్‌సాగర్ వద్ద సర్వీస్ రోడ్డును మూసివేశారు. మంచిరేవుల-నార్సింగి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పురానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ ప్రమాదకర స్థాయికి చేరింది.

నీటమునిగిన శివాలయం

పురానాపూల్‌లోని శివాలయం నీటమునిగింది. ఆలయ పూజారి కుటుంబం నీటిలో చిక్కుకుపోవడంతో హైడ్రా సిబ్బంది క్రేన్ సాయంతో బయటికి తీసుకొచ్చారు. మూసీ నదీలో చిక్కుకున్న ఓ యువకుణ్ని రక్షించారు. నార్సింగిలో ఔటర్ సర్వీసుపై వరద ఉధృతిలో వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ ఆటోలో ఉన్న నలుగురిని హైడ్రా డీఆర్‌ఎఫ్, నార్సింగి పోలీసులు కాపాడారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద గాంధీ సమాధి వరద నీటితో పూర్తిగా మునిగిపోయింది.

తగ్గిన వరద ఉధృతి

మూసీ నదికి శనివారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. జంట జలాశయాల నుంచి మూసీలోకి 36 నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు తగ్గింది. ఎగువభాగం నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లకు 12 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 12 గేట్ల ద్వారా మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. అంతకు మందు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వచ్చి చేరడంతో వచ్చిన నీటిని వచ్చినట్లే విడుదల చేయడంతో మూసీ ఉగ్రరూపం దాల్చి నగరాన్ని అతలాకుతలం చేసింది. 24 గంటల తర్వాత వరద ఉధృతి అదుపులోకి వచ్చినట్లయింది.


ఓల్డ్ సీబీఎస్ వద్ద ప్రయాణికుల రద్దీ

కొత్త కొత్వాల్‌గా వీసీ సజ్జనార్

అదనపు సీపీ (క్రైమ్ అండ్ సిట్)గా ఎం.శ్రీనివాసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది ఐపీఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో.. హైదరాబాద్ కమిషనరేట్‌లో కీలక మార్పుచేర్పులు చోటు చేసుకున్నాయి. అదనపు సీపీగా (శాంతిభద్రతలు) పని చేస్తున్న విక్రమ్‌సింగ్ మాన్‌ను అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. ఈ స్థానంలో తఫ్సీర్ ఇక్బాల్‌ను సంయుక్త సీపీ హోదాలో నియమించింది.



ప్రస్తుతం సీఐడీలో ఐజీ హోదాలో ఉన్న ఎం.శ్రీనివాసులుకు అదనపు సీపీ (నేరాలు, సిట్)గా పోస్టింగ్ ఇచ్చింది. ఇక్కడ పని చేస్తున్న పి.విశ్వప్రసాద్ ఇటీవల తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సభ్యులుగా నియమితులైన విషయం విదితమే. వెస్ట్‌జోన్ డీసీపీగా పని చేస్తున్న ఎస్ఎం విజయ్‌కుమార్ సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా వెళ్తున్నారు. ఆ స్థానంలోకి రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బదిలీ అయ్యారు. సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ ఎల్బీనగర్ జోన్ డీసీపీగా వస్తున్నారు. నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ రాజేంద్రనగర్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఏసీబీలో పని చేస్తున్న రితిరాజ్‌ను మాదాపూర్ డీసీపీగా ప్రభుత్వం నియమించింది.

సజ్జనార్ నేపథ్యమిదీ..

కర్ణాటకలోని హుబ్లీకి చెందిన వీసీ సజ్జనార్ అక్కడి జీజీ కామర్స్ కాలేజీలో బీకాం పూర్తి చేశారు. ధారవాడ్‌లోని కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 1996లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2018 నుంచి ఆగస్టు 2021 వరకు కీలకమైన సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పని చేశారు. సెప్టెంబర్ 2021లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. అక్కడ ఉంటూనే బెట్టింగ్ యాప్స్‌పై 'హ్యాష్‌ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' పేరుతో సోషల్ మీడియాలో పెద్ద ఉద్యమమే చేశారు. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ యాప్స్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది.

హై లెవెల్ బ్రిడ్జి.. లో లెవెల్ పనులు

ముందుకు సాగని మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం

- తరచూ ముంపు సమస్యతో మునుగుతున్న ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: ముంపు సమస్య పరిష్కారానికి నిర్మించతలపెట్టిన మూసారాం బ్రిడ్జి పనులు ముందుకు సాగకపోవడంతో.. ప్రజలు ట్రాఫిక్ నరకం అనుభవిస్తున్నారు. 2020లో కురిసిన భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలతోపాటు మూసీ పరిసరాల్లోని పలు బస్తీలు నీట మునిగాయి. ముంపు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మూసారాంబాగ్ పాత బ్రిడ్జి స్థానంలో కొత్తగా హైలెవెల్ బ్రిడ్జి నిర్మించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయగా.. 2024 జనవరిలో మొదలయ్యాయి. భూసేకరణలతోపాటు తరచూ వర్షాలు, వరదలు, ట్రాఫిక్ సమస్యలతోపాటు, కాంట్రాక్టు ఏజెన్సీకి బిల్లుల చెల్లింపులు జరగక పనులు నత్తనడకన సాగుతున్నాయి. హైలెవెల్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా గోల్నాక బ్రిడ్జిని వినియోగిస్తున్నారు. దీని వల్ల రోజూ ట్రాఫిక్ జామ్స్ తప్పడం లేదు. తరచూ రాంగ్‌రూట్ ప్రయాణాలతోనూ ప్రమాదాలూ జరుగుతున్నాయి.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..

నిర్మాణ పనుల్లో జాప్యంతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లు తెరచినప్పుడు ఎగువ నుంచి వచ్చే వరదతో సమస్యలు మరింత జటిలంగా మారుతున్నాయి. శుక్రవారం రాత్రి వరద ఉధృతికి బ్రిడ్జి పనుల్లోని సెంట్రింగ్, సపోర్టింగ్ ఇనుప రాడ్లు చైన్‌లింక్ మెష్, తదితరమైనవి కొట్టుకుపోయాయి. మొత్తం ఐదు శ్లాబులకుగాను రెండు శ్లాబుల పనులు పూర్తయ్యాయి. పనులు జరుగుతున్న మరో శ్లాబు సెంట్రింగ్ కొట్టుకుపోయింది. వరదతో పాటు కొట్టుకు వచ్చే చెత్త , సిల్ట్, పాతదుస్తులు, ప్లాస్టిక్ తదితరమైనవి సైతం తరచూ నిర్మాణ పనులకు ఆటంకంగా మారుతున్నాయి. సమీపంలోని చాదర్‌ఘాట్, మూసానగర్, కమలానగర్, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాలు నీట మునగడంతో స్థానిక ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. ఎప్పుడు వర్షం వచ్చినా కంటిమీద కునుకులేకుండా గడపాల్సి వస్తోందని వేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ సేవలు అస్తవ్యస్తం

మూసీ వరదలతో ముప్పతిప్పలు

- ఎంజీబీఎస్ నుంచి బస్సుల మళ్లింపు
- 1500కు పైగా సిటీ సర్వీసులకు బ్రేక్
- నరకం అనుభవిస్తున్న ప్రయాణికులు

బస్సుల సమాచారం కోసం..
040-6944 0000
040-2345 0033

సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: మూసీ వరదల తాకిడికి ఆర్టీసీ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. శనివారం అర్ధరాత్రి ఎంజీబీఎస్‌లోకి వరద నీరు పోటెత్తింది. బస్‌స్టేషన్‌లోకి వచ్చే అన్ని ప్రవేశమార్గాల్లోనూ మూసీ ఉప్పొంగి ప్రవహించింది. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకవైపు ప్రయాణికుల రద్దీ, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్న తరుణంలో ముంచుకొచ్చిన ఉపద్రవంతో ఆర్టీసీ కకావికలమైంది. ఎంజీబీఎస్ జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో విలవిలలాడారు. ఇక్కడి నుంచి బయలుదేరే బస్సులన్నింటినీ నగరంలోని శివారు కూడళ్లకు తరలించారు. మరోవైపు బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను సైతం పలు బస్టాపుల వద్దకు చేరవేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ జె.శ్రీలతతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ప్రయాణికులకు సహాయక చర్యలు అందజేశారు.

ఇప్పట్లో ఎంజీబీఎస్‌కు రావొద్దు..

ఎంజీబీజీఎస్ ప్రాంగణంలోకి వరద చేరడంతో బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరంగల్, హన్మకొండ, నర్సంపేట్, మహబూబాద్, జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఉప్పల్ వైపు మళ్లించారు. ఖమ్మం, విజయవాడ, నల్లగొండ, సూర్యాపేట వైపు వెళ్లే బస్సులను ఎల్‌బీనగర్, హయత్‌నగర్ మార్గంలో నిలిపి ప్రయాణికులకు హోల్డింగ్ సదుపాయం కల్పించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపునకు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడిపేందుకు చర్యలు చేపట్టారు. మహబూబ్‌నగర్, కర్నూల్, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి బయలుదేవిధంగా మళ్లించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రావద్దని ఆర్ఎం శ్రీలత తెలిపారు.

స్తంభించిన సిటీ బస్సులు..

మూసీ వరదల కారణంగా సిటీ బస్సులు సైతం స్తంభించాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రాకపోకలు సాగించే సుమారు 1500 బస్సులకు బ్రేక్ పడింది. మూసీకి దూరంగా ఉన్న ఘట్కేసర్, నారపల్లి, ఉప్పల్, కీసర, కుషాయిగూడ, మేడ్చల్, మల్కాజిగిరి. సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు, జీడిమెట్ల తదితర మార్గాల్లో మాత్రమే బస్సులు పాక్షికంగా నడిచాయి. అంబర్‌పేట్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కోఠి. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, వనస్థలిపురం తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. పాతబస్తీ నుంచి సికింద్రాబాద్ వైపు, ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూసీ వరదల కారణంగా కనీసం 15 వేల ట్రిప్పులు రద్దయినట్లు అంచనా. బస్సులు అందుబాటులో లేకపోవడంతో మహిళలు, పిల్లలు, వయోధికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు దూరప్రాంతాలకు వెళ్లే బస్సులను నగర శివార్లకు మళ్లించడంతో పలు చోట్ల భారీగా ట్రాఫిక్ రద్దీ చోటుచేసుకుంది. గంటల తరబడి వాహనాలు రహదారులపైనే నిలిచిపోయాయి,

అన్ని ఏర్పాట్లు చేశాం



వరదల కారణంగా బస్సులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్పటికప్పుడు బస్సుల మళ్లింపు చర్యలు తీసుకున్నాం. ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రాకుండా తమకు సమీపంలోని హోల్డింగ్ కేంద్రాల నుంచే దూరప్రాంతాలకు బయలుదేరాలి. వివిధ కూడళ్లలో బస్సుల సమాచారంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశాం.

– శ్రీలత, ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్


ఎంజీబీఎస్ ప్రాంగణాన్ని ముంచెత్తిన వరద

మూసీ ఇలా.. బ్యూటీ ఎలా?

ఏటేటా నగరాన్ని ముంచేస్తున్న వరదలు

- ముఖ్యమంత్రి కలల ప్రాజెక్ట్‌పై ప్రభావం
- నాలాలు, నదీ గర్భంలో ఆక్రమణలే కారణం
- ఇకనైనా మేల్కోకపోతే భవిష్యత్తు ప్రమాదకరమే


చాదర్‌ఘాట్ వద్ద మూసీ మహోగ్ర రూపం

సాక్షి, సిటీబ్యూరో: ప్రతీ ఏటా మూసీ వరద భాగ్యనగరాన్ని ముంచేస్తోంది. నదీ గర్భం, పరీవాహక ప్రాంతాలలో ఆక్రమణలు, వరద కాల్వలు, నాలాల విస్తరణ లేకపోవడం వంటి కారణాలనేకం. ప్రభుత్వంతో పాటు ప్రజలూ బాధ్యతగా భాగస్వామ్యం అయితే తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ మూసీ పునరుజ్జీవం కార్యరూపం దాల్చడం కష్టమే. ఇప్పటికే గండిపేట నుంచి బాపూఘాట్ వరకూ మూసీ సుందరీకరణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలోనే బ్యూటిఫికేషన్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇలాంటి తరుణంలో మూసీ వరద ముంచెత్తడంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు.

ఏటేటా వరదలే..

నగరం మధ్యలో 55 కి.మీ. మేర మూసీ ప్రవహిస్తుంది. దీనికి 1908లో 4.1 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితులను అడ్డుకట్ట వేసేందుకు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలను నిర్మించారు. 2.6 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా నిర్మాణం చేపట్టారు. కానీ, వందేళ్లలో మూసీ ఎన్నెన్నో ఆక్రమణలకు గురైంది. నగరంలో 1908 తర్వాత 62 ఏళ్లకు 1970లో వరదలు వచ్చాయి. అనంతరం 30 ఏళ్లకు 2000లో వరద సిటీని ముంచెత్తింది. ఆ తర్వాత 2008, 2014, 2016, 2018, 2020లలో కూడా వరదలు వచ్చాయి.

ఎక్కడ చూసినా ఆక్రమణలే..

నగరంలో గంటలో రెండు, మూడు సెంటీ మీటర్ల వర్షం పడితే తట్టుకునే వరద కాలువల వ్యవస్థ లేదు. అంతకుమించి కురిస్తే మునక తప్పడం లేదు. ఆక్రమణల కారణంగా రోజురోజుకూ కుంచించుకుపోతోంది. జియాగూడ, చాదర్‌ఘాట్, గోల్నాక, అంబర్‌పేట ఇలా ఎక్కడ చూసినా మూసీ వెంట ఆక్రమణలే ఉన్నాయి. మూసీ నదీ గర్భం, బఫర్ జోన్‌లలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి మూడు జిల్లాల్లో కలిపి 8 వేలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి..

నగరంలో చెరువులను కాపాడుకుంటూ.. పునరుద్ధరించుకుంటూ వరద వెళ్లేలా చేయాలి. నీటి పారుదల శాఖ అధికారులు జీహెచ్‌ఎంసీ, జలమండలి, హైడ్రాను సమన్వయం చేసుకోవాలి. దీంతో పాటు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. నగరంలో వరద కాల్వల్లో ఏటా 5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక వస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇంట్లోని పాత వస్తువులు నాలాల్లో వేయకుండా వ్యక్తిగత బాధ్యత వహించాలి.

ఓఆర్ఆర్‌పై వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం



మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పక్కనే జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి నార్సింగిలోని గండిపేట ఫ్లైఓవర్ కింద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం అతన్ని వేగంగా ఢీ కొట్టింది. దాంతో అతను ఔటర్‌పై కొద్ది దూరం ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఎవరు, అతన్ని ఢీ కొట్టిన వాహనం గురించి విచారణ చేస్తున్నామని, వివరాలు తెలిస్తే నార్సింగి పోలీస్ స్టేషన్ 87125 71928, 94910 39034 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఎస్ఎస్‌జేలో మెంటర్‌గా జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0 కింద కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన స్వచ్ఛ షెహర్ జోడీ (ఎస్ఎస్‌జే) కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కార్యక్రమాల అమలులో రాష్ట్రంలోని తక్కువ పనితీరు కలిగిన పట్టణాలకు సహకరించేందుకు జీహెచ్ఎంసీ మెంటర్ నగరంగా ముందుకొచ్చింది. ఈ మేరకు మంథని మునిసిపాలిటీ కమిషనర్ సి.హెచ్ వెంకన్న, చేరియాల్ మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.నాగేందర్‌లతో ఒప్పంద పత్రాలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, అడిషనల్ కమిషనర్ (శానిటేషన్, హెల్త్) సీఎన్ రఘుప్రసాద్, స్వచ్ఛభారత్ మిషన్ జీహెచ్ఎంసీ నోడల్ ఆఫీసర్, ఆర్. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎస్‌జే కార్యక్రమం ద్వారా 100 రోజుల పాటు తక్కువ పనితీరు కలిగిన (మెంటీ) పట్టణాల్లో పారిశుద్ధ్యం, మురుగు నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, తదితర కార్యక్రమాల్లో మెరుగుదల సాధించేందుకు మంచి పనితీరు కలిగిన (మెంటర్) నగరాలు మార్గనిర్దేశం చేస్తాయి.

ట్రాఫిక్ 'ముంచెత్తింది'!

- మూసీ వరద ఉధృతితో కొన్ని కాజ్‌వేలు క్లోజ్
- ఆర్టీసీ బస్సుల స్టార్టింగ్ పాయింట్లు మార్పు
- ఫలితంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్స్



సాక్షి, సిటీబ్యూరో: మూసీ నది ఉగ్రరూపం దాల్చడంతో సిటీలోని మూడు ప్రధాన రహదారులతో పాటు మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌ను (ఎంజీబీఎస్) మూసివేశారు. ఈ ప్రభావం నగరంలోని ట్రాఫిక్‌పై తీవ్రంగా పడింది. అనేక ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిల్చిపోయాయి. దీనికితోడు వర్షాలకు కొన్ని చోట్ల రోడ్లు కూడా ఛిద్రం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. మొత్తమ్మీద పండుగ సీజన్‌లో నగవాసి నరకం చవిచూడాల్సి వచ్చింది. మూసీలో వరద ఉధృతితో శుక్రవారం రాత్రి నుంచి కుల్సుంపుర–పురానాపూల్ మధ్య ఉన్న 100 అడుగుల రోడ్డు, చాదర్‌ఘాట్ కాజ్ వే, ముసారాంబాగ్ కాజ్‌వేలను పూర్తిగా మూసేశారు. శనివారం ఉదయం నుంచి ఈ మార్గాల్లో నడిచే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపించారు. దీని ప్రభావం దిల్‌సుఖ్‌నగర్ నుంచి కోఠి వరకు కనిపించింది. ఇటు వాహనాలు అటు వెళ్లడానికి నాగోలు వంతెన తర్వాత కేవలం చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ మాత్రమే ఉండటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. పురానాపూల్ వంతెన మూసివేత ప్రభావమూ ఎక్కువగానే చూపింది. మరోపక్క శుక్రవారం రాత్రి ఎంజీబీఎస్ మునిగిపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు బయలుదేరే ప్రాంతాన్ని ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర ప్రాంతాలకు మార్చారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనాలకు అదనంగా ఈ బస్సులు తోడు కావడంతో రహదారిపై పరిస్థితి దారుణంగా తయారైంది.

'భవిష్యత్తు' నగరానికి బాటలు!

- ప్రపంచ బ్యాంకు, జైకా ఆర్థిక సహాయంతో అభివృద్ధి
- అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ మౌలిక సదుపాయాలు
- ఎలక్ట్రానిక్, ఏఐ, హెల్త్, లైఫ్ సైన్సెస్, ఎడ్యుకేషన్ జోన్లు
- ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- నేడు ఎఫ్‌సీడీఏ భవనం, రేడియల్ రోడ్డుకు సీఎం శంకుస్థాపన



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీకి ఆదివారం ఉదయం అంకురార్పణ జరగబోతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో ఈ కొత్త నగరానికి వడివడిగా బాటలు పడుతున్నాయి. ప్రపంచ బ్యాంకు సహా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) ఆర్థిక సహాయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఈ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనులను ప్రారంభించిన ప్రభుత్వం.. తాజాగా ఇదే కేంద్రంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిపాలన భవనాలు సహా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు–1కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయబోతున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.

56 గ్రామాలు.. 765 చదరపు కిలో మీటర్లు

మొత్తం 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్‌సిటీ (ఫోర్త్ సిటీ)ని తీర్చిదిద్దనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు గ్రేటర్‌లోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు..ఏడు మండలాలు...56 రెవెన్యూ గ్రామాలు..765 చదరపు కిలోమీర్ల పరిధితో ఈ ఏడాది మార్చి 12న ఎఫ్‌సీడీఏను ఏర్పాటు చేసింది. సీనియర్ కలెక్టర్ శశాంకను ఎఫ్‌సీడీఏ కమిషనర్‌గా నియమించింది. కర్బన ఉద్గారాలు, ఇతర గ్రీన్‌హౌస్ వాయువులను పీల్చుకుని, మానవాళికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇచ్చే వృక్ష సంపదను పెంచి, ఈ ప్రాంతాన్ని నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఇందుకోసం 15 వేల ఎకరాల్లో అర్బన్‌ఫారెస్ట్రీని అభివృద్ధి చేయనుంది.

13,973 ఎకరాలు..పది జోన్లు

ప్రభుత్వం ఇప్పటి వరకు సేకరించిన 13,973 ఎకరాల భూమిని పది జోన్లుగా విభజించింది. దీనిలో 34 శాతం భూమిని ఎలక్ట్రానిక్స్ అండ్ జనరల్ పరిశ్రమలకు కేటాయించించింది. ఆ తర్వాత లైఫ్‌సైన్స్ (ఫార్మా, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) హబ్‌కు 30 శాతం ప్రాధాన్యం ఇచ్చింది. 9 శాతం భూమిని రెసిడెన్షియల్ మిక్స్‌డ్ యూజెస్ కోసం, మరో ఏడు శాతం రెసిడెన్షియల్ జోన్ కోసం కేటాయించింది. స్పోర్ట్స్ హబ్‌కు ఐదు, హెల్త్, ఎడ్యుకేషన్, వినోదం, పర్యాటకం కోసం మూడు శాతం చొప్పున, ఫర్నిచర్, ఏఐ సిటీల కోసం రెండు శాతం చొప్పున భూములు కేటా యించింది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) కూడా సిద్ధం చేసింది. మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచె, ముచ్చర్ల, పంజాగూడ రెవెన్యూల పరిధిలో ఫోర్త్‌సిటీతో పాటు దానికి ఇరువైపులా విద్య, వైద్యం, పర్యాటక, క్రీడా సంస్థల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇక జనావాసాలకు దూరంగా కుర్మిద్ద, కడ్తాల్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌కు ఆనుకుని ఉన్న భూములను ఫార్మా, ఆర్‌అండ్‌డీ పరిశ్రమలకు కేటాయించింది.

41.50 కి.మీ..ఆరులేన్లు

- రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న 41.50 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు (రతన్ టాటా రోడ్డు) పనులను రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలు దక్కించుకున్నాయి. ఈ రోడ్డును రెండు దశలుగా నిర్మించనున్నారు.
- మొదటి దశలో రావిర్యాల నుంచి (టాటా ఇంటర్ చేంజ్) నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్లు పూర్తి చేస్తారు. ఇందుకోసం రూ.1,665 కోట్లతో అంచనాలు రూపొందించారు.
- రెండో దశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ట్రిపుల్‌ఆర్ వద్ద ఆమన్‌గల్ వరకు రూ.2,365 కోట్లతో 22.3 కిలోమీటర్లు నిర్మించనున్నారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల్లోని 14 గ్రామాలకు ఈ రోడ్డుతో అనుసంధానం ఏర్పడనుంది.

రోడ్డు ప్రత్యేకతలు....

- ఇది 100 మీటర్ల వెడల్పుతో కూడిన యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ వే. ఆరు లైన్ల ప్రధాన రహదారి (3+3 లేన్)
- ఈ రహదారిని భవిష్యత్తులో 8 లైన్‌లకు (4+4) విస్తరించే అవకాశం ఉంది.
- ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మధ్యలోనే మెట్రో కారిడార్ కోసం 20 మీటర్ల భూమిని కేటాయిస్తారు. ఈ మార్గంలో ఎట్ గ్రేడ్ (భూమార్గంలో) గా మెట్రో కారిడార్ రానుంది.
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రెండు వైపులా 3–లైన్ల సర్వీస్ రోడ్లు ఉంటాయి. 2 మీటర్ల చొప్పున గ్రీన్‌బెల్ట్‌ను (పచ్చదనం) ఏర్పాటు చేస్తారు.
- రెండు వైపులా 3 మీటర్ల సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఉంటుంది. మరో 2 మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు ప్రాధాన్యం

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతాం

- రోడ్లపై వాహనచోదకుల ట్రావెల్ టైమ్ తగ్గించడమే లక్ష్యం
- డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం
- 'సాక్షి'తో కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్



హుబ్లీలో కుటుంబ సభ్యులతో సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: 'హైదరాబాద్ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. అలాగే పోలీసు ప్రాథమిక విధులైన ప్రివెన్షన్, డిటెక్షన్, కన్విక్షన్‌లతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సముచిత ప్రాధాన్యం ఇస్తా' అని కొత్త కొత్వాల్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ అన్నారు. తొలిసారిగా పోలీసు విభాగం నుంచి బయటకు వెళ్లి నాలుగేళ్ల పాటు ఆర్టీసీ ఎండీగా పని చేశానని, తద్వారా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ప్రాముఖ్యత తెలిసి వచ్చిందని చెప్పారు. అలాగే డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతానని పేర్కొన్నారు. ఈ మేరకు సజ్జనార్ శనివారం ఫోన్ ద్వారా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

అన్ని విభాగాలతో కలిసి ముందుకు...

ప్రజలకు నేరుగా సేవ చేయగలిగే వ్యవస్థల్లో పోలీసు విభాగం కీలకమైంది. హోంగార్డు నుంచి కమిషనర్ వరకు ప్రతి ఒక్కరం ప్రభుత్వ లక్ష్యాల కోసం పని చేస్తాం. బాధితులకే తొలి ప్రాధాన్యం అనే ప్రాథమిక సూత్రానికి కట్టుబడే అంతా విధులు నిర్వర్తిస్తాం. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం, మానవవనరుల్ని సమర్థంగా వినియోగించుకుంటూ మరింత సమర్థంగా నగర ప్రజలకు సేవ చేస్తాం.

అనుభవాల ఆధారంగా మార్పుచేర్పులు...

పోలీసు విభాగంలో అడుగుపెట్టి దాదాపు 30 ఏళ్లు అవుతోంది. ఈ కెరియర్‌లో వివిధ హోదాల్లో, వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించా. ఒక్కో చోట చేసిన పని ఒక్కో అనుభవాన్ని నేర్పింది. వాటన్నింటినీ క్రోడీకరించి నగర పోలీసింగ్ చేపడతా. ఆర్టీసీకి ఎండీగా పని చేయడం అంటే..ఓ పెద్ద కంపెనీకి సీఈఓ బాధ్యతలు నిర్వర్తించినట్లే. దాదాపు నాలుగేళ్ల పాటు నాతో కలిసి నడుస్తూ, సహకరిస్తూ అనేక మెళకువలు నేర్పిన డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఆ అధికారులకూ కృతజ్ఞుడినై ఉంటా.

రోడ్లపై ఉండే సమయం తగ్గించాలి...

వాహనచోదకులు రహదారులపై ఎంత తక్కువ సమయం ఉంటే అంత త్వరగా గమ్యానికి చేరుకుంటారు. ఈ లక్ష్యం సాధించడం కోసం ట్రాఫిక్ జామ్స్ తగ్గించడానికి ప్రాధాన్యం ఇస్తాం. జీహెచ్ఎంసీతో పాటు ఇతర విభాగాల సహకారంతో ఉన్న సమస్యలు చక్కదిద్దుకుంటూ ట్రాఫిక్ ఇక్కట్లు తగ్గిస్తాం. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తాం. రోడ్లపై వాహనాల సగటు వేగం పెంచడంతో పాటు రోడ్డు ప్రమాదాలు, వాటిలో మృతులు, క్షతగాత్రుల సంఖ్యను తగ్గిస్తూ వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ప్రజలతో కలిసి వారి సహకారంతో, సమన్వయంతో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తాం.

సైబర్ నేరాలను నిరోధించాలి..

ప్రాపర్టీ అఫెన్సులుగా పిలిచే చోరీలు, దోపిడీలు, దొంగతనాల కేసుల్లో ప్రజలు ఎంత మొత్తం కోల్పోతున్నారో... దానికి అనేక రెట్లు సైబర్ నేరాల్లో నష్టపోతున్నారు. సాధారణ ప్రజల్లో ఉన్న అవగాహన లేమి, ఆశ, భయాలే పెట్టుబడిగా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు నిలువుగా ముంచేస్తున్నారు. డిజిటల్ అరెస్టు బారినపడిన ఓ వైద్యురాలు ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ఉదంతం ఇటీవల అందరినీ కలచివేసింది. ఈ నేరాల్లో నేరగాళ్లను అరెస్టు చేసినా రికవరీ కష్టసాధ్యంగా మారుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని సైబర్ నేరాల నిరోధానికి ప్రాధాన్యం ఇస్తాం. బెట్టింగ్ యాప్స్, వైట్ కాలర్ అఫెన్సులతో పాటు మల్టీ లెవల్ మార్కెటింగ్ పైనా ఉక్కుపాదం మోపుతాం. ఇక నగరంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్ విక్రయించే వారిపైనా...వినియోగించే వారిపైనా దృష్టిసారించి కఠిన శిక్షలు పడేలా చూస్తాం.

వైద్యురాలిని 'చంపిన' కేసులో ఇరువురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు స్కామ్ ద్వారా రిటైర్డ్ ప్రభుత్వం వైద్యురాలి మరణానికి కారణమైన కేసులో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మధురానగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు (76) చంచల్‌గూడ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న మామిడిపూడి నాగార్జున ఏరియా ఆస్పత్రిలో పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆమెకు ఈ నెల 5న తొలిసారిగా సైబర్ నేరగాళ్ల నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. బెంగళూరు పోలీసుల పేరు చెప్పి ఆమె ఆధార్ కార్డు దుర్వినియోగమైందని, మనుషుల అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి కేసు నమోదైందని చెప్పారు. ఈ కేసు షాదత్ ఖాన్ హ్యూమన్ ట్రాఫికింగ్ కేసుకు అనుబంధంగా నమోదైందని భయపెట్టి డిజిటల్ అరెస్టు చేశారు. ఆమె నుంచి రూ.6.6 లక్షలు కాజేసినప్పటికీ సెప్టెంబర్ 8 వరకు 'నిర్బంధం'లో ఉంచారు. ఆ ఒత్తిడితో గుండెపోటుకు గురైన బాధితురాలు చికిత్స పొందుతూ చనిపోయారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తునకు కీలక ప్రాధాన్యం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ మట్టం రాజు నేతృత్వంలోని బృందం సూత్రధారులకు బ్యాంకు ఖాతాలు అందించిన మహారాష్ట్ర వాసులు శంకర్ నుపూర్, విశ్వాస్ దత్తాత్రేయ మిరాజేలను అరెస్టు చేసి తీసుకువచ్చారు. మరోపక్క ఓ ప్రైవేట్ కంపెనీ ఎండీ ఫొటోను డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు రూ.25 లక్షలు కాజేశారు. కంపెనీ ఎండీ శ్రీలంక వెళ్లడంతో ఆయనకు చెందిన కొత్త నెంబర్ అంటూ వాట్సాప్ సదరు కంపెనీ మేనేజర్‌తో చాటింగ్ చేశారు. తొలుత తమ ఖాతాల్లోకి రూ.25 లక్షలు బదిలీ చేయించుకున్నారు. అదనంగా మరో రూ.40 లక్షలు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన మేనేజర్ తన యజమానిని ఫోన్ ద్వారా సంప్రదించి విషయం తెలుసుకున్నారు. దీనిపై సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో శనివారం కేసు నమోదైంది.


'ఓజీ' నిర్మించిన డీవీవీ క్రియేషన్స్‌పై కేసులు వేస్తాం



మాట్లాడుతున్న మల్లేష్ యాదవ్

పంజగుట్ట: ఓజీ సినిమాను తీసిన డీవీవీ క్రియేషన్స్‌పై త్వరలో పరువునష్టంతో పాటు, కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని న్యాయవాది బర్ల మల్లేష్ యాదవ్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓజీ సినిమా టికెట్ల రేట్లు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ తాను కోర్టులో పిటీషన్ వేయగా..రేట్లు పెంపుదలను కోర్టు నిలిపివేసిందన్నారు. ఈ నేపథ్యంలో తనను అవమాన పరుస్తూ డీవీవీ క్రియేషన్స్ వారు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టారని, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ తనను ట్రోల్ చేసేలా ప్రోత్సహించారని మల్లేష్ ఆరోపించారు. దీనిపై తాను మళ్లీ కేసు వేస్తానని చెప్పారు. పేదలకు వినోదం తక్కువ ధరకే అందాలనే ఉద్దేశంతోనే తాను టికెట్ రేట్ల పెంపును వ్యతిరేకించానని పేర్కొన్నారు.


నీట మునిగిన పెద్దాపూర్ పంప్ హౌస్



పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాలకు తొగరిపల్లి వాగు పొంగడంతో హైదరాబాద్ నగరానికి మంచి నీరు సరఫరా చేస్తున్న మంజీరా పథకంలోని పెద్దాపూర్ ఫేజ్–3 పంప్ హౌస్ నీట మునిగింది. జలమండలి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు ప్రారంభించింది. ఎండీ అశోక్ రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి పంపు హౌస్‌ను సందర్శించి పునరుద్ధరణ పనులను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలకు పంపు హౌస్ లోకి వరద చేరడంతో ముందస్తు జాగ్రత్తగా పంపింగ్ ప్రక్రియను నిలిపివేసినట్టు ప్రకటించారు. పంపు హౌస్ నుంచి నీటిని తోడి పునరుద్ధరణ పనులు చేపట్టినట్టు చెప్పారు. హైదరాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, దీనికి ప్రత్యామ్నా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండీ చెప్పారు. ఈ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి తిరిగి పంపింగ్ చేయడానికి మరో 48 గంటలు పడుతుందన్నారు.

ఏసీబీకి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్



పట్టుబడ్డ రాధాకృష్ణారెడ్డి

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) రాధాకృష్ణారెడ్డి రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేసి..మూడున్నర లక్షల రూపాయాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం టీపీఎస్ రాధాకృష్ణారెడ్డి ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని గంగస్థాన్ వెంచర్ అనుమతుల విషయంలో రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో మొదటి విడత రూ.మూడున్నర లక్షలు శనివారం తన ఇంటి సమీపంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనుమతుల విషయంలో బెదిరించడంతో వెంచర్ యజమానులు రాధాకృష్ణారెడ్డిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించారు. కాగా ఎల్లంపేట్ మున్సిపల్ కార్యాలయంలో, రాధాకృష్ణారెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

నడిరోడ్డుపై కారులో మంటలు

– ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



గచ్చిబౌలి: అకస్మాత్తుగా నడిరోడ్డుపై ఓ కారు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో వాహనం నడిపేవారే కాకుండా రోడ్డుపై రాకపోకలు నిర్వహిస్తున్న ఇతర వాహనదారులు కూడా ఆందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని కారు ఇంజన్‌లో చెలరేగిన మంటలను ఆర్పివేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.శనివారం సాయంత్రం 6 గంటలకు జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి నుంచి బయోడైవర్సిటీకి వెళ్లే రోడ్డులో హెక్సాన్ కారు వెళ్తుండగా అకస్మాత్తుగా మంటు చెలరేగాయి. దీంతో అందులో ఉన్న వారు వెంటనే కారు దిగేశారు. సమాచారం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

సూర్యప్రభ వాహన సేవలో శ్రీవారు



బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం స్వామివారిని ఉదయం సూర్యప్రభ వాహనంలో, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో ఊరేగించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలైన పూజలు, పూర్ణాహుతి, బలిహరణ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. స్వామివారి వాహన సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఈవో శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

హిమాయత్‌నగర్: 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్న గురుకులాల నిత్యావసర సరుకుల సరఫరాదారులకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని గురుకుల కాంట్రాక్టర్స్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జేఏసీ కన్వీనర్ కనుకుంట్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 1053 ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకుల హాస్టల్స్‌కు 5 వేల మంది సరుకులు సరఫరా చేస్తున్నారన్నారు. 6 నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదన్నారు. అధికారులకు తమ గోడును విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సమావేశంలో ఎస్.జ్యోతి, మల్కల అశోక్ పాల్గొన్నారు.

టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా శంకర్ గౌడ్

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆలయ లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం హిమాయత్‌నగర్ టిటిడి ఆలయంలో వేద పండితుల మధ్య శంకర్ గౌడ్ ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ ఏఈఓ రమేష్, అధికారులు శ్రీనివాస్, మణికంఠ, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సోషల్ మీడియాపై సైఫాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు

లక్డీకాపూల్: జర్నలిస్టు శివారెడ్డిపై వివిధ పోస్టులు పెట్టిన కాంగ్రెస్ సోషల్ మీడియాపై కోర్టులో పరువు నష్టం దావా వేస్తామని తెలంగాణా జర్నలిస్ట్ ఫోరం(టీయుడబ్ల్యుజే) హెచ్చరించింది. హైడ్రా తన ఇల్లు కూల్చిందని శివారెడ్డి క్యారెక్టర్‌ను దిగజార్చే విధంగా కాంగ్రెస్ సోషల్ మీడియా పెట్టిన పోస్టులను తీవ్రంగా పరిగణించింది. శనివారం సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ సోషల్ మీడియాపై జర్నలిస్ట్ శివారెడ్డి ఫిర్యాదు చేశారు. తనమీద కొన్ని రోజులుగా కాంగ్రెస్ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తవ్వారు.. వదిలేశారు..

ముందుకుసాగని వరదనీటి కాలువ పనులు

- మోటార్లతో ఎత్తిపోస్తున్న నీరు
- శాస్త్రీయత లోపించిన ఇంజనీరింగ్ విధానం



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లో వరదనీటి పైపుల కోసం తవ్విన దృశ్యం..

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసిత ప్రాంతంతో పాటు నిత్యం రాకపోకలు సాగించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట ప్రాంతాల్లో వరదనీటి వ్యవస్థ లోపభూయిష్టంగా మారింది. చాలాచోట్ల వరదనీటి కాలువలు మూసుకుపోవడం, మ్యాన్‌హోళ్లపై మూతలు లేకపోవడం, పెద్ద ఎత్తున వస్తున్న వరద ధాటికి రోడ్లు కొట్టుకుపోతుండడంతో ఈ ఏడాది వర్షాకాలం బీభత్సంగా మారింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ రహదారులతో పాటు పంజగుట్ట, సోమాజీగూడ, ఖైరతాబాద్ ప్రాంతాలు నడుంలోతు వరదతో స్థానికులకు చిక్కులు చూపిస్తున్నాయి. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ రహదారులన్నీ పార్కులో నుంచి వస్తున్న వరదనీటితో నీట మునిగాయి. ఎక్కడికక్కడ మోటార్లు పెట్టి తాత్కాలిక ఉపశమనంగా వరదను అవతలి వైపు తోడేస్తున్నారు. ఇందుకు శాశ్వత పరిష్కారంగా వరదనీటి పైప్‌లైన్లు వేయాలని బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2 కేబీఆర్ పార్కు అవతలి వైపు వారం క్రితం తవ్వకాలు చేపట్టారు. అయితే ఇంతవరకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టకపోగా తవ్విన రోడ్డు వరదతో నిండిపోయి ప్రమాదాలు తెచ్చిపెడుతుంది. రాత్రిపూట వాహనదారులు ఈ కాలువల్లో పడిపోతున్నారు. ఇక్కడ చీకటి రాజ్యమేలుతుండడంతో దగ్గరకు వచ్చేవరకు వాహనదారులకు తవ్విన ఈ గోతులు కనిపించడం లేదు. కేబీఆర్ పార్కు లోపల చెరువులు, కుంటలు నిండడంతో వరదంతా బయటకు వస్తున్నది. ముందస్తు ప్రణాళిక లేకపోవడం, ఇంజనీరింగ్ శాస్త్రీయ లోపించడం ఈ వరదకు ప్రధాన కారణంగా ఇటీవల అధికారుల సర్వేలో తేలింది. 20 ఏళ్ల క్రితం వేసిన వరదనీటి పైపులు రోడ్డుకు 10 అడుగుల లోతుకు వెళ్లాయి. వీటిని గుర్తించడం కష్టతరంగా మారింది. రోడ్డుకు మధ్యలో నుంచి తాత్కాలిక పైప్‌లైన్ వేసి వరదను ఇందిరానగర్ వైపు మళ్లించాలని ఈ తవ్వకాలు చేపట్టారు. తీరా పనులు ముందుకుసాగకపోగా స్థానికులను భయపెడుతున్నాయి. మరోవైపు ఇక్కడ పైపులు వేసినా ఈ వరదంతా ఇందిరానగర్, కమలాపురికాలనీ, శ్రీనగర్‌కాలనీ, ప్రాంతాల రోడ్లను ముంచెత్తే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు తప్పించుకునే ధోరణిలో పైపులు వేసి చేతులు దులుపుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లుగా ఇక్కడ తవ్వకాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు చాలాచోట్ల వరదనీటి కాలువల్లోకి డ్రైనేజీ పైప్‌లైన్లు కలిపారు. దీంతో వరద, మురుగు రోడ్లను ముంచెత్తుతూ స్థానికులకు పెద్ద సమస్యగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువై ఇంజనీర్లు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడంతో ప్రతియేటా వరద సమస్య తీవ్రతరమవుతోంది. ప్రజాప్రతినిధులు సైతం అలా వచ్చి, వరద వద్ద రెండు ఫోటోలు తీసుకుని మీడియాకు ప్రకటనలు ఇచ్చి జారుకుంటున్నారు తప్పితే సమస్య శాశ్వత పరిష్కారం కృషి చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ కేబీఆర్ పార్కుతో పాటు పలు ప్రాంతాల్లో వరద ఉన్న చోటికి వచ్చి హడావిడి చేసి వెళ్లారు. ఆయన వెళ్లిన తర్వాత ఆ సమస్య ఎలాంటి పరిష్కారానికి నోచుకోలేదు.కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు ఎర్రమంజిల్, పంజగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాలన్నీ వరదతో నిండిపోతూ స్థానికులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్ కూడా కేబీఆర్ పార్కు వద్ద వరదనీటిలో చిక్కుకుపోవడం గమనార్హం.

జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరం

- అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్
- తర్జనభర్జనలో అధికార కాంగ్రెస్ పార్టీ
- బీజేపీలో ఇంకా నో క్లారిటీ

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ రాజకీయం రసవత్తరంగా మారింది. గెలుపు బాట కోసం రాజకీయపార్టీలు తమ రాజకీయ చతురతను ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిని అన్ని పార్టీల కన్నా ముందుగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను తమ పార్టీ అభ్యర్థిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అభ్యర్థి ప్రకటన విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఇంకా తర్జనభర్జన పడుతోంది. టిక్కెట్ రేసులో తామున్నామంటూ బీసీ నేత నవీన్‌యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ఇదిలా ఉండగా మైనార్టీలకే సీటు ఇస్తారని, కొత్త వ్యక్తి పోటీలో ఉంటారన్న ఊహాగానాలు కూడా తెరపైకి వస్తున్నాయి.

బీజేపీలో నో క్లారిటీ....

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమదైన ఓటుబ్యాంకు కలిగిన బీజేపీ కేవలం బూత్‌కమిటీ మీటింగ్స్ తప్ప నియోజకవర్గంలో ప్రచారాన్ని ఇంకా ప్రారంభించలేదు. కేవలం కార్యాలయ, పార్టీ కేంద్ర, రాష్ట్ర నేతలతో సమావేశాలే తప్ప బస్తీల్లో, కాలనీల్లో ప్రచారం ఊసేలేదు. పార్టీ అభ్యర్థిపై ఇంకా క్లారిటీలో లేదని భావన ఏర్పడింది. గత ఎన్నికల్లో పోటీలో నిలిపిన లంకల దీపక్‌రెడ్డిని పార్టీ మరోసారి బరిలో నిలబెడుతుందో..లేదో చూడాలి. ఏదేమైనా అధికార కాంగ్రెస్ అభివృద్ధి పనులతో మాదే సీటు అంటూ ప్రచాలను ముమ్మరం చేస్తుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ తొలుత అభ్యర్థిని ప్రకటించి రేసులో మేమే ముందుజలో ఉన్నామన్న సంతేకాలను అందించింది. కానీ బీజేపీ మాత్రం రేసులో వెనుకబడి ఎటువంటి హడావుడీ లేకుండా తమ వ్యూహాలేమిటో ప్రతిపక్ష పార్టీలకు అంతకుచిక్కకుండా చేస్తుంది.

ముందస్తు పరీక్షలతో ముప్పు తప్పించుకోవచ్చు



బంజారాహిల్స్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శనివారం ఆస్టర్ ప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ నుంచి ప్రారంభమై అమీర్‌పేటలోని ఆస్పత్రి వరకు కొనసాగింది. ర్యాలీని ఆస్టర్ హాస్పటల్స్ క్లస్టర్ సీఈఓ డాక్టర్ హరికుమార్‌రెడ్డి, సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ సాయిరవిశంకర్ మాట్లాడుతూ.. గుండె సంబంధిత సమస్యను తగ్గించేందుకు జీవనశైలిలో మార్పులు అనివార్యమన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముప్పు తప్పించుకోవచ్చన్నారు. సీఈఓ డాక్టర్ హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో లిటరరీ ఫెస్టివల్



ఛాయ లిటరరీ ఫెస్టివల్ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: తెలుగు సాహిత్యాన్ని బయట ప్రపంచానికి, బయటి సాహిత్యాన్ని తెలుగుకు పరిచయం చేసేందుకు ఛాయ లిటరరీ ఫెస్టివల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. అక్టోబర్ 25న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఛాయ లిటరరీ ఫెస్టివల్ లోగోను శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్, ఫెస్టివల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, రచయిత్రి కుప్పిలి పద్మలతో కలిసి మాట్లాడారు. ఫెస్టివల్‌కు కవి యాకూబ్, రచయిత్రి కుప్పిలి పద్మ, ప్రొఫెసర్ స్వరూప రాణిలు మెంటర్స్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రచయితలు, కవులు, అనువాదకులు, ప్రచురణకర్తలు, సినీ అభిమానులు, సాహిత్య ప్రియులను ఒకే వేదికపైకి చేర్చేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మొత్తం 16 సెషన్స్‌లో 50 మంది వక్తలు పాల్గొంటారని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషుతో పాటు దక్షిణాది భాషలైన దక్కనీ, తమిళ, కన్నడ, మలయాళ, సాహితీ ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 14 పుస్తకావిష్కరణలు, ప్రముఖ రచయితలతో సంభాషణలు ఫెస్టివల్ ప్రత్యేకతలు అన్నారు. ప్రచురణకర్తల బుక్ స్టాల్స్ ఉంటాయని ప్రధాన వక్తలుగా తెలుగు నుండి అల్లం రాజయ్య, తమిళం నుండి పెరుమాళ్ మురుగన్, కన్నడ నుండి వసుధేంద్ర, మలయాళం నుండి షీలా టోమి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కవి యాకూబ్, ఛాయ వ్యవస్థాపకులు మోహన్ బాబు, అరుణాంక్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బసవతారకంలో జాతీయ సదస్సు

బంజారాహిల్స్: బసవతారకం కేన్సర్ ఆస్పత్రి రేడియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో 'మెడికల్ ఫిజిక్స్ ఆధారిత ఆవిష్కరణలు, అడాప్టివ్ రేడియోథెరపీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర' అనే అంశంపై శనివారం ఒకరోజు జాతీయ సదస్సు జరిగింది. నిపుణులైన వైద్యుల మధ్య విజ్ఞాన మార్పిడి, పరస్పర చర్చలు, ఆత్యాధునిక ఆవిష్కరణలపై ప్రత్యేక వివరణలతో భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్సను ప్రభావితం చేసే అంశాలను అందిపుచ్చుకోవడానికి ఈ సింపోజియం వేదికైంది. ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ కృష్ణయ్య ప్రారంభించి మాట్లాడారు. కేన్సర్ కేర్‌లో పరివర్తనాత్మక పురోగతి అనే థీమ్‌తో సింపోజియం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖచ్చితమైన అంకాలజీ చికిత్స అందించడంలో ముందంజలో కొనసాగుతోందని, బలమైన క్లినికల్ సేవలను అధునాతన సాంకేతికతను మిళితం చేసిన అనంతరం విద్యా సంబంధ అంశాలపై దృష్టి కూడా జోడించి పనిచేస్తుందన్నారు. రేడియేషన్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బతుకమ్మ వేడుకలు





బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు డీసీపీలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదనపు సీపీ విక్రమ్ మాన్‌సింగ్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జాయింట్ సీపీ పరిమళ హనా నూతన్ తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్, అసోసియేషన్ కోశాధికారి సుగుణ, మహిళా సంఘం నేతలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మకు పూజలు చేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

రహమత్‌నగర్ : రహమత్‌నగర్‌లో శనివారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

ఓపెన్ వర్సిటీలో బతుకమ్మ సంబరాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. మహిళా అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఉద్యోగులతో కలిసి నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లు విజయలక్ష్మి, మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి ఆటపాటలతో సందడిచేశారు.





రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారు

బంజారాహిల్స్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయాల్లో నవరాత్రుల సందర్భంగా చండీ హోమాలు, సామూహిక కుంకుమార్చనలు ఘనంగా జరుగుతున్నాయి. దైవసన్నిధానంలోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారు, బంజారాహిల్స్‌లోని కనక దుర్గా దేవి అమ్మవారు, శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు, విజయగణపతి స్వామి ఆలయంలోని అమ్మవారు, జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



బంజారాహిల్స్ కనక దుర్గా దేవి ఆలయంలో



రాజరాజేశ్వరి దేవి అలంకారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి



మాగంటి కాలనీ విజయ కనకదుర్గా దేవి ఆలయంలో..



శ్రీ లలితా దేవిగా ఫిలింనగర్ దైవసన్నిధానంలో..



శ్రీ లలితా దేవిగా శ్రీనగర్ కాలనీ శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు



శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా శ్రీ విజయగణపతి స్వామి ఆలయంలో..



జూబ్లీహిల్స్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో..

పండగకు ఊరెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

పంజగుట్ట: దసర, దీపావళి పండుగల సందర్భంగా గ్రామాలకు వెళ్లేవారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. పండగలకు గ్రామాలకు వెళ్లేవారు ఇంటి తలుపులకు సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారమ్స్ మోషన్ సెన్సార్‌లు అమర్చుకోవాలన్నారు. బంగారం, వెండి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులు ఉంటే బ్యాంకు లాకర్లల్లో భద్రపరచాలన్నారు. వాహనాలను లోపల ఉంచి చక్రాలకు చైన్, సెంట్రల్ లాక్ అమర్చాలని, తలుపుల తాళాలు కనిపించకుండా కర్టన్‌లు వేయాలన్నారు.

వెస్ట్‌జోన్ డీసీపీగా శ్రీనివాస్

బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ డీసీపీగా 2018 బ్యాచ్‌కు చెందిన చింతమనేని శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు వెస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న 2012 బ్యాచ్ ఎస్‌ఎం విజయ్‌కుమార్‌ను సిద్దిపేట కమిషనర్‌గా బదిలీ చేశారు. వెస్ట్‌జోన్ పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, ఎస్సార్ నగర్, బోరబండ, మధురానగర్, పంజగుట్ట తదితర పోలీస్‌స్టేషన్లు వస్తాయి.

ఉత్సాహంగా ఓరియంటేషన్ ప్రోగ్రాం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎస్‌యూఈఎస్)కి చెందిన ప్రముఖ సంస్థ అమ్జద్ అలీఖాన్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో శనివారం ఎంబీఏ, ఐఎంబీఏ కోర్సులు చేయనున్న నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌యూఈఎస్ చైర్మన్ మహ్మద్ వలియుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో యువకుడి నుంచి రూ.99 వేలు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన శరత్‌బాబు ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. అతనికి గత నెల 13వ తేదీనాడు దివ్య మెహతా అనే యువతి నుంచి వాట్సప్ మెసేజ్ వచ్చింది. తాను డిజిటల్ మార్కెట్‌లో వర్క్ చేస్తున్నానని పరిచయం చేసుకుంది. తమ వద్ద పార్ట్‌టైం జాబ్స్ ఖాళీగా ఉన్నాయని, స్టార్ హోటల్స్‌కు రేటింగ్స్ పంపితే నగదు వస్తుందని, ఇందుకోసం రిజిస్టర్ చేయాలని తెలియజేసింది. ఈ విధంగా తొలుత అతని వద్ద వెయ్యి రూపాయలు ఆన్‌లైన్‌లో తీసుకున్నారు. అతనికి రూ.2వేలు తిరిగి పంపారు. అనంతరం మరో వెయ్యి, 2వేలు, రూ.3 ఈ విధంగా నగదు తీసుని అప్పుడప్పుడు కొద్దిగా రిటర్న్ పంపారు. చివరకు ఇతని వద్ద నుంచి రూ.99 వేలు నమ్మించి లాక్కున్నారు. ఆ నగదు కోసం ఎన్నిసార్లు ఫోన్ల ద్వారా సంప్రదించినా ఉపయోగం లేకుండా పోయింది. అతని నెంబర్‌ను బ్లాక్ చేశారు. దాంతో బాధితుడు తనకు న్యాయం చేయాలని మధురానగర్ పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



ఖైరతాబాద్ : తెలంగాణ జాతిపిత కొండా లక్ష్మణ్ బాపూజీ 110 జయంతోత్సవాల సామాజిక తెలంగాణ వారోత్సవాలలో భాగంగా శనివారం జలదృశ్యం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

అమ్మవారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రహమత్‌నగర్ : అమ్మవారి కృపతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆకాంక్షించారు. రాజీవ్‌నగర్‌లో దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ముస్తాఫా, డివిజన్ అధ్యక్షుడు ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

నోడల్ అధికారులకు ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలు



సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు సన్నద్ధంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమించకూడదన్నారు. ఎన్నికలకు సంబంధించి నిర్వహించే శిక్షణ కార్యక్రమాలలో రిటర్నింగ్ అధికారి పాల్గొని నోడల్ అధికారులకు వారి బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులు , వృద్ధుల ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ట్రాన్స్‌పోర్ట్, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సీ- విజిల్, టోల్ ఫ్రీ నంబర్లు, ఇతర వ్యవస్థల ద్వారా వేగంగా స్పందించేలా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు, హోర్డింగులను వేగంగా తొలగించాలన్నారు. సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, కె.వేణుగోపాల్, అలివేలు మంగతాయారు, జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు.

పీరంచెరువులో నామాల కోడి



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పీరం చెరువులో అరుదైన పక్షి నామాల కోడి (యూరేసియన్ కూట్)ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ పక్షిని ఆస్ట్రేలియన్ కూట్ అని కూడా పిలుస్తారు. ఇది ఐరోపా, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఉత్తర ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలోని దసరా స్పెషల్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దేవాదబ్రహ్మోత్సవ్–2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాద నైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యాన వన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టికల్చర్ షో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్టప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్, డీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.


సరిగ్గా 117 ఏళ్ల క్రితం..

సరిగ్గా 117 ఏళ్ల క్రితం నాటి పరిస్థితి పునరావృతమైంది. అదే సెప్టెంబర్ 26వ తేదీ.. అదే మూసీ నది.. అదే ప్రాంతం.. అవే వరదలు.. అదే ఉధృతి.. అదే బీభత్సం.. ఇదీ హైదరాబాద్‌లో వాన తెచ్చిన హైరానా.. 1908 నాటి వరదలను తాజా వరదలు తలపించాయి. హైదరాబాద్ నగరాన్ని ఇప్పటివరకు పదుల సంఖ్యలో వరదలు ముంచెత్తినట్లు చరిత్ర చెబుతోంది. కుతుబ్ షాహీ, అసఫ్ జాహీ పాలకుల నుంచి నేటి వరకు 21 సార్లు మూసీనది ఉప్పొంగింది. నగర జనాన్ని వణికించింది. 1908 సెప్టెంబర్ 26 నుంచి 28 తేదీల్లో మూసీ ఉగ్రరూపం చూపగా.. కాకతాళీయంగా 117 ఏళ్ల తర్వాత తిరిగి అదే తేదీల్లో మూసీనదికి వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలు నిండుకుండల్లా మారాయి. దీంతో దిగువకు వదిలిన వరదనీరు నగరంలోని మూసీని ముంచెత్తింది.

–సాక్షి,సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్



అప్పట్లో కూలిన నయాపూల్ బ్రిడ్జి (ఫైల్)



1908లో భారీ వరదల కారణంగా నీటమునిగిన ఓల్డ్ అఫ్జల్‌గంజ్ (ఫైల్)

- వరదల్లో చిక్కుకుని 2 వేల మంది మృత్యువాత
- 150 మందిని కాపాడిన చింతచెట్టు..
- ఉధృతి పెరిగిన వరద.. కొట్టుకుపోయిన పేట్లబురుజు
- కాలినడకన జనం మధ్యకు వచ్చిన నిజాం నవాబు
- మళ్లీ తాజాగా ముంచెత్తిన నదీ ప్రవాహం

1908 సెప్టెంబర్ 26న మూసీ ప్రళయం



పబ్లిక్ గార్డెన్స్‌ను ముంచెత్తిన వరద (ఫైల్)

నాటి మూసీ.. అదే సీన్

ఈ 1908 సంవత్సరం సెప్టెంబర్ 27 ఉదయం 6 గంటలు ఆకాశంలో కారుమబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. గంట దాటింది. చినుకులు చిన్న చిన్నగా మొదలయ్యాయి. మధ్యాహ్నం 2 గంటలకల్లా వర్షం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కాస్త తగ్గినట్టే తగ్గి మరలా విజృంభించింది. ఈ ఉధృతి క్రమేణా పెరిగింది. ఎగువ ప్రాంతంలోని చెరువులకు, కుంటలకు గండ్లు పడ్డాయి. వికారాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ తదితర ప్రదేశాల్లోని కుంటలు, చెరువులకు కూడా గండి పడటంతో ఆ వరద కాస్తా మూసీకి పోటెత్తింది. రాత్రి రెండు గంటలకు పురానాపూల్ వంతెన మీదుగా నీరు ప్రవహిస్తుందని సమాచారం వచ్చింది. నీటి ప్రవాహం గంట గంటకూ పెరగసాగింది.

అఫ్జల్‌గంజ్ వద్ద మూసీకి ఇరు పక్కలా..

అఫ్జల్‌గంజ్ వద్ద మూసీ ఇరు పక్కల ఉన్న బస్తీల్లోకి నీరు చేరింది. మొదట కొలసావాడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. రెండు వేల ఇళ్లు నేలకూలాయి. 15 వేల మంది మృతి చెందారు. 20 వేల మంది నిరాశ్రయులయ్యారు. హుస్సేనీ ఆలం , షహీద్‌గంజ్, బద్రి ఆలావా, ఘాన్సీమియా బజార్, దారుషిఫా, జాంబాగ్, గౌలిగూడ, అఫ్జల్‌గంజ్ నుంచి రెసిడెన్సీ ప్యాలెస్ వరకు అన్ని ప్రాంతాలను వరద ముంచెత్తింది. నీటి ప్రవాహం తీవ్రతకు వందల సంఖ్యలో చెట్లు నేలకూలాయి. అఫ్జల్ దవాఖానా కూలిపోయింది. నయాపూల్ వంతెన కొట్టుకుపోయింది. వరదల దాటికి జనం కకావికలమయ్యారు. ఎటు చూసినా బాధితుల హాహాకారాలే. సహాయం కోసం, ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. వారం రోజుల పాటు నగర జనజీవనం స్తంభించిపోయింది.

కొట్టుకుపోయిన పేట్ల బురుజు..

అఫ్జల్‌గంజ్ భవనంపైక్కి, దానికి ఆనుకొని ఉన్న చెట్టుపై ఎక్కి వందల మంది ప్రాణాలను కాపాడుకున్నారు. ఆ చెట్టు ఇప్పటికీ సాక్షీభూతంగా నిలిచింది. మూసీకి ఉత్తరం వైపు 2 కిలోమీటర్లు, దక్షిణం వైపు ఒక కిలోమీటర్ వరకు వరద ప్రవహించింది. అఫ్జల్‌గంజ్ వంతెన కొట్టుకుపోయింది. పురానాపూల్ వంతెన మీద నుంచి నీరు ప్రవహించింది. 26వ తేదీ ఆదివారం సాయంత్రం కూడా కుండపోతగా వర్షం కురిసింది. 27 సోమవారం రోజంతా వర్షం పడగా, మొదటి వరద హెచ్చరిక రాత్రి 2 గంటలకు వచ్చింది. సెప్టెంబర్ 28 మూసీ నది 60 అడుగుల ఎత్తులో ప్రవహించింది.

36 గంటల్లో 16 సెం.మీ. వర్షపాతం

36 గంటల్లో 16 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అఫ్జల్ గంజ్ వద్ద నీటి మట్టం 11 అడుగులకు చేరింది. వరద నీరు ఇటు చాదర్‌ఘాట్ దాటి అంబర్‌పేట బ్రిడ్జి వరకు, అటు చార్మినార్ దాటి శాలిబండ వరకు ప్రవహించింది. వరద నీరు చంపా దర్వాజా ప్రాంతంలోకి చేరడంతో జనం భయకంపితులయ్యారు. అక్కడే ఉన్న పేట్ల బురుజుపైకి వందలాది మంది జనం ఎక్కారు. రెండు గంటల్లోనే పేట్లబురుజు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో వందల మంది వరద ఉధృతిలో కొట్టుకుపోయారు. 28వ తేదీ సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టింది. ఈ వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. హైదరాబాద్‌లో అంతవరకు అలాంటి భయానక పరిస్థితులను నగరవాసులు చూడలేదు.

నిజాం ప్యాలెస్‌లలో వైద్యశిబిరాలు..

అప్పటి పాలకుడు నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ కాలినడకన జనం మధ్యకు వచ్చారు. వరద బాధితుల కోసం సహాయచర్యలు చేప్పటాలని ప్రధాన మంత్రి మహారాజా కిషన్ ప్రసాద్‌కు ఆదేశాలు ఇచ్చారు. నిరాశ్రయుల కోసం తమ సంస్థానంలోని అన్ని భవనాలను ప్రజల కోసం తెరవాలని సూచించారు. పురానీ హవేలీతోపాటు అన్ని ప్యాలెస్‌ల్లో వైద్య శిబిరాలు, భోజనవసతి ఏర్పాటు చేశారు. వారం రోజులు జనజీవనం స్తంభించింది. సెప్టెంబర్ నెల వచ్చిందంటే నగర ప్రజలు ఎన్నో ఏళ్ల వరకు భయపడేవారు. 1968లో మరలా 1984లో 2007, 2020లోనూ వరదలు తీవ్రస్థాయిలో వచ్చాయి.

నగరానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ అవసరం



నిజాం కాలంలో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యం ఇప్పటి జనాభా అవసరాలకు సరిపోకపోవడం వల్లే ఇలాంటి విపత్తులకు అవకాశం ఏర్పడుతోంది. ప్రకృతి కన్నెర్ర చేస్తే ఎలా ఉంటుందో ముందు తరాలకు చూపించే విధంగా ఈ వరదలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మూసీ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

- ఎం.వేదకుమార్, చైర్మన్, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్

సాక్షీభూతంగా నిలిచిన చింతచెట్టు

అప్పటి వరదల్లో ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలోని చింతచెట్టును ఆసరాగా చేసుకుని దాదాపు 150 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కాపాడుకున్నారని చరిత్ర చెబుతోంది. సరిగ్గా 117 సంవత్సరాల తర్వాత మళ్లీ అదే తేదీన తాజాగా వరదలు రావడంతో ఈ ప్రాంతవాసులు ఆ చెట్టు గురించి చర్చించుకుంటున్నారు.



'స్వచ్ఛ్ భారత్'తో దేశంలో మార్పు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



స్వచ్ఛ ఆటోట్రాలీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాచిగూడ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన 'స్వచ్ఛ్ భారత్'తో దేశంలో మార్పు వచ్చిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బర్కత్‌పురలో చేపట్టిన స్వచ్ఛ్ ఆటోలను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత విషయంలో బస్తీల్లో ప్రజలకు పాఠశాలల్లో విద్యార్థులకు అందరికీ అవగాహన ఏర్పడిందని అన్నారు. స్వచ్ఛ భారత్ కారణంగా దేశంలో సగటు మనిషి వైద్యం, మెడిసిన్‌పై చేస్తున్న ఖర్చులు మిగులుతున్నాయని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. స్వచ్ఛ భారత్ వల్ల పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛతతో మన దేశం ఇమేజ్ పెరుగుతుందని, టూరిజం మెరుగుపడుతుందని, గ్రామాలు, బస్తీలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. మహిళల గౌరవాన్ని పెంచేలా దేశంలో 11 కోట్లకుపైగా టాయిలెట్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. స్వచ్ఛ్ భారత్ ఫలితాలు ఇప్పుడు మనకు కనిపిస్తున్నాయని తెలిపారు. వ్యాపార వర్గాలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన జీఎస్టీ ప్రకారమే అమ్మకాలు చేపట్టాలని, అమాయక ప్రజలను మోసం చేయవద్దని కోరారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకర్గం పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉనన అన్ని ప్రభుత్వ పాఠశాలల క్లీనింగ్ కోసం స్వచ్ఛ ఆటోట్రాలీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న 11 ఆటోలతోపాటు మరో 6 నూతనంగా కొనుగోలు చేసి ప్రారంభించినట్లు చెప్పారు. నియోజకవర్గం పరిధిలో 700లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఒక్కో ఆటో రోజూ 30 పాఠశాలల్లోని టాయిలెట్లను క్లీనింగ్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, సి.కృష్ణయాదవ్, ఆనంద్ గౌడ్, సి.నందకిషోర్ యాదవ్, ఏడెల్లి అజయ్ కుమార్, శ్యామ్‌రాజ్, సి.వినోద్ యాదవ్, ఎక్కాల నందు, కన్నా, ప్రవీణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీకి నూతన పాలకవర్గం ఎన్నిక



అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీకి ఈ ఏడాదికిగాను నూతన పాలకవర్గం ఎన్నికైంది. ఎగ్జిబిషన్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికకాగా, మిగతా పాలకవర్గానికి ఎన్నికలు శుక్రవారం రాత్రి జరిగాయి. ప్రతి ఏడాది సెప్టెంబర్‌లో ఎగ్జిబిషన్ సొసైటీకి ఎన్నికలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. నూతన పాలకవర్గం ఏడాదిపాటు అధికారంలో ఉంటుంది. 87 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఎగ్జిబిషన్ సొసైటీకి మొత్తం 277 మంది సభ్యులు ఉండగా, 222 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన సొసైటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఆర్.సుఖేష్‌రెడ్డి, కార్యదర్శిగా బీఎన్ రాజేశ్వర్, జాయింట్ సెక్రెటరీగా టి.చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా బి.హన్మంతరావు, ఎస్.వినయ్ కుమార్ ముదిరాజ్, పి.నరోత్తమ్‌రెడ్డి, ఎం.శైలజరాజ్, ఎం.చంద్రశేఖర్, ఎల్.మంజిత్‌రెడ్డి, అనురాగ్ మిశ్రా ఎన్నికయ్యారు.

కొండా లక్ష్మణ్ జీవితం స్ఫూర్తిదాయకం



లక్ష్మణ్ బాపూజీకి పుష్పాంజలి ఘటిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్ : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ నిస్వార్థ సేవలు, ఉద్యమ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్ణన్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యోద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాల్గొని అవే విలువలను జీవితాంతం పాటించారని కొనియాడారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమం సహా అనేక ప్రజా ఉద్యమాలకు ఆయన ప్రత్యక్ష సాక్షిగా, మూడు తరాలకు వారధిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు రఘుప్రసాద్, వేణుగోపాల్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, అదనపు సీసీపీ గంగాధర్, పీఆర్ఓ మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

హై సెక్యూరిటీ నెంబర్‌ప్లేట్లకు గడువు లేదు

సాక్షి, సిటీబ్యూరో: వాహనాల భద్రత దృష్ట్యా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తలపెట్టిన హై సెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ల ఏర్పాటుకు ఎలాంటి గడువు విధించలేదని రవాణా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 30లోగా అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ప్లేట్(హెచ్ఎస్ఆర్‌పీ) తప్పనిసరిగా బిగించుకోవాలంటూ వచ్చే వార్తల్లో నిజం లేదని సంయుక్త రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. హెచ్ఎస్ఆర్‌పీ లేని వాహనాలకు ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు చలానాలు, జరిమానాలు విధిస్తారనేది వాస్తవం కాదని ఆయన స్పష్టం చేశారు. నిర్ణీత గడువుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదని పేర్కొన్నారు. హెచ్ఎస్ఆర్‌పీ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, హెచ్ఎస్ఆర్‌పీ బిగిస్తామంటూ మోసం చేసే నకిలీ వెబ్‌సైట్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతికూల వాతావరణం.. విమానాల మళ్లింపు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం ఉండటంతో శనివారం ఉదయం రెండు విమానాలను దారి మళ్లించారు. బహ్రెయిన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన గల్ఫ్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు తరలించారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన మరో విమానాన్ని చెన్నై విమానాశ్రయానికి మళ్లించారు. ఈ రెండు విమానాలు కూడా తిరిగి సాయంత్రంలోపు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాయి. సాంకేతిక కారణాలలో తిరుపతి, చెన్నై నుంచి రావాల్సిన మూడు విమానాలు కూడా రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే భరతం పడతాం

ఎంపీ ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 42 శాతం బీసీ రిజర్వేషన్లు అగ్ర వర్ణాలు వ్యతిరేకించి గ్రామాల్లో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్లకు అన్ని వర్గాల వారు సహకరించాలని, వ్యతిరేకించేవారి భరతం పడతామని హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తూ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడం బీసీల సుదీర్ఘ పోరాట విజయమని అన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉన్నాయన్నారు. అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇస్తే బీసీలు వ్యతిరేకించలేదని, కాబట్టి అగ్రకులాలతోపాటు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కుల సంఘాలు అప్రమత్తంగా ఉండి, బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు సి.రాజేందర్, కోల జనార్దన్, పగిళ్ల సతీష్, సుధాకర్ ముదిరాజ్, మోదీ రాందేవ్, జి.అనంతయ్య, నందగోపాల్, రవి యాదవ్, లింగయ్య యాదవ్, బి.గోపి, సుభాష్, ప్రీతం పాల్గొన్నారు.

స్థలమిస్తే ఇళ్లు నిర్మించి ఇస్తాం: పొంగులేటి

మంత్రి పొన్నంతో కలిసి కంటోన్మెంట్‌లో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ప్రారంభం

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వానికి పౌర విమానయాన, రక్షణ శాఖల పరిధిలోని స్థలాలను కేంద్రం కేటాయిస్తే కంటోన్మెంట్‌లో నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రసూల్‌పుర నారాయణ జోపిడీ బస్తీలో 288 డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, కంటోన్మెంట్ బోర్డ్ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాలు అందజేశారు. పొంగులేటి మాట్లాడుతూ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌చార్జిగా నారాయణ జోపిడి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వెంటనే నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చానని, ఇప్పుడు వాటిని పూర్తి చేయడం సంతోషంగా ఉందని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, నగరంలోనూ వీలైనంత ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఇటీవల ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు అన్నానగర్లోని పలు నివాసాలకు నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కేంద్రంలోని తమ ప్రభుత్వమే ఈ చర్యకు పాల్పడిందని, అయినా నిరసిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కంటోన్మెంట్ జాయింట్ సీఈవో ఆశిక్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోలో పయనిస్తూ.. ప్రయాణికులను పలకరిస్తూ..



మెట్రో రైల్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం మెట్రో రైలులో పయనించారు. సాధారణ ప్రయాణికుడి మాదిరిగా టికెట్ కొనుక్కొని నాగోల్ స్టేషన్ నుంచి ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం వరకు ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి ప్రయాణికులతో ముచ్చటించారు. మెట్రో సేవలు, సదుపాయాలు, స్టేషన్లలో భద్రత, ఎదురయ్యే ఇబ్బందులు, నగరంలోని ట్రాఫిక్ రద్దీ తదితర అంశాలపై వారితో చర్చించారు. నగరంలో ప్రజా రవాణాను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మెట్రో రెండోదశ విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం, తదితర భవిష్యత్ ప్రణాళికలను గురించి చెప్పారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రశంసలతోపాటు విమర్శలను కూడా స్వీకరిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్న తమ ప్రభుత్వానికి అండగా నిలవాలని, రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

బీజేపీ ఎజెండా.. చేతిలో కాంగ్రెస్ జెండా



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మహమూద్ అలీ

రాహుల్, రేవంత్‌లపై కేటీఆర్ విమర్శలు

రహమత్‌నగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల్లో కాంగ్రెస్ జెండా పట్టుకుని బీజేపీ ఎజెండాతో ముందుకు వెళుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రహమత్‌నగర్ డివిజన్ గంగానగర్‌లో శనివారం ప్రముఖ ఇస్లాం సందేశకుడు అహ్మద్ నక్షబంది నివాసంలో ఏర్పాటు చేసిన ముస్లిం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీ సంక్షేమం కోసం బీఆర్ఎస్ హయాంలో అధిక నిధులు వెచ్చించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తే బుల్డోజర్ కూల్చివేతలకు అనుమతులు ఇచ్చినట్లేనని ఆరోపించారు. శాసన సభలో, మంత్రిమండలిలో ముస్లింల ప్రాతినిధ్యంలేని ప్రభుత్వం ఒక్క తెలంగాణ రాష్ట్రమేనని అన్నారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తమ పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు మసీఉల్లా, సోహైల్, ఫయాజ్, లియాకత్‌అలీ, సయ్యద్ బషీర్, అరుణ్ కూమార్, కేఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పింక్ పవర్ రన్ 2.0..

బ్రెస్ట్ కేన్సర్ అవగాహన కల్పించే దిశగా రన్



లక్డీకాపూల్ : నగరవాసుల్లో బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించే లక్ష్యంతో పింక్ పవర్ రన్ కార్యక్రమాన్ని తలపెట్టారు. ది సుధా రెడ్డి ఫౌండేషన్, మెయిల్ ఫౌండేషన్ సంయుక్తగా ఆదివారం ఉదయం ఈ రన్ నిర్వహిస్తున్నారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద ఈ రన్ మొదలవుతుంది. మిస్ వరల్డ్ –2025 ఓపల్ సుచాత చువాంగ్స్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందులో మిస్ వరల్డ్, మిస్ ఆసియా సుందరీమణులు, పలువులు నటీనటులు పాల్గొన్ని పింక్ రన్‌కు మరింత శోభను తేనున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, హోంశాఖ కార్యదర్శి సీవీ ఆనంద్‌లతో పాటు మెయిల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గోనున్నారు.

విక్రయాల జోరు..

- ఫ్యాషన్ ఉత్పత్తుల అమ్మకాలే అధికం
- పండుగ విక్రయాల అధ్యయనం వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: పండుగ సీజన్ విక్రయాల్లో గృహోపకరణాలు, పురుషుల దుస్తులు, పాదరక్షలు ముందు వరుసలో ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఫ్యాషన్‌కే ఎక్కువ డిమాండ్ ఏర్పడిన విషయాన్ని ప్రముఖ ఆన్‌లైన్ విపణి ఫ్లిప్‌కార్ట్ షాప్సీ అధ్యయనం వెల్లడించింది. గృహావసర వస్తువులకు డిమాండ్ 108% పెరిగిందనీ, పురుషుల సాధారణ దుస్తులు, పాదరక్షల విక్రయాలు 95% పెరిగాయనీ తెలిపింది. మహిళల కుర్తా, ప్యాంట్ సెట్‌లు, ఇయర్‌బడ్స్, పురుషుల అనలాగ్ గడియారాలు అత్యధికంగా అమ్ముడైన ఉత్పత్తులుగా నిలిచాయని తేలింది. జెన్ జెడ్‌గా పేర్కొంటున్న నవ యువ తరం ప్రధానంగా గ్రూమింగ్, ఫ్యాషన్, దుస్తులపై దృష్టి పెట్టగా, మిలీనియల్స్ (నేటి తరం) గృహ అవసరాలు, ఫ్యాషన్‌కు ప్రాధాన్యత ఇవ్వడం 60% అమ్మకాలకు దోహదపడిందని, మొత్తం ఆర్డర్‌లలో 57%తో మహిళా కొనుగోలుదారులు టాప్‌లో నిలిచారని వెల్లడించింది.



సూపర్.. సప్పర్..

నగరంలో విస్తరిస్తున్న కొత్త తరహా కల్చర్

- ఆతిథ్యం ఇచ్చేవారు, పుచ్చుకునేవారు అపరిచితులే
- విందులతో చిగురిస్తున్న సరికొత్త స్నేహాలు
- 'మెట్రో'లలో వేళ్లూనుకుంటున్న పార్టీ ట్రెండ్
- హైదరాబాద్‌లోనూ స్ట్రేంజర్స్ మీట్, ట్రీట్ డిమాండ్
- 'సప్పర్ క్లబ్స్' పేరిట విస్తరిస్తున్న వైనం

ఓ ఆదివారం ఆహ్లాదకరమైన సాయంత్రపు వేళ, తరచూ వెళ్లే కేఫ్‌లకు బదులు, ఓ అపరిచిత వ్యక్తి ఇంటికి వెళ్లడం, ఎప్పుడూ కలవని మరికొందరితో కలిసి టేబుల్ పంచుకోవడం ఎలా ఉంటుంది?.. ఈ ఊహ నగరంలో వాస్తవరూపం దాలుస్తోంది.. ఇప్పటికే పలు మెట్రో నగరాల్లో ట్రెండ్‌గా మారి ఇప్పుడిప్పుడే నగరంలోనూ అంకురిస్తున్న సప్పర్ క్లబ్‌లు రేపటి అనుభవాలను మాత్రమే కాదు కొత్త స్నేహాలను తీర్చిదిద్దే వేదికలుగా అవతరిస్తున్నాయి. రుచికరమైన ఆహారం ప్రశాంతమైన సంభాషణ, కొత్త రుచులను కనుగొనడం, ఒత్తిడి లేకుండా ముచ్చట్లు.. వీటన్నింటినీ అపరిచితులతో పంచుకోవడమే సప్పర్ క్లబ్స్ ప్రత్యేకత.

– సాక్షి, సిటీబ్యూరో

దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న ఈ క్లబ్స్ ప్రత్యేకమైన అనుభవం కోసం అతిథులను ఆహ్వానిస్తున్నాయి. 'సప్పర్ క్లబ్‌లు తరచూ ఇళ్లలో నిర్వహించే సన్నిహిత భోజన అనుభవాలు. ఇక్కడ ఆహారంతోపాటు సంభాషణలు, పరిచయాలే ప్రధానం. రెస్టారెంట్‌ల మాదిరిగా స్థిరమైన మెనూ ఉండదు. వ్యక్తులు తమ కథలు చెప్పడం, కాలానుగుణ రుచులతో కొత్త వ్యక్తులను కలవడంపై మాత్రమే దృష్టి పెడతారు. తద్వారా వారు వండిన వంటకాలను కలిసి తినడం, భాగస్వామ్య టేబుల్‌పై కనెక్ట్ అవ్వడంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తారు.' అని సప్పర్ క్లబ్స్ నిర్వహించే జైపూర్‌కు చెందిన సీమా సేథి అంటున్నారు. ఈ కొత్త ట్రెండ్‌కు సోషల్ మీడియా ప్రధాన ప్రేరకంగా మారింది. ప్రతి ఒక్కరూ తాము పంచుకోగల ప్రత్యేకమైన అనుభవాన్ని కోరుకుంటుండడం సప్పర్ క్లబ్స్‌కు ఊపునిస్తోంది. 'ఎప్పుడూ కలవని వ్యక్తులతో ఓ ఇంట్లో జరిగే విందు పార్టీలో ఉన్నట్లు ఊహించుకోండి.. సప్పర్ క్లబ్.. కేవలం విందు కాదు.. ఇది ఒక వైబ్.. ఆకర్షణ వ్యక్తిగతంగా లీనమయ్యేలా చేస్తుంది. సాధారణ విందు విహారయాత్రకు భిన్నంగా ఉంటుంది.' అని ముంబైలో సప్పర్ క్లబ్ హౌస్ ఆఫ్ మాలా సహ వ్యవస్థాపకురాలు ప్రాచి గుప్తా అంటున్నారు.





హోమ్లీగా.. జాలీగా..

'చెఫ్ తాజాగా క్యూరేట్ చేసిన ఆహారాన్ని తినాలనుకునే డైనర్లలో ఈ ఫార్మాట్ ఆదరణ పొందుతోంది. డైనర్లు ఒకే టేబుల్ వద్ద కూర్చునే కుటుంబ–శైలి విందు కావడం కూడా ఆకర్షణను పెంచుతుంది.' అని పుణెకు చెందిన యాంపిల్ సప్పర్ క్లబ్ వ్యవస్థాపకురాలు చెఫ్ కౌసల్య పాటిల్ అన్నారు. నేటి తరం ప్రజలు కేవలం భోజనం కంటే ఎక్కువ కోరుకుంటున్నారని హౌస్ ఆఫ్ మాలా సహ వ్యవస్థాపకురాలు సలోని గుప్తా అభిప్రాయపడ్డారు. నిర్దీత మెనూ లేకపోవడం లాంటి ప్రత్యేకతలు సప్పర్ క్లబ్‌ల వైపు ఆకర్షించే బలమైన కారకాలుగా సీమా సేథి అంగీకరిస్తున్నారు. 'ఇది ఆ నిర్దిష్ట సాయంత్రం కోసం మాత్రమే రూపొందిన అనుభవం..వ్యక్తిగతమైనది' అని ఆమె చెప్పారు. 'కోవిడ్–19 టైమ్‌లో దాదాపు రెండేళ్లు ఒంటరిగా ఇంట్లోనే గడిపాము. దీంతో మానవ సంబంధాలను పెంచుకోవడంపై ఆసక్తి పెరిగింది.' అని గురుగ్రామ్‌లో బెంగాలీ సప్పర్ క్లబ్ టూంటూనీస్ టేబుల్ వ్యవస్థాపకురాలు టూనికా గుహా అంటున్నారు.

వలస యువతతో ఊపు..

చదువుకోడానికి లేదా పని చేయడానికి వలస వచ్చిన యువత ఎక్కువగా ఉన్న హైదరాబాద్ లాంటి నగరాల్లో తమ ఇళ్లను కుటుంబాలను విడిచిపెట్టిన వారు.. కొత్త వ్యక్తులను పరిచయం చేసుకోడానికి సప్పర్ క్లబ్‌లు గొప్ప మార్గంగా మారాయి.. 'ఇవి రెస్టారెంట్లు, బార్ల కంటే భిన్నమైన అనుభవాన్ని ఇస్తాయి. నగరాల్లోని ప్రజలు మంచి ఆహారం తినాలని, అలాగే మంచి స్నేహానుభవాన్ని పొందాలని కోరుకుంటారు' అని నగరంలో సప్పర్ క్లబ్‌కు శ్రీకారం చుట్టిన ప్రణవి చెప్పారు. విభిన్న సంస్కృతులలో కమ్యూనల్ డైనింగ్ ఒక సంప్రదాయం. ప్రతి సమావేశం, దానితో ఆలోచనల మార్పిడి, విభిన్న ఆచారాలు, సంస్కృతులను మనకు పరిచయచేస్తాయి.' అని మరో క్లబ్ నిర్వాహకులు కౌశల్య పాటిల్ అన్నారు. డిజిటల్ సంబంధాలపై ఆధారపడుతున్న యుగంలో సప్పర్ క్లబ్‌లు అవసరమైన పరస్పర సాన్నిహిత్యాన్ని అందిస్తున్నాయి.







కేర్ ఫుల్.. కమ్యూనిటీ చిల్..

అపరిచితులతో కాబట్టి నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుంటారు. టేబుల్‌లో హద్దులను నిర్దేశిస్తారు. వస్తువులను సురక్షితంగా ఉంచుతారు. హాజరవుతున్నవారు ఎలాంటి ఆహారాన్ని ఇష్టపడుతున్నారో? సప్పర్ క్లబ్ డిన్నర్ టేబుల్ సీటు బుక్ చేసుకోవడానికి ఎందుకు ఆసక్తి చూపుతున్నారో? అర్థం చేసుకోవడానికి విందుకు ముందే అవసరమైన సంప్రదింపులు ఉంటాయి.

ఇలా ప్రారంభించి.. అలా లీనమై..

ఈ విందులో పాల్గొన్నప్పుడు తొలుత ప్రతి ఒక్కరూ కొంచెం ఇబ్బందికరంగా ప్రారంభిస్తారు. ఇక్కడికి చేరుకోడానికి వారు ఎంత ట్రాఫిక్‌ను ఎదుర్కొన్నారనే విషయాలనే మాట్లాడతారు. కానీ అలా అలా నగరంలో రుచికరమైన, ఉత్తమమైన మటన్ థాలీని ఎక్కడ దొరుకుతుందనే సంభాషణ నుంచి అలా అలా చర్చలు లోతుగా మారతాయి.. 'దీనికి ఫ్యాన్సీ రెస్టారెంట్ అంత స్థలం అవసరం లేదు. ఇది సోషల్ మీడియా బజ్‌కు సరైనది. దీని ద్వారా నగరాల్లో హోస్టల నెట్‌వర్క్‌ను నిర్మించవచ్చు. 'ఆదాయాన్ని పొందడం కంటే మిన్నగా వ్యక్తిగత బ్రాండ్ కమ్యూనిటీని సప్పర్ క్లబ్‌లు నిర్మిస్తాయి' అని సీమా సేథి అంటున్నారు. ప్రతి సమావేశం కంటెంట్ సోషల్ మీడియా ద్వారా పంచుకోగల కథగా మారుతుంది. సొంత నిబంధనల ప్రకారం ఆతిథ్యం ఇచ్చేందుకు వీలు కల్పిస్తుంది. మరింత ముఖ్యంగా, ఇది ఆహారం కోసం మాత్రమే కాకుండా పరిచయాల కోసం వచ్చే అతిథుల సర్కిల్‌ను సృష్టిస్తుంది, వర్క్‌షాప్‌లు, సహకారాలు, ప్రయాణ అనుభవాలు తదితర భవిష్యత్తు అవకాశాలకు తలుపులు తెరుస్తుంది.



సేవే లక్ష్యం.. ప్రేమే మార్గం అంటూ అనాథలకు అండగా నిలుస్తూ.. తండ్రి స్ఫూర్తితో వృద్ధులను ఆదుకుంటున్నారు.. వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి. ఎందరో అభాగ్యులను చేరదీసి వారికి ఆశ్రయం కల్పిస్తున్నారు. నెల్లూరు జిల్లా తిమ్మారెడ్డి వాగు గ్రామంలో జన్మించి ఉన్నత చదువులు అభ్యసించినప్పటికీ సామాజిక స్పృహతో సమాజానికి తనవంతు సేవ చేస్తున్నారు.

– ఆల్విన్‌కాలనీ

సేవే లక్ష్యం.. ప్రేమే మార్గం..

- అనాథలకు అండగా నిలుస్తున్న వృద్ధాశ్రమం
- తండ్రి స్ఫూర్తితో వృద్ధులను ఆదుకుంటూ
- అభాగ్యులను చేరదీస్తున్న రాజేశ్వరి

మనసుకు నచ్చిన పని చేస్తే అందులో కలిగే తృప్తి, ఆనందం వేరు అంటున్నారు కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ సాయినగర్‌లో శ్రీ రాజేశ్వరి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు. చిన్నప్పటి నుంచి సామాజిక స్పృహను అలవాటు చేసిన తండ్రి స్ఫూర్తితో 2012లో ఈ వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. అప్పటి నుంచి అనేక మంది అభాగ్యులను చేరదీసి వారికి అండగా నిలుస్తున్నారు. ఈ వృద్ధాశ్రమంలో ప్రస్తుతం 65 మంది వృద్ధులను ఆదరిస్తున్నారు. వారినే తన తల్లిదండ్రులుగా భావిస్తూ నిరంతరం సేవలందిస్తున్నారు. జీహెచ్ఎంసీవారు, పోలీసు వారు తప్పిపోయిన అనాథలను తీసుకొచ్చి రాజేశ్వరి వృద్ధాశ్రమంలో చేర్పిస్తుంటారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో..

వృద్ధులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో.. వృద్ధాశ్రమంలో పక్షులు, బాతులు, చిలుకలు, పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేశారు. నిత్యం ఆశ్రమ పరిసరాలను శానిటేషన్ చేయిస్తూ శుభ్రతను పాటిస్తుంటారు. పలు ఆస్పత్రుల నిర్వాహకులతో చర్చించి వైద్య పరీక్షలు చేయిస్తుంటారు. వృద్ధులకు కాలక్షేపానికి కథలు చెబుతూ ఆట పాటలు నిర్వహిస్తుంటారు.



దివ్యాంగులకూ అండగా..

కూకట్‌పల్లి, బోయిన్‌పల్లిలోని ఆశ్రమాల్లో గత ఐదేళ్లుగా వయో వృద్ధులతో పాటు దివ్యాంగులైన మూగ, చెవిటి వారికి కూడా ఆశ్రయం కల్పించి ఉచితంగా సేవలు అందిస్తున్నారు.



సేవే మహా భాగ్యంగా..



నా చివరి మజిలీ వరకూ మాతృమూర్తులకు సేవ చేస్తూనే ఉంటా. ఆశ్రమానికి పలువురు దాతలు అందించే చేయూత ఎప్పటికీ మరువలేను. వారి సహకారంతోనే నా లక్ష్యాన్ని కొనసాగిస్తున్నాను. కష్టంలోనూ వయో వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా. వారి ఆనందమే నా ఆనందం. – రాజేశ్వరి, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు



ఆరెంజ్ ట్రీలో.. స్వాన్ కలెక్షన్..



సాక్షి, సిటీ బ్యూరో: జోధ్‌పూర్‌కు చెందిన ప్రముఖ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ఆరెంజ్ ట్రీ, బ్రిటన్‌కు చెందిన ప్రముఖ డిజైన్ బ్రాండ్ స్వాన్ నగర మార్కెట్‌కి పరిచయం చేసింది. బంజారాహిల్స్‌లోని ఆరెంజ్ ట్రీ ప్రాంగణంలో ఈ కలెక్షన్ లాంచ్ నిర్వహించారు. యూరోపియన్ క్లాసిక్ డిజైన్‌లను ఆధునిక జీవనశైలికి అనుగుణంగా కొత్తగా ఆవిష్కరించిన ఈ కలెక్షన్‌లో శిల్పాకృతిలోని క్యాబినెట్లు, స్టేట్‌మెంట్ టేబుళ్లు, స్టైలిష్ బుక్‌షెల్ఫ్‌లు, ఎలిగెంట్ మీడియా యూనిట్లు వంటి 30 వరకూ ఫర్నిచర్ ఉత్పత్తులు ఉన్నాయి. నగరంలోని కొత్త తరం నివాసాలకు తమ ఉత్పత్తులను అందించడం ఆనందంగా ఉందని స్వాన్ సహ వ్యవస్థాపకురాలు డెబ్బీ విలియమ్‌సన్ అన్నారు. కార్యక్రమంలో ఆరెంజ్ ట్రీ వ్యవస్థాపకులు, క్రియేటివ్ డైరెక్టర్ గౌరవ్ జైన్ పాల్గొన్నారు.



నగరంలో ది బ్రైడల్ స్టోరీ

అక్టోబర్ 3 నుంచి 5 వరకు ప్రదర్శన
170 స్టాల్స్‌లో వెడ్డింగ్ స్పెషల్ డిజైన్‌లు

మాదాపూర్ : శక్తివంతమైన మహిళ సాధికారత, వ్యాపారోత్సవానికి ప్రతీకగా ది బ్రైడల్ స్టోరీ నిలువనుంది. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో అక్టోబర్ 3 నుంచి 5 వరకూ నిర్వహించనున్న 'ది బ్రైడల్ స్టోరీ' జీటో లేడీస్ వింగ్ అత్యున్నత లగ్జరీ ఎగ్జిబిషన్ వివరాలను హైటెక్స్ శనివారం వెల్లడించారు. దేశంలోని అగ్రశ్రేణి డిజైనర్లు రూపొందించిన జ్యువెలరీ బ్రాండ్లతో 170 స్టాల్స్‌లో ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని జాతీయ కార్యదర్శి సర్లా బుటోరియా తెలిపారు. అనంతరం ప్రదర్శన బ్రోచర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తరుణ్ తహిలియాని, అబూజాని సందీప్ ఖోస్లా, గోలు బాయ్ బడాలియా, రాజువాడ జ్యువెలర్స్ తదితరులు పాల్గోనున్నట్లు చైర్‌పర్సన్ సుధా కీమ్టీ తెలిపారు.

ఆకట్టుకున్న పారిశ్రామిక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ఐఎంసీ లేడీస్ వింగ్ 38వ మహిళా పారిశ్రామికుల ప్రదర్శనను తొలిసారి నగరంలోని నోవోటెల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు జరుగనున్న ఈ ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి వచ్చిన మహిళా వ్యాపారులు తమ ప్రత్యేక ఫ్యాషన్, జ్యువెలరీ, లైఫ్‌స్టైల్ డిజైన్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 'ట్రీ ఆఫ్ లైఫ్' థీమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాజా రవివర్మ కళా స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఈ అలంకరణ, మహిళల ధైర్యం, శక్తి, సౌందర్యాలకి ప్రతీకగా నిలిచింది.



పోలీస్ 'బలుపు'పై ఏపీ హైకోర్టు ఫైర్

గుంటూరు ఎస్పీని పిలిపించి మంగళగిరి సీఐపై కేసుకు ఆదేశం

విధుల్లో ఉన్న హైకోర్టు డ్రైవర్ లక్ష్మీనారాయణపై సీఐ తీవ్రంగా దాడి

- జడ్జీలకు ఫైళ్లు ఇచ్చేందుకు వెళ్తుండగా వాహనం ఆపి కొట్టిన వైనం
- 'నువ్వేంటిరా.. డ్రైవర్ నా కొడుకువి. నువ్వా నాకు చెప్పేది.. నేను సీఐని' అంటూ పొట్టలో గట్టిగా గుద్దిన సీఐ



తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులను నడిరోడ్డుపై బహిరంగంగా కుళ్లబొడిచారు...
బాపట్లలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రయత్నాల్లో ఉన్న ఇద్దరు యువకులను చితకబాదారు...
రాజమహేంద్రవరంలో దళిత యువకుడిని అక్రమంగా నిర్బంధించి అర్ధనగ్నంగా సెల్‌లో ఉంచారు...
రాప్తాడులో ఓ యువకుడిని అసలు సంబంధమే లేని కేసులో అదుపులోకి తీసుకుని దాడి చేశారు...
కర్నూలులో భూవివాదంలో మైనారిటీ టీచర్‌ను బెదిరించి కుటుంబసభ్యులను కిడ్నాప్ చేసి కొట్టారు..!
...ఈ దుర్మార్గాలన్నీ ఏ రౌడీలో, మరే రాజ్యాంగేతర శక్తులో చేసినవి కాదు..!
...రెడ్‌బుక్ రాజ్యాంగంలో యథేచ్ఛగా చెలరేగుతూ రాష్ట్ర పోలీసులు చేసిన దారుణాలు
...ఒకటా, రెండా..? రాష్ట్రవ్యాప్తంగా కన్నూమిన్నూ కానని ఇలాంటి ఉదాహరణలెన్నో!
...ఈ కోవలోనే ఏకంగా డ్యూటీలో ఉన్న హైకోర్టు ఉద్యోగి పైనే జులుం ప్రదర్శించారు
...బాధితుడు సాధారణ వ్యక్తి అయినట్లైతే ఈ పైశాచికం పోలీసు బూట్ల కింద నలిగిపోయేదే

కానీ, హైకోర్టు ఉద్యోగి కావడం... పోలీసుల తప్పు స్పష్టం కావడంతో సంచలనం రేపుతోంది.

సాక్షి, అమరావతి: అయినదానికి, కానిదానికి రాష్ట్రంలో సాధారణ పౌరులపైన తమ ప్రతాపం చూపిస్తూ వస్తున్న పోలీసులు మరోసారి 'బలుపు' ప్రదర్శించారు. ఎదురు చెప్పినవారిని చితక్కొట్టడమే పనిగా పెట్టుకున్న రక్షకభటులు ఏకంగా డ్యూటీలో ఉన్న హైకోర్టు ఉద్యోగిపైనే దాడి చేశారు. జడ్జీలకు కేసుల ఫైళ్లను అందజేసేందుకు వెళ్తుండగా అడ్డుకుని అత్యంత దురుసుగా ప్రవర్తించారు. బాధితుడు తాను ఎవరో వివరాలు చెప్పినా పట్టించుకోకుండా దూషిస్తూ దారుణంగా ప్రవర్తించారు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే... ఎం.లక్ష్మీనారాయణ హైకోర్టులో ఆఫీస్ సబార్డినేట్ కమ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గుంటూరు పరిధిలో ఉన్న న్యాయమూర్తులకు ఆయన కేసుల ఫైళ్లు అందజేస్తుంటారు. మరుసటి రోజు విచారించాల్సిన కేసులకు సంబంధించిన ఫైళ్లను రాత్రి న్యాయమూర్తులు తమ ఇంటి వద్దనే చదువుతారు. తద్వారా విచారణ సులభమవుతుంది. ఇలా వారికి కేసుల ఫైళ్లను అందజేయడాన్ని సర్క్యులేషన్ అంటారు. లక్ష్మీనారాయణ గురువారం హైకోర్టు వాహనంలో ఈ ఫైళ్లను తీసుకుని రెయిన్ ట్రీ విల్లాల్లో నివసిస్తున్న జడ్జీలకు ఇచ్చేందుకు మంగళగిరి మీదుగా బయల్దేరారు. ఎర్రబాలెం–మంగళగిరి రైల్వే ఫ్లై ఓవర్‌పై మిగిలిన వాహనాలతో కలిసి వెళ్తుండగా లక్ష్మీనారాయణ వాహనాన్ని ఓ కానిస్టేబుల్ అకస్మాత్తుగా ఆపారు. ఈ దారిలో వద్దని, విజయవాడ మీదుగా వెళ్లాలని చెప్పారు. తాను రోజూ ఇదే మార్గంలో వెళ్తుంటానని, హైకోర్టు జడ్జీలకు అత్యవసరంగా ఫైళ్లు ఇవ్వాల్సి ఉందని లక్ష్మీనారాయణ సమాధానం ఇచ్చారు. దారి మళ్లించిన విషయం తెలియదన్నారు. ఈ సంవాదం జరుగుతుండగానే... మంగళగిరి గ్రామీణ సీఐ వై.శ్రీనివాసరావు వచ్చారు. రావడం రావడమే లక్ష్మీనారాయణను గట్టిగా చెంపదెబ్బ కొట్టారు. హైకోర్టు ఉద్యోగినని చెప్పినా వినిపించుకోలేదు. 'నువ్వేంటిరా.. డ్రైవర్ నా కొడుకువి.. నువ్వా నాకు చెప్పేది.. నేను సీఐను' అని దూషిస్తూ లక్ష్మీనారాయణ పొట్టలో గట్టిగా గుద్దారు. పదేపదే ఆయన చెంపపై కందిపోయేలా కొట్టారు.

అర్జంట్ అయితే జడ్జీలే ఫోన్ చేస్తారులే...

ఇద్దరు కానిస్టేబుళ్లను పిలిచి లక్ష్మీనారాయణతో పాటు హైకోర్టు వాహనాన్ని కూడా మంగళగిరి స్టేషన్‌కు తీసుకెళ్లమని, ర్యాష్ డ్రైవింగ్ కింద లక్ష్మీనారాయణపై కేసు పెట్టాలని సీఐ శ్రీనివాసరావు ఆదేశించారు. అయితే, ఫైళ్లను జడ్జీలకు అందజేయడం అత్యవసరమని లక్ష్మీనారాయణ వివరించినా పట్టించుకోలేదు. కేసుల తాలూకు ఫైళ్లు ఉన్నాయని చెప్పినా వినలేదు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు లక్ష్మీనారాయణ ప్రయత్నించగా ఓ కానిస్టేబుల్ ఆయన ఫోన్‌ను బలవంతంగా లాగేసుకున్నారు. స్టేషన్‌కు వెళ్లాక ఫోన్ ఏదని అడిగినా ఇవ్వలేదు. వ్యాన్‌లో అత్యవసరంగా అందజేయాల్సిన ఫైళ్లు ఉన్నాయని చెప్పగా, అంత అత్యవసరమైతే జడ్జీలే ఫోన్ చేస్తారులే అంటూ కానిస్టేబుళ్లు దురుసుగా మాట్లాడారు. లక్ష్మీనారాయణ అరగంట బతిమిలాడాక తన ఉన్నతాధికారి నంబరు రాసుకునేందుకు మాత్రం మొబైల్ ఇచ్చారు. నంబరు రాసుకుని... మరో వ్యక్తి ఫోన్ నుంచి జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం లక్ష్మీనారాయణను పంపించేశారు.

సంఘటితమైన జడ్జీల డ్రైవర్లు... కీలక వ్యక్తికి దృష్టికి

శుక్రవారం ఉదయం హైకోర్టులోని న్యాయమూర్తుల డ్రైవర్లు అందరూ కలిసి... తమ సహచరుడిపై పోలీసుల దాష్టీకాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో హైకోర్టులో 'కీలక' స్థానంలో ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి పోలీసుల దుందుడుకు చర్యలను వివరించారు. డ్యూటీలో ఉన్న ఉద్యోగి.. అందునా హైకోర్టు ఉద్యోగిని కొట్టడమే కాక న్యాయమూర్తుల కేసుల ఫైళ్లున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని హైకోర్టు వర్గాలు తీవ్రంగా పరిగణించాయి. తర్వాత లక్ష్మీనారాయణ గుంటూరు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా మంగళగిరి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ, నిందితుల జాబితాలో లక్ష్మీనారాయణపై దాడి చేసిన సీఐ శ్రీనివాసరావు పేరును చేర్చలేదు. కేవలం నిందితుల కాలమ్‌లో ''సీఐ'' అని రాసి సరిపెట్టారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని ఆయన విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు బీఎన్ఎస్ సెక్షన్ 132 కింద కేసు పెట్టారు. గాయమవుతుందని తెలిసినా గాయం చేయాలన్న ఉద్దేశంతో గాయపరిచారంటూ సెక్షన్ 115(2) కింద కూడా కేసు నమోదు చేశారు. కాగా, నిందితుల జాబితాలో సీఐ అని మాత్రమే రాయడంతో హైకోర్టులోని 'కీలక వ్యక్తి'... జిల్లా ఎస్పీని గట్టిగా నిలదీశారు. పోలీసులు విధి లేని పరిస్థితుల్లో నిందితుల జాబితాలో సీఐ శ్రీనివాసరావు పేరును చేర్చారు.

ఆగమేఘాలపై వచ్చిన జిల్లా ఎస్పీ

మంగళగిరి సీఐ శ్రీనివాసరావు ఏకంగా హైకోర్టు ఉద్యోగిని కొట్టడం, హైకోర్టు తీవ్రంగా స్పందించడంతో గుంటూరు ఎస్పీ శుక్రవారం ఉదయం ఆగమేఘాలపై హైకోర్టుకు వచ్చి ఉన్నతాధికారులను కలిశారు. మొత్తం ఘటనపై వివరణ ఇచ్చారు. తమ ఉద్యోగిపై చెయ్యి వేయడమంటే హైకోర్టుపై వేయడమేనని హైకోర్టు వర్గాలు ఎస్పీకి తేల్చిచెప్పాయి. డ్రైవర్ లక్ష్మీనారాయణ తప్పు చేసి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని, ఇందుకు ఎవరూ అభ్యంతరం చెప్పరని ఎస్పీకి స్పష్టం చేశాయి. సీఐ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తీవ్ర విషయమని తెలిపాయి. పైగా న్యాయమూర్తులకు అందజేయాల్సిన కేసుల ఫైళ్లను కూడా పోలీస్‌స్టేషన్‌లో ఉంచడంపై హైకోర్టు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది కోర్టు పాలనలో జోక్యం చేసుకోవడమేనని ఎస్పీతో వ్యాఖ్యానించాయి.

ఆయన 'ఛీ'ఐ...

మొత్తం ఘటన తీవ్రత తెలుసుకున్న ఎస్పీ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. డ్రైవర్ లక్ష్మీనారాయణను కొట్టిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుల జాబితాలో చేర్చారు. ఇప్పుడు సీఐపై ఎస్పీ ఏం చర్యలు తీసుకుంటారో చూడాలని హైకోర్టు వర్గాలు భావిస్తున్నాయి. కాగా, సీఐ శ్రీనివాసరావు మంగళగిరి నియోజకవర్గంలోనే అత్యంత వివాదాస్పద అధికారిగా ముద్రపడ్డారు. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే లోకేశ్ అండతో ఆయన రెచ్చిపోతున్నట్లు ప్రజలు చెబుతున్నారు.

సవీంద్ర కేసును హైకోర్టు సీబీఐకి అప్పగించడం హర్షణీయం

ఇది రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దంపడుతోంది

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్

సత్యమేవ జయతే హ్యాష్ ట్యాగ్‌తో 'ఎక్స్'లో పోస్టు



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా యాక్టివిస్ట్ కుంచాల సవీంద్రరెడ్డి(సౌంద రరెడ్డి) కేసును హైకోర్టు సుమోటోగా తీసుకుని సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేయడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఆందోళనకరమైన పరిస్థితులకు హైకోర్టు ఆదేశాలు అద్దంపడుతున్నాయని పేర్కొన్నారు. సరైన విచారణ, ప్రజల హక్కుల పరిరక్షణ అవసరాన్ని ఈ ఆదేశాల ద్వారా హైకోర్టు నొక్కి చెప్పిందని వివరిస్తూ 'సత్యమేవ జయతే' హ్యాష్ ట్యాగ్‌తో 'ఎక్స్'లో తన ఖాతాలో శనివారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే... ''సోషల్ మీడియా కార్యకర్త కుంచాల సవీంద్రరెడ్డి కేసును హైకోర్టు సుమోటోగా తీసుకుని సీబీఐకి అప్పగిస్తూ జారీ చేసిన ఆదేశాలను స్వాగతిస్తున్నాను. హైకోర్టు నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ఆందోళనకరమైన పరిస్థితులకు అద్దంపడుతోంది. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కింద పనిచేస్తున్న పోలీసులు అనేకసార్లు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను పట్టించుకోకుండా అక్రమ కేసులు బనాయిస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు. భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకుంటున్నారు. కల్పిత కేసులు, అక్రమ అరెస్టులు, సెక్షన్ 111 దుర్వినియోగం నిత్యకృత్యంగా మారాయి. సరైన దర్యాప్తు, ప్రజల హక్కుల పరిరక్షణ అవసరాన్ని హైకోర్టు ఆదేశాలు నొక్కి చెబుతున్నాయి''.

వైఎస్ జగన్ అందరినీ గౌరవించారు

▶ మొదటి పేజీ తరువాయి

తేల్చి చెప్పారు. చిరంజీవిని వైఎస్ జగన్ అవమానించారంటూ వ్యక్తిత్వ హననం చేస్తూ కొందరు దుష్ప్రచారం చేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభలో హిందూపురం ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను మీడియా ఆయన దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఆ వ్యాఖ్యలపై మెగాస్టార్ చిరంజీవి స్పందించిన తీరు నూటికి నూరుపాళ్లు సత్యమని చెప్పారు. కోవిడ్ కష్టకాలంలో సినిమా పరిశ్రమ ఏమవుతుందోనని ఆందోళన చెందిన నిర్మాతలు, దర్శకులు, హీరోలు.. చిరంజీవిని సినిమా పరిశ్రమ పెద్దగా భావించి, గౌరవించి సమస్యల పరిష్కారంపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చించాలని విజ్ఞప్తి చేశారన్నారు. ఆ మేరకు సినిమా పరిశ్రమ సమస్యలపై చర్చించడానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమవడానికి నిర్మాతలు, దర్శకులు, హీరోలతోపాటు తనకు కూడా ఫోన్ చేసి చిరంజీవి ఆహ్వానించారని.. అది ఆయన సంస్కారమని ప్రశంసించారు. చిరంజీవి నేతృత్వంలో వైఎస్ జగన్‌ను కలిసిన బృందంలో తాను కూడా ఉన్నానని గుర్తు చేస్తూ.. ఆ రోజు జరిగిన వాస్తవాలను.. నిజాలను చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు

ఆ రోజున చిరంజీవితోపాటు సినిమా పరిశ్రమ నుంచి వచ్చిన పెద్దలను వైఎస్ జగన్ సాదారంగా ఆహ్వానించి, గౌరవించారని.. ఇది సత్యం.. సత్యం అని ఆర్.నారాయణమూర్తి తేల్చి చెప్పారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి.. చిరంజీవి బృందం ఏది అడిగితే అది చేయాలని నాటి సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానిని ఆదేశించారని వివరించారు. సినిమా పరిశ్రమను కోవిడ్ సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి అప్పట్లో చిరంజీవి స్పందించిన తీరుకు సెల్యూట్ చేస్తున్నానని.. మరోసారి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొన్ని సమస్యలను పరిష్కరించిందని గుర్తు చేస్తూ.. ఇప్పటికీ కొన్ని సమస్యలు ఉన్నాయంటూ ఎత్తిచూపుతూ.. వాటిని చంద్రబాబు ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ సమస్యల పరిష్కారానికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపాలని కోరారు. చిరంజీవినే కాదు ఎవరినీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవమానించలేదని.. అందరినీ గౌరవించారని.. సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని స్పష్టం చేశారు. కానీ ఈ అంశంపై కొందరు పనిగట్టుకుని వక్రీకరించి వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు.

సాధారణ ప్రజలకు వినోదాన్ని దూరం చేయొద్దు

దేశంలో సాధారణ ప్రజలకు సినిమానే వినోదమని నారాయణ మూర్తి చెప్పారు. సాధారణ ప్రజలకు వినోదాన్ని దూరం చేసేలా సినిమా టికెట్ల ధరలను పెంచడం దారుణమన్నారు. సినిమా బడ్జెట్ పెరిగిందని.. టికెట్లు ధరలు పెంచకపోతే నష్టపోతామంటూ ప్రభుత్వాలకు నిర్మాతలు విజ్ఞప్తి చేస్తూ టికెట్ల ధరలు పెంచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో లవకుశ సినిమాను భారీ బడ్జెట్‌తో తీశారని.. నాడు టికెట్ల ధరలు పెంచాలని ఆ నిర్మాణ సంస్థ కోరలేదని చెప్పారు. అయినా ఆ సినిమా భారీ విజయం సాధించందని, నిర్మాతకు భారీగా లాభాలను తెచ్చిపెట్టిందని గుర్తు చేశారు. మెఘల్-ఏ-ఆజం, షోలే సినిమాలను భారీ బడ్జెట్‌తో నిర్మించారని.. ఆ సినిమాలు బాలీవుడ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచాయని.. నిర్మాతలకు భారీ ఎత్తున లాభాలు తెచ్చి పెట్టాయని చెప్పారు. అప్పట్లో ఆ సినిమాల టికెట్ల ధరలు పెంచుకోలేదని గుర్తు చేశారు. సినిమా బాగుంటే ప్రజలు చూస్తారని.. నిర్మాతలకు లాభాలు వస్తాయని.. టికెట్ ధరలు పెంచితే.. సాధారణ ప్రజలపై భారం పడుతుందన్నారు. దీనివల్ల సాధారణ ప్రజలు సినిమాకు దూరం అవుతున్నారని.. ఇదే సినిమాకు నష్టాలను తెచ్చిపెడుతోందని వివరించారు. సినిమా పరిశ్రమ వర్ధిల్లాలంటే టికెట్ల ధరలు పెంచకూడదని.. ప్రేక్షక దేవుళ్లను సినిమాకు దూరం చేయకూడదని.. ఈ దిశగా సినిమా నిర్మాతలు, రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆర్.నారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు.

పీపీపీ ప్రాజెక్టు అద్భుతం

- డీజీపీ జితేందర్ ప్రశంసలు
- చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో ప్రాజెక్టు ప్రారంభం



పీపీపీ ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ జితేందర్, జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా..

కుషాయిగూడ (హైదరాబాద్): సామాజిక స్పృహ, సమాజ భాగస్వామ్యంతో తెలంగాణ జైళ్లశాఖ శ్రీకారం చుట్టిన పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) కార్యక్రమం ఓ విశిష్టమైన రూపకల్పనని డీజీపీ డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసిన పీపీపీ ప్రాజెక్టును శనివారం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యామిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన యోగా కేంద్రం, అడ్వెంచర్ పార్కు, మినీ గోల్ఫ్ కోర్టు, ఫామ్ టూ ప్లేట్ ప్రాజెక్టులు అద్భుతమైన రూపకల్పన అన్నారు. పిల్లలకు వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటుగా వ్యవసాయ ప్రాముఖ్యతను తెలియజేయాలనే లక్ష్యం గొప్పదని ప్రశంసించారు.కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ జి.సుధీర్‌బాబు, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.రమేశ్, ఇంటెలిజెన్స్ ఐజీపీ కార్తికేయ, తఫ్సీర్ ఇక్బాల్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, రిటైర్డ్ ఐజీ నరసింహ, జైళ్లశాఖ ఐజీ మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీ స్టార్ అన్నది నిజమేనేమో..


- ప్రొఫెసర్ నాగేశ్వర్



సాక్షి, అమరావతి: అసెంబ్లీలో బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేసి కొన్ని గంటలు గడిచి పోయినప్పటికీ పవన్ కళ్యాణ్‌గానీ, జనసేన గానీ స్పందించకపోవడం ఏమిటని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పలు మీడియా ఛానళ్ల చర్చా వేదికల్లో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అన్న మీద చిన్న మాట కూడా పడనివ్వననే పవన్ ఇంత వరకూ స్పందించక పోవడం, పవన్ ప్యాకేజీ స్టార్ అని వైఎస్సార్‌సీపీ వారు చేస్తున్న ప్రచారం నిజమనేలా ఉందని అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు గానీ, తెలుగుదేశం పార్టీ గానీ, ఉప సభాపతి గానీ బాలకృష్ణను ఎందుకు వారించలేదని ఆయన ప్రశ్నించారు. కనీసం సభాపతి స్థానంలో ఉన్న రఘురామకృష్ణరాజైనా చిరంజీవి గురించి 'ఎవడు' అని బాలకృష్ణ సంబోధించినప్పుడు అడ్డుపడి, ఆ పదాన్ని రికార్డుల నుంచి తొలగిస్తామని చెప్పాలన్నారు. సభలో ఒక్కరైనా ఈ విషయాన్ని ప్రస్తావించాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. విచిత్రమేమిటంటే జనసేన సభ్యులైనా ఎందుకు అడగలేదో ఆశ్చర్యం వేస్తోందన్నారు. చిరంజీవిని అందరూ కలిసి ఒంటరి వాడిని చేస్తారా.. అని ఆయన ప్రశ్నించారు. అసలు సభలో లేని వ్యక్తుల గురించి మాట్లాడటం సబబు కాదని, సభా సంప్రదాయం కాదని సీఎం చంద్రబాబు గానీ, సభాపతి గానీ బాలకృష్ణకు చెప్పి ఉండాల్సిందని అన్నారు.

ఓజీ.. ఏ క్యా జీ!

- టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- పెంచిన ధరలకే రాష్ట్రంలో టికెట్ల అమ్మకాలు
- కోర్టు రిజిస్ట్రీ ఆదేశించినా పట్టించుకోని అధికారగణం



హైదరాబాద్‌లోని ఓ మాల్‌లో ఓజీ టికెట్ ధర



అదే మాల్‌లో మరో తాజా చిత్రం టికెట్ ధర



కరీంనగర్‌లోని ఓ మల్టీప్లెక్స్‌లో ఓజీ టికెట్ ధర.



అదే మల్టీప్లెక్స్‌లో మరో తాజా చిత్రం టికెట్ ధర..

సందే కదా.. ఓజీ సినిమాకి పోదామని అరవింద్ ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేద్దామనుకున్నాడు. తీరా చూసి నోరెళ్లబెట్టాడు. అంతకు రెండ్రోజుల క్రితమే ఓజీ సినిమా టికెట్ల ధరల పెంపును హైకోర్టు కొట్టేసిందని విన్న అతనికి ఆ ధరలు చూస్తే ఏమీ అర్థం కాలేదు. నిజంగానే హైకోర్టు తగ్గింపు ఉత్తర్వులిచ్చిందా? లేక థియేటర్లు అమలు చేయడం లేదా? అనే డైలమాలో పడ్డాడు.

సాక్షి, హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన ఓజీ టికెట్ల ధరల పెంపుతోపాటు ప్రత్యేక షోలకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన మెమోను హైకోర్టు శుక్రవారం కొట్టివేసినా, పెంచిన ధరలకే టికెట్లు అమ్ముతున్నారు. శనివారం టికెట్ల బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నిస్తే పెంచిన ధరలే కనిపించాయని పలువురు వాపోయారు. హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లోని థియేటర్లలో ఈ వ్యత్యాసం కనిపించిందని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఓజీ సినిమా టికెట్ ధరలు పెంచుతూ, ప్రత్యేక షోలకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం మెమో జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది బర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. టికెట్ ధరల పెంపు మెమోను నిలిపివేశారు. తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా వేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ హైకోర్టులో అప్పీల్ చేయగా, విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. 26న విచారణ చేపట్టాలని సింగిల్ జడ్జిని కోరింది. 'ఓజీ'చిత్రానికి ఎలాంటి ఉపశమన ఆదేశాలు జారీ చేయలేమని శుక్రవారం విచారణ సందర్భంగా సింగిల్ జడ్జి స్పష్టం చేశారు. ఈ నెల 24 ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ.. అక్టోబర్ 9కి విచారణ వాయిదా వేశారు. అయినా పెంచిన ధరలనే థియేటర్లు వసూలు చేస్తున్నాయి. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తాం..



ఓజీ చిత్ర టికెట్ ధరల పెంపు మెమోను ప్రభుత్వం నిలిపివేసినా సోషల్ మీడియాలో తీర్పునకు వక్రభాష్యం చెబుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా టికెట్ ధరలను తగ్గించడం లేదు. తప్పుడు సందేశాలు, పెంచిన టికెట్ ధరలు వసూలు చేయడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తాం.

– బర్ల మల్లేశ్, న్యాయవాది

మౌనం వీడలేదు.. నోరు పెగల్లేదు

సైలెన్స్.. గంభీరా!

చిరంజీవిని పూచికపుల్లలా తీసివేస్తూ బాలకృష్ణ తూలనాడినా పవన్ మౌనవ్రతమే

రగిలిపోతున్న చిరంజీవి అభిమానులు, కాపు సామాజిక వర్గం



సాక్షి, అమరావతి: చిరంజీవిని పూచికపుల్లలా తీసివేస్తూ అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై అధికారంలో ఉండి కూడా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించకపోవడంపై మెగాస్టార్ అభిమానులు, కాపు సామాజిక వర్గం రగిలిపోతోంది! ఓ వైపు బాలకృష్ణపై మండిపడుతూనే.. పవన్‌కళ్యాణ్ సైతం తన సొంత సోదరుడిని దారుణంగా అవమానించి 48 గంటలు గడిచిపోయినా నోరు విప్పకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎక్కడో విదేశాల్లో ఉన్న చిరంజీవే స్వయంగా స్పందించి బాలయ్య వ్యాఖ్యలను ఖండించినా పవన్ మాత్రం కిమ్మనకపోవడం ఏమిటని తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వైరల్ జ్వరంతో బాధపడుతూ కూడా గురువారం నిర్వహించిన డీఎస్సీ సభకు సంబంధించి మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తూ ప్రకటన జారీ చేసిన పవన్‌కళ్యాణ్... బాలయ్య వ్యాఖ్యలపై పూర్తి మౌనం పాటించడాన్ని తప్పుబడుతున్నాయి.

ఆ విష ప్రచారాన్ని ఖండించిన 'చిరు'..

చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు గత ప్రభుత్వ హయాంలో చిరంజీవి సహా పలువురు సినీ ప్రముఖులు అప్పటి సీఎం వైఎస్ జగన్‌ను కలిసినప్పుడు సాదరంగా ఆహ్వానించి గౌరవిస్తే.. ఎన్నికల ముందు కూటమి నేతలు పవన్‌తో జతకట్టి దుష్ప్రచారం చేయటాన్ని పరిశీలకులు ప్రస్తావిస్తున్నారు. ఈ విష ప్రచారాన్ని తాజాగా స్వయంగా చిరంజీవే ఖండించటాన్ని గుర్తు చేస్తున్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలను చిరంజీవి విదేశాల్లో ఉండి కూడా తీవ్రంగా తప్పుబడుతూ ప్రకటన చేశారని పేర్కొంటున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు తనను సాదరంగా భోజనానికి ఆహ్వానించి గౌరవించారని, అనంతరం కొద్దిరోజులకు సినీ ప్రముఖులతో కలిసి మరోసారి వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి తామంతా చర్చించామని చిరంజీవి అందులో స్పష్టం చేశారు. ఆ సమావేశం కారణంగానే నాడు వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య సినిమా టిక్కెట్ రేట్లు పెరిగాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మెగాస్టారే స్వయంగా విడుదల చేసిన ప్రకటన ద్వారా ఎన్నికల ముందు పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, టీడీపీ నేతలు వైస్ జగన్‌పై చేసిన దుష్ప్రచారంలో నిజం లేదని తేటతెల్లమైందని చిరంజీవి అభిమానులు చర్చించుకుంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నాడు చంద్రబాబు అంత దుష్ప్రచారం చేయగా.. ఇప్పుడు బాలకృష్ణ నేరుగానే చిరంజీవిని కించపరిచినా పవన్‌కళ్యాణ్ కనీసం ఖండించకపోవడాన్ని చిరంజీవి అభిమాన సంఘాలు, కాపు సామాజిక సంఘాల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

రాజకీయాల కోసం కుటుంబ గౌరవం తాకట్టా?


గతంలో తన తల్లిని అవమానించేలా నారా లోకేష్ పోస్టులు పెట్టించారని స్వయంగా విమర్శలు చేసిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు అదే కుటుంబానికి దాసోహమవడం కారణంగా మెగాస్టార్ కుటుంబం ఇలాంటి అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని చిరంజీవి అభిమానులు, కాపు సంఘాల నేతలు చర్చించుకుంటున్నారు. పవన్‌కళ్యాణ్ తీరు చూస్తుంటే కుటుంబం, జనసేన ప్రయోజనాల కన్నా చంద్రబాబు, లోకేష్ రాజకీయ లబ్ధి కోసం ఆరాటపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాలకృష్ణ అంత తీవ్ర వాఖ్యలు చేసినా చంద్రబాబుకు భయపడో లేదంటే తన రాజకీయ భవిష్యత్తుకు దెబ్బ అనే భయంతోనే పవన్ ఖండించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి కేసులో గతంలో చంద్రబాబు అరెస్టు అయినప్పుడు పవన్‌కళ్యాణ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా విజయవాడ వస్తూ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారని.. రాజమహేంద్రవరం జైలు ఎదుట సంఘీభావం ప్రకటించారని.. అవేమీ బాలకృష్ణకు గుర్తు లేవా? అని చిరంజీవి అభిమానులు, కాపు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. చిరంజీవినుద్దేశించి బాలకృష్ణ ఆ వ్యాఖ్యలు చేసే సమయంలో సభలో జనసేన ఎమ్మెల్యేలు ఉండి కూడా అభ్యంతరం చెప్పకపోవడాన్ని చిరంజీవి అభిమానులు, కాపు సంఘం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో చిరంజీవినుద్దేశించి బాలకృష్ణ 'మా బ్లడ్ వేరు.. మా బ్రీడ్ వేరు' అని వ్యాఖ్యలు చేసినప్పుడు స్పందించిన నాగబాబు.. ఇప్పుడు ఎమ్మెల్సీ అయ్యాక తాజాగా చిరంజీవినుద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై స్పందించకపోవడాన్ని తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ఎమ్మెల్సీ పొందినంత మాత్రన ప్రస్తుతం నాగబాబు ఇంతలా దిగజారాలా అనే వ్యాఖ్యలు చిరంజీవి అభిమానుల నుంచి వినిపిస్తున్నాయి.

చిరంజీవి ఏంది..? మా బ్లడ్ వేరు..!!

బాలకృష్ణ గతంలోనూ పలు సందర్భాల్లో చిరంజీవిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు దీనిపై పలు పోస్టులు పెడుతున్నారు. గతంలో చిరంజీవి రాజకీయాల్లోకి రావడంపై బాలకృష్ణ ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ.. 'రాజకీయాల్లో విజయం సాధించడం ఒక్క రామారావు వల్లే అయింది. చిరంజీవి ఏంది...? మేం వేరు... మా బ్లడ్ వేరు... మా బ్రీడ్ వేరు... సస్టైయిన్‌బులిటీ ఉంది మాకు..!' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరో సందర్భంలో 'సంకరజాతి..' 'అలగా జనం..' అంటూ బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా చర్చ జరుగుతోంది. ఇవన్నీ చిరంజీవి కుటుంబాన్ని ఉద్దేశించినవేనని బాలకృష్ణపై మండిపడుతున్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఆత్మగా నిలిచారు

మంత్రి డి.శ్రీధర్‌బాబు



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

మన్సూరాబాద్ (హైదరాబాద్): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం ఎవరు ఉద్యమం చేపట్టినా మద్దతుగా నిలిచి ఉద్యమానికి ఆత్మగా ఉన్న మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత ఆధ్వర్యంలో.. కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహాన్ని ఎల్బీనగర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంతో క్విట్ ఇండియా, గైర్ ముల్కీ ఉద్యమాలతో పాటు నిజాం ప్రభుత్వంపై పోరాటం, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో తన జీవిత కాలం పోరాటాలు చేసిన వ్యక్తి లక్ష్మణ్ బాపూజీయని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం తన జీవితాన్ని, ఇంటిని త్యాగం చేసిన మహనీయుడు లక్ష్మణ్ బాపూజీయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయనతో కలిసి పనిచేశానని పేర్కొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 28-9-2025

DON'T MISS A BEAT రేపు వరల్డ్ హార్ట్ డే

గుండెకు అండగా ఉందాం

ఈ ఏడాది 'వరల్డ్ హార్ట్ డే' థీమ్ 'ఒక్క స్పందననూ మిస్ కాకండి' (డోంట్ మిస్ ఏ బీట్) అని. అంటే... గుండెను రక్షించుకోవడంలో ఏ అవకాశాన్నీ వదులుకోవద్దనీ, గుండె ఇచ్చే వార్నింగ్ సిగ్నల్స్‌గానీ లేదా అదే చేసే హెచ్చరికలుగానీ ఏవీ మిస్ కాకుండా చూసుకోవాలనే సందేశాన్ని ఈ థీమ్ ఇస్తోంది. ఈ నేపథ్యంలో గుండె సంరక్షణ కోసం సీనియర్ కార్డియాలజిస్టులు... పాఠకులతో పంచుకుంటున్న అత్యంత కీలకమైన విషయాలివి.

భారతదేశంలో గుండెజబ్బుల విస్తృతి కాస్తంత బెంబేలెత్తించేలాగే ఉంది. గతంలో అంటురోగాల శకం ముగిసి, ఇప్పుడు జీవనశైలితో వస్తున్న 'నాన్ కమ్యూనికబుల్ జబ్బులు' విస్తరిస్తున్న శకంలో... అన్ని జబ్బులతో పోలిస్తే గుండెజబ్బుల వాటా తక్కువేమీ కాదు. పైగా అన్ని నదులూ పరుగెత్తేది సముద్రం వైపే అన్నట్టుగా... అన్ని జబ్బులూ నడిచేది గుండెజబ్బుల వైపే. ఉదాహరణకు అది డయాబెటిస్‌గానీ, హైబీపీగానీ, స్థూలకాయం, మెటబాలిక్ సిండ్రోమ్స్ ఇవన్నీ పెరుగుతూ పెరుగుతూ చివర్న గుండెజబ్బుల దిశగా పయనిస్తున్నాయి. ఇక్కడ పేర్కొన్న ప్రతి జబ్బూ అది హార్ట్ ఎటాక్‌గానో, బ్రెయిన్ స్ట్రోక్‌గానో పరిణమించేదే అనడంలో సందేహం లేదు.

■ హృద్రోగం వృద్ధాప్య రోగం కాదు...

గతంలో గుండెజబ్బులనేవి కాస్తంత వయసు పెరిగాకే కనిపించేవి. ఇప్పుడు అవి కూడా చాలా త్వరితంగా వచ్చేస్తున్నాయి. ప్రత్యేకించి యువతలో సైతం కనిపిస్తున్నాయి. అందుకే చాలా సందర్భాల్లో వీటిని నిశ్శబ్ద ఉత్పాతాలు (సైలెంట్ ఎపిడెమిక్స్) అని కూడా నిపుణులు పేర్కొంటున్నారు.

■ ఆ తెలుగు వాడుక మాట అక్షరాలా నిజం...

మన తెలుగు వాడుక మాటల్లో 'గుండెల్ని పిండేసేలాగా...' అన్నది ఓ జాతీయం. ఒత్తిడి విషయంలో ఆ నుడికారం అక్షరసత్యం. ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ అది 'గుండెలను పిండేస్తుంది'!

మానసిక ఒత్తిడి అనేది ఓ భావోద్వేగపూరితమైన ఎమోషన్‌గా చెప్పడం సరికాదు. ఆ భావోద్వేగం కాస్తా తన భౌతిక లక్షణాలతో గుండెజబ్బుగానో, గుండెపోటుగానో కనిపించడం చాలా సాధారణం. ఎందుకంటే... మానసిక ఒత్తిడి పెరగగానే... రక్తనాళాల్లో రక్తపోటూ పెరుగుతుంది. రక్తపోటు కాస్తా గుండెపోటుగా పరిణమించడం మనకు తెలిసిన విషయమే. మనం సంప్రదాయంగా పాటించే కొన్ని అంశాల్లో దీనికి విరుగుడు దాగుంది. అవే... యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు. వీటి సాయంతో మన నరాలను హాయిపరచడం మొదలుపెట్టగానే... రక్తనాళాల్లో పోటెత్తే రక్తప్రవాహాన్నీ అది జోకొడుతుంది. దాంతో బీపీ తన నార్మల్ ఒత్తిడికి వచ్చేస్తుంది. ఫలితంగా గుండెజబ్బుల ముప్పూ తప్పుతుంది. అందుకే ఇప్పుడు డాక్టర్లు కూడా మందులతో పాటు... ఈ మార్గాలూ ప్రిస్క్రిప్షన్‌లో సూచిస్తున్నారు.

■ డాన్సులూ డేంజరస్‌గా మారిన దేస్ ఇవి!

ఇప్పుడు న్యూస్ ఫాలో అవుతున్నవారికి తెలియని విషయాలేమీ కావివి. అవేమిటంటే... మంచి వయసులో ఉన్న యువత కూడా డాన్స్ చేస్తూనో, క్రికెట్ ఆడుతూ ఆడుతూనో, జిమ్‌లో వ్యాయమం చేస్తూనో యువతీ యువకులు కుప్పకూలిపోతున్నారు. దీన్ని నివారించదగిన అంశాలూ ఉన్నాయి. ఉదాహరణకు ఎక్కువ శక్తిని ఒకేసారి ఇచ్చే హై-ఎనర్జీ డ్రింకులూ, వ్యాయామంతోపాటు స్టెరాయిడ్స్ తీసుకుంటున్న ఉదంతాలూ, ఒకే చోట కూర్చుని చేసే వృత్తివ్యాపకాలూ, చురుగ్గా కదలడానికి అంతగా ఇష్టపడని జీవనశైలీ... ఇవన్నీ ఇలా ఆకస్మికంగా గుప్పెడంత గుండెను కుప్పకూల్చే ముప్పును పెంచుతున్నాయి. వీటి నివారణ చాలా సింపుల్. క్రమం తప్పకుండా చేసుకునే కొన్ని సాధారణ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలతో పెద్ద పెద్ద గుండె ముప్పులనూ నివారించుకోవచ్చు. అలా నిబ్బరంగా, నిశ్చింతగా ఉండవచ్చు.



డా. ఎంఎస్ఎస్ ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

■ నివారణ చాలా సింపుల్... అదే టైమ్‌లో బోలెడంత పవర్‌ఫుల్...

నిజానికి గుండెజబ్బుల నివారణ చాలా చాలా సింపుల్. మనం సంకల్పంతో నిలిపేయగలిగే పొగతాగే అలవాటు, మద్యం అలవాట్లనుంచి దూరంగా ఉంటే చాలు. అదే సమయంలో అన్నంలో తగినన్ని ఆకుకూరలూ, కాయగూరలతో పాటు తాజా పండ్లు తీసుకోవడం వంటి మంచి రుచికరమైన మార్గంలో వెళ్లడం ద్వారా గుండెజబ్బుల్ని సమర్థంగా నివారించవచ్చు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవడం, బరువు ఆరోగ్యకరమైన లిమిట్‌లోనే ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమైనవి. ఇక్కడ కాస్తంత కష్టమైనదైనా కన్సిస్టెంట్‌గా అంటే క్రమం తప్పకుండా పై అలవాట్లను కొనసాగించడంతో గుండె ఆరోగ్యాన్ని పదికాలాలపాటు పదిలంగా పదిలపరచవచ్చు.

■ గాలినీ, కలుషితాలనూ తేలిగ్గా తీసుకోకండి...

మనం పీల్చే గాలి శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమే. అంటే... వాహనాల పొగతో లేదా కాలుష్యంతో కూడిన గాలిని పీల్చుకోవడాన్ని వీలైనంతగా తప్పించుకోవాలి. వాటిలో ఉండే కాలుష్యపదార్థాలు, ధూళిదూసరాలూ రక్తనాళాల్లో రక్తప్రవాహాన్ని వేగవంతం చేస్తాయి. అలా గుండెజబ్బులూ వేగంగా వచ్చేలా చేస్తాయి. కాలుష్యం పెరిగిన కొద్దీ రక్తం తాలూకు ఎరుపు రంగు డేంజర్ మార్క్‌లా కనిపిస్తుంది. అదే వీలైనంతగా పచ్చటి పరిసరాల్లోనే ఉండటం ప్రారంభిస్తే గుండె ఆరోగ్యమూ పదికాలాలు పచ్చగా ఉంటుంది.

■ మహిళల గుండెలకు మరింత ముప్పు...

మహిళలు కుటుంబ ఆరోగ్యానికి ప్రాథమ్యం ఇచ్చి, చాలావరకు తమ ఆరోగ్యానికి రెండో ప్రాధాన్యమిస్తారు. వారు తమలో కలిగే అలసటను ఇంటి పనులతో వచ్చిన నీరసంగా అనుకుంటారు. తమ అజీర్ణ సమస్యను గ్యాస్ సమస్యగా భావిస్తారు. తమ గుండెనొప్పిని ఛాతీనొప్పిగానే తీసుకుంటారు. ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగున్నట్టుగా వాళ్ల గుండె బాగుంటేనే మిగతా ఇంటి సభ్యుల గుండె సంస్పందనలూ బాగుంటాయి. 'డోంట్ మిస్ ద బీట్' అనే థీమ్‌ను తమకు అనువుగా ఆలోచిస్తే.. మహిళలకే అది ఎక్కువగా అనువర్తిస్తుంది.

■ అనుక్షణం... రక్షణకు అనువైన క్షణమే...


ఆకస్మిక గుండె జబ్బు ముప్పు నుంచి కాపాడాలంటే అనుక్షణం అనువైన క్షణమే. అందుకే గుండెజబ్బు లక్షణాలు కనిపించినప్పుడు దాన్నుంచి రక్షించాలంటే ప్రతి ఒక్కరూ కార్డియాక్ పల్మనరీ రిససియేషన్ అనే సీపీఆర్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఎవరైనా గుండె పట్టుకుని కుప్పకూలిపోతే ఒకచేతి వేళలో మరో చేతి వేళ్లు దూర్చి క్షణం కూడా ఆలస్యం చేయకుండా గుండెపై క్రమబద్ధంగా, లయబద్ధంగా, నేర్పుగా కదిలిస్తూ 'సీపీఆర్' నిర్వహించే నైపుణ్యాలను నేర్చుకోవాలి. అది ఇల్లూ, వాకిలీ, పనిప్రదేశం ఇలా ఎక్కడైనా, ఎవరైనా అభ్యసించగల సింపుల్‌గా చేయగలిగే ఈ ప్రాణరక్షణ నైపుణ్యం చేతుల్లో దాగి ఉండే అభయహస్తాలవుతాయవి.

■ చివరగా...

మనం పుట్టిన నాటి నుంచీ క్షణం కూడా ఆగకుండా... ఒక్క బీట్ కూడా మిస్ కాకుండా ఒక జీవిత కాలం పాటు సంస్పదిస్తూ ఉండే ఆ గుండెను గౌరవిస్తూ... దాన్ని మాటువేసి కాటు వేసే అన్ని రకాల అవాంతరాల నుంచి కాపాడుకోడానికి బిక్కు బిక్కుమని భయపడకుండా ఉండటానికి గడియారంలో టిక్కు టిక్కుమనే ఏ బీట్‌నూ మిస్ కాకుడదంటూ లబ్‌డబ్ మంటూ స్పందించే 'హార్ట్ డే' థీమ్‌కు భాష్యం చెప్పుకోవాలి.

హెల్త్

నిర్వహణ: యాసీన్



● యంగ్ ఇండియా! బీ(ట్) కేర్‌ఫుల్

లబ్... డబ్... లయ తప్పొద్దు!

ప్రపంచవ్యాప్తంగా గుండెజబ్బులు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అందునా ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ తన విశృంఖల ప్రతాపం చూపాక గుండెజబ్బుల కేసులు మరింత ఎక్కువయ్యాయి. అందుకే ప్రతి ఏడాదీ సెప్టెంబరు 29న నిర్వహించే వరల్డ్ హార్ట్ డే తాలూకు థీమ్ ఏమిటంటే... "ఒక్క స్పందననూ మిస్ కావద్దు" (డోంట్ మిస్ ఏ బీట్). దీని అర్థం ఏమిటంటే... ఒక్క గుండె కూడా తన స్పందనలను కోల్పోయే పరిస్థితి రాకూడదనే. గతంలో కనీసం 50, 40లలో కనిపించే ఈ గుండెజబ్బులు ఇప్పుడు ఎందుకిలా యుక్తవయసులోనే వచ్చేస్తున్నాయో చెప్పే కారణాలూ, వాటిని నివారిస్తూ మన యువతను గుండెజబ్బుల నుంచి రక్షించుకునేందుకు తగిన అవగాహనను కల్పించేందుకే ఈ కథనం.

గుండెజబ్బుల తీవ్రతనూ, విస్తృతినీ తెలిపే కొన్ని గణాంకాలను చూద్దాం. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌లలోని కొన్ని పెద్ద హాస్పిటల్స్ తాలూకు ఎమర్జెన్సీ కేసులను పరిశీలిస్తే సగానికి పైగా కేసులు... అంటే 50% కేసుల్లో బాధితులు కేవలం 40 ఏళ్లలోపు వాళ్లే. మానసిక ఒత్తిడి, ఎటూ కదలకుండా (శారీరక శ్రమ లేకుండా) ఉండే వృత్తులూ పెరగడంతో గుండె జబ్బులతో బాధపడే యువత కూడా పెరుగుతోంది. అందుకే ఇటీవల కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ 45 ఏళ్ల లోపే అక్యూట్ కరోనరీ సిండ్రోమ్‌తో బాధపడేవారిపై పరిశోధనల కోసం ఓ అధ్యయన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటీవలి పరిశీలనల ప్రకారం ప్రతి ఐదు గుండెపోటు కేసులను పరిశీలిస్తే అందులో ఒకరు తప్పనిసరిగా 40 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. గుండెజబ్బుల పరంగా ప్రపంచవ్యాప్తంగా 20 - 30 ఏళ్ల యువతలో ఏడాదికి 2% పెరుగుదల ఉండగా... మన దేశంలో సైతం గుండెజబ్బులకు లోనైన వాళ్లలో 40 ఏళ్ల లోపు వారు కనీసం 25% వరకు ఉండటం మరింతగా బెంబేలెత్తిస్తున్న అంశం. హైబీపీ, హైకొలెస్ట్రాల్ వంటివి యువతలో పెరుగుతుండటమే దీనికి కారణం. దాంతో క్రమంగా, నిశ్శబ్దంగా చాపకింద నీరులా గుండెజబ్బుల కేసులు భారత్‌లోనూ పెరుగుతున్నాయి.

లక్షణాలు... సాధారణంగా చాలామందిలో ఛాతీనొప్పితో గుండెపోటు కనిపిస్తుంది. ఈ లక్షణం కనిపించే వారు 97.3 శాతం మంది, చెమటలు పట్టడం 11 శాతం మందిలో, వాంతులు లేదా వికారం 8.2 శాతం కేసుల్లో, శ్వాస ఆడకపోవడం 6.8 శాతం మందిలో కనిపిస్తాయి. ఈ వయసులో చాలా మందిలో వచ్చే గుండెపోటుకు కారణమైన నొప్పిని గ్యాస్, అజీర్ణం, అసిడిటీ కారణంగా భావిస్తుంటారు. ఈ అంశం కూడా చికిత్స ప్రారంభించడాన్ని ఆలస్యం చేస్తోంది.

నివారణ ఇలా... కార్డియో వాస్క్యులార్ హెల్త్ స్కోరుకు దగ్గరగా ఉండే జీవనశైలి: సాధారణంగా పాశ్చాత్యదేశాల్లో... మరీ ముఖ్యంగా అమెరికా వంటి చోట్ల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిర్దేశించిన కొన్ని జీవనశైలి మార్గదర్శకాలు ఉన్నాయి. వాటినే 'లైఫ్ ఎసెన్షియల్స్ 8 (ఎల్ఈ 8); లైఫ్ ఎసెన్షియల్స్ 7 (ఎల్ఈ 7)గా వ్యవహరిస్తుంటారు. అంటే... ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా అనుసరించే మార్గదర్శకాలైన... రక్తపోటును (హైబీపీని) అదుపులో ఉంచుకోవడం; రక్తంలో చక్కెరమోతాదులనూ, కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం; ఆరోగ్యకరమైన ఆహారాన్ని, పోషకాహారాన్ని తీసుకోవడం; తగినంత వ్యాయామం చేయడం; ఎత్తుకు తగినంత బరువు ఉండేలా బాడీ మాస్ ఇండెక్స్- (బీఎమ్ఐ)ను మెయింటెయిన్ చేయడం; స్మోకింగ్ / నికోటిన్‌కు దూరంగా ఉండటం; కంటినిండా నిద్రపోవడం... అలాంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా ఈ లైఫ్ ఎసెన్షియల్ స్కోరును ఎంతగా పెంచుకుంటే గుండెజబ్బులను అంతగా నివారించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ● **అర్లీ వార్నింగ్ సిగ్నల్స్ ద్వారా :** చాలామందిలో గుండెజబ్బులుగానీ లేదా గుండెపోటుగానీ ఆకస్మికంగా రాకముందే కొన్ని వార్నింగ్ సిగ్నల్స్ పంపుతాయి. ఉదాహరణకు ఛాతీలో ఇబ్బందిగా ఉండటం, తీవ్రమైన నీరసం, నిస్సత్తువ, అలసట, గుండెదడ (పాల్పిటేషన్) వంటివి. వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో గుర్తించి డాక్టర్లను సంప్రదించడం వల్ల. ● **స్క్రీనింగ్ పరీక్షలతో :** హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, మధుమేహంతో బాధపడేవారు తగిన పరీక్షలు చేయించుకోవడం, ఏవైనా లక్షణాలు కనిపిస్తే కరోనరీ సీటీ యాంజియోగ్రామ్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండెజబ్బులు నివారించవచ్చు.



డాక్టర్ అంజని ద్వారంపూడి
సీనియర్ కార్డియాలజిస్ట్

గుండె జబ్బుల పెరుగుదలకు కారణాలు...

● **వయసు పెరుగుతుండటం:** ఇది నివారించలేని అంశం. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు గట్టిబారుతుంటాయి. దీన్నే అథెరోస్క్లిరోసిస్ అంటారు. గతంలో సాధారణంగా 40 ఏళ్లకు పైబడ్డాక ఈ పరిణామం సంభవిస్తుండేది. ఇప్పుడు ఈ వయసు కంటే ముందే.. అంటే 20 నుంచి 30 ఏళ్లలోపే ఇలా రక్తనాళాలు గట్టిబారడం కనిపిస్తోంది. కొందరిలో కొలెస్ట్రాల్ నిల్వలు చాలా నెమ్మదిగా రక్తనాళాల్లోకి చేరుతుంటాయి. కానీ కొందరిలో చాలా వేగంగా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఇలా పేరుకునే కొవ్వును 'ప్లాక్'గా వ్యవహరిస్తుంటారు. ఈ ప్లాక్ రక్తనాళాల్లోకి ఎక్కువగా చేరడం వల్ల ధమనులు/రక్తనాళాలు సన్నబడి, గుండె కండరాలకు రక్తప్రసరణ తగ్గిపోతుంది. ఈ ప్లాక్ ఎక్కువగా చీలిపోయి క్లాట్స్ (అడ్డంకులు)గా మారి ఆకస్మికంగా గుండెకు రక్తసరఫరా తగ్గవచ్చు. ఫలితంగా గుండెపోటు రావచ్చు.

● **ఆహారపు అలవాట్లు:** హైలీ ప్రాసెస్‌డ్ ఫుడ్ తీసుకోవడం వంటి మారుతున్న ఆహారపు అలవాట్లు, ఉప్పు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు చిన్న వయసులోనే గుండెజబ్బులు / గుండెపోటుకు దారితీసే ముప్పును పెంచుతున్నాయి. మన దేశంలో దిగువ, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఉండే దేశాల్లో పెరుగుతున్న పట్టణీకరణ / నగరీకరణ కారణంగా అన్ని పోషకాలు ఉండే మంచి ఆహారంతో పోలిస్తే అధిక క్యాలరీలు ఉండే ఆహారం చవగ్గా దొరుకుతుండటంతో గుండెజబ్బుల ముప్పు పెరుగుతోంది.

● **తగినంత వ్యాయామం లేకపోవడం :** కుదురుగా కూర్చుని చేసే వృత్తులు పెరగడం ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అంశమే అయినప్పటికీ... మన దేశ యువతలో కూడా వ్యాయామం లేకపోవడమూ, పైగా మన దేశ సాంస్కృతిక, సామాజిక నేపథ్యం కారణంగా మహిళలు, అమ్మాయిల్లో వ్యాయామ సంస్కృతి తక్కువగా ఉండటం కూడా గుండెజబ్బులు / గుండెపోటు ముప్పునకు కారణమవుతోంది.

● **పొగతాగడం :** ఇటీవల భారత్, రష్యా, కొన్ని మధ్య ఆసియా దేశాల్లో పొగాకు వినియోగం బాగా పెరుగుతుండటం అథెరోస్క్లిరోసిస్‌కూ, గుండెపోటుకు మరో ప్రధాన కారణం. 60 ఏళ్ల వ్యక్తులతో పోలిస్తే 40 ఏళ్లలోపు వారికి పొగ దుష్ప్రభావం మరింత ఎక్కువ. అయితే ఏ వయసులోనైనా పొగతాగడం అంతే ప్రమాదకరం అని గుర్తించాలి.

● **స్థూలకాయం కారణంగా :** మన దేశవాసుల్లో ఊబకాయం ఎక్కువగా పొట్ట దగ్గర వస్తుంది. దీన్నే అబ్డామినల్ ఒబేసిటీ అంటారు. మన జీవనశైలి (లైఫ్ స్టైల్) కారణంగా ఇలా స్థూలకాయం రావడం, పొట్ట దగ్గర కొవ్వు పెరగడం కూడా గుండెజబ్బుల ముప్పును మరింత పెరిగేలా చేస్తోంది.

● **హైబీపీ, డయాబెటిస్ :** లైఫ్‌స్టైల్ జబ్బులైన హైబీపీ, డయాబెటిస్ వంటి అనారోగ్యాల విషయంలో అవగాహన అంతగా లేని మన లాంటి దేశాలలో నియంత్రణలో లేని హైబీపీ, మధుమేహం వంటివి గుండెపోటుకు కారణమవుతున్నాయి.

● **జెండర్ అంశం :** ఒక వయసు వరకు మహిళలతో పోలిస్తే గుండెపోటు వచ్చే అవకాశాలు పురుషుల్లో ఎక్కువ. రుతుస్రావం ఆగిపోయే వరకు మహిళల్లోని ఈస్ట్రోజెన్ వారికి ఒక రక్షణ కవచంగా ఉంటుంది. అయితే రుతుక్రమం ఆగాక మహిళలతో పాటు... ఏ జెండర్ వారికైనా గుండెపోటు అవకాశాలు సమానం.

● **సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు:** పై అంశాలకు తోడుగా ఒక సమాజంలోని విద్య, ఆదాయ వనరులు, ఆరోగ్య సంరక్షణకు గల అవకాశాలు, సాంస్కృతిక నేపథ్యాల వంటి అంశాలు కూడా గుండెజబ్బుల కేసులను ప్రభావితం చేస్తుంటాయి.

● **ఫ్యామిలీ హిస్టరీ :** మిగతావారితో పోలిస్తే గుండెజబ్బులు / గుండెపోటు లాంటివి వచ్చిన వారి కుటుంబాల తాలూకు కుటుంబ ఆరోగ్య చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) కూడా గుండెజబ్బుల ముప్పునకు ఒక ప్రధాన కారణం. మిగతావాళ్లతో పోలిస్తే దాదాపు 25 శాతం మంది రోగుల్లో గుండెపోటుకు ఈ ఫ్యామిలీ హిస్టరీనే కీలకాంశమవుతుంది.

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసిచూడు.. అని సామెత. రెండూ జటిలమైనవేనని అర్థం. ఇంటి కోసం అప్పు చేసినా తప్పు లేదు. అదొక నీడగా మిగులుతుంది. కానీ పెళ్లి? కంపాటబులిటీ కుదిరితే కుటుంబంగా స్థిరపడుతుంది. లేదంటే చేదుజ్ఞాపకంగా వెంటాడుతుంది. అయినా అంతా బాగుంటుందనే ఆశతో ఏడడుగుల ప్రయాణానికి సిద్ధపడినా.. దానికోసం లక్షలకు లక్షలు అప్పు చేయాల్సిన అవసరం ఉందా అని! ఇప్పుడు పెళ్లి ఖర్చును వధూవరులిద్దరే పెట్టుకుంటున్నారు. అది వాళ్లిద్దరి జీవితాలకు తీరని రుణంగా పరిణమించి.. ఈఎమ్ఐల రూపంలో జీతాలనే మింగేస్తోంది. దాని గురించే ఈ కథనం..



● మూడు ముళ్లు... ఆరు వాయిదాలు

E - ఈక్వల్ M - మ్యారేజ్ I - ఇన్‌స్టాల్‌మెంట్

సాత్విక్‌ది మార్కెటింగ్ జాబ్, మానస ఒక కార్పొరేట్ కంపెనీలో లీడ్ రోల్‌లో ఉంది. వీళ్లది పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా, డెస్టినేషన్ వెడ్డింగ్. దాదాపు 80 లక్షల రూపాయలకు పైనే ఖర్చయింది. ఆ భారం ఇరువైపుల తల్లిదండ్రుల మీద పడకుండా వీళ్లిద్దరే షేర్ చేసుకున్నారు. సేవింగ్స్ నుంచేనా ఖర్చు చేసింది అని అడిగితే.. ట్వంటీ పర్సెంట్ సేవింగ్స్, ఎయిటీ పర్సెంట్ లోన్ అనే చెప్పారు ముక్తకంఠంతో. పెళ్లయి మూడేళ్లవుతోంది. ఆ ఖర్చుకు ఇంకా ఈఎమ్ఐ చెల్లిస్తునే ఉన్నారు. ఆ లోన్ తీరేదాకా పిల్లలు వద్దు అనుకుంటున్నారట. ఆ మాటతో మానస వాళ్ల మామ్మ హతాశురాలైంది. ఇదెక్కడి చోద్యమంటూ విచారపడింది.

> మన మ్యారేజ్ ఇండస్ట్రీ ఏటా కోటి పెళ్లిళ్లతో 10.79 లక్షల కోట్ల టర్నోవర్‌గా పురోగమిస్తోంది. ఫుడ్ అండ్ గ్రాసరీ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధాన, ప్రభావవంతమైన ఇండస్ట్రీగా విరాజిల్లుతోంది.

సర్వేలే సాక్ష్యం

'ఇండియా లెండ్స్' చేసిన సర్వే మేరకు సొంత ఖర్చుతోనే పెళ్లిచేసుకోవాలనుకుంటున్న 26 శాతం అమ్మాయిలు, అబ్బాయిలు.. ఆ ఖర్చును పర్సనల్ లోన్‌తో భర్తీ చేసుకుంటున్నారట. వాళ్లలో చాలామంది పెళ్లికి సంబంధించి ఒక్క ఈవెంట్‌కే రూ. లక్ష నుంచి రూ. అయిదు లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దీని మీదే వెడ్డింగ్‌వైర్ ఇండియా అనే సంస్థ చేసిన అధ్యయనంలో ఒక్క నిరుడే మన దేశంలో పెళ్లి ఖర్చు అమాంతం రూ. 29.6 లక్షలకు చేరినట్టు తేలింది. పెళ్లి జంటల్లోని మూడోవంతు జంటలు తమ పెళ్లికి రూ. 30 లక్షలకు పైనే వెచ్చిస్తుంటే మిగిలిన జంటలు రూ. 50 లక్షలకు పైగా ఖర్చుపెడుతున్నారని ఆ సర్వే నివేదిక.

అప్పులు బారెడు... జీతం మూరెడుగానే!

డబ్బు ఖర్చు పెట్టడం చాలా ఈజీ. కూడబెట్టడమే బహుకష్టం. రూ. లక్ష సమకూర్చుకోవడానిక్కూడా కనీసం ఏడాది పడుతుంది. అలాంటిది మూడు లేదా అయిదురోజుల పెళ్లిలోని ఒక్కో వేడుకకు రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల దాకా పెట్టే ఖర్చు జీవితానికి ఎంత భారమవుతుందో తెలుసా! ఆ అప్పు తీర్చడానికి ఆ జంటలు.. అప్పుడే పిల్లల్ని వద్దనుకోవడం దగ్గర్నుంచి ఇల్లు, ఇతర స్థిర, చరాస్తులను సమకూర్చుకోవడం దాకా అన్నిటినీ వాయిదా వేసుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ డౌన్‌పేమెంట్‌కి పనికొచ్చే డబ్బును, భవిష్యత్ ప్రణాళికలను.. ఆఖరకు ఇన్సూరెన్స్ పాలసీలను సైతం బ్రేక్ చేసి మరీ పెళ్లి బట్టలు, ఈవెంట్ డెకరేషన్ కోసం చేసిన అప్పు తీరుస్తున్న జంటలున్నాయి. ఇలా ఆ లోన్ వాళ్ల పెళ్లిని మధుర జ్ఞాపకంగా మలచకపోగా సంసారాన్ని చింతల చితిగా మారుస్తోంది.

క్రైసిస్‌లో కాపురాలు

దరఖాస్తుదారుల క్రెడిట్ స్కోర్‌ను బట్టి వెడ్డింగ్ లోన్స్, పర్సనల్ లోన్స్ ఏడాదికి పది నుంచి 24 శాతం దాకా మంజూరవుతున్నాయట. వీటికి కట్టలేకుండా పేరుకుపోయిన ఈఎమ్ఐల వడ్డీ వచ్చి చేరి.. ఎంత జీతం వచ్చినా, అత్యవసరాలకే ఎసరు వస్తోంది. ఈ క్రైసిస్ కాపురంలో కలతలను రేపుతోందంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్లు. పెరుగుతున్న రుణభారాన్ని తీర్చడానికి ఓవర్ టైమ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల కోసం వెదుక్కుంటున్న జంటలూ ఉన్నాయి. నెల తిరిగేసరికల్లా వచ్చే ఈ ఈఎంఐల ఒత్తిడి తట్టుకోలేక భార్యాభర్తల డైనింగ్ టేబుల్ కాన్వర్జేషన్స్ కలహాలతో ముగుస్తున్నాయి. ఎడమొహం పెడమొహంగా ఉదయాలు మొదలవుతున్నాయి.

అప్పు తప్పు కాదు కానీ..

లోన్ తీసుకోవడంలో తప్పులేదు. కానీ ఎందుకు తీసుకుంటున్నాం.. దేనిమీద ఖర్చు పెడుతున్నామనే ఎరుక, స్పష్టత చాలా అవసరం అంటున్నారు ఆర్థికవిశ్లేషకులు. ఇల్లు కట్టుకోవడానికో, వ్యాపారం ప్రారంభించడానికో, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే చదువుకోసమో అప్పు చేయడం సబబే. కానీ.. పైసా రాబడి లేనిచోట అప్పు చేసి మరీ డబ్బును వెదజల్లడం తెలివైన నిర్ణయం కాదని చెబుతున్నారు. పరస్పర గౌరవ మర్యాదలు, సర్దుబాట్లు, ప్రేమాభిమానాలతో పెళ్లి చేసుకోవాలి. మంచి కుటుంబంగా స్థిరపడాలి. కానీ ఆడంబరాల వేడుకగా.. ఫొటోలు, వీడియోలతో కనిపించే అప్పుగా కాదని సూస్తున్నారు ఆర్థికనిపుణులు, విశ్లేషకులు, ఫ్యామిలీ కౌన్సెలర్లు. కలలు సాకారమవ్వాల్సిందే! మధురమైన జ్ఞాపకాలను క్రియేట్ చేసుకోవాల్సిందే! కానీ ఈ రెంటికి మూల్యం మన జీవితం కాకూడదు! అప్పుడే సాకారమైన కలలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

దేశవ్యాప్తంగా ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తూ టెంపుల్ డ్యాన్సర్‌గా పేరుతెచ్చుకుంది విజయవాడవాసి కూచిపూడి నృత్యకారిణి కావ్య కంచర్ల. దసరా నవరాత్రుల సందర్భంగా తన విద్యార్థులతో కలిసి అమ్మవారి రూపాలను వివిధ ఆలయాలలో నృత్యరూపకాలుగా ప్రదర్శిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కేరళ తరంగ్‌లో పాల్గొని విజేతగా నిలిచారు. గిన్నిస్‌బుక్ రికార్డ్‌లోనూ చోటు సంపాదించారు. నృత్యం ద్వారా తమ శక్తిని ఎలా ప్రదర్శిస్తారో ఈ సందర్భంగా వివరించారు.



నృత్యార్చనం

నవశక్తి

"దసరా నవరాత్రులలో అంతటా అమ్మవారే కనిపిస్తుంటారు. ఇక విజయవాడలోనే కొలువైన అమ్మవారికి చేరువలో ఉంటూ నృత్యం ద్వారా సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ ఉన్న వివిధ ఆలయాలకు ముందుగానే అప్లికేషన్స్ ఇచ్చాం. వారు ఇచ్చిన టైమ్ ప్రకారం నృత్యం ప్రదర్శనలు ఇస్తున్నాం.

అలసట తెలియదు

నవరాత్రుల మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు ఆరు ప్రదర్శనలు ఇచ్చాం. అమ్మవారి మీద ఎన్నో గీతాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో గీతాన్ని ఒక్కో ఆలయంలో మాకు ఇచ్చిన సమయం వరకు ప్రదర్శన ఇస్తున్నాం. పూర్తయ్యాక పెద్ద వయసున్నవారు కూడా ఏమాత్రం సంకోచించకుండా మమ్మల్ని కలిసి 'ఆ అమ్మవారే నృత్యం చేస్తున్నారా అనే భావన కలిగింది' అని చెప్పినప్పుడు కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేనిది. ఒక తొంభైఏళ్ల బామ్మగారు ప్రదర్శన పూర్తయ్యాక వచ్చి తన చిన్నప్పుడు నేర్చుకున్న ఆలాపన ఇప్పుడు గుర్తుకు వచ్చిందని భావయుక్తంగా పాడి వినిపించారు. 'ఆ అమ్మవారు ఈ రూపంలో నాకు కనిపించారు' అని పొంగిపోయారు. ఇలాంటి ఎన్నో అనుభూతులను ప్రతిసారీ మేం పొందుతుంటాం. మా దగ్గర నృత్యం నేర్చుకునే విద్యార్థులు కూడా 'అమ్మవారి నృత్యంలో అలసట ఎందుకు రాదు' అని అడుగుతుంటారు. నృత్యం ఒక యాక్టివిటీ కాదు దైవికంగా ఎంత దగ్గరవుతుంటామో ఈ నృత్యం మాకు స్పష్టం చేస్తుంటుంది.

విజయవాడ అంటేనే అమ్మవారు. దసరానవరాత్రుల్లో ఆలయాల్లో మేం నృత్యం చేయడం అంటే అమ్మకు దగ్గరగా ఉన్నట్టే. ఒక భక్తి పూర్వక ప్రార్థన. మా నృత్యాన్ని అమ్మ చూస్తుంది అనే భావనతోనే చేస్తాం. 'ఎంతసేపు నృత్యం చేసినా అలసటగా ఎందుకు అనిపించడం లేదు?' అని మా విద్యార్థులు అడుగుతుంటారు. ఆధ్యాత్మికంగా అమ్మవారికి దగ్గరగా ఉంటే మరేమీ తెలియదు.

అమ్మవారి ప్రతి రూపం మనకు ప్రేరణ ఇచ్చే పాఠమే. మన జీవన విధానానికి ఎంతగానో తోడ్పడేదే. ఆ శక్తిని మేం నృత్యం ద్వారా ప్రదర్శించడమే కాదు మేమూ పొందుతుంటాం. సేవ చేస్తున్న కొద్దీ శక్తి పెరిగేదే. శ్రీశైలం, తిరుపతి, శిరిడీ, మహానంది, భద్రాచలం, హరిద్వార్, కేదార్‌నాద్, బదిరీనాద్... ఇలా మనదేశంలోని ప్రముఖ దేవాలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లభించింది. వందల, వేల మంది ముందు ప్రదర్శనలు ఇస్తుంటాం కాబట్టి ధైర్యం పెరుగుతుంది. మధురమైన మాటతీరు, ఏకాగ్రత.. ఇలా ఎన్నో పాజిటివ్ అంశాలు పెరుగుతాయి. రోజూ సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ఆనందం కలుగుతుంది. వీటన్నింటి వల్ల జీవనశైలి కూడా బాగుంటుంది.

బీఎస్సీ కంప్యూటర్స్‌లో డిగ్రీ, నృత్యంలో డిప్లొమా చేశాను. మా అమ్మ మాధవికి కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. నాలుగేళ్ల వయసు నుంచి నాకు నృత్యం నేర్పించారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. అకాడమీ పెట్టి, నృత్యసేవను కొనసాగిస్తూ ఉండాలని మా నాన్న కల. నాన్న వెంకట రత్నకుమార్ కరోనాలో మాకు దూరమయ్యారు. నాన్న కలను నెరవేర్చడానికి 'పంచమవేద' అకాడమీ ద్వారా కృషి చేస్తున్నాను. జాతీయ స్థాయి నృత్య పోటీ అయిన కేరళ తరంగ్‌లో పాల్గొన్ని విజేతగా నిలిచాను. ఇప్పటి వరకు 1500 కు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. గ్రూప్‌గా చేసిన శతనృత్య యాగంలో పాల్గొనే అవకాశం రావడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ లో చోటు దక్కింది. ఎంతో సాధన చేస్తూ శక్తిని పెంచుకోవడానికే ఈ నృత్య సేవ చేస్తున్నాను' అని వివరించారు ఈ నృత్యకారిణి.

– **నిర్మలారెడ్డి**, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వార్మప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత మహిళల జట్టు విజయం



శ్రీ చరణి

బెంగళూరు: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన టీమిండియా శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. మొదట న్యూజిలాండ్ జట్టు 42 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 44 ఓవర్లకు కుదించగా... ఆ తర్వాత మరో రెండు ఓవర్లు తగ్గించారు. కివీస్ కెప్టెన్ సోఫీ డివైన్ (54 బంతుల్లో 54; 9 ఫోర్లు) అర్ధశతకం సాధించగా... మ్యాడీ గ్రీన్ (49 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), అమేలియా కెర్ (40; 4 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో ఆంధ్ర స్పిన్నర్ శ్రీ చరణి 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం భారత లక్ష్యాన్ని 42 ఓవర్లలో 237 పరుగులుగా నిర్ణయించగా... హర్మన్ బృందం 40.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. హర్లీన్ డియోల్ (79 బంతుల్లో 74; 10 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (86 బంతుల్లో 69; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. గువాహటి వేదికగా మంగళవారం జరగనున్న ప్రపంచకప్ తొలి పోరులో శ్రీలంకతో భారత్ తలపడనుంది.



రజత దీప్తి

- 400 మీటర్ల పరుగులో తెలంగాణ అథ్లెట్‌కు రెండో స్థానం
- శైలేశ్‌కు పసిడి పతకం
- వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: తెలంగాణ పారా అథ్లెట్ జివాంజి దీప్తి ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో మెరిసింది. పారిస్ పారాలింపిక్స్‌లో పసిడి పతకం నెగ్గిన దీప్తి... తాజా పోటీల్లో రజతం ఖాతాలో వేసుకుంది. మహిళల 400 మీటర్ల పరుగు టి20 విభాగంలో బరిలోకి దిగిన దీప్తి శనివారం ఫైనల్లో 55.16 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచింది. ఈ సీజన్‌లో దీప్తికి ఇదే అత్యుత్తమ ప్రదర్శన కాగా... టర్కీకి చెందిన అయెసెల్ ఒండెర్ కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పుతూ 54.51 సెకన్లలో గమ్యాన్ని చేరి పసిడి పతకం కైవసం చేసుకుంది. ఉక్రెయిన్ యులియా షులియర్ (56.20 సెకన్లు)కు కాంస్యం దక్కింది. న్యూఢిల్లీ వేదికగా శనివారం ఘనంగా ప్రారంభమైన వరల్డ్ అథ్లెటిక్స్ పోటీల్లో తొలి రోజు భారత్ ఖాతాలో మూడు పతకాలు చేరాయి. దీప్తి రజతం చేజిక్కించుకోగా... హై జంప్‌లో భారత అథ్లెట్లు రెండు పతకాలు కైవసం చేసుకున్నారు. పురుషుల హై జంప్ టి42 విభాగంలో శైలేశ్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా... వరుణ్ సింగ్ కాంస్యం నెగ్గాడు. శైలేశ్ 1.91 మీటర్ల ఎత్తు దూకి అగ్రస్థానంలో నిలవగా... పారా ఆసియా క్రీడల పతక విజేత వరుణ్ సింగ్ 1.85 మీటర్లతో కాంస్యం నెగ్గాడు. భారత్‌కే చెందిన రాహుల్ (1.78 మీటర్లు) నాలుగో స్థానంలో నిలిచాడు.



శైలేశ్



సల్మాన్



ఆసియా కప్ మొదలై 41 సంవత్సరాలు...వన్డే ఫార్మాట్‌లో 14 సార్లు, టి20 ఫార్మాట్‌లో 2 సార్లు టోర్నీ జరిగింది. ఓవరాల్‌గా భారత్ 8 సార్లు విజేతగా నిలిచింది. కానీ ఒక్క సారి కూడా భారత్, పాకిస్తాన్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగలేదు. తాజా టోర్నీలో పాక్ జట్టు ప్రదర్శన, తడబాటును చూస్తే ఈ సారి కూడా అది సాధ్యం కాదని అనిపించింది. కానీ పడుతూ లేస్తూ పాక్ ఎట్టకేలకు తుది పోరుకు అర్హత సాధించగా...మరో వైపు చక్కటి ఫామ్, అజేయమైన రికార్డుతో ఎదురుగా భారత్ నిలిచింది. గత రెండు **మ్యాచ్‌ల ఫలితం, ఆపై సూర్యకుమార్ వ్యాఖ్యలు** చూస్తే ఇరు జట్ల మధ్య 'వైరం' అనే మాటలో అర్థం లేదు! అయితే టి20 ఫార్మాట్‌లో అనూహ్య ఫలితాలు కొత్త కాదు. టీమిండియా తమ జోరును కొనసాగిస్తూ ఏకపక్ష ఆటతో 9వ సారి చాంపియన్‌గా నిలుస్తుందా... లేక పాకిస్తాన్ పాఠాలు నేర్చుకొని కొత్త తరహా ఆటతో పోటీనిస్తుందా అనేది ఆసక్తికరం. ఫలితం ఎలా ఉన్నా అభిమానులకు వరుసగా మూడో ఆదివారం **క్రికెట్ పండగ ఖాయం.**

ఆఖరి పోరాటం

నేడు ఆసియా కప్ ఫైనల్ • పాకిస్తాన్‌తో భారత్ ఢీ

జోరు మీదున్న టీమిండియా • సంచలనంపై పాక్ గురి • రా.గం.8.00 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



సూర్యకుమార్

దుబాయ్: ఆసియా కప్ డిఫెండింగ్ చాంపియన్ భారత్ తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సన్నద్ధమైంది. సరిగ్గా రెండేళ్ల క్రితం వన్డే ఫార్మాట్‌లో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్...ఇప్పుడు టి20 ఫార్మాట్‌లో టైటిల్‌కు గురి పెట్టింది. నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో టీమిండియా తలపడుతుంది. వరుసగా ఆరు విజయాలతో సత్తా చాటిన సూర్యకుమార్ సేన సహజంగానే ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఇదే జోరు మరో మ్యాచ్‌లో కొనసాగిస్తే ట్రోఫీ మన జట్టు ఖాతాలో పడుతుంది. మరో వైపు పాకిస్తాన్ జట్టు అన్ని రంగాల్లో బలహీనంగా ఉంది. శ్రీలంక, బంగ్లాదేశ్‌లపైనే చివరి వరకు శ్రమించి గట్టెక్కిన ఆ జట్టు భారత్‌ను నిలువరించడం అంత సులువు కాదు. దాయాది జట్టు చేతిలో లీగ్, సూపర్-4 దశలో ఎదురైన ఓటములు వారికి వాస్తవాన్ని చూపించాయి కూడా. అయితే ఆ జట్టు సంచలనాన్ని ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో 'ఆసియా'లో ఎవరిది పైచేయి కానుందో చూడాలి.

సూర్య ఫామ్‌పై ఆందోళన...

శ్రీలంకపై చివరి లీగ్ మ్యాచ్‌లో బుమ్రా, దూబేలకు విశ్రాంతినిచ్చినా...ఫైనల్ పోరుకు వారిద్దరు తిరిగి రావడం ఖాయం. ఇది మినహా మిగతా జట్టులో ఎలాంటి మార్పూ ఉండకపోవచ్చు. వరుస విజయాల్లో భాగంగా ఉన్న ప్రధాన ఆటగాళ్లనే మేనేజ్‌మెంట్ కొనసాగించే అవకాశం ఉంది. అయితే సూపర్-4 దశలో జట్టులో పలు లోపాలు కనిపించాయి. భారత్ విజయావకాశాలు అభిషేక్ శర్మ ఇచ్చే అసాధారణ ఆరంభంపైనే ఆధారపడి ఉన్నాయనడంలో సందేహం లేదు. టోర్నీ టాపర్‌గా 309 పరుగులు చేసిన అతడు 200కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో అదరగొడుతున్నాడు. మరో ఎండ్‌లో గిల్ (115 పరుగులు)నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. అభిషేక్ దూకుడు ఈ లోటును తెలియనివ్వలేదు. ఈ సారైనా వైస్ కెప్టెన్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాలని భారత్ కోరుకుంటోంది. మిడిలార్డర్‌లో పాండ్యా తన స్థాయికి తగినట్లు చెలరేగలేదు. అయితే తిలక్, సామ్సన్‌లు రాణించడం సానుకూలాంశం. గత మ్యాచ్‌లో వీరిద్దరి ప్రదర్శన నమ్మకాన్ని పెంచింది. బౌలింగ్‌లో ఆకట్టుకుంటున్న దూబే బ్యాటింగ్‌లోనూ ధాటిని ప్రదర్శించాల్సి ఉంది. అన్నింటికి మించి కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ జట్టులో ఆందోళన పెంచుతోంది. ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి అతను 71 పరుగులే చేశాడు. అదీ తన సహజశైలికి భిన్నంగా 108 స్ట్రయిక్‌రేట్ మాత్రమే ఉండటం అనూహ్యం. వచ్చే వరల్డ్ కప్ జట్టును నడిపించడం ఖాయమని భావిస్తున్న ప్లేయర్ ఇలా విఫలం కావడం ఇబ్బంది పెడుతోంది. ఫైనల్లోనైనా అతను చెలరేగాల్సి ఉంది. బౌలింగ్‌లో బుమ్రా మరోసారి కీలకం కానుండగా, పాండ్యా కూడా రాణించడం అవసరం. అయితే మరోసారి మన స్పిన్ బలగంపై జట్టు ఆధారపడుతోంది. ఆరుకంటే తక్కువ ఎకానమీతో అత్యధికంగా 11 వికెట్లు తీసిన కుల్దీప్‌ను ఎదుర్కోవడం పాక్ బ్యాటర్లకు మళ్లీ కష్టమే. అక్షర్, వరుణ్ కూడా ప్రత్యర్థిని కట్టిపడేయగలరు.

గెలిపించేదెవరు!

భారత్‌తో పోలిస్తే అన్ని రంగాల్లో పాకిస్తాన్ బలహీనంగానే కనిపిస్తోంది. తమ చివరి సూపర్-4 మ్యాచ్‌లో కూడా బంగ్లాదేశ్‌తో దాదాపు ఓటమికి చేరువై అదృష్టవశాత్తూ తప్పించుకోగలిగింది. ఇక భారత్‌తో ఆడిన రెండు మ్యాచ్‌లలో కూడా టీమ్ ప్రదర్శన పేలవంగా ఉంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో కూడా చెప్పుకోదగ్గ ఆటగాళ్లు కనిపించడం లేదు. 160 పరుగులతో టీమ్ టాప్ స్కోరర్‌గా ఉన్న ఫర్హాన్ ఒక్క మ్యాచ్‌లో అర్ధ సెంచరీ మినహా ప్రభావం చూపలేదు. ఫఖర్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వకపోగా... మిగతా ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ సల్మాన్ ఆగా కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా రాణించలేదు. ఆరు ఇన్నింగ్స్‌లలో కలిపి అతను చేసింది 64 పరుగులే. 'పాక్ అభిషేక్ శర్మ' అంటూ కొన్నాళ్ల క్రితం కీర్తించిన సయీమ్ అయూబ్ ఏకంగా రికార్డు స్థాయిలో 4 డకౌట్‌లతో ఘోర ప్రదర్శన కనబర్చాడు. అయితే మరో చెప్పుకోదగ్గ ప్రత్యామ్నాయం కూడా లేదు కాబట్టి ఈ మ్యాచ్‌లోనూ అతని స్థానంపై ఎలాంటి ఢోకా లేదు. వీరందరిలో తుది పోరులో ఎవరు రాణిస్తారనేది చూడాలి. పాక్ సాధారణ స్కోరు నమోదు చేయాలన్నా మిడిలార్డర్‌లో తలత్, హారిస్‌లు కనీస ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. బౌలింగ్‌లో షాహిన్ అఫ్రిది ఒక్కడే కాస్త ఫర్వాలేదనిపించినా... భారత్ ఓపెనర్లు అతడిని అలవోకగా ఎదుర్కొంటున్నారు. రవూఫ్, అబ్రార్, ఫహీమ్, నవాజ్ మన బ్యాటర్లను అడ్డుకోవడం అంత సులువు కాదు.

పిచ్, వాతావరణం

దుబాయ్‌లో సాధారణ వికెట్. అటు బ్యాటింగ్‌తో పాటు ఇటు బౌలింగ్‌కు కూడా అనుకూలం. అయితే రెండో సారి బ్యాటింగ్ చేసిన జట్టుకే విజయావకాశాలు ఉంటాయని పదే పదే రుజువైంది. కాబట్టి టాస్ గెలిచిన టీమ్ ఫీల్డింగ్ ఎంచుకోవడం ఖాయం

3-7 భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య వన్డే, టి20లు కలిపి ఇప్పటి వరకు 10 ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో భారత్ 3 గెలవగా... పాకిస్తాన్ 7 ఫైనల్‌లలో విజయం సాధించింది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, గిల్, సామ్సన్, తిలక్, పాండ్యా, దూబే, అక్షర్, కుల్దీప్, వరుణ్, బుమ్రా.

పాకిస్తాన్: సల్మాన్ (కెప్టెన్), ఫర్హాన్, ఫఖర్, అయూబ్, తలత్, హారిస్, అఫ్రిది, నవాజ్, ఫహీమ్, రవూఫ్, అబ్రార్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

పవర్‌ఫుల్ శికంజా మాలిక్



• మోహన్ బాబు

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు పవర్‌ఫుల్ విలన్ పాత్రను పోషిస్తున్నారని చిత్రయూనిట్ పేర్కొంది. విలన్ శికంజా మాలిక్‌గా ఆయన చేస్తున్న క్యారెక్టర్‌కి సంబంధించి రెండు లుక్స్‌ని శనివారం విడుదల చేశారు. ''చాలాకాలం తర్వాత మోహన్‌బాబుగారిని పవర్‌ఫుల్ విలన్‌గా శ్రీకాంత్ స్క్రీన్ పైకి తీసుకువస్తున్నారు. ఈ పాత్ర గురించి దర్శకుడు శ్రీకాంత్ చెప్పిన వెంటనే మోహన్‌బాబు గారు అంగీకరించారు. ఈ పాత్ర బాగా నచ్చడంతో ఆయన శ్రీకాంత్ అభిమానిగా మారిపోయారు. పవర్‌ఫుల్, స్టైలిష్‌గా కనిపించే శికంజా మాలిక్ పాత్రలో మోహన్‌బాబుగారి ప్రత్యేకమైన పంచ్ డైలాగ్స్, మేనరిజమ్స్ ఫ్యాన్స్‌కి పండగలా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా 2026 మార్చి 26న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది.

సిద్ధంగా ఉండండి!



• 'దేవర 1'లో ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, సైఫ్ అలీఖాన్ విలన్ రోల్ చేశారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. నందమూరి కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది సెప్టెంబరు 27న విడుదలైంది. ఈ సినిమా విడుదలై ఏడాది పూర్తయిందని, ప్రస్తుతం 'దేవర 2'కు సన్నద్ధం అవుతున్నామని, అందరూ సిద్ధంగా ఉండండి అని శనివారం చిత్రయూనిట్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. అలాగే 'మ్యాడ్ 2' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లోనూ 'దేవర 2' ఉంటుందని ఎన్టీఆర్ స్పష్టం చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని పీరియాడికల్ యాక్షన్ మూవీ 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో హీరోగా నటిస్తున్నారు ఎన్టీఆర్. ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది. ఈ చిత్రం చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'దేవర 2' సినిమాను ఎన్టీఆర్ సెట్స్‌కు తీసుకువెళ్తారని ఊహించవచ్చు. ఇంకా 'దేవర 2'తో పాటు మరో కొత్త సినిమా షూటింగ్‌ను సమాంతరంగా మొదలుపెట్టాలనే ఆలోచనలో ఎన్టీఆర్ ఉన్నారని టాక్.

బాలీవుడ్ ఎంట్రీ

'హిట్ 2, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించి, స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు మీనాక్షీ చౌదరి. ఈ బ్యూటీ బాలీవుడ్ ఎంట్రీ ఖరారైందని సమాచారం. జాన్ అబ్రహాం నటించనున్న హిందీ చిత్రం 'ఫోర్స్ 3'లోని హీరోయిన్ పాత్ర కోసం మీనాక్షీ చౌదరిని ఎంపిక చేసిందట యూనిట్. భావ్ దులియా దర్శకత్వం వహించనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం షూటింగ్ ఈ నవంబరులో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో మీనాక్షి పాత్రకూ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని, ఇందుకోసం ఆమె శిక్షణ తీసుకోనున్నారని తెలిసింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ మొదలయ్యాయని, కొన్ని వర్క్‌షాప్స్ కూడా జరుగుతున్నాయని భోగట్టా. ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.



• మీనాక్షీ చౌదరి

అది నా గ్యారెంటీ

- కిరణ్ అబ్బవరం



• కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా

''కె-ర్యాంప్' యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌ని ఇప్పటికే చూసి ఉంటారు. ఒకట్రెండు డైలాగ్స్ చూసి, ఈ సినిమాపై అభిప్రాయానికి రాకండి. ఎక్కడా ఇబ్బంది పడరు. నా సినిమా ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది. అది నా గ్యారెంటీ. ఈ సినిమాతో ప్రేక్షకులకు కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నా'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన సినిమా 'కె-ర్యాంప్'. ఈ చిత్రంలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించారు. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం చిత్రయూనిట్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో హీరో క్యారెక్టర్‌కు ఉన్న సమానమైన ప్రాధాన్యం హీరోయిన్‌కి ఉంటుంది. 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి, వెంకీ, రెడీ... ఇలాంటి ఎంటర్‌టైనర్స్‌లా మా 'కె-ర్యాంప్' సినిమా చిత్రాన్ని రిపీటెడ్‌గా చూడాలని ఆడియన్స్ అనుకుంటారు'' అని అన్నారు. ''ఈ సినిమాలో కొత్త తరహా పాత్ర చేశాను'' అని తెలిపారు వీకే నరేశ్. 'కె ర్యాంప్' అంటే 'కిరణ్ అబ్బవరం ర్యాంప్'. అది దృష్టిలో పెట్టుకునే కథ రాసి, సినిమా రూపొందించాను. ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ పేరు కుమార్'' అని తెలిపారు జైన్స్ నాని. ''ఈ దీపావళికి ఎంత పోటీ ఉన్నా మా సినిమా సక్సెస్‌పై నమ్మకం ఉంది. కిరణ్‌గారితో మళ్లీ మళ్లీ సినిమాలు చేయాలని ఉంది. చేతన్ భరద్వాజ్ చాలా అంకితభావం ఉన్న వ్యక్తి. మా సంస్థలో రాబోయే మూడు కొత్త సినిమాలకు చేతనే మ్యూజిక్ డైరెక్టర్'' అని చెప్పారు రాజేశ్ దండ.

ఈ పాట నా మనసుని హత్తుకుంది

- ఆర్. నారాయణమూర్తి



• వరుణ్ సందేశ్, ఆర్.నారాయణ మూర్తి, మధులిక

''సమాజంలో పోలీసులు పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయం. చట్టాన్ని కాపాడుతూ నిజాయితీగా పని చేసే పోలీసులు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంటారు. అలాంటి నిజాయితీ గల ఓ కానిస్టేబుల్ ఇతివృత్తంతో ఈ 'కానిస్టేబుల్' సినిమాను రూపొందించడం అభినందనీయం'' అని దర్శక-నిర్మాత-నటుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. వరుణ్ సందేశ్, మధులికా వారణాసి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కానిస్టేబుల్'. ఎస్.కె ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో 'బలగం' జగదీష్ నిర్మించారు. శనివారం చిత్రయూనిట్ నిర్వహించిన మీడియా సమావేశానికి ఆర్. నారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై, గీత రచయిత చంద్రబోస్ పాడిన ఈ సినిమాలోని 'మా పంచ ప్రాణాలే...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అనంతరం ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ- ''దేశ సరిహద్దులలో జవాన్లు, దేశం లోపల పోలీసులు ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఈ రోజు నేను ఆవిష్కరించిన ఈ ఎమోషనల్ పాట నా మనసును ఎంతగానో హత్తుకుంది. నా కళ్లు చెమర్చాయి. చంద్రబోస్ ఈ పాటను అద్భుతంగా ఆలపించారు. వరుణ్ సందేశ్‌కు ఇది మంచి కమ్ బ్యాక్ చిత్రం కావాలి. ఈ సినిమా ట్రైలర్, పాటల్ని చూస్తుంటే దర్శక-నిర్మాతల అభిరుచి అర్థమవుతోంది'' అని అన్నారు. ''ఎమోషన్, సస్పెన్స్, డ్రామా, థ్రిల్ వంటి అంశాలతో 'కానిస్టేబుల్' ప్రేక్షకులను అలరిస్తుంది'' అని తెలిపారు వరుణ్ సందేశ్. ''అక్టోబరు 10న మా సినిమాను రిలీజ్ చేస్తున్నాం. నైజాంలో ఏషియన్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ విడుదల చేస్తోంది. దాదాపు 500 థియేటర్స్‌లో విడుదల కానుంది'' అని తెలిపారు 'బలగం' జగదీష్. ''సమాజానికి స్ఫూర్తిదాయకమైన చిత్రాలు రావాలని కోరుకునే విధంగా ఈ చిత్రం ఉంటుంది'' అని పేర్కొన్నారు ఆర్యన్‌సుభాన్. 'మా పంచ ప్రాణాలే...' గీత రచయిత రామారావు, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతితో దర్శకురాలిగా...



• వరలక్ష్మి

ఏ క్యారెక్టర్‌లో అయినా ఒదిగిపోగల నటి వరలక్ష్మీ శరత్‌కుమార్. పాజిటివ్ రోల్స్‌తో పాటు నెగటివ్ రోల్స్‌లోనూ ప్రేక్షకులను మెప్పించి, విలక్షణ నటి అనిపించుకున్నారు. ఇప్పుడు ఆమె ఓ కొత్త ప్రయత్నం మొదలుపెట్టారు. దర్శకురాలిగా మారి, 'సరస్వతి' అనే చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని దోస డైరీస్ బేనర్‌పై తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి నిర్మించనున్నారామె. అలాగే ఈ చిత్రంలో వరలక్ష్మి ప్రధాన పాత్ర పోషించనున్నారు. థ్రిల్లర్ మూవీగా రూపొందనున్న 'సరస్వతి'లో ప్రకాశ్‌రాజ్, ప్రియమణి, నవీన్ చంద్ర ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: ఎ.ఎం. ఎడ్విన్ సకే.

ఓటీటీ ఇది చూడొచ్చు

లా ఫర్మ్‌ల కతలు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో 'ది ట్రయల్' రెండో సీజన్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.



ఏదైనా నేరం జరిగితే తగిన సాక్ష్యాలతో నేరస్థుడిని నిరూపించే ప్రక్రియలో న్యాయవాదులు ఉంటారు. ఆ న్యాయవాదుల సమూహంగా కొన్ని కంపెనీలు కూడా ఉంటాయి. ఆ కంపెనీలలో ఎంతో మంది న్యాయవాదులు తమ క్లయింట్ల తరఫున కోర్టులో విచారణకు హాజరవుతుంటారు. అటువంటి లా ఫర్మ్‌లపై తీసిన సిరీస్ 'ది ట్రయల్'. 2023లో ఈ సిరీస్ మొదటి భాగం హాట్ స్టార్ వేదికగా రిలీజ్ అయింది. మళ్ళీ రెండేళ్ళకు దానికి కొనసాగింపుగా ఇప్పుడు 2025లో 'ది ట్రయల్' రెండో సీజన్ రిలీజ్ అయింది. కాజోల్ ప్రధాన పాత్రలో నటించగా ఆమె భర్త అజయ్ దేవగన్ ఈ సిరీస్‌కి నిర్మాతగా వ్యవహరించడం విశేషం. రెండు సిరీస్‌లు కలిపి 14 ఎపిసోడ్లతో ఉన్న 'ది ట్రయల్' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్ కథాంశానికొస్తే... న్యోనికా సేన్ గుప్తా ఓ పేరున్న ఫర్మ్‌లో మంచి లాయర్. ఆమె భర్త రాజకీయ నాయకుడు. ఆమె చేస్తున్న లా ఫర్మ్‌లో ఎన్నో రాజకీయాలతో ఆమె ప్రమోషన్‌ని అడ్డుకుంటూ న్యోనికా కుటుంబానికి కూడా ఆపద కలిగిస్తుంటారు ఆమె ప్రత్యర్థులు. ఆ లా ఫర్మ్‌లోకి వచ్చే కేసులు కూడా ఈ భార్యాభర్తలకు లింకు అవుతుంటాయి. ఆ లింకులు పెద్ద పెద్ద కష్టాలనే తెచ్చిపెడతాయి. మరి... ఆ కష్టాలన్నింటినీ తట్టుకుని తన క్లయింట్ల కేసులను వాదిస్తూ, ఫర్మ్‌లోని రాజకీయాలను ఎదుర్కొంటూ న్యోనికా నిజంగా ట్రయల్ గెలుస్తుందా? లేదా అన్నది మాత్రం సిరీస్‌లోనే చూడాలి. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది ట్రయల్' మంచి కాలక్షేపం. ఈ లా ఫర్మ్ కతలు పెద్దలు మాత్రమే చూడదగినవి. ఎంజాయ్.

– హరికృష్ణ ఇంటూరు

విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం ప్రత్యేక విభాగం



ఏటీసీల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, పొన్నం, శ్రీధర్‌బాబు తదితరులు

- ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి స్టైపెండ్
- వర్చువల్‌గా 65 ఏటీసీలను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

విజయనగర్ కాలనీ(హైదరాబాద్): రాష్ట్రంలోని నైపుణ్యత కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతోపాటు విదేశాల్లో ఉద్యోగావకాశాలను కూడా అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. యువతీయువకులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్నిరకాల అవకాశాలు కల్పిస్తుందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌కు ప్రణాళికలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ)గా మార్చిన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ 'ఏటీసీల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ప్రతి నెలా రూ.2,000 స్టైపెండ్ ఇస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందని, ఇది ఖర్చు కాదు. భవిష్యత్‌కు పెట్టుబడి. పని చేయాలన్న సంకల్పం కావాలి. కష్టపడి పనిచేయాలని'చెప్పారు.

తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

ఏటీసీల్లో శిక్షణ పొందిన తమ్ముళ్లు, చెల్లెళ్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికశక్తిగా ఎదగడంలో మీ వంతు కృషి చేయాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యం కలిగిన శిక్షణ అందించాలన్న లక్ష్యంతో గత ఏడాది ఇదే ప్రాంగణంలో ఏటీసీలకు పునాదులు వేసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతమున్న 65 ఏటీసీలకు అదనంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మరో 51 ఏటీసీలను ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చడానికి ప్రభుత్వం కేవలం రూ. 300 కోట్లు ఖర్చు చేస్తే, టాటా సంస్థ రూ.2,100 కోట్లు ఖర్చు చేసి ఆధునిక ఏటీసీలను తీర్చిదిద్దిందని చెప్పారు.

నైపుణ్యం ఉంటేనే ఉద్యోగావకాశాలు

రాష్ట్రంలో ఏటా లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టా పొందుతున్నా, నైపుణ్యం లేని కారణంగా చాలామందికి ఉద్యోగావకాశాలు రావడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నైపుణ్యం లేనిదే ప్రైవేట్‌లో ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని, అందుకే స్కిల్స్ పెంచాలన్న అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాంటివి ప్రారంభించామంటే మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలన్నదే మా సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తోపాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, టాటా టెక్నాలజీస్ ప్రతినిధులు హాజరయ్యారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు.

లండన్‌లో ఘనంగా యాదగిరీశుడి కల్యాణం

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో లండన్‌లోని మిల్టన్ కేన్స్ ప్రాంతంలో శనివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, అర్చకులు కిరణ్‌కుమార్, దోర్బల భాస్కర్‌శర్మ బృందం ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఉత్సవమూర్తుల కల్యాణం జరిపించారు. వేడుకకు స్థానిక మేయర్ జేమ్స్ ల్యాంక్ హిస్టరీ, కౌన్సిలర్లు పీదర్, చౌహాన్‌తో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు హాజరయ్యారు.



కల్యాణతంతు సందర్భంగా తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

నమ్మి గెలిపిస్తే నమ్మక ద్రోహం చేశారు

పదేళ్లలో ఒక్క గ్రూప్-1 ఉద్యోగం కూడా భర్తీ చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం : సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాలం కలిసివచ్చి ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన కారణజన్ములు కాలేరని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రెండుసార్లు అధికారాన్ని చేజిక్కించుకుని దర్పంతో కారణజన్ములుగా తమ కుతామే భావించారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాల్సినవారు తమ కుటుంబ సంక్షేమం, కుటుంబ సభ్యుల ఉపాధి మాత్రమే చూసుకున్నారని ఆరోపించారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్.. ఒక్క గ్రూప్-1 ఉద్యోగం కూడా భర్తీ చేయకపోవడం ఆ పార్టీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 19 నెలల్లోనే ఏకంగా 562 గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీచేసి చరిత్ర సృష్టించామని చెప్పారు. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించేందుకు శిల్పకళావేదికలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. అనంతరం వారినుద్దేశించి ప్రసంగించారు.



నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో నరేందర్‌రెడ్డి, కేశవరావు, జూపల్లి, పొంగులేటి, రామకృష్ణారావు, పొన్నం, శ్రీహరి, జితేందర్ తదితరులు

తెలంగాణ ఇక్కడే ఉంది.. ఉంటది..

కొత్త రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రెండుసార్లు నమ్మి అధికారాన్ని కట్టబెడితే నమ్మక ద్రోహం చేశారని బీఆర్ఎస్‌పై సీఎం మండిపడ్డారు. వాళ్లు ఇప్పుడు నమ్మక ద్రోహులుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. 'తెలంగాణ ఎక్కడుందంటూ కొందరు అప్పుడప్పుడు విమర్శిస్తున్నారు. వారికి నేను చెబుతున్నా... తెలంగాణ ఎక్కడికీ పోలేదు. ఇక్కడే ఉంది.. ఇక్కడే ఉంటది. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణలో ఎన్నో పోరాటాలు జరిగాయి. ఏ పల్లెకు వెళ్లినా తెలంగాణ స్ఫూర్తి ఉట్టిపడుతుంది. యాదయ్య, శ్రీకాంతాచారి, ఇషాన్ రెడ్డి, యాదిరెడ్డిలాంటి వాళ్ల త్యాగాలను గత పాలకులు అపహాస్యం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అర్హత లేనివారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యులుగా నియమించారు. సరైన జ్ఞానం లేనివారిని నియమిస్తే వారు రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసు ఉద్యోగులను ఎలా భర్తీ చేస్తారు. అందుకే అప్పట్లో ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో కనిపించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. పారదర్శకతతో పరీక్షలు నిర్వహించాం. కొంతమందికి అది నచ్చలేదు. కడుపునిండా విషం పెట్టుకుని రేవంత్‌రెడ్డి రూ.2 కోట్లు, రూ.3 కోట్లు తీసుకుని ఉద్యోగాలు ఇస్తున్నారని సిగ్గులేకుండా ఆరోపణలు చేశారు. అలాంటి వ్యాఖ్యలను నేను ఏమాత్రం పట్టించుకోకుండా మీ భవిష్యత్ కోసమే పోరాడా. నాడు అర్జునుడికి చేప కన్ను మాత్రమే కనిపించినట్లు... నాకు నిరుద్యోగుల భవిష్యత్ మాత్రమే కనిపించింది. మీరంతా తెలంగాణ మోడల్. కోచింగ్ సెంటర్ల కుట్రను కూడా మీరు అర్థం చేసుకోవాలి. ఏళ్ల తరబడి సెంటర్ల చుట్టూ తిరిగి ఇప్పుడు ఉద్యోగాలు అందుకుంటుంటే కొందరు రూ.లక్షలు ఫీజు ఇచ్చి కేసులు వేస్తున్నారు'అని విమర్శించారు

జీడీపీలో మన వాటా పది శాతానికి పెంచుదాం

తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఒక నమూనాగా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచస్థాయి నగరాలతో పోటీ పడుతున్నామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ ఎకానమీ రూ.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని ధీమా వ్యక్తంచేశారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 నుంచి 10 శాతానికి పెరిగేలా అభివృద్ధి చేస్తున్నామని, అందరం కలిసి దేశానికి తెలంగాణ మోడల్ చూపిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కొత్త గ్రూప్-1 అధికారులకు సూచించారు. 'మీ భవిష్యత్ కోసం శ్రమించిన తల్లిదండ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత మీదే. తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఏమాత్రం సహించబోము. నిర్దాక్షిణ్యంగా మీ జీతాల్లోంచి పది శాతం కోత పెట్టి వారి ఖాతాలో జమచేస్తాం. ఈ మేరకు త్వరలో చట్టాన్ని తీసుకువస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

రాష్ట్ర మేధాశక్తిని ప్రపంచానికి చాటుదాం: భట్టి

ప్రభుత్వానికి ఎన్నో సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అజేయంగా నిలబెట్టడానికి కృషి చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 40 ఏళ్లలో కూడా ఇంతపెద్ద సంఖ్యలో గ్రూప్-1 ఉద్యోగాలు ఒకేసారి భర్తీ చేయలేదని చెప్పారు. ఈ గ్రూపు-1 పరీక్షల్లో వ్యవసాయ కూలీ బిడ్డ మొదలుకొని, పంచర్లు వేసే కుటుంబానికి చెందిన బిడ్డలు కూడా ఉన్నతాధికారులుగా నియమితులు కావడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 22,500 కోట్లతో లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదవారి కలలు నెరవేరుస్తోందని అన్నారు. యువత మేధాశక్తిని ఉపయోగించుకోవటానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని, ప్రపంచంతో పోటీ పడే స్థాయికి యువత మేధాశక్తిని తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అక్క, బావ ప్రోత్సాహంతోనే..



మాది వ్యవసాయ కుటుంబం. అమ్మ కేన్సర్‌తో మృతి చెందింది. నాన్న వ్యవసాయానికి దూరమయ్యాడు. అన్నయ్య ఆటో నడిపిస్తున్నాడు. అక్క పుష్పలత, బావ వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయికి రాగలిగాను. 2017లో బీటెక్ పూర్తి చేశాను. 8 ఏళ్లుగా గ్రూప్-1 కోసం చదువుతున్నా. ఇప్పుడు 142వ ర్యాంకు వచ్చింది. డీఎస్పీగా ఉద్యోగం వచ్చింది. గతంలో పేపర్ లీకేజీల వల్ల చాలా ఇబ్బంది పడ్డాం. ఇటీవల ఉద్యోగాలు అమ్ముకున్నారన్న ఆరోపణలు మమ్మల్ని బాధించాయి. నా కుటుంబ నేపథ్యం చూస్తే ఉద్యోగం కొనటం సాధ్యమయ్యేదేనా?

– ఆంజనేయులు, చోడంపల్లి, నార్కట్‌పల్లి మండలం, నల్లగొండ జిల్లా

నా విజయం చూడకుండానే నాన్న చనిపోయారు



చిన్నప్పటి నుంచి చదువులో నేను టాపర్‌నే. ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. జేఎన్టీయూ హైదరాబాద్‌లో గోల్డ్ మెడల్ సాధించా. సివిల్స్ లక్ష్యంగా ప్రిపేర్ అయ్యాను. ఐదేళ్లు ఇంట్లోనే ఉండి సొంతంగానే చదువుకున్నాను. గ్రూప్స్-1లో 39వ ర్యాంకు సాధించాను. డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది. నన్ను ఎంతగానో ప్రోత్సహించే మా నాన్న గత ఫిబ్రవరిలో చనిపోయారు. నా విజయం చూడకుండానే ఆయన దూరమైనందుకు బాధగా ఉంది. ఆయన లెగసీని పూర్తి చేసేందుకు సర్వీస్‌లో డెడికేటెడ్‌గా పనిచేస్తాను.

మోక్షిత, ఇటిక్యాల, పుల్కల్ మండలం, సంగారెడ్డి జిల్లా.

నేను ఐఏఎస్ కావాలన్నది నాన్న కోరిక



మా నాన్న సురేశ్ ఉపాధ్యాయుడు. నేను ఐఏఎస్ కావాలన్నది ఆయన కోరిక. ఆయనే నా ఇన్‌స్పిరేషన్. బీఏ పూర్తి చేశాక యూపీఎస్సీకి సన్నద్ధమయ్యాను. ప్రిలిమ్స్ 3 సార్లు రాశా. గ్రూప్-1లో 270 ర్యాంకు వచ్చింది. ఈ మధ్య మాపై వచ్చిన ఆరోపణలు బాధించాయి. అందరూ నిజాయితీగా ఉద్యోగాలు సాధించారు. ఎట్టకేలకు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది.

– గడ్డం నాగవైష్ణవి, భూపాలపల్లి

జోగుళాంబ సన్నిధిలో సీఎం సతీమణి



జోగుళాంబ అమ్మవారి ఆలయంలో సీఎం సతీమణి, కుటుంబ సభ్యులు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ క్షేత్ర ఆలయాలను సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, కుమార్తె నైమిశ, అల్లుడు సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం సతీమణి, కుటుంబ సభ్యులు బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ, స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం జోగుళాంబ ఆలయానికి చేరుకొని కుంకుమార్చన పూజలు జరిపించారు. ఈ సందర్భంగా సీఎం సతీమణి అమ్మవారికి ఒడిబియ్యం, మంగళ ద్రవ్యాలు సారె సమర్పించారు.

ప్రతి గ్రామంలో కనీసం వంద సంతకాలు

- ఓట్‌చోరీ జరిగిందని 80 శాతం మంది ప్రజలు నమ్ముతున్నారు: టీపీసీసీ చీఫ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్‌చోరీ ఉద్యమానికి మద్దతుగా ప్రతి గ్రామంలో కనీసం 100 సంతకాలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఓట్‌చోరీ జరిగిందని దేశంలోని 80 శాతం మంది ప్రజలు నమ్ముతున్నారని, అలా నమ్ముతున్న వారందరి చేత సంతకాలు పెట్టించాలని, ఓట్ చోరీ జరిగిందని నమ్ముతున్నందున తాను కూడా సంతకం పెడుతున్నానని చెప్పారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో ఓట్‌చోరీపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, జాతీయ నాయకులు శ్రవణ్‌రావు, జైస్వాల్, ఖాలిద్ తదితరులతో కలిసి మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఓట్‌చోరీతోనే మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని, ఓట్‌చోరీ అనేది ప్రజాస్వామ్యానికి పెద్ద విఘాతమని అన్నారు. రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున 8 మంది ఎంపీలు గెలిచింది కూడా ఓట్‌చోరీతోనేనని తన పాదయాత్రలోనే చెప్పానని, దీనిపై ఇంతవరకు బీజేపీ నేతలు స్పందించలేదని చెప్పారు. ఓట్‌చోరీపై రాహుల్‌గాంధీ సంధించిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ జవాబులు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఓట్‌చోరీకి వ్యతిరేకంగా జరుగుతున్న సంతకాల సేకరణలో మేధావులు, జర్నలిస్టులు కూడా పాల్గొనాలని కోరారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి: టీజీవో

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బతుకమ్మ సంబరాలు గృహకల్ప ప్రాంగణంలో శనివారం ఘనంగా జరిగాయి. టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 7వ రోజు జరిగిన ఈ వేడుకలకు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కేంద్ర కమిటీ మహిళా అధ్యక్షురాలు దీపారెడ్డితోపాటు 33 జిల్లాలు, 55 ఫోరంల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. పథకాలను ప్రజలకు చేరవేయడంలో మహిళలు చురుగ్గా పనిచేయాలనిఏలూరి తెలిపారు. అనంతరం మహిళా నేతలు వాకిటి లలిత శ్రీహరి, హర్ష



శివసేనరెడ్డి, ఇందిరాశోభన్ మాట్లాడుతూ బతుకమ్మ అంటేనే ప్రకృతి పండుగ అని, కలిసిమెలిసి ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు.

అవసరమైన పక్షంలో రోజువారీ విచారణ జరపండి

సాక్షి, హైదరాబాద్: వాన్‌పిక్ ప్రాజెక్ట్ నష్టం రూ. 600 కోట్లు చెల్లించాలని నిమ్మగడ్డ ప్రసాద్‌ను ఆదేశిస్తూ గతంలో కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల అమలుకు రస్ అల్‌ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై అవసరమైన పక్షంలో రోజువారీ విచారణ చేపట్టాలని వాణిజ్య కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం విచారించింది.

ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన కొల్లేరు సరస్సు.. పక్షుల కిలకిలరావాలతో కళకళలాడే విహంగాల స్వర్గధామం. కానీ ఇప్పుడు ఆ స్వర్గంలో మరణమృదంగం మోగుతోంది. అతిథులను ఆత్మీయంగా ఆదరించాల్సిన మన సంస్కృతి సూక్తిని విస్మరించిన వేటగాళ్లు, విదేశీ పక్షులపై విరుచుకుపడుతున్నారు. తుపాకీ గుండ్లతో మూగజీవాల గుండెలను చీల్చేస్తూ, వలల ఉచ్చులతో ఊపిరి ఆడకుండా చేస్తున్నారు. అటవీ అభయారణ్య చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితమైపోయాయి. నియంత్రించాల్సిన అధికారుల కళ్లముందే వేటగాళ్ల దౌర్జన్యం పెరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో మరింత బరితెగించి కొల్లేరు ఒడిలో సేదతీరుతున్న పక్షుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. - కైకలూరు

విహంగాల స్వర్గంలో వేటగాళ్ల మరణమృదంగం



కొల్లేరులో విహరిస్తున్న పక్షుల గుంపులు



వేటగాళ్ల గుళికలకు మరణించిన కొల్లేరు జమ్ముకోడి పక్షులు (ఫైల్)

కొల్లేరులో వలలకు అరుదైన పక్షులు బలి
నాటు తుపాకులకు ప్రాణాలు హరీ

గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
చేతులెత్తేసిన అటవీశాఖ అధికారులు

ఆక్వా చెరువులపై వాలినా ఆయువు తీరినట్లే...

ఆక్వా చెరువులపై వాలిన అరుదైన పక్షి జాతులు సైతం వేటగాళ్ల నాటు తుపాకులకు బలవుతుండడం సమస్యకు మరో కోణం. రాష్ట్రంలో 5.75లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ విస్తీర్ణం 2.90 లక్షల ఎకరాలుగా ఉంది. ఎక్కువ విస్తీర్ణం కలిగిన చేపల రైతులు సాగు ప్రారంభంలో చేప పిల్లలను పక్షులు తినకుండా నాటు తుపాకుల కలిగి వేటగాళ్లను నియమించుకుంటారు. ఇందుకోసం తమిళనాడు, సూళ్లూరుపేట నుంచి వచ్చిన దాదాపు 150 కుటుంబాలు కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తుపాకితో ఒక్క పక్షిని చంపితే వీరికి రూ.200 నుంచి రూ.300 వరకూ పనికి తీసుకెళ్లిన చెరువు రైతులు చెల్లించాలి. ఈ క్రమంలో కొల్లేరులో సంచరించే పక్షులు చెరువులపై వాలితే వేటగాళ్లు కాల్చేస్తున్నారు. చేపలు పెద్దవైన తర్వాత సైతం వేటగాళ్లు తమ పక్షుల వేటను కొనసాగిస్తుండడం గమనార్హం. నాటు తుపాకులకు పేలే మందు తయారీ క్రమంలో అనేక మంది వేటగాళ్లు మరణించిన ఘటనలు కొల్లేరు ప్రాంతంలో చోటుచేసుకోవడం గమనార్హం.

అక్రమ వేటకు ఎన్నో ఆనవాళ్లు..

గుడివాకలంక, నిడమర్రు, అడవి కొలును, శృంగవరప్పాడుతో పాటు నడి కొల్లేరులోని అనేక ప్రాంతాల్లో వేట సాగిస్తున్నారు.

ఆగస్టు 29న ఏలూరు జిల్లా గుడివాకలంక వద్ద కొల్లేరు పక్షులను వేటాడి తెస్తున్న వ్యక్తిని ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట ప్రాంతంలో వేటాడానని అతను చెప్పాడు. ఇదే ప్రాంతంలో కొన్ని నెలల క్రితం బతికి ఉన్న పక్షుల తీసుకెళుతున్న ఒకరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ తీర్పుతో పక్షులను వదిలేశారు.

సెప్టెంబర్ 4న నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం చేపల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన 13 మృతి చెందిన పక్షులను, ఏడుగురు వేటగాళ్లను, 3 నాటు తుపాకులను భీమవరం ఫారెస్టు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

కొద్దిరోజుల క్రితం వేటగాళ్లు గుళికలతో చంపిన గ్లోసి ఐబీస్ కొల్లేరు పక్షుల ఫొటోలు సామాజిక మాద్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి.

ఇవే కాకుండా కొల్లేరులో పక్షుల వేటలో వెలుగు చూడని అనేక ఘటనలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి.



గుడివాకలంకలో మృతిచెందిన కొల్లేరు పక్షులు



నిడమర్రు ప్రాంతంలో వేటగాళ్ల చేతిలో మృతి చెందిన కొల్లేరులో సంచరించే గ్లోసీ ఐబీస్ పక్షులు

సరస్సు ముఖ్యాంశాలు..

ప్రాంతం: **901** చ.కి.మీ.

విస్తీర్ణం: **2,22,300** ఎకరాలు

అభయారణ్యం: **77,138** ఎకరాలు (9 మండలాలు)

గ్రామాలు: **122**

జనాభా: **3.50** లక్షలు

విహరించే పక్షి జాతులు: **182**

వలస పక్షులు: ప్రత్యేక ఆకర్షణ

సమస్యలు

వేటగాళ్లు 30 అడుగుల ఎత్తులో చిక్కు వలలు కడుతున్నారు

గుళికలు ఎరగా పెడుతున్నారు	జత పక్షులు సైజు బట్టి రూ.600–1,000 శ్రేణిలో విక్రయం
పక్షులను పట్టి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు	వేటగాళ్లపై గ్రామ పెద్దలు జరిమానాలు విధిస్తామన్నా ఫలితం లేదు.

పూర్వం వేటాడిన పక్షులను బహిరంగంగానే కొన్ని జాగ్రత్తలతో విక్రయించేవారు.

ఇప్పుడు నాయకుల సిఫార్సుల ఆధారంగా భారీగా విక్రయాలు సాగిపోతున్నాయి.

వేటకు గురవుతున్న ప్రధాన పక్షులు

పర్పూల్ శాంఫన్ (కొండింగాయి)	గ్లోసీ ఐబీస్ (నల్ల కంకణాల పిట్ట)
కామన్ మోర్‌హెన్ (జమ్ముకోడి)	విజిటింగ్ టీల్ (సిలువ బాతులు)
కామన్ కూట్ (నామాల కోడి)	గ్రేహెరాన్ (నారాయణ పక్షి)
టీల్ (పరజా)	కార్మోరెంట్ (నీటి కాకులు)



నిఘా ముమ్మరం



కొల్లేరు ప్రాంతంలో పక్షుల వేటగాళ్లపై నిఘాను ముమ్మరం చేశాం. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వేటాడినా, వాటి ఆవాసాలను నాశనం చేసినా, అభయారణ్యంలో ప్రవేశించినా నేరంగా పరిగణిస్తాం. రెండేళ్ల జైలు, రూ.20 వేల జరిమానాతో పాటు రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాల్సి ఉంటుంది. నాటు తుపాకులతో అభయారణ్యంలో ప్రవేశం నేరం.

– కె.రామలింగాచార్యులు, జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఏలూరు

ఏఐటీటీలో దేశంలోనే గిరిజన విద్యార్థిని టాప్



ఝాన్సీ లక్ష్మీభాయి

సీతంపేట(పార్వతీపురం మన్యం): ఈ ఏడాది జూలైలో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో(ఏఐటీటీ) స్థానిక ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్న గిరిజన విద్యార్థిని తంబర ఝాన్సీ లక్ష్మీభాయి 600 మార్కులకుగాను 600 సాధించి దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఝాన్సీ లక్ష్మీభాయిని ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో రైతులకు మేలు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు

సాక్షి, అమరావతి: కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ –2.0 సంస్కరణలు వ్యవసాయానికి ఎంతో మేలు చేయనున్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు వెల్లడించారు. జీఎస్టీ పన్ను తగ్గింపు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై 30, అక్టోబర్ 1వ తేదీల్లో జిల్లా, మండల, రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా వ్యవసాయ పనిముట్ల ప్రదర్శనతో పాటు ఏఏ పనిముట్టుపై గతంలో ఎంత జీఎస్టీ ఉండేది, ప్రస్తుతం ఎంత ఉంది, దాని వల్ల ఏ మేరకు ఆదాఅవుతుందో రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ మత్స్య, పశు సంవర్థక రంగాల్లో ఉపయోగించే వివిధ రకాల పరికరాల తయారీ, వాటి ఉత్పత్తులు, ఉపఉత్పతులకు సంబంధించిన 837 వస్తువులకు జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించారన్నారు. జీఎస్టీ ప్రయోజనాలపై శాఖల వారీగా నిర్వహించ తలపెట్టిన ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా 'జీఎస్టీ 2.0–అద్భుతమైన పొదుపు' అనే నినాదంతో వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా పోస్టర్స్, కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు గ్రామ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆదివారం డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు.

పొట్ట పోషణ కోసం



కూలాడితే గానీ కుందాడని బతుకులు వారివి. కొండకోనలు, వాగువంకలు, చెట్టుపుట్టలు తప్ప మరో దృశ్యానికి నోచుకోని అమాయక ప్రజలు వారు. మూడు పూటలా నాలుగు వేళ్లు నోటిలోకి వెళ్లాలంటే గ్రామం దాటి కూలి పనికి వేరే ఊరు వెళ్లేందుకు వారికి గెడ్డ దాటక తప్పదు. వర్షాకాలంలో అదారుగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఆకలితో పస్తులుండలేక, పొట్టపోషణ కోసం ప్రాణాలు అరచేతబట్టుకుని ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనికి పక్కనున్న చిత్రమే నిలువెత్తు సాక్ష్యం. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం, పనసభద్ర పంచాయతీ, గుంటభద్ర గ్రామానికి చెందిన గిరిజనులు మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఓ రైతు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలో కూలిపనులు చేసేందుకు 10 మంది గిరిజన మహిళలు శనివారం గుంటభద్ర గ్రామం నుంచి ఉదయం వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని గ్రామానికి వస్తున్న క్రమంలో అదారుగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు ఒక్కో మహిళను పీకల్లోతు గెడ్డ నుంచి తాడు సహాయంతో ఒడ్డుకు చేర్చాడు. – మక్కువ

డీఈవో పూల్ భాషా పండితులకు న్యాయం చేయండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డీఈవో పూల్‌లో ఉండి విధులు నిర్వర్తిస్తోన్న భాషా పండితులకు న్యాయం చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా శాశ్వత స్థానాలు లేక పాఠశాలలు మారుతూ భాషా పండితులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు 1,207 సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి డీఈవో పూల్ భాషా పండితులందరికీ శాశ్వత స్థానాలు కల్పించి పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి: ఆప్టా

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త అభ్యర్థులకు జిల్లాల్లోని పాఠశాలలు ఉన్న ప్రాంతాలపై అవగాహన ఉండదని, ఈ క్రమంలో వారికి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సరికాదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిపారు. అలాగే, డీఎస్సీ అభ్యర్థులకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి, వారివారి జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు.

చట్ట సభల్లోనే కుల వివక్ష ఉంటే బయట పరిస్థితి ఏంటి?

మండలి చైర్మన్ మోషేన్‌రాజుపై వివక్ష తగదు
కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం

సాక్షి, అమరావతి: ఎస్సీ అనే కారణంగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుపై కుల వివక్ష చూపడం తగదని, చట్టాలు చేసి, అమలు చెయ్యాల్సిన చట్ట సభల్లోనే ఇలా ఉంటే సమాజంలో పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ప్రశ్నించింది. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేయవద్దని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఏ.మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్‌ల కోసం నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవానికి మండలి చైర్మన్ మోషేన్‌రాజును ఆహ్వానించకుండా ప్రభుత్వం అవమానించిందని మండిపడ్డారు. దళితుడనే కారణంతో మోషేన్‌రాజును ఆహ్వానించకుండా అవమానించినట్లు కన్పిస్తోందన్నారు. మంత్రులు క్షమాపణలు చెబితే సరిపోదని, ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఆయన పేరును చేర్చి ఆ భవనాన్ని పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన మహిళా సాధికార సమావేశాలకూ మండలి చైర్మన్‌ను ఆహ్వానించలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికమైంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 75,006 మంది స్వామివారిని దర్శించుకోగా 45,413 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



తిరుపతి రూరల్ : కోలాటాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళారూపాలతో తుమ్మలగుంట గ్రామం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం వైభవంగా సాగింది. తిరుమలకు వెళ్లి శ్రీవారి గరుడోత్సవాన్ని తిలకించలేని సుమారు 75 వేల మంది భక్తులు తుమ్మలగుంటకు చేరుకుని గరుడోత్సవాన్ని తిలకించారు. రాత్రి 7.30 గంటలకు బయలుదేరిన గరుడ వాహనం అర్ధరాత్రి 12.30 గంటల వరకు సాగింది. కల్యాణ వేంకటేశ్వరుడు గరుడునిపై మలయప్ప స్వామిగా కొలువుదీరి భక్తులను కటాక్షించారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో కొలువైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోశారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో కొలువైన శ్రీ రాట్నాలమ్మ దేవస్థానం దేవీ నవరాత్రులను పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం శ్రీ రాట్నాలమ్మకు ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.39,450, విరాళంపై రూ.7,069, లడ్డూ ప్రసాదంపై రూ.18,975, ఫొటోల అమ్మకంపై రూ.2,130 కలిపి మొత్తం రూ.67,624 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.


ఆసియాలో అతిపెద్ద
ఫర్నిచర్ అమ్మకం
63% తగ్గింపు
₹1 డౌన్ పేమెంట్
36 నెలల EMI
ఉచితం
ఎలక్ట్రిక్ బైక్
₹49,999
ఫర్నిచర్ కొనుగోలుతో
లక్కీ డ్రాలు లేవు | స్క్రాచ్ కార్డులు లేవు | గ్యారంటీగా బహుమతులు
బైక్ ప్యాకేజ్: 3 సీటర్ సోఫా కమ్ బెడ్ + సెంటర్ టేబుల్ + గ్లాస్ డైనింగ్ టేబుల్, 4 చైర్స్‌తో + 2 సింగిల్ కాట్స్+ కంప్యూటర్ టేబుల్ + క్రాకరీ యూనిట్ + ఉచితం ఎలక్ట్రిక్ బైక్
ఉచితం బైక్
ఒక కస్టమర్‌కు 1 బైక్ పరిమితం
MRP ₹1,24,999
Sale ₹49,999
PER DAY EMI ₹54
ఇటాలియన్ ఫుల్ ఎ లెదర్ సోఫా సెట్: 3+2+1 పూర్తిగా డబుల్ మోటరైజ్డ్ ఎలక్ట్రికల్ రిక్లైనర్
● 6 సీటర్ ● కప్‌హోల్డర్ ● బాటమ్ లైట్ (7 రంగులు కలవు) ● హ్యాండ్‌రెస్ట్ స్టోరేజ్ ● కన్సోల్ టేబుల్
● USB ఛార్జర్: 2 రీడింగ్ లైట్స్ ● ఉచితం బైక్
MOTORIZED RECLINER
ZERO GRAVITY RECLINERS
ఉచితం బైక్
10 సంవత్సరాల వారంటీ ఉడెన్ స్ట్రక్చర్ కొరకు
MRP ₹5,09,999
Sale ₹2,49,999
PER DAY EMI ₹269
ప్రీమియం బెడ్ రూమ్ సెట్:
హైగ్లాస్ డ్యూకో పెయింటెడ్ హైడ్రాలిక్ కింగ్ సైజ్ బెడ్, 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో +5 డోర్ వార్డ్‌రోబ్ + డ్రెస్సింగ్ టేబుల్, స్టూల్‌తో
MRP ₹2,69,999
Sale ₹99,999
PER DAY EMI ₹108
కింగ్ సైజ్ కాట్, 2 బెడ్‌సైడ్ టేబుల్స్ & హై గ్లోస్ ఫినిష్, కుషన్ & హైడ్రాలిక్ స్టోరేజ్+ బైక్ ఉచితం
ఉచితం బైక్
MRP ₹1,39,999
Sale ₹59,999
PER DAY EMI ₹65
రిక్లైనర్ సోఫా సెట్: 3+2+1
+ ఉచితం పెయింటింగ్, కార్పెట్, కార్నర్ స్టాండ్ & TV యూనిట్ రూ. 50,000 విలువగలవి
MRP ₹2,14,999
Sale ₹99,999
PER DAY EMI ₹108
బ్రైడల్ సోఫా సెట్: 3+2+1+ డివైడర్ + ఉచితం షోకేస్ + కార్పెట్ + బైక్
MRP ₹ 1,09,999
Sale ₹49,999
PER DAY EMI ₹54
ఉచితం ♦ బైక్ ♦ బుక్ కేస్ ♦ కార్పెట్
4 చైర్స్‌తో మార్బుల్ డైనింగ్ టేబుల్+ ఉచితం సింగిల్ కాట్, రూ. 8,000 విలువ గలది
MRP ₹32,999
PER DAY EMI ₹15
Sale ₹13,999
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
● ఏదైనా డైనింగ్ టేబుల్ కొనండి మరియు పొందండి 30 పీసుల క్రాకరీ సెట్ ఉచితం ● ఏదైనా కాట్ కొనండి మరియు పొందండి 4 పీసుల బెడ్‌షీట్ మరియు పెయింటింగ్ ఉచితం
● ఏదైనా సోఫా కొనండి మరియు పొందండి కార్పెట్ మరియు సెంటర్ టేబుల్ ఉచితం ● మ.1 గం.కు ముందు కొనుగోలు చేయండి మరియు పొందండి కర్టెన్ మరియు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఉచితం
79933 33351, 79950 00930
♦ ఎ.ఎస్. రావ్ నగర్ ♦ అత్తాపూర్ ♦ బోడుప్పల్ ♦ దిల్‌సుఖ్‌నగర్ ♦ హైటెక్ సిటీ ♦ కరీంనగర్ ♦ కర్మన్‌ఘాట్
♦ కొంపల్లి ♦ కూకట్‌పల్లి ♦ నాగోల్ ♦ సికింద్రాబాద్ ♦ వరంగల్ ♦ విజయవాడ ♦ www.bantia.in

సాక్షి ప్లస్
ఆదివారం । 28-9-2025

- గతంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకే ప్రమాదాలు
- కానీ ఇప్పుడు వరుస వర్షాలతో పిడుగులతోనూ ముప్పు
- హెచ్చరికలు వచ్చేలా అందుబాటులో యాప్‌లు
- నివాసాలపై లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు అవసరం


పిడుగు పడే సమయాన ఆకాశంలో మెరుపులు (ఫైల్)

పిడుగుల వానలు

భద్రాచలం అర్బన్: వర్షాకాలం ఇంకా కొనసాగుతోంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఇదే సమయాన ఉరుములతో పాటు పిడుగులు పడుతుండగా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. పిడుగు శబ్దానికి కొందరు మృత్యువాత పడుతుండగా.. మరికొందరు దాని తీవ్రతకు బలవుతున్నారు. మృతుల్లో ఎక్కువగా పొలాల్లో పనిచేసే రైతులు, జీవాల కాపరులు, కూలీలు ఉంటున్నారు. అయితే, వర్షం పడుతున్న సమయంలో రక్షణగా ఉంటుందని చెట్ల కిందకు చేరుతుండడం సురక్షితం కాదని నిపుణులు సూచిస్తున్న నేపథ్యాన కథనమిది.

అత్యధిక ఉష్ణోగ్రత

సూర్యుడిపై ఉష్ణోగ్రత కంటే ఈ పిడుగు పడేటప్పుడు విడుదలయ్యే ఉష్ణోగ్రత దాదాపు ఐదురెట్లు ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు వందకు పైగా పిడుగులు పడతాయని సర్వేలు చెబుతున్నాయి. కాగా, పిడుగు బారిన పడకుండా కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. పిడుగుపాటుకు ఎక్కువ శాతం రైతులు, దినసరి కూలీలే గురవుతున్నారు. పొలం పనులకు వెళ్లిన వారు వర్షం మొదలుకాగానే చెట్ల కిందకు చేరతారు. ఆ సమయాన చెట్లపై పిడుగులు పడితే ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

పిడుగు అంటే?

ఆకాశం కారుమబ్బులతో నిండినప్పుడు మబ్బు పైభాగంలో ధనావేశం (ప్లస్), కింది భాగంలో రుణావేశం (మైనస్) ఉంటాయి. సముద్రపు నీరు ఆవిరై మేఘాలుగా మారతాయనే విషయం తెలిసిందే. గాలులు వీస్తున్నప్పుడు మేఘాలు కదులుతుంటాయి. మేఘాల్లో విడుదలైన పాజిటివ్ (ధనావేశం) కణాలు తేలిక కావడంతో పైభాగానికి చేరుతాయి. బరువు ఉండే నెగటివ్ (రుణావేశం) కణాలు మాత్రం అడుగు భాగానికి చేరతాయి. మేఘాలు దగ్గరికి వచ్చినప్పుడు పాజిటివ్, నెగటివ్ కణాల మధ్య ఆకర్షణ వల్ల భీకర శబ్దం వస్తుంది. ఆ సమయాన అత్యధిక విద్యుదుత్పత్తి అవుతుందని అంచనా. ఈ విద్యుత్‌లోని రుణావేశం భూమిపై ఉన్న ధనావేశం (ప్రధానంగా పచ్చని చెట్లు, గుట్టలు, ఎత్తుగా ఉన్న ఇనుప సంబంధిత వస్తువుల తదితరాలు) పైకి ప్రసరిస్తుంది. దీనినే పిడుగు అంటారు. ఆ పిడుగులో వేడితోపాటు ఎన్నో ఓల్టుల విద్యుత్ ఉండడం వల్ల విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతుంటారు. పిడుగులు భూమి మీద పడినప్పుడు వస్తువును బట్టి తీవ్రత మారుతుంది. పొలాల్లో పనిచేస్తున్న వారు మిగతా మొక్కల కంటే ఎత్తుగా ఉంటారు కాబట్టి.. పిడుగు నేరుగా మనుషులపై పడే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో మోకాళ్ల మధ్యలో తల పెట్టి కింద కూర్చుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చు.



ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న యాప్‌లు

యాప్‌ల అండ

పిడుగుల నుంచి రైతులు, ప్రజలను అప్రమత్తం చేసి వారికి దన్నుగా నిలిచేందుకు కేంద్ర వాతావరణ శాఖ ప్రత్యేక యాప్‌లు రూపొందించింది.

మేఘదూత్

పంటల సంరక్షణకు పిచికారీ వేళ వర్షాలతో రసాయన ఎరువులు వృథా అవుతుంటాయి. ఈ మేఘదూత్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలు ఫోన్‌కు సంక్షిప్త సందేశంగా అందుతాయి. రాబోయే అయిదు రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచన, ఆకాశం మేఘావృతం అవుతుందా, ఈదురుగాలులు ఏ మేరకు ఏ దిశగా వీస్తాయనే సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

రెయిన్ అలారం

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచన ఉందో సమాచారాన్ని క్షణాల్లో అందిస్తుంది.

దామిని

ఈ యాప్ ద్వారా 5 నుంచి 20 నిమిషాల్లోపు 20 కిలో మీటర్ల పరిధిలో ఎక్కడ పిడుగు పడుతుందో సమాచారం అందిస్తుంది. దీంతో రైతులు, ప్రజలు అప్రమత్తమై ప్రాణాలను రక్షించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భారీ వర్షాలు, ఉరుములు, మెరుపుల సమయాన తగిన జాగ్రత్తలు తీసుకుంటే వస్తువులను కాపాడుకోవచ్చు. ఇంట్లో ఉన్న స్విచ్‌బోర్డుల నుంచి ప్లగ్గులన్నీ తొలగించాలి. కిటికీలు, తలుపుల వద్ద ఉండి బయటకు చూడొద్దు. షవర్ కింద స్నానం చేయొద్దు. టీవీలు, కంప్యూటర్లు, ఏసీ నిలిపివేయాలి. ఆరుబయట వంట పాత్రలు శుభ్రం చేయొద్దు.


పిడుగుపాటుకు కాలిపోతున్న చెట్టు (ఫైల్)

లైట్నింగ్ కండక్టర్‌తో ప్రయోజనం

పిడుగుల నుంచి రక్షణ కోసం భౌతిక శాస్త్రవేత్త బెంజిమన్ ఫ్రాంక్లిన్ రాగి తీగలతో లైట్నింగ్ కండక్టర్ రూపొందించారు. వీటిని ఎత్తయిన భవనాలు, గుడి గోపురాలపై అమర్చేవారు. ఈ కండక్టర్ పిడుగుల్లోని విద్యుదావేశాన్ని గ్రహించి రాగి తీగల ద్వారా నేరుగా భూమిలోకి పంపిస్తుంది. ఈ క్రమంలో రాగి తీగలు కరిగిపోతుంటాయి. ప్రస్తుతం రాగి, కాంస్య మిశ్రమంతో రూపొందిచిన లైట్నింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ప్రజలు అవసరాన్ని బట్టి వినియోగిస్తే పిడుగుల బారి నుంచి రక్షణ పొందవచ్చు.

చెట్లకు దూరంగా ఉండాలి..



వర్షం కురిసినప్పుడు చెట్ల దగ్గరకు వెళ్లకపోవడమే మంచిది. వర్షం వచ్చేటప్పుడు సెల్ ఫోన్ వినియోగించడం కూడా మంచిది కాదు. విద్యుత్‌ను గ్రహించే వాటికి దూరంగా ఉండాలి. పిడుగుపాటుకు గురైతే వెంటనే స్పృహ కోల్పోతారు. ప్రథమ చికిత్సకు అవకాశం తక్కువగా ఉంటుంది. పిడుగు పాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెప్పి వెంటనే వైద్యులను సంప్రదించాలి.
– డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎంవో, ఏరియా ఆసుపత్రి, భద్రాచలం

శాసనసభలో కొండా లక్ష్మణ్ జయంతి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ప్రాంగణంలో శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు

సాక్షి, హైదరాబాద్: డీజీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఆవిర్భావానికి విశేష కృషి చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీలు మహేశ్ భగవత్, అనిల్ కుమార్, శాంతి భద్రతల ఏఐజీ రమణకుమార్ తదితరులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కార్యాలయానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలను స్మరించుకున్నారు.

డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: డీజీపీ కార్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ కార్యాలయం మహిళా సిబ్బంది, మహిళా పోలీస్ అధికారులు ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు డీజీపీ మహేశ్ భగవత్, పర్సనల్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, పీఅండ్ఎల్ ఐజీపీ రమేశ్, అడ్మిన్ ఏఐజీ నాగరాజు, డీజీపీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ భవన్‌లో బతుకమ్మ ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కోలాటం ఆటలు, పాటలతో ఆబ్కారీ భవన్‌లో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ నాంపల్లి కార్యాలయం ఆవరణలోని దేవికాంబ అమ్మవారి దేవాలయం ముందు శనివారం జరిగిన బతుకమ్మ వేడుకలో.. ఆ శాఖ మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వలరెడ్డితో పాటు టీజీబీసీఎల్ జనరల్ మేనేజర్ బి.అంశా విజయలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

317 జీవోను రద్దు చేయాలి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయులను శాశ్వతంగా వారి జిల్లా, జోన్లకు కేటాయించాలని 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్ చేసింది. 317 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ సచివాలయం ముట్టడికి ప్రయత్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 317 జీవో తెచ్చినప్పుడు బాధితుల పక్షాన పోరాటం చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఇందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే సమస్య పరిష్కరిస్తానని, మేనిఫెస్టోలో స్థానికత ఆధారంగా కేటాయింపులు చేస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు. ముగ్గురు సీనియర్ మంత్రులతో కమిటీ వేసినా తమకు న్యాయం జరగలేదన్నారు.

చట్టాలను చదవండి.. ఎక్సైజ్ శాఖకు గుర్తింపు తెండి

కొత్తగా ఎంపికైన గ్రూప్-1 ఉద్యోగులకు ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ సూచన

సాక్షి, హైదరాబాద్: చట్టాలను చదివి అవగాహన పెంచుకోవడం, ఫీల్డ్ వర్క్ చేయడం ద్వారా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారు పట్టు సాధించగలుగుతారని ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఎక్సైజ్ శాఖ నిర్వర్తించాల్సిన బాధ్యతలు, విధులను స్పష్టంగా అర్థం చేసుకోవడం ద్వారా సమయస్ఫూర్తితో పనిచేసి శాఖకు గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికై ఎక్సైజ్ శాఖలో చేరనున్న అధికారులు శనివారం ఆబ్కారీ కార్యాలయంలో కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ మంచి ర్యాంకులు సాధించి, ఉద్యోగాలు పొందిన అందరికీ అభినందనలు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో పనిచేసే వారికి యూనిఫారం సర్వీసు గుర్తింపు ఉంటుందని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, అక్రమ లిక్కర్‌ను అరికట్టడం ..ఇలా అన్ని రకాల విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ రాథోడ్ నరేశ్, సర్వీసెస్ అసిస్టెంట్ సెక్రటరీ నాగలక్ష్మి, ఒమర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలి: జూలకంటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. అధిక వర్షాల కారణంగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మూడున్నర లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు దెబ్బ తిన్నాయని తెలిపారు. వీటికి ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించి పైసా ఇవ్వలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం ఐదు లక్షల ఎకరాల్లో పంటల నష్టం జరిగినప్పుడు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ, పరిహారం పూర్తిగా అందలేదని గుర్తు చేశారు.

గోమాతకు సీమంతం


నల్లగొండ జిల్లా తిప్పర్తిలో గోమాతకు సీమంతం చేస్తున్న నగేశ్ దంపతులు

తిప్పర్తి: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన వ్యాపారి దొర్నాల నగేశ్ గత ఎనిమిది సంవత్సరాలుగా గోవులను పెంచుతున్నారు. అందులో ఒక గోవు సూడికి వచ్చింది. దీంతో నగేశ్ దంపతులు శనివారం గోమాతకు సీమంతం నిర్వహించారు. పండ్లు, పూలు సమర్పించి.. మహిళలను పిలిచి వాయినం ఇచ్చారు. ఆవులకు సేవ చేయడం ఎంతో తృప్తినిస్తుందని ఈ సందర్భంగా నగేశ్ అన్నారు.

తెలంగాణ జాతిపితగా కొండా లక్ష్మణ్ బాపూజీ

సాక్షి, హైదరాబాద్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకను శనివారం జలదృశ్యం వేదికగా బీసీ రాజ్యాధికార సమితి ఘనంగా నిర్వహించింది . ఈ కార్యక్రమానికి అనేకమంది రాజకీయ సామాజిక ప్రముఖులు హాజరై బాపూజీకి నివాళులు అర్పించారు. తదనంతరం ఏర్పాటుచేసిన స్మారక సభలో బాపూజీకి భారతరత్న కోసం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసులు సిద్ధం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రభుత్వాన్ని కోరారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవించిన 97 సంవత్సరాలలో 77 సంవత్సరాలు దేశ స్వాతంత్రం కొరకు, నిజాంలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, తెలంగాణ

బాపూజీ జయంతిలో ప్రముఖుల ఆకాంక్ష

రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు చేశారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. బాపూజీ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కోరారు. కొండా లక్ష్మణ్ సామాజిక తెలంగాణకోసం తపించారని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఐఏఎస్ చిరంజీవి గుర్తు చేశారు. బీసీ కమిషన్ సభ్యులు సురేందర్, జయప్రకాశ్, జాజుల శ్రీనివాస్ గౌడ్, వకుళాభరణం కృష్ణమోహన్, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ అధ్యక్షుడు రాపోలు జ్ఞానేశ్వర్, మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు.

ఖతార్‌లో తెలంగాణ జాగృతి బతుకమ్మ

హాజరైన ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: ఖతార్‌లో తెలంగాణ జాగృతి శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ నిర్వహించిన ఈ సంబురాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖతార్‌లోని తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. తెలంగాణ వాసులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. త్వరలోనే మీరంతా తెలంగాణకు తిరిగి వచ్చే మంచి రోజులు రావాలని, ఇక్కడే ఉన్నా సుఖంగా ఉండాలని కోరారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, వారి శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ కొట్లాడుతామన్నారు.


శనివారం పురానాపూల్ జియాగూడ రోడ్డులో మూసీ ఉధృతి..


కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద ఇలా..


పురానాపూల్ వద్ద వరద ధాటికి నీట మునిగిన ఇళ్లు

అందరికీ వరాల్చి ఆదుకునే దేవుడికే సమస్య వచ్చింది. అన్యాక్రాంతమవుతున్న తన భూములను రక్షించుకోలేక పోతున్నాడు. ఈ భూమి నాదే అంటూ న్యాయస్థానానికి మొరపెట్టుకుంటున్నాడు. కోట్లు విలువజేసే భూములున్నా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాల దాతలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ఒంగోలు డెయిరీకి ఇచ్చేసింది. ఈ భూములపై తమకు హక్కు ఉందంటూ కొంత మంది అత్యాశపరులు హైకోర్టుకెక్కారు.


పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం


దేవస్థానం భూమిలో నిర్మించిన ఒంగోలు డెయిరీ భవనం

దేవునికే పాలుపోక!

- వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములు పరాధీనం
- ఆలయ భూమి 7.3 ఎకరాల్లో ఒంగోలు డెయిరీ నిర్మాణం
- భూమి విలువ సుమారు రూ.85 కోట్లు
- గత టీడీపీ ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డులు తారుమారు
- భూమి రికార్డులు సరిచేయాలంటూ జేసీ కోర్టును ఆశ్రయించిన దేవస్థానం అధికారులు
- ఈ భూములపై హక్కు ఉందంటూ కొందరు హైకోర్టులో కేసు
- దేవుడి భూములు కాపాడాలని ప్రభుత్వ పెద్దలను కోరుతున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పురాణ ప్రసిద్ధి చెందిన ప్రకాశం జిల్లా పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములకు రక్షణ లేకుండా పోయింది. స్వామి వారికి వేలాది ఎకరాలు ఉన్నా అవి అన్యాక్రాంతమై పరుల ఆధీనంలో ఉన్నాయి. ఆలయానికున్న ఆస్తులతో గుడికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ అవి అన్యాక్రాంతమవడంతో దాతల సహకారంపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా దేవస్థానానికి చెందిన 7.30 ఎకరాల భూమి సంతనూతలపాడు మండల పరిధిలోని పేర్నమిట్టలో 128–1 సర్వే నంబరులో ఉంది. దాని విలువ రూ.85 కోట్లు పైనే ఉంది. ఆ భూమిలో ప్రభుత్వం డెయిరీని నిర్మించింది. ఇది కాకుండా తిరుపతి జిల్లా గూడూరులో 99 ఎకరాలు, మండలంలోని కనుమళ్ల పంచాయతీలో 98 ఎకరాల భూమి ఉంది. ఇవి కూడా ఆక్రమణలో ఉన్నాయి.

రికార్డులు తారుమారు

దేవస్థానం భూమి 7.30 ఎకరాల్లో ఒంగోలు సహకార డెయిరీని నిర్మించారు. ప్రకాశం జిల్లా పాడి ఉత్పత్తులదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో 1978లో దీనిని ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో భవనాలు, మిషనరీ ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగా ఉందని దేవదాయ వర్గాలు తెలియజేస్తున్నాయి. ఈ విషయం తెలిసినా అప్పటి ఆలయాధికారులు పెద్దగా పట్టించుకోలేదు. 2013 ఇనాం అబాలిష్ చట్టం వచ్చిన తర్వాత అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు దేవస్థానం అధికారులు ప్రయత్నించినప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. 2018 సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అడంగల్, వన్–బీలో మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా పేరు మార్చేసింది. 1905 సంవత్సరం నాటి (బ్రిటీష్ కాలంలోని) ఆర్ఎస్ఆర్‌లో మాత్రం వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పేరుమీద ఈ భూములు ఉన్నాయి. దీనిని ప్రభుత్వం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా పేరు ఎలా మారుస్తుందని భక్తులు నిలదీస్తున్నారు.

జేసీ కోర్టులో కేసు..

దేవస్థానానికి చెందిన భూమిలో డెయిరీ నిర్మించడంపై జేసీ కోర్టులో కేసు దాఖలు చేశారు. దేవుడి భూముల హక్కును సైతం మార్చేయడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు జేసీ కోర్టులో పలుసార్లు వాదనలు జరిగాయి. ఇదిలా ఉండగా ఏడు ఎకరాల భూమిలో ఎకరం భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ కొందరు అత్యాశపరులు హైకోర్టులో కేసు నమోదు చేశారు. దీనిపై సంతనూతలపాడు మండల రెవెన్యూ అధికారులు సైతం ఆ భూములను పరిశీలించారు. దేవుని ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని, ఇందు కోసం న్యాయపోరాటం చేస్తామని దేవస్థానం అధికారులు తెలియజేస్తున్నారు.

మూతపడిన డెయిరీ..


ప్రకాశం జిల్లా పాడి ఉత్పత్తులదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో డెయిరీ 1978లో ప్రారంభమైంది. రోజుకు 3.5 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యంతో పాటు, 30 మెట్రిక్ టన్నుల పాలపొడి తయారీ యూనిట్, 20 మెట్రిక్ టన్నుల వెన్న తయారీ, 10 మెట్రిక్ టన్నుల నెయ్యి తయారీ సామర్థ్యంతో ఒంగోలు డెయిరీ ఉండేది. 278 పాల సహకార సంఘాల ద్వారా 35 వేల మంది పాడి రైతులు నిత్యం పాలుపోసేవారు. ఒక వెలుగు వెలిగిన ఈ డెయిరీ కాలక్రమంలో ఆర్థిక కష్టాల్లో చిక్కుకుని, రైతులకు బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితికి చేరుకుంది. దీనినే నమ్ముకుని పనిచేసిన రెగ్యులర్, తాత్కాలిక సిబ్బంది 120 మంది రోడ్డున పడ్డారు. ప్రస్తుతం డెయిరీ కూడా మూలపడడంతో రూ.కోట్లు విలువజేసే భూములను తిరిగి దక్కించుకునేందుకు అధికారులు పోరాటం చేస్తున్నారు.


ఆధారాలు ఉన్నాయి..



జిల్లా డెయిరీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూమిలో నిర్మించారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం పూర్తి ఆధారాలు ఉన్నాయి. కానీ కొందరు రెవెన్యూ అధికారుల మాయాజాలంతో దేవునికి చెందాల్సిన భూములకు హక్కుదారుగా అడంగల్, వన్–బీ లో మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీగా నమోదు చేశారు. ఈ భూములు దేవునికి దక్కేలా న్యాయపోరాటం చేస్తాం. ఇప్పటికే దీనిపై జేసీ కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నాం.

– పీ కృష్ణవేణి, ఈఓ, వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం


రెవెన్యూ రికార్డు ఆర్ ఎస్ ఆర్ లో దేవస్థానం పేరుమీద భూమి ఉన్న దృశ్యం


రెవెన్యూ రికార్డులు వన్- బీలో దేవుని పేరు మీద భూమి ఉన్న దృశ్యం

క్లుప్తంగా...

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనని ప్రభుత్వ విప్, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఒక వెబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. తాను ఒక సాధారణ ఆర్టీసీ డ్రైవర్ కొడుకునని, లక్షల మంది తరపున పనిచేసే అవకాశం తనకు వచ్చిందని చెప్పారు. రాజకీయాల్లో అలసిపోయానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. వ్యవసాయం చేసుకుంటానన్నారు. జనసేనలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్నారు. రాజకీయాల్లో లేకపోయినా తాను పవన్ కల్యాణ్ వెంటే ఉంటానన్నారు. ప్రజా సేవ చేయాలనే ఆకాంక్ష ఉన్నవారికి మద్దతు ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.


నేటి నుంచి ట్రిపుల్ ఐటీలకు దసరా సెలవులు

నూజివీడు: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 5 వరకు యాజమాన్యం దసరా సెలవులను ప్రకటించింది. అక్టోబర్ 6 నుంచి తరగతులు పునఃప్రారంభమవుతాయని పేర్కొంది. దీంతో నూజివీడు ట్రిపుల్‌ఐటీ నుంచి విద్యార్థులు శనివారం నుంచే ఇళ్లకు బయలుదేరి వెళ్లారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ నూజివీడు డిపో అధికారులు ట్రిపుల్ ఐటీ నుంచి 41 బస్సులను ఏర్పాటు చేసి దూర ప్రాంతాల విద్యార్థులను వారి గమ్యస్థానాలకు చేర్చారు. కొందరు విద్యార్థులు సమీపంలోని విజయవాడ, హనుమాన్‌జంక్షన్‌లలో గల రైల్వేస్టేషన్‌లకు చేరుకొని ఇళ్లకు వెళ్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,358 మంది స్వామివారిని దర్శించుకోగా 29,166 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

మద్ది క్షేత్రంలో పూజలు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ఆలయంలో అభిషేక సేవ నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా స్వామి వారి ఉత్సవ మూర్తికి ఆలయ ముఖమండపంపై శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ. 1,40,146 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.



నాటి మెరుపులే తప్ప..

కొత్త వెలుగులేవీ..?

- విశాఖలో పడకేసిన పర్యాటకాభివృద్ధి
- ఏడాదిన్నర పాలనలో ఒక్క ప్రాజెక్టూ తీసుకురాని కూటమి సర్కారు
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే అంకురార్పణ
- కూటమి వచ్చిన తర్వాత ప్రైవేట్

సాక్షి, విశాఖపట్నం: 'పర్యాటక రాజధానిగా' విశాఖను మారుస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా టూరిజం రంగాన్ని గాలికొదిలేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తయి పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచుతున్నాయే తప్ప, కూటమి వచ్చాక ఒక్క కొత్త టూరిజం ప్రాజెక్టు అయినా పట్టాలెక్కకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కొత్త మెరుపులు లేకుండానే మరో పర్యాటక దినోత్సవం ముగిసిపోయిందని పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఐఎస్–2023 సదస్సులో రూ. 8,806 కోట్ల విలువైన 66 టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ఎంవోయూలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సింగపూర్, టర్కీ, ఫ్రాన్స్ వంటి దేశాలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించిన ఈ ప్రాజెక్టులు పడకేయడంతో విశాఖకు ప్రపంచ పర్యాటక పటంలో లభించాల్సిన స్థానం చేజారిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు కూటమి నాయకులు ఉన్న భూములను కొల్లగొట్టేందుకు పీపీపీ పేరుతో స్కెచ్‌లు వేస్తున్నారే తప్ప, కొత్తగా అభివృద్ధి చేయడం లేదన్న విమర్శలున్నాయి.

2024 ఏప్రిల్‌లోనే గ్లాస్ బ్రిడ్జికి ఎల్‌వోఏ

కైలాసగిరిపై నిర్మాణం పూర్తయిన గ్లాస్ బ్రిడ్జ్ ప్రాజెక్టు తమ ఘనతేనని కూటమి నేతలు ప్రచారం చేస్తుండగా, వాస్తవానికి ఈ ప్రతిపాదన 2022లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వచ్చిందే. 2024 జనవరిలో పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టుకు ఎల్‌వోఏ ఇచ్చారని, ఇప్పుడు పనులు పూర్తవడంతో ఆ క్రెడిట్ కూటమి తన ఖాతాలో వేసుకుంటోంది.

రూ. వేల కోట్ల భూములపై నేతల కన్ను

మరోవైపు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలు చేయకుండా, ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని రూ. వేల కోట్ల విలువైన పర్యాటక భూములను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు కూటమి నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. యాత్రినివాస్ వంటి భవనాలను ఇప్పటికే పీపీపీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగించింది. తమ నియోజకవర్గాల పరిధిలోని విలువైన పర్యాటక భూములను అనుచరులకు కట్టబెట్టడానికి కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. విశాఖ జిల్లాలో 176.15 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 22.67 ఎకరాలు, అల్లూరి జిల్లాలో 43.10 ఎకరాలు చొప్పున మొత్తం 241.92 ఎకరాల్ని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. త్వరలోనే కూటమి నేతల అనుచరులకు టూరిజం ప్రాజెక్టుల పేరుతో భూపందేరం జరగనుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించకుండా.. ఉన్న భూములను కూటమి నాయకులకు ధారాదత్తం చేసేందుకు.. ప్రభుత్వ పెద్దలు ఎవరికి చెబితే.. వారికి భూ కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన రూ. వేల కోట్ల ఒప్పందాలను పక్కన పెట్టి, భూములను కూటమి నేతల అనుచరులకు ధారాదత్తం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం.

అవకాశాలున్నా.. ఆలోచన సున్నా..!

మాటల్లోనే విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారే తప్ప.. వాస్తవ రూపం దాల్చేలా ఒక్క అడుగు కూడా కూటమి ప్రభుత్వం వెయ్యడం లేదు. గత ప్రభుత్వం హయాంలో ఒప్పందం ప్రకారం అన్నవరంలో ఒబెరాయ్, మై ఫెయిర్ హోటల్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరహా ఒప్పందం ఒక్కటి కూడా కూటమి ప్రభుత్వం చెయ్యలేదు. విశాఖ నగరంలో పర్యాటక వనరులు కోకొల్లలుగా ఉన్నాయి. వాటిని పట్టించుకోకుండా.. పీపీపీ పద్ధతిలో భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తుందే తప్ప.. కొత్త ఆలోచనల్ని అమలు చెయ్యడంలో పూర్తిగా విఫలమయ్యింది.

రూ. వేల కోట్ల భూములపై నేతల కన్ను

మరోవైపు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలు చేయకుండా, ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని రూ. వేల కోట్ల విలువైన పర్యాటక భూములను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు కూటమి నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. యాత్రినివాస్ వంటి భవనాలను ఇప్పటికే పీపీపీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగించింది. తమ నియోజకవర్గాల పరిధిలోని విలువైన పర్యాటక భూములను అనుచరులకు కట్టబెట్టడానికి కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. విశాఖ జిల్లాలో 176.15 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 22.67 ఎకరాలు, అల్లూరి జిల్లాలో 43.10 ఎకరాలు చొప్పున మొత్తం 241.92 ఎకరాల్ని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. త్వరలోనే కూటమి నేతల అనుచరులకు టూరిజం ప్రాజెక్టుల పేరుతో భూపందేరం జరగనుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించకుండా.. ఉన్న భూములను కూటమి నాయకులకు ధారాదత్తం చేసేందుకు.. ప్రభుత్వ పెద్దలు ఎవరికి చెబితే.. వారికి భూ కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన రూ. వేల కోట్ల ఒప్పందాలను పక్కన పెట్టి, భూములను కూటమి నేతల అనుచరులకు ధారాదత్తం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం.

త్వరలో మరో హిప్‌హాప్ బస్సు



ఉమ్మడి విశాఖలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే బీచ్‌రోడ్డులో రూ.5 కోట్లతో రెండు హిప్‌హాప్ బస్సులు నడుపుతున్నాం. త్వరలోనే మరో హిప్‌హాప్ బస్సు పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నాం. రుషికొండ, జోడుగుళ్ల పాలెం, భీమిలి బ్యాక్ వాటర్‌లో వాటర్‌స్పోర్ట్స్, కయాకింగ్, స్కూబాడైవింగ్ మొదలైనవి అందుబాటులోకి రాబోతున్నాయి. విశాఖ, అరకు క్యారవాన్స్ తీసుకొస్తున్నాం. టూరిజం హోటల్స్‌కు టెండర్లు వేశాం. త్వరలోనే వైజాగ్‌లో 2 వేల రూమ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. స్పోర్ట్స్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

– జీవీబీ జగదీష్, ఏపీటీడీసీ డీవీఎం

ప్రపంచ స్థాయి హోటల్స్‌తో పర్యాటకుల తాకిడి



ఈ ఏడాది టూరిజం డేని పర్యాటకంలో స్థిరమైన, సమగ్రాభివృద్ధి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నాం. పర్యాటక రంగంలో హాస్పిటాలిటీ ప్రధాన పాత్రపోషిస్తోంది. ప్రపంచస్థాయి హోటల్స్ రాబోతుండటంతో.. విశాఖకు సందర్శకుల తాకిడి రెట్టింపయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య ప్రస్తుతం కోటికి పైగా ఉంది. ఇది రెట్టింపు చేసుకునే అవకాశాలు బోలెడు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. భవిష్యత్తులో విశాఖకు విమానాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ విమానాల సంఖ్య పెరిగితే మెడికల్ టూరిజం, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధి చెందనున్నాయి.

– పవన్ కార్తీక్, ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

కైకలూరు.. పొట్టేళ్ల పందేల జోరు

- కొల్లేరు చెరువు గట్లు కేంద్రంగా నిత్యం నిర్వహణ
- ఒక్కొక్క పందెం రూ.లక్ష నుంచి ప్రారంభం
- ఉమ్మడి పశ్చిమలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం
- పందేల మాటున భారీగా వసూళ్లకు పాల్పడుతున్న కూటమి నేతలు
- కోడిపందేల కంటే ముందుగానే పొట్టేళ్ల పందేలతో హడావుడి
- కృష్ణా, పశ్చిమగోదావరి నుంచి నిత్యం పందేలరాయుళ్లు కైకలూరుకు రాక


కైకలూరు చెరువు గట్లపై నిర్వహిస్తున్న పొట్టేళ్ల పందేలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరిలో కొత్త ట్రెండ్ ప్రారంభమైంది. కోడిపందేలకు రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే పశ్చిమగోదావరి జిల్లా ఖ్యాతిగాంచింది. గత రెండు, మూడేళ్ల నుంచి జిల్లాలో ఒక ప్రాంతంలో పందులతో పందేలు నిర్వహించిన పందేలరాయుళ్లు తెలంగాణలో నిషేధించిన పొట్టేళ్ల పందాలకు జిల్లాను అడ్డాగా మారుస్తున్నారు. ప్రధానంగా కైకలూరు నియోజకవర్గంలోని కొల్లేరు చెరువు గట్లను పందెం అడ్డాలుగా మారుస్తూ లక్షల్లో పందేలు నిర్వహిస్తూ అధికార పార్టీ నేతలు కాసులు దండుకుంటూ అనేక మంది జేబులు గుల్ల చేస్తున్నారు. జిల్లాలో సంక్రాంతి సమయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కోడిపందేలు నిర్వహిస్తుంటారు. హైకోర్టు నిషేధాజ్ఞలు ఉన్నా పోలీసులు హడావిడి చేసినా ఏమీ లెక్కచేయకుండా అధికార పార్టీ ముసుగులో భారీగా కోడిపందేలు నిర్వహిస్తుంటారు. జూన్ నుంచే పందెం కోళ్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలను నిర్వహించి పందెం కోళ్లను సన్నద్ధం చేస్తుంటారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో కైకలూరు ప్రాంతంలోని కొల్లేరులో ఉన్న చేపల చెరువు గట్ల వద్ద భారీ జీతాలతో ట్రైనర్లను నియమించి ప్రత్యేక బ్రీడ్ పందెం పుంజులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంటారు. అలాంటి శిక్షణా కేంద్రాలే బెట్టింగ్ అడ్డాలుగా మారుతున్నాయి. పేకాట శిబిరం, కోడి పందేల బదులు పొట్టేళ్ల పందేలకు తెరతీయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నిర్మానుష్య ప్రాంతాల్లో ఆక్వా చెరువులు ఉండటంతో పోలీసుల హడావిడి ఉండదంటూ ఇతర ప్రాంతాల నుంచి జూదరులను ఆహ్వానిస్తున్నారు. తాజాగా చెరువు గట్లపై పొట్టేళ్ల పందేలను సైతం నిర్వహిస్తూ బరితెగింపునకు తెరలేపుతున్నారు. ఒక్కొక్క పందెం కనీసం రూ.లక్ష నుంచి పొట్టేలు స్థాయిని బట్టి రూ.3 లక్షల వరకు కూడా కాస్తున్నారు. జిల్లాలో సంక్రాంతి వంటి పెద్ద పండుగలకే పరిమితమైన కోడి పందేలు, పేకాట, పొట్టేళ్ల పందేలు కూటమి నేతలకు ఇప్పుడు నిత్య ఆదాయ వనరుగా మారిపోయాయి. చేపల చెరువు గట్లపై గుట్టు చప్పుడు కాకుండా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. కైకలూరులో రోజంతా ప్రజాప్రతినిధి వెంట తిరుగుతూ రాత్రి సమయంలో టిప్పర్ల మైనింగ్ అవతారం ఎత్తే నేత తాజాగా పొట్టేళ్ల పందేలకు శ్రీకారం చుట్టాడు. పోలీసు శాఖపై కూడా ఇతనికే పెత్తనం చేసే పని అప్పగించడంతో ఇతని వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. ఇతని చెరువు గట్టుపై వేసే ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతుంది. శని, ఆదివారాల్లో పొట్టేళ్ల పందేలు జరుగుతున్నట్టు సమాచారం. రెండు పొట్టేళ్లు కొమ్ములతో కొట్టుకుంటూ ఏది పారిపోతే అది ఓడిపోయినట్టు లెక్క. కోడి పందేలకు అలవాటు పడిన వ్యసనపరులు తెలియని పొట్టేళ్ల పందేలలో రూ.లక్షలు తగలేసుకుని ఇంటి ముఖం పడుతున్నారు.

తెలంగాణలో కేసులు

బెట్టింగులతో పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తే తెలంగాణలో కేసులు నమోదు చేస్తారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి కైకలూరు నియోజకవర్గం చావలిపాడులో కోడిపందేలతో పాటు పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 పొట్టేళ్లను తీసుకొచ్చారు. గొప్ప కోసం ఓ కూటమి నేత మహిళలతో కూడిన 30 మంది బౌన్సర్లను తీసుకొచ్చి ఆకర్షించాడు. దీంతో పొట్టేళ్ల పందేలకు వచ్చిన క్రేజ్‌ను కూటమి నేతలు ఉపయోగించుకుంటున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సంక్రాంతికి పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఏడాది వరకు వాటి జోలికి వెళ్లరు. తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పొట్టేళ్ల సంస్కృతిని తీసుకొస్తున్నారు.

కొల్లేరు అడ్డాగా పందేలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 9 మండలాల్లోని 122 గ్రామాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. సరస్సు సమీపంలో లక్షలాది ఎకరాల్లో చేపల చెరువుల సాగు చేస్తున్నారు. ఇవే పేకాట జూదరులకు అవకాశంగా మారుతున్నాయి. చెరువుల్లో వేసే మేతల నిల్వ కోసం, కాపలాదారుల కోసం గృహాలు నిర్మిస్తారు. కొందరు చెరువు వద్ద విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రధానంగా పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, భీమవరం నుంచి ఏలూరు జిల్లా సరిహద్దు కైకలూరు మండలంలో ఉప్పుటేరు సమీపంలోని చేపల చెరువులపై పేకాట శిబిరాలు జరుగుతున్నాయి. పోలీసులు డ్రోన్లు ఎగురవేసి మమ అనిపిస్తున్నారు. పొట్టేళ్ల పందేల నిర్వహణపై కైకలూరు సీఐ కృష్ణను వివరణ కోరగా.. పొట్టేళ్ల పందేలపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మల్టీస్టారర్ చేసేద్దాం మిత్రమా...

ప్రతి ఇండస్ట్రీలోనూ మల్టీస్టారర్ చిత్రాలు రూపొందుతూనే ఉంటాయి. ఓ సీనియర్ హీరో, ఓ రైజింగ్ హీరో కలిసి చేసిన మల్టీస్టారర్ చిత్రాలు ఉన్నాయి. అలాగే ఇద్దరు స్టార్స్ చేసిన 'ఆర్ఆర్ఆర్' వంటి మల్టీస్టారర్ సినిమాలూ ఉన్నాయి. కానీ ఇండస్ట్రీలో సుదీర్ఘమైన సక్సెస్‌ఫుల్ కెరీర్‌తో రాణించిన తర్వాత కొంత గ్యాప్ తీసుకుని, ఇద్దరు సీనియర్ హీరోలు మల్టీస్టారర్ సినిమాలు చేస్తుండటం, చేసేందుకు ఆసక్తి చూపిస్తుండటం ప్రజెంట్ ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. 'మల్టీస్టారర్ చేసేద్దాం మిత్రమా' అంటూ రెడీ అయిన కొంతమంది సీనియర్ హీరోలు చేస్తున్న మూవీస్‌పై ఓ లుక్ వేయండి.


● కమల్‌హాసన్, రజనీకాంత్


● చిరంజీవి, వెంకటేశ్

46 సంవత్సరాల తర్వాత...

కెరీర్ తొలినాళ్ళలో 'అపూర్వ రాగంగాళ్, మూండ్రు ముడిచ్చు, అంతులేని కథ'... ఇలా దాదాపు ఇరవైకి పైగా సినిమాల్లో కలిసి నటించారు రజనీకాంత్, కమల్‌హాసన్. కానీ 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించింది లేదు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి నటించే అవకాశం ఉంది. రజనీకాంత్‌తో మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం వస్తే హ్యాపీ అని ఇటీవల ఓ సందర్భంలో కమల్‌హాసన్ చెప్పారు. ఇలా కమల్ చెప్పిన తక్కువ రోజుల్లోనే కమల్‌హాసన్‌తో తాను సినిమా చేస్తున్నానని, రెడ్ జెయింట్ మూవీస్-కమల్‌హాసన్ ప్రొడక్షన్ హౌస్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్ సంస్థలు ఈ సినిమాను నిర్మిస్తాయని రజనీకాంత్ స్పష్టం చేశారు. దీంతో రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం కోలీవుడ్‌లో ఊపందుకుంది. కాగా, ఈ చిత్రానికి తొలుత దర్శకుడు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారనే ప్రచారం జరిగింది. కమల్‌తో 'విక్రమ్' వంటి హిట్ మూవీ తీశారు లోకేశ్. అలాగే రజనీకాంత్‌కు 'కూలీ'తో తమిళనాట మంచి విజయాన్ని అందించారు లోకేశ్. దీంతో కమల్-రజనీకాంత్ కాంబినేషన్ సినిమాకి లోకేశ్ దర్శకత్వం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కానీ మంచి కథ, స్క్రీన్ ప్లే కుదిరితేనే లోకేశ్‌తో సినిమా చేయాలని భావిస్తున్నారట కమల్-రజనీ. అంతే కాదు... మరికొంత మంది యువ దర్శకులను కూడా మంచి కథల కోసం అప్రోచ్ అవుతున్నారట. తాజాగా ప్రదీప్ రంగనాథన్ పేరు తెరపైకి వచ్చింది. దర్శకుడిగా 'కోమలి' సినిమాతో తొలి ప్రయత్నంతోనే హిట్ అందుకున్న ప్రదీప్ రంగనాథ్ ఆ తర్వాత 'లవ్ టుడే' సినిమాతో దర్శకుడితో పాటు హీరోగానూ సక్సెస్ అయ్యారు. రజనీకాంత్-కమల్‌హాసన్ కాంబినేషన్‌కు తాజాగా ఈ యువ దర్శకుడి పేరు తెరపైకి వచ్చింది. ఫైనల్‌గా 46 సంవత్సరాల తర్వాత కమల్‌హాసన్-రజనీకాంత్ కాంబోతో రానున్న సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తారనే విషయంపై సస్పెన్స్ వీడాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు.


● అమితాబ్ బచ్చన్


● షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్


● మోహన్‌లాల్, మమ్ముట్టీ

పండక్కి వస్తున్నారు

సిల్వర్‌స్క్రీన్‌పై ఒకే ఫ్రేమ్‌లో చిరంజీవి, వెంకటేశ్ కనిపిస్తే తెలుగు ఆడియన్స్‌కు పండగే. అదీ ఈ ఇద్దరు స్టార్ హీరోలు నటించిన సినిమా పండక్కి రిలీజైతే, ఈ పండగ సంక్రాంతి అయితే... ఇక చెప్పేది ఏముంది? వినోదాల సంబరాలు రెట్టింపు అవుతాయి. వచ్చే సంక్రాంతికి ఈ వినోదాల సంబరాలను సిల్వర్ స్క్రీన్‌పై చూపించనున్నారు 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. 'పండక్కి వస్తున్నారు' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, వెంకటేశ్, కేథరీన్, వీటీవీ గణేశ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఓ ఇన్వెస్టిగేషన్ డ్రామాకు ఫ్యామిలీ ఎమోషన్స్‌ను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోందని తెలిసింది. చిరంజీవి పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో వెంకటేశ్ కూడా పాల్గొననున్నారు. చిరంజీవి - వెంకటేశ్ కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు మేకర్స్. అలాగే చిరంజీవి-వెంకటేశ్-నయనతార-కేథరీన్‌ల కాంబినేషన్‌లో ఓ సెలబ్రేషన్ సాంగ్‌ను కూడా ప్లాన్ చేశారట అనిల్ రావిపూడి. సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. అతి త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై కూడా స్పష్టత రానుంది. భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.


● రణ్‌వీర్ సింగ్


● అక్షయ్ కుమార్


● సైఫ్ అలీఖాన్

మరో మల్టీస్టారర్!

మల్టీస్టారర్ మూవీస్ చేయడంలో సీనియర్ హీరో వెంకటేశ్ ముందు వరుసలో ఉంటారు. 'ఎఫ్ 2, వెంకీమామ, గోపాల గోపాల'... ఇలా వెంకీ కెరీర్‌లో మల్టీస్టారర్ మూవీస్ మెండుగానే ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా వెంకటేశ్ మరో మల్టీస్టారర్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇటీవల అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ సీనియర్ హీరోతో కలిసి సినిమా చేయనున్నట్లు వెంకటేశ్ తెలిపారు. అయితే ఈ చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు' కాదు. దీంతో వెంకటేశ్ చేయనున్న లేటెస్ట్ మల్టీస్టారర్‌లోని తాజా చిత్రంలో బాలకృష్ణ హీరోగా నటించే అవకాశాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

పేట్రియాటిక్ మూవీలో...

మలయాళ స్టార్ హీరోలు మోహన్‌లాల్, మమ్ముట్టీ కలిసి కొన్ని చిత్రాల్లో నటించారు. కానీ 2008లో వచ్చిన యాక్షన్ ఫిల్మ్ 'ట్వంటీ 20' తర్వాత మమ్ముట్టీ, మోహన్‌లాల్ కలిసి మరో సినిమా చేయడానికి పదహారేళ్లు పట్టింది. మహేశ్ నారాయణ్ దర్శకత్వంలోని 'పేట్రియాట్' (వర్కింగ్ టైటిల్) సినిమాలో మమ్ముట్టీ, మోహన్‌లాల్ మళ్లీ కలిసి నటిస్తున్నారు. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా తెలిసింది. ఫాహద్ ఫాజిల్, కుంచాకో బోబన్ ఈ చిత్రంలోని ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా కోసం ఓ లాంగ్ షూటింగ్ షెడ్యూల్ చిత్రీకరణ శ్రీలంకలో ముగిసింది. అయితే మమ్ముట్టీ ఆరోగ్య పరిస్థితుల కారణంగా ఈ సినిమాకు తాత్కాలిక బ్రేక్ పడినట్లుగా వార్తలు వస్తున్నాయి. అతి త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ తిరిగి ప్రారంభం అవుతుందనీ అజర్ బైజాన్, యూకే, మిడిల్ ఈస్ట్ దేశాల లొకేషన్స్‌లో చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలిసింది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● ఉపేంద్ర, శివ రాజ్‌కుమార్

పఠాన్ వర్సెస్ టైగర్!

షారుక్ ఖాన్ హీరోగా చేసిన బ్లాక్‌బస్టర్ మూవీ 'పఠాన్'లో సల్మాన్ ఖాన్ ఓ గెస్ట్ రోల్ చేశారు. సల్మాన్ ఖాన్ హీరోగా చేసిన 'టైగర్ 3' చిత్రంలో షారుక్ ఖాన్ గెస్ట్ రోల్ చేశారు. ఈ రెండు సినిమాల్లోనూ సల్మాన్ ఖాన్-షారుక్ ఖాన్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించినప్పుడు ఆడియన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. కానీ ఈ ఇద్దరూ కలిసి లీడ్ రోల్స్‌లో నటించి, దాదాపు 30 సంవత్సరాలవుతోంది. 1995లో వచ్చిన 'కరణ్ అర్జున్' సినిమా తర్వాత సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్‌లు కలిసి లీడ్ రోల్స్‌లో మరో సినిమా చేయలేదు. అయితే గత ఏడాదిగా సల్మాన్, షారుక్ హీరోలుగా ఓ సినిమా ప్లానింగ్ జరుగుతోందని బాలీవుడ్ సమాచారం. 'పఠాన్', 'టైగర్ 3'... ఈ రెండూ వైఆర్ఎఫ్ (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లోని చిత్రాలే. కాబట్టి ఈ స్పై యూనివర్స్‌లో భాగంగానే 'పఠాన్ వర్సెస్ టైగర్' అనే సినిమా రానుందని, యశ్‌రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మిస్తారని టాక్. 'పఠాన్, వార్' సినిమాలకు దర్శకత్వం వహించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తారని, కాకపోతే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ రావడానికి కొంత సమయం పడుతుందనే వార్త బాలీవుడ్‌లో ప్రచారంలోకి వచ్చింది. అలాగే 'వార్' సినిమా కూడా వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగమే కనుక హృతిక్ రోషన్ కూడా ఈ 'పఠాన్ వర్సెస్ టైగర్' చిత్రంలో గెస్ట్ రోల్ చేసే అవకాశం లేకపోలేదని, ఇదే నిజమమైతే అప్పుడు సల్మాన్, షారుక్, హృతిక్‌లను ఒకే ఫ్రేమ్‌లో చూడొచ్చని బాలీవుడ్ ఫ్యాన్స్ ఆశపడుతున్నారు. మరి... ఫ్యాన్స్ ఆశలు నిజమౌవుతాయా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

17ఏళ్ల తర్వాత...

బాలీవుడ్ స్టార్ హీరోలు అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్‌ల కాంబినేషన్‌లో బాలీవుడ్‌లో 'హైవాన్' అనే మల్టీ స్టారర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ హిందీ థ్రిల్లర్ సినిమాకు ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సయామీ ఖేర్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వెంకట్ కె. నారాయణ, శైలాజా దేశాయ్ ఫెన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ కూడా మొదలైంది. కొచ్చి, ఊటీ లొకేషన్స్‌లో కొంత భాగం చిత్రీకరణ జరిపారు మేకర్స్. తాజా షూటింగ్ షెడ్యూల్ చిత్రీకరణ ముంబైలో జరుగుతోందనే టాక్ వినిపిస్తోంది.

ఇక ఈ చిత్రదర్శకుడు ప్రియదర్శన్‌కు మోహన్‌లాల్‌తో మంచి అనుబంధం ఉంది. దీంతో ఈ 'హైవాన్'లో మోహన్‌లాల్ ఓ గెస్ట్ రోల్ చేసేందుకు అంగీకరించారట. ఇక ఈ చిత్రంలో మోహన్‌లాల్‌నే ఎందుకు గెస్ట్ రోల్‌కి తీసుకోవాలనుకున్నారంటే.. 'ఒప్పం'కు హిందీ రీమేక్‌గా 'హైవాన్' సినిమా తెరకెక్కుతోందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. మోహన్‌లాల్ హీరోగా ప్రియదర్శన్ దర్శకత్వంలో రూపొందిన 'ఒప్పం' సినిమా 2016లో విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించింది. మరోవైపు 'తషాన్' చిత్రం తర్వాత 17 ఏళ్లకు సైఫ్ అలీఖాన్, అక్షయ్ కుమార్ కలిసి నటిస్తున్న చిత్రం 'హైవాన్'యే కావడం విశేషం.

ముగ్గురు డాన్‌లు

బాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ డాన్స్ ముగ్గురూ ఒకే ఫ్రేమ్‌లో కనిపించే అవకాశం కనిపిస్తోంది. రణ్‌వీర్ సింగ్ హీరోగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో బాలీవుడ్‌లో 'డాన్ 3' అనే చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను 2023 ఆగస్టులోనే ప్రకటించినప్పటికీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. అయితే 1978లో వచ్చిన 'డాన్' సినిమాలో నటించిన అమితాబ్ బచ్చన్, 2006, 2011లో వచ్చిన 'డాన్, డాన్ 2' చిత్రాల్లో నటించిన షారుక్ ఖాన్ సైతం 'డాన్ 3'లో భాగం కానున్నారని, ఆ దిశగా ఫర్హాన్ అక్తర్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. మరి... రణ్‌వీర్ సింగ్, షారుక్ ఖాన్, అమితాబ్ బచ్చన్‌లు కలిసి ఒకే ఫ్రేమ్‌లో హిందీ సిల్వర్‌స్క్రీన్‌పై కనిపిస్తే, అంతకుమించిన ఆనందం హిందీ సినీ లవర్స్‌కి ఏముంటుంది. ఇక 'డాన్ 3'లో హీరోయిన్‌గా కియారా అద్వానీ నటించనున్నారు. విలన్‌గా విజయ్ దేవరకొండ, విక్రాంత్ మెస్సే, అర్జున్ దాస్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా 'డాన్ 3' చిత్రంలో ఎవరు విలన్‌గా నటిస్తారనే విషయంపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 2027లో 'డాన్ 3' చిత్రం థియేటర్స్‌లో రిలీజ్ అయ్యే చాన్సెస్ కనిపిస్తున్నాయి.

కథే హీరో

కన్నడ స్టార్ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రధారులుగా ఆర్.బి. శెట్టి మరో ప్రధాన పాత్రధారిగా నటించిన సినిమా '45'. వందకు పైగా సినిమాలకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేసిన అర్జున్ జన్యా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఎం. రమేశ్ రెడ్డి, ఉమా రమేశ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది. సనాతన ధర్మానికి సంబంధించిన అంశాలు ఈ సినిమాలో ఉంటాయని చిత్రయూనిట్ పేర్కొంది. అలాగే ఈ సినిమాలో ప్రత్యేకంగా హీరోలంటూ ఎవరూ లేరని, కథే ఈ సినిమాకు హీరో అని శివ రాజ్‌కుమార్ ఓ సందర్భంలో చెప్పారు. ఇక ఉపేంద్ర దర్శకత్వంలో శివ రాజ్‌కుమార్ హీరోగా నటించిన 'ఓం' (1995) సినిమా సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర కలిసి మళ్లీ అసోసియేట్ కావడం ఇదే అని టాక్.

కొంత గ్యాప్ తర్వాతనో లేక సరికొత్తగానో మల్టీస్టారర్ సినిమాలు చేసే సీనియర్ హీరోలు మరికొందరు ఉన్నారు.

- ముసిమి శివాంజనేయులు


ఆస్కార్‌కి లీడింగ్ లైట్


● 'లీడింగ్ లైట్' పోస్టర్

కోలీవుడ్ స్టార్ కపుల్ సూర్య, జ్యోతికల కుమార్తె దియా సూర్య దర్శకురాలిగా మెగాఫోన్ పట్టారు. 'లీడింగ్ లైట్: ది అన్‌టోల్డ్ స్టోరీస్ ఆఫ్ ఉమెన్ బిహైండ్ ది సీన్స్' అనే డాక్యుమెంటరీని తెరకెక్కించారు దియా. ఈ చిత్రాన్ని సూర్య-జ్యోతిక నిర్మించారు. సినిమా పరిశ్రమలోని లైటింగ్ విభాగంలో పని చేసే మహిళల జీవితాల్లోని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ డాక్యుమెంటరీని తీశారు దియా. కాగా 'లీడింగ్ లైట్' 2026 ఆస్కార్ క్వాలిఫయింగ్ రన్‌గా ఎంపికైంది. అంటే... ఈ చిత్రాన్ని లాస్ ఏంజెల్స్‌లోని రేగెన్సీ థియేటర్లో సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 2 వరకూ ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటలకు ప్రదర్శిస్తారు.

కట్టప్ప కథ ఏంటి?

బ్లాక్‌బస్టర్ మూవీ 'బాహుబలి'లో కట్టప్ప పాత్ర ఓ మేజర్ హైలైట్. ఈ పాత్రనే ప్రధాన కథాంశంగా 'బాహుబలి' రచయిత విజయేంద్ర ప్రసాద్ ఓ కథను రెడీ చేస్తున్నారట. ఈ కథతో ఓ సినిమా తీసేందుకే ఆయన కట్టప్ప పాత్ర ఆధారంగా స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారని, స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. మాహిష్మతి రాజ్యంలో కట్టప్ప ఎందుకు కట్టుబానిసలా ఉన్నాడు? కట్టప్ప గతం, కట్టప్ప పూర్వీకుల నేపథ్యం వంటి అంశాలు ఈ సినిమాలో ఉంటాయట. మరి... 'బాహుబలి' సినిమాలో కట్టప్ప పాత్రను పోషించిన సత్యరాజ్ 'కట్టప్ప' సినిమాలోనూ హీరోగా నటిస్తారా? లేక మరొకరు నటిస్తారా? ఎవరు దర్శకత్వం వహిస్తారు? అనే అంశాలపై స్పష్టత రావడానికి కొంత టైమ్ పడుతుంది. ప్రభాస్ హీరోగా, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్ కీలక పాత్రల్లో రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'బాహుబలి'. రెండు భాగాలుగా విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయాలను సాధించింది. అలాగే ఈ రెండు భాగాలను కలిపి 'బాహుబలి ది ఎపిక్'గా ఈ అక్టోబరు 31న విడుదల చేయనున్నారు.


● 'బాహుబలి'లో కట్టప్పగా సత్యరాజ్

ఎర్ర గులాబీలా...



పచ్చని చెట్ల మధ్య ఎర్రని గులాబీలా ఎరుపు రంగు డ్రెస్‌లో మెరిసి పోయారు అనుపమా పరమేశ్వరన్. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మైమరచిపోయారీ బ్యూటీ. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో 'పచ్చందనమే... పచ్చదనమే' అంటూ ఇలా సేద తీరారు. ఈ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.





అనుపమ షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. అభిమాన తార ఇలా కలర్‌ఫుల్‌గా కనిపించడంతో ఆమె అభిమానులు 'బ్యూటిఫుల్' అని కితాబులిచ్చేశారు. ఇక సినిమాల విషయానికొస్తే... అనుపమ నటించిన లేడీ ఓరియంటెడ్ మూవీ 'పరదా', బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన నటించిన 'కిష్కింధపురి' చిత్రాలు ఇటీవలే విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆమె తమిళ చిత్రం 'బైసన్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్నారు.

బిజినెస్ రీల్

ఇరాక్‌తో అపోలో హాస్పిటల్స్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇరాక్ అంతర్గత వ్యవహారాల శాఖతో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. దీని ప్రకారం ఇరాక్ రక్షణ బలగాలు, వారి కుటుంబాలకు అధునాతన వైద్య సేవలను అందించడంతో పాటు ఇంటర్నల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆసుపత్రిని నిర్వహించాల్సి ఉంటుందని వివరించింది. అంతర్జాతీయంగా ఆరోగ్య సంరక్షణ విభాగంలో భారత్ స్థానాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఇది దోహదపడగలదని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు.

తెలుగు విద్యార్థులకు నియో స్కాలర్‌షిప్



హైదరాబాద్: ఫ్లైట్ టికెట్ స్కాలర్‌షిప్‌లను దక్కించుకున్న విజేతల్లో ఇద్దరు తెలుగు విద్యార్థులు ఉన్నట్లు ట్రావెల్ ఫిన్‌టెక్ సంస్థ నియో వెల్లడించింది. వీరిలో హైదరాబాద్‌కి చెందిన అభయ్ చక్ర సాదినేని, విశాఖకు చెందిన వరుణ్ సాయి ఉన్నట్లు తెలిపింది. అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో అభయ్ డ్యుయల్ డిగ్రీ చేయనుండగా, కిర్గిజ్‌స్తాన్‌లోని ఓష్ స్టేట్ వర్సిటీలో వరుణ్ ఎంబీబీఎస్ చేయనున్నట్లు వివరించింది. విమాన టికెట్ల చార్జీల కింద ఇద్దరికీ చెరో రూ.50,000 స్కాలర్‌షిప్ అందించినట్లు నియో పేర్కొంది. ఫ్లై విత్ నియో స్టూడెంట్ ఫ్లైట్ టికెట్ స్కాలర్‌షిప్ కింద 10 మంది విద్యార్థులకు మొత్తం రూ. 5,00,000 విలువ చేసే స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు పేర్కొంది.

కేంద్రానికి ఎన్‌టీపీసీ రూ. 3,248 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరానికి (2024–25) గాను ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ సంస్థ, కేంద్రానికి రూ. 3,248 కోట్ల తుది డివిడెండును అందించింది. కంపెనీ సీఎండీ, డైరెక్టర్లు కలిసి ఈ మేరకు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌కి పేమెంట్ అడ్వైజ్‌ను అందజేశారు. ఇప్పటికే ఇచ్చిన రూ. 2,424 కోట్ల తాత్కాలిక తొలి డివిడెండు, రూ. 2,424 కోట్ల రెండో తాత్కాలిక డివిడెండుకు ఇది అదనమని కంపెనీ తెలిపింది. దీంతో పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 8.35 చొప్పున మొత్తం రూ. 8,096 కోట్ల డివిడెండ్ ఇచ్చినట్లయిందని వివరించింది. అలాగే వరుసగా 32వ ఏడాది కూడా చెల్లించినట్లయిందని పేర్కొంది.

దుబాయ్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచ్‌పై ఆంక్షలు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు దుబాయ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అథారిటీ(డీఎఫ్‌ఎస్‌ఏ) షాక్ ఇచ్చింది. బ్యాంకుకు చెందిన దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్సియల్ సెంటర్(డీఐఎఫ్‌సీ) బ్రాంచిలో కొత్త కస్టమర్లను చేర్చుకోవడంపై నిషేధం విధించింది. డీఎఫ్‌ఎస్‌ఏ ఆదేశాలను అమలు చేయడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని, దీనివల్ల తమ కార్యకలాపాలు, ఆర్థిక స్థితిగతులపై పెద్దగా ప్రభావం ఉండదని బ్యాంకు తెలిపింది. ''డీఎఫ్‌ఎస్‌ఏ నుంచి 'డెసిషన్ నోటీసు' అందింది. కస్టమర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు, సరిగ్గా రిజిస్టర్ చేసుకోని కస్టమర్లకు సేవలు అందించడం వంటి అంశాల కారణంగా డీఎఫ్‌ఎస్‌ఏ ఈ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం కొత్త కస్టమర్లను చేర్చుకోకూడదు. అయితే ఇప్పటికే ఉన్న వినియోగదారులకు సేవలను కొనసాగించవచ్చు'' అని ఎక్స్చేంజీలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమాచారం ఇచ్చింది. జాయింట్ అకౌంట్లతో సహా డీఐఎఫ్‌సీ శాఖలో 1,489 మంది కస్టమర్లు ఉన్నారని బ్యాంకు పేర్కొంది. డీఎఫ్‌ఎస్‌ఏ రాతపూర్వకంగా ఆదేశాలను సవరించే వరకు లేదా రద్దు చేసే వరకు నిషేధం కొనసాగుతుందని బ్యాంకు వివరణ ఇచ్చింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-9-2025

విశాఖ	530-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

హెచ్‌ఎంఎస్‌ఐ 'సీబీ350సీ' స్పెషల్ ఎడిషన్



- ధర రూ.2,01,900
- బుకింగ్‌లు ప్రారంభం

గురుగ్రామ్: న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) 'సీబీ350సీ' స్పెషల్ ఎడిషన్‌ను విడుదల చేసింది. ఎక్స్ షోరూమ్ ధర రూ.2,01,900గా నిర్ణయించారు. ఇప్పటికే బుకింగ్‌లు మొదలయ్యాయి. హోండా ప్రీమియం బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల ద్వారా అక్టోబర్ మొదటి వారం నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. మ్యాట్ డూన్ బ్రౌన్, రెబెల్ రెడ్ మెటాలిక్ రెండు రంగుల్లో లభిస్తుంది. ఫ్యూయల్ ట్యాంక్‌పై కొత్త 'సీబీ350సీ' లోగో, స్పెషల్ ఎడిషన్ స్టిక్కర్ ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఫ్యూయల్ ట్యాంక్, ముందు, వెనుక ఫెండర్లపైన కొత్త స్ట్రైప్డ్ గ్రాఫిక్స్ మరింత ప్రీమియం లుక్‌ను ఇస్తున్నాయి. రైడర్ల కోసం డిజిటల్–అనలాగ్ క్లస్టర్ అందుబాటులోకి తెచ్చారు. హోండా స్మార్ట్‌ఫోన్ వాయిస్ కంట్రోల్ సిస్టమ్ ఉంది. సులభతర, సురక్షిత రైడింగ్‌కు డ్యూయల్–ఛానల్ ఏబీఎస్, హోండా సెలెక్టబుల్ టార్క్ కంట్రోల్ (హెచ్‌ఎస్‌టీసీ), అసిస్ట్, స్లిప్పర్ క్లచ్ వంటి కీలక భద్రతా ఫీచర్లను అందించారు. ఇంజిన్‌లో ఎటువంటి మార్పులు లేవు. బీఎస్4 ఓబీడీ2బీ, ఈ20 ఇంధన స్పెసిఫికేషన్‌లకు అనుగుణంగా తీర్చిదిద్దిన 348.36సీసీ, సింగిల్–సిలిండర్, ఎయిర్–కూల్డ్ ఇంజిన్‌తో వస్తుంది. ఇంజిన్ 5,500 ఆర్‌పీఎం వద్ద 20.78 బీహెచ్‌పీ పవర్‌ను, 3,000 ఆర్‌పీఎం వద్ద 29.5 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5–స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తుంది.

క్రెడిట్ కార్డులకు పండగల బూస్ట్

- ఆగస్టులో దాదాపు 7 లక్షల కొత్త కార్డుల జారీ
- ఏడు నెలల గరిష్ట స్థాయిలో ఇష్యూ
- 11.23 కోట్లకు చేరిన మొత్తం యాక్టివ్ కార్డుల సంఖ్య



న్యూఢిల్లీ: పండగ సీజన్ డిమాండ్ నేపథ్యంలో బ్యాంకులు పోటాపోటీగా పెద్ద స్థాయిలో క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నాయి. పరిశ్రమ గణాంకాల ప్రకారం ఆగస్టులో దాదాపు 7,00,000 కార్డులను ఇష్యూ చేశాయి. ఇది ఏడు నెలల గరిష్ట స్థాయి కావడం గమనార్హం. దీంతో మొత్తం యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 11.23 కోట్లకు చేరింది. నెలవారీగా క్రెడిట్ కార్డులపై చేసే ఖర్చు రూ. 1.91 లక్షల కోట్లుగా నమోదైంది. వార్షికంగా 13.7 శాతం పెరిగింది. గతేడాది ఆగస్టులో ఈ వ్యయాలు రూ. 1.68 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా హెచ్‌డీఎఫ్ బ్యాంక్ కార్డులపై కొనుగోలుదారులు చేసిన వ్యయాలు 24 శాతం పెరిగి ఏకంగా రూ. 53,873 కోట్లుగా నమోదయ్యాయి. రూ. 33,063 కోట్లతో (24.8 శాతం వృద్ధి) ఎస్‌బీఐ కార్డ్ రెండో స్థానంలో ఉంది. పండగ సీజన్‌లో కస్టమర్లు గణనీయంగా ఖర్చు చేస్తున్న ధోరణి కనిపిస్తోందని కోటక్ మహీంద్రా బ్యాంక్ బిజినెస్ హెడ్ (క్రెడిట్ కార్డ్స్) ఫ్రెడరిక్ డిసౌజా తెలిపారు. ట్రావెల్, లైఫ్‌స్టయిల్‌లాంటి అంశాలపై వ్యయం చేయడం పెరిగిందని పేర్కొన్నారు. పన్నులపరమైన ప్రయోజనాలు కూడా తోడు కావడం వల్ల క్రెడిట్ కార్డుల వినియోగం మరింతగా పెరుగుతుందని భావిస్తున్నట్లు వివరించారు. ఎప్పట్లాగే ఆన్‌లైన్ లావాదేవీలు అత్యధికంగా ఉంటున్నాయని, కార్డుల వినియోగానికి ఎలక్ట్రానిక్స్, ట్రావెల్, లైఫ్‌స్టయిల్ కొనుగోళ్లు దన్నుగా నిలుస్తున్నాయని డిసౌజా పేర్కొన్నారు. వినియోగదారులు ప్రీమియం, మరింత ఖరీదైన ఉత్పత్తుల కొనుగోళ్ల వైపు మొగ్గు చూపే ధోరణి కనిపిస్తోందని పేర్కొన్నారు. అలాగే జీఎస్టీ ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రత్యేక డిస్కౌంట్లు, ఈజీ పేమెంట్ ఆప్షన్లు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో కంపెనీలు దూకుడుగా పండగ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండటం కూడా వ్యాపారాలకు మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. పీడబ్ల్యూసీ ఇండియన్ పేమెంట్స్ హ్యాండ్‌బుక్ ప్రకారం, జెన్–జెడ్ వినియోగదారుల సెగ్మెంట్లో, ద్వితీయ..చిన్న నగరాల్లో క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతోంది.

డేటా ఇలా..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ జూలైలో జారీ చేసిన 3,15,000 కార్డులతో పోలిస్తే తక్కువే అయినప్పటికీ, మిగతా బ్యాంకులతో పోలిస్తే అత్యధికంగా 2,21,000 కొత్త కార్డులను జారీ చేసింది. దీంతో ఆ బ్యాంకులోని మొత్తం కార్డుల సంఖ్య 2.5 కోట్లకు చేరింది. 1,40,000 కొత్త కార్డులతో యాక్సిస్ బ్యాంక్ రెండో స్థానంలో నిల్చింది. జూలైలో జారీ చేసిన 1,22,000 కార్డులను కూడా కలిపితే మొత్తం కార్డుల సంఖ్య 1.53 కోట్లకు చేరింది. అటు ఐసీఐసీఐ బ్యాంక్ తాజాగా 1,30,000 ఇష్యూ చేయడంతో మొత్తం సంఖ్య 1.81 కోట్లకు ఎగిసింది. జూలైలో నమోదైన 67,664 కార్డులతో పోలిస్తే బ్యాంకు ఆగస్టులో రెట్టింపు సంఖ్యలో జారీ చేసింది. ఇక రెండో అతి పెద్ద ఇష్యూయర్ అయిన ఎస్‌బీఐ కార్డ్స్ కొత్తగా 69,531 ఇష్యూ చేయడంతో మొత్తం కార్డుల సంఖ్య 2.13 కోట్లకు చేరింది. అయితే, ఆర్‌బీఎల్ బ్యాంక్ కార్డులు మాత్రం 1,00,000 తగ్గడంతో మొత్తం యాక్టివ్ కార్డుల సంఖ్య 45 లక్షలకు తగ్గింది. అయినప్పటికీ పండగ సీజన్‌పై బ్యాంకు ఆశావహంగా ఉంది.

పీసీల విక్రయాల వృద్ధికి అపార అవకాశాలు

హెచ్‌పీ ఇండియా ఎండీ ఈప్సితా దాస్‌గుప్తా



న్యూఢిల్లీ: భారత్‌లో పర్సనల్ కంప్యూటర్ల (పీసీ) వినియోగం కేవలం 20 శాతంగా ఉన్న నేపథ్యంలో విక్రయాల వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని హెచ్‌పీ ఎండీ (ఇండియా, బంగ్లాదేశ్, శ్రీలంక) ఈప్సితా దాస్‌గుప్తా తెలిపారు. ఇళ్లల్లో, కార్యాలయాల్లో పీసీలను మరింతగా వినియోగంలోకి తెచ్చేందుకు పరిశ్రమ వినూత్న వ్యూహాలను అన్వేషించాలని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగాల విషయంలో పీసీలు కీలక పాత్ర పోషిస్తాయని ఈప్సితా వివరించారు. దేశీయంగా తమ ఉత్పత్తుల విక్రయానికి సంబంధించి కమర్షియల్ విభాగం పటిష్టంగా ఉందని, కన్జూమర్ విభాగం కాస్త నెమ్మదించి, మళ్లీ పుంజుకుంటోందని ఆమె చెప్పారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోకి కార్యకలాపాలు విస్తరించడం, చిన్న–మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) ప్రాధాన్యతనివ్వడం వంటి అంశాలపై దృష్టి పెడుతున్నట్లు ఈప్సితా తెలిపారు.

ఆటో విడిభాగాలకు టారిఫ్‌ల దెబ్బ

- మొత్తం ఉత్పత్తి 8 శాతం డౌన్
- ఇక్రా రేటింగ్స్ తాజా అంచనా



న్యూఢిల్లీ: అధికస్థాయిలో యూఎస్ విధిస్తున్న టారిఫ్‌లు దేశీయంగా మొత్తం ఆటో విడిభాగాల తయారీని దెబ్బతీయనున్నట్లు రేటింగ్స్ సంస్థ ఇక్రా పేర్కొంది. ఇతర ఆసియా దేశాల ఎగుమతిదారులతో పోలిస్తే భారత్ నుంచి ఆటో విడిభాగాలను ఎగుమతి చేసే సంస్థలకు ఇది ప్రతికూలంగా పరిణమించనున్నట్లు తెలియజేసింది. ఇది భారత్, యూఎస్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద ప్రాధాన్యతను పట్టి చూపుతున్నట్లు పేర్కొంది. ఆటో విడిభాగాల పరిశ్రమ ఆదాయంలో 30 శాతం ఎగుమతులనుంచే లభిస్తున్నట్లు తెలియజేసింది. దీనిలో ఒక్క యూఎస్ నుంచే 27 శాతం సమకూరుతున్నట్లు వివరించింది. వెరసి ఇటీవల యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు దేశీయంగా మొత్తం ఆటో విడిభాగాల ఉత్పత్తిపై ప్రత్యక్షంగా 8 శాతం ప్రభావాన్ని చూపనున్నట్లు ఇక్రా తాజాగా అంచనా వేసింది. 15–30% టారిఫ్‌లను ఎదుర్కొంటున్న చైనా, జపాన్, వియత్నాం, ఇండొనేసియా తదితర ఆసియా దేశాలతో పోల్చితే భారత్ ఎగుమతిదారులకు ప్రతికూలమేనని తెలియజేసింది.

కేపీఐ గ్రీన్‌కు ఎస్‌బీఐ నిధులు

రూ. 3,200 కోట్ల రుణాలకు ఓకే



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ నుంచి ఫైనాన్స్ సౌకర్యాన్ని పొందినట్లు పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ కేపీఐ గ్రీన్ ఎనర్జీ తాజాగా వెల్లడించింది. దీంతో ఎస్‌బీఐ నుంచి రూ. 3,200 కోట్ల రుణాన్ని అందుకోనున్నట్లు తెలియజేసింది. సోలార్, హైబ్రిడ్ ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ ప్రాజెక్టులకు ఎస్‌బీఐ రుణాలు సమకూర్చనున్నట్లు తెలియజేసింది. వీటిని గుజరాత్‌లో మొత్తం 1జీడబ్ల్యూపీ సామర్థ్యంతో ఏర్పాటు చేయనుంది. రెండు వ్యూహాత్మక పాజెక్టులకు ఈ రుణ సౌకర్యాలు మద్దతివ్వనున్నట్లు పేర్కొంది. 250 మెగావాట్ల(ఏసీ), 350 ఎండబ్ల్యూపీ(డీసీ) సోలార్ పవర్ ప్రాజెక్టుతోపాటు.. 370 మెగావాట్ల హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు వీటిలో ఉన్నాయి.

సంస్కరణలు ఆదుకుంటాయ్

- ప్రతికూలతల నుంచి రక్షణ
- హెచ్–1బీ ప్రభావాన్ని పరిశీలించాల్సిందే
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల అజెండా వాణిజ్య పరమైన అవాంతరాల కారణంగా ఏర్పడే ప్రతికూలతల నుంచి రక్షణనిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లలో ఆటుపోట్లు, షాక్‌ల పట్ల అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపింది. కార్పొరేట్ పన్ను, వ్యక్తిగత ఆదాయపన్ను తగ్గింపు అనంతరం చేపట్టిన మూడో సంస్కరణ జీఎస్‌టీ శ్లాబుల క్రమబద్ధీకరణగా పేర్కొంది. దీనివల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని, దేశ వృద్ధి అవకాశాలు మరింత పెరిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. బలమైన వృద్ధి రేటు, స్థూల ఆర్థిక అంశాల స్థిరత్వం, ద్రవ్య క్రమశిక్షణ వంటి అంశాలతో భారత సావరీన్ క్రెడిట్ రేటింగ్‌ను మూడు రేటింగ్ ఏజెన్సీలు అప్‌గ్రేడ్ చేయడాన్ని ప్రస్తావించింది. ఇటీవల హెచ్1–బి వీసాలపై అమెరికా విధించిన లక్ష డాలర్ల ఫీజును ప్రస్తావిస్తూ.. భవిష్యత్తు రెమిటెన్స్‌లు (స్వదేశానికి నిధుల బదిలీ), వాణిజ్య మిగులుపై దీని ప్రభావం ఏ మేరకో పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపింది. ఇప్పటి వరకు ప్రభావితం కాని సేవల రంగాన్ని సైతం వాణిజ్య అనిశ్చితులు ప్రభావితం చేస్తాయనడానికి హెచ్–1బి వీసాపై విధించిన ఫీజును నిదర్శనంగా పేర్కొంది. ఇప్పటికైతే ఈ రిస్కులను ఎదుర్కోగలమన్న దృక్పథంతో ఉన్నట్లు తెలిపింది.

టారిఫ్ అనిశ్చితులతో ఉపాధికి రిస్క్

వృద్ధి వేగాన్ని కొనసాగించేందుకు నియంత్రణపరమైన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి అవసరమని కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. రాష్ట్రాలు సైతం తమ పరిధిలో నియంత్రణలను తొలగించినట్లయితే దేశ ఆర్థిక వ్యవస్థను అధిక వృద్ధి పథంలో నడిపించొచ్చని అభిప్రాయపడింది. ''టారిఫ్ పరమైన అనిశ్చితులు కొనసాగితే, ఎగుమతుల రంగాలపై ప్రభావం పడుతుంది. అది దేశీ ఉపాధి అవకాశాలను, ఆదాయం, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. కొత్త మార్కెట్లకు మనకు తగిన అవకాశాలు కల్పించేందుకు, ఎగుమతుల వృద్ధికి కొంత సమయం పడుతుంది''అని వివరించింది.

చమురు షేర్ల విలువ సరికాదు

- ఆరేళ్లలో రూ. 2.5 లక్షల కోట్ల లాభం
- స్విగ్గీ, జొమాటోకు రూ. 24,000 కోట్ల నష్టాలు
- హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీల విలువతో సమానం
- పెట్రోలియం, సహజవాయు మంత్రి హర్‌దీప్ సింగ్ పురి



ముంబై: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజాల(ఓఎంసీలు) షేర్ల విలువలపై కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి తాజాగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. మార్కెట్లో వీటికి ఇన్వెస్టర్ల నుంచి లభిస్తున్న విలువపట్ల ప్రభుత్వం నిరాశకు లోనైనట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్(ఐవోసీ), హిందుస్తాన్ పెట్రోలియం(హెచ్‌పీసీఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) ఉమ్మడిగా గత ఆరేళ్లలో రూ. 2.5 లక్షల కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలియజేశారు. అయితే ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ స్విగ్గీ, జొమాటో సంయుక్తంగా రూ. 24,000 కోట్ల నష్టాలు ప్రకటించినట్లు ప్రస్తావించారు. అయితే మూడు ఓఎంసీల విలువతో ఈ రెండు కంపెనీల విలువ అటూఇటుగా సమానంగా ఉన్నట్లు వ్యాఖ్యానించారు. గతేడాది మూడు ఓఎంసీలు ఉమ్మడిగా ఆర్జించిన లాభాలు దేశీ కార్పొరేట్ లాభాల్లో 3.3 శాతం వాటాకు సమానమని పేర్కొన్నారు. అయితే వీటి విలువ 1 శాతానికంటే తక్కువేనని వెల్లడించారు. వెరసి చమురు మార్కెటింగ్ పీఎస్‌యూ షేర్లకు తగిన విలువ లభించడంలేదని అభిప్రాయపడ్డారు.

వాటా విక్రయ యోచన

ఇంధన విక్రయ దిగ్గజాలలో ప్రభుత్వం కొంతమేర వాటా విక్రయించేందుకు చూస్తున్నట్లు పురి తెలియజేశారు. అయితే వీటిలో పూర్తి వాటాను అమ్మివేసే యోచనలేదని స్పష్టం చేశారు. కంపెనీల సామర్థ్యాన్ని మెరుగుపరిచే దిశలో స్వల్ప వాటాను విక్రయించనున్నట్లు తెలియజేశారు. అయితే బీపీసీఎల్ ఈ జాబితాలో లేనట్లు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఆఫీస్ లీజింగ్ డౌన్

- 48 శాతం తక్కువగా నమోదు
- ఏడు నగరాల్లో ఫ్లాట్ పనితీరు
- సెప్టెంబర్ క్వార్టర్‌లో 172 లక్షల ఎస్‌ఎఫ్‌టీ
- కొలియర్స్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఆఫీసు లీజింగ్ (కిరాయికి ఇవ్వడం) సెప్టెంబర్ త్రైమాసికంలో డీలా పడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 48 శాతం తక్కువగా 15 లక్షల చదరపు అడుగులుగా (ఎస్‌ఎఫ్‌టీ) ఉంటుందని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 29 లక్షల చదరపు అడుగులుగా ఉండడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో మాత్రం ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఫ్లాట్ పనితీరు చూపించింది. 172 లక్షల చదరపు అడుగులు (ఎస్‌ఎఫ్‌టీ)గా ఉంటుందని.. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో డిమాండ్ తగ్గినట్టు కొలియర్స్ ఇండియా తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఏడు నగరాల్లో ఆఫీస్ వసతుల లీజింగ్ 174 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉండడం గమనార్హం. లీజు పునరుద్ధరణ లావాదేవీలు ఇందులో కలసి లేవు. ఈ మేరకు సెప్టెంబర్ త్రైమాసికంపై తన అంచనాలను కొలియర్స్ ఇండియా విడుదల చేసింది.

- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో లీజింగ్ 16 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉండొచ్చన్నది కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ పరిమాణం 24 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంది.
- బెంగళూరులోనూ లీజింగ్ 25 శాతం తగ్గి 47 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంటుంది.
- కోల్‌కతాలో ఎలాంటి వృద్ధి లేకుండా లక్ష చదరపు అడుగులుగా ఉండొచ్చు.
- చెన్నై మార్కెట్లో ఆఫీస్ వసతుల లీజింగ్ 86 శాతం మేర పెరిగి 26 లక్షల ఎస్‌ఎఫ్‌టీకి చేరుకుంటుంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లీజింగ్ పరిమాణం 14 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంది.
- ముంబైలోనూ 76 శాతం వృద్ధితో 30 లక్షల చదరపు అడుగుల మేర లీజింగ్ నమోదు కానుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 17 లక్షల ఎస్‌ఎఫ్‌టీగా ఉంది.
- పుణెలో 37 లక్షల ఎస్‌ఎఫ్‌టీ మేర లీజింగ్ ఉండొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 42 శాతం అధికంగా నమోదు కానుంది.
- అన్ని రకాల ఆఫీస్ స్పేస్ లీజింగ్‌ను గమనిస్తే 8 శాతం పెరిగి 509 లక్షల చదరపు అడుగులుగా ఉంటుందన్నది అంచనా.

బలమైన పనితీరు..

''భారత ఆఫీస్ మార్కెట్ బలమైన పనితీరును కొనసాగిస్తోంది. అంతర్జాతీయంగా భౌగోళిక, వాణిజ్య పరమైన అనిశ్చితులు నెలకొన్నప్పటికీ ఈ ఏడాది తొమ్మిది నెలల్లో లీజింగ్ 50 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీని అధిగమించింది. ఏడు నగరాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఇప్పటికే 20 లక్షల ఎస్‌ఎఫ్‌టీ లీజింగ్‌ను నమోదు చేశాయి. మొత్తం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో వీటి వాటా 40 శాతానికి చేరింది''అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మెహరోత్రా తెలిపారు.

ఇళ్ల అమ్మకాలు డీలా

- హైదరాబాద్‌లో 11 శాతం డౌన్!
- ఏడు నగరాల్లో 9 శాతం తగ్గొచ్చు
- అమ్మకాల విలువ పెరగొచ్చు
- రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ అంచనా

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 9 శాతం మేర తక్కువగా ఉంటాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ అంచనా వేసింది. 97,080 యూనిట్ల విక్రయాలు నమోదు కావొచ్చంటూ క్యూ2పై ఇప్పటి వరకు ఉన్న గణాంకాల ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 1,07,060 యూనిట్లుగా ఉన్నాయి. కానీ, విలువ పరంగా 1.52 లక్షల కోట్ల విక్రయాలు ఉంటాయని, క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాల విలువ రూ.1.33 లక్షల కోట్లతో పోల్చి చూస్తే ఇది 14 శాతం అధికమని పేర్కొంది. ప్రీమియం, లగ్జరీ ఇళ్ల విభాగంలో లావాదేవీలు పెరగడం మొత్తం మీద సెప్టెంబర్ త్రైమాసికంలో విక్రయాల విలువ వృద్ధికి కారణమని అనరాక్ నివేదిక తెలిపింది. సరఫరా కంటే విక్రయాలే అధికంగా ఉన్నట్టు అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి తెలి పారు. రియల్ ఎస్టేట్ మార్కెట్లో పరిస్థితి సానుకూలంగా ఉన్నట్టుగా ఇది తెలియజేస్తోందన్నారు.

హైదరాబాద్‌లో 11,305 యూనిట్లు

- హైదరాబాద్ మార్కెట్లో సెప్టెంబర్ త్రైమాసికంలో అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం తగ్గి 11,305 యూనిట్లుగా ఉంటాయన్నది అనరాక్ అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో 12,735 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- బెంగళూరులో ఒక శాతం తక్కువగా 14,835 యూనిట్ల విక్రయాలు జరగొచ్చు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 13,920 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 11 శాతం తక్కువ.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 16 శాతం తగ్గి 30,260 యూనిట్ల అమ్మకాలు నమోదు కావొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో 36,915 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- పుణెలో 16 శాతం క్షీణతతో 16,620 యూనిట్లు అమ్ముడుపోవచ్చు. కోల్‌కతాలో 4,130 యూనిట్ల విక్రయాలు జరగొచ్చన్నది అనరాక్ వేసిన అంచనా. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇక్కడ 3,980 యూనిట్ల అమ్మకాలతో పోల్చి చూస్తే 4 శాతం అధికం.
- చెన్నైలోనూ 33 శాతం అధికంగా 6,010 యూనిట్ల అమ్మకాలు ఉంటాయని అనరాక్ నివేదిక పేర్కొంది.

సాక్షి ప్లస్
ఆదివారం । 28-9-2025

అనిరుధ్ జోడీకి టైటిల్

సాక్షి, హైదరాబాద్: జింగ్‌షాన్ ఓపెన్ ఏటీపీ–100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో అనిరుధ్ చంద్రశేఖర్ జంట టైటిల్ చేజిక్కించుకుంది. చైనా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల డబుల్స్‌లో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)–రిసీ స్టాల్డర్ (అమెరికా) జంట విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో అనిరుధ్–రిసీ స్టాల్డర్ జోడీ 6–2, 2–6, 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో సుంగ్ హావో హువాంగ్ (చైనీస్ తైపీ)–యుసింగ్ పార్క్ (దక్షిణ కొరియా) ద్వయంపై గెలుపొందింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో అనిరుధ్ జంట 2 ఏస్‌లు సంధించి... 3 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌ను సునాయాసంగానే నెగ్గిన అనిరుధ్–స్టాల్డర్ జోడీకి రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. ఇక ఉత్కంఠభరితంగా సాగిన నిర్ణయాత్మక మూడో సెట్ 'సూపర్ టైబ్రేక్'కు చేరగా... ఒత్తిడిని అధిగమించి కీలక సమయాల్లో పాయింట్లు సాధించిన భారత జంట విజేతగా నిలిచింది. 67 నిమిషాల పాటు సాగిన తుదిపోరులో 2 బ్రేక్ పాయింట్లు సాధించిన అనిరుధ్–స్టాల్డర్ జోడీ... మొత్తం 49 పాయింట్లు నెగ్గింది. తమ సర్వీస్‌లో 34 పాయింట్లు సాధించి ముందంజ వేసింది.





ప్రపంచ చాంపియన్ శీతల్

పారా ఆర్చరీలో కొత్త చరిత్ర ● వ్యక్తిగత స్వర్ణంతో పాటు రజత, కాంస్యాలు

గ్వాంగ్‌జూ (దక్షిణ కొరియా): భారత ఆర్చర్ శీతల్ దేవి చేతుల్లేకపోయినా పతకాల వేటలో చరిత్ర సృష్టించింది. ప్రపంచ పారా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో 18 ఏళ్ల ఆర్చర్ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించింది. అసలు భుజాల నుంచే చేతుల్లేని ఈ కశ్మీరీ టీనేజర్ ఏకంగా ప్రపంచ నంబర్‌వన్ ఆర్చర్ ఒజ్నూర్ కుర్ గిర్డిని కంగు తినిపించి మహిళల విభాగంలో చరిత్ర పుటలకెక్కింది. మిగతా దివ్యాంగులతో పోల్చితే తాజా ఈవెంట్ బరిలోకి దిగిన చేతులే లేని ఏకైక ఆర్చర్ శీతల్ తన చేతలతో భళా అనిపించింది. విలువిద్యలో లక్ష్యంపై గురిపెట్టాలంటే చేతులే కీలకం. కానీ జమ్మూ కశ్మీర్ పారా ఆర్చర్ కాలి వేళ్లతోనే విల్లును నియంత్రిస్తూ లక్ష్యంపై గురి పెడుతోంది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఫైనల్లో ఆమె 146–143 స్కోరుతో టర్కీకి చెందిన ప్రపంచ నంబర్‌వన్ ఒజ్నూర్ గిర్డిపై విజయం సాధించి స్వర్ణం చేజిక్కించుకుంది. ఓవరాల్‌గా పారా ఆర్చరీ చరిత్రలో చేతుల్లేని ఆర్చర్ స్వర్ణం గెలవడం గతంలో ఒకే ఒక్కసారి జరిగింది. 2022లో అమెరికాకు చెందిన మ్యాట్ స్టుట్‌మన్ దుబాయ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారం గెలిచాడు. అతనికీ చేతుల్లేవ్. 39 ఏళ్ల వయసులో అతను చరిత్ర లిఖించగా, మహిళల విభాగంలో... అది కూడా 18 ఏళ్ల వయసులోనే చాంపియన్‌గా నిలిచిన చరిత్ర మాత్రం మన శీతల్‌దే కావడం విశేషం! ఈమె ఫైనల్లో తలపడిన టర్కిష్ నంబర్‌వన్ ఒజ్నూర్ గిర్డి వీల్‌చైర్ ఆర్చర్. గిర్డికి కాళ్లలో వైకల్యమున్నా... చేతులు రెండు వంద శాతం పనిచేస్తున్నాయి. అంటే నిబంధనల ప్రకారం ఆమె పారా అథ్లెటే అయినప్పటికీ ఆర్చరీలో మాత్రం పూర్తిస్థాయి అథ్లెట్‌గా భావించవచ్చు. అలాంటి ప్రత్యర్థిపై చేతుల్లేని శీతల్ విజయం సాధించడమే గొప్ప విషయం.

ఒకే రోజు ఐదు పతకాలు

అంతకుముందు శీతల్ దేవి జోడీకట్టి జంట పతకాలు సాధించింది. మహిళల టీమ్ విభాగంలో సరితతో కలిసి రజతం గెలిచింది. ఈ విభాగంలో జరిగిన ఫైనల్లో భారత్‌కు చెందిన శీతల్–సరిత ద్వయం 148–152తో టర్కీ మేటి జోడీ ఒజ్నూర్ కుర్ గిర్డి–బూర్సా ఫత్మా చేతిలో ఓడింది. దీంతో భారత జంట రన్నరప్‌తో తృప్తిపడింది. అనంతరం మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో తోమస్ కుమార్‌తో జతకట్టిన శీతల్ కాంస్య పతకం గెలుచుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోటీల్లో శీతల్–తోమస్ జోడీ 152–149 స్కోరుతో బ్రిటన్‌కు చెందిన జాదీ గ్రిన్‌హమ్–నాథన్ మెక్‌క్విన్ జంటపై విజయం సాధించింది. తోమస్ వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచాడు. ఇద్దరు భారతీయుల మధ్యే జరిగిన పురుషుల కాంపౌండ్ ఫైనల్లో తోమస్ 40–20తో రాకేశ్ కుమార్‌పై గెలిచాడు. సాంకేతిక అంశాల కారణంగా పోటీ మధ్యలోనే రాకేశ్‌ను తప్పించాల్సి వచ్చింది. దీంతో శనివారం జరిగిన పోటీల్లోనే భారత్‌కు మొత్తం ఐదు పతకాలు లభించాయి. ఇందులో రెండేసి చొప్పున స్వర్ణ, రజతాలుండగా, ఒక కాంస్య పతకం కూడా ఉంది.





వరుసగా రెండో పరాజయం



కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పర్యటనలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో పోరులో జ్యోతి సింగ్ సారథ్యంలోని భారత జట్టు 0–5 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా అండర్–21 జట్టు చేతిలో ఓడింది. గత మ్యాచ్‌లో గట్టి పోటీనిచ్చి పరాజయం పాలైన భారత అమ్మాయిలు... ఈ పోరులో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయారు. ప్రత్యర్థికి కనీసం పోటీనివ్వలేక వెనుకబడింది. భారత్ ఒక్క గోల్ కూడా చేయలేకపోగా... ఆస్ట్రేలియా జట్టు తరఫున మకేలా జోన్స్ (10వ, 11వ, 52వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించింది. సమీ లవ్ (38వ నిమిషంలో), మిగాలియా హవెల్ (50వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. గత మ్యాచ్‌లో కేవలం ఒక్క గోల్ తేడాతో ఓడిన భారత్... ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడులు చేయడంలో విఫలమైంది. మ్యాచ్ ఆరంభం నుంచి అటాకింగ్ గేమ్ ఆడిన ఆస్ట్రేలియా అమ్మాయిలు... పదేపదే భారత గోల్‌పోస్ట్‌పై దాడులు చేస్తూ ఒత్తిడి కొనసాగించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో చిలీ వేదికగా ఎఫ్‌ఐహెచ్ జూనియర్ మహిళల ప్రపంచకప్ జరగనుండగా... దానికి ముందు ఈ సిరీస్‌ను సన్నాహకంగా వినియోగించుకోవాలనుకున్న భారత్‌కు నిరాశ ఎదురవుతోంది. ఇరు జట్ల మధ్య సోమవారం ఇక్కడే మూడో మ్యాచ్ జరగనుంది.

బెంగాల్ వారియర్స్ మూడో విజయం



జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో బెంగాల్ వారియర్స్ మూడో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన తొలి పోరులో బెంగాల్ వారియర్స్ 48–42 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవాంక్ 22 పాయింట్లతో విజృంభించడంతో జట్టు సునాయాసంగా గెలుపొందింది. హిమాన్షు నర్వాల్, అశీష్ మాలిక్ చెరో 5 పాయింట్లతో సారథికి అండగా నిలిచారు. పట్నా పైరేట్స్ తరఫున అయాన్ 15 పాయింట్లు, మణిందర్ సింగ్ 12 పాయింట్లతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు రెయిడింగ్‌లో 29 పాయింట్లు సాధించగా... ట్యాక్లింగ్‌లో ముందంజ వేసిన బెంగాల్‌ను విజయం వరించింది. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన బెంగాల్ వారియర్స్ 3 విజయాలు, 5 పరాజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 10వ స్థానంలో కొనసాగుతోంది. ఇక పట్నా 8 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 6 పరాజయాలతో 4 పాయింట్లు సాధించి 11వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 37–28 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. తలైవాస్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లు సాధించగా... పింక్ పాంథర్స్ తరఫున నితిన్ కుమార్ 8 పాయింట్లు సాధించాడు. లీగ్‌లో జైపూర్ అంచె పోటీలు ముగియగా... ఇక చెన్నై వేదికగా మ్యాచ్లు జరగనున్నాయి. లీగ్‌లో ఆదివారం విశ్రాంతి దినం కాగా... సోమవారం జరగనున్న మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో గుజరాత్ జెయింట్స్, దబంగ్ ఢిల్లీతో హర్యానా స్టీలర్స్ తలపడనున్నాయి.

రష్మిక–కపిల్ జోడీ పసిడి గురి

- వన్షిక–జొనాథన్ జంటకు రజతం
- 11 పతకాలతో అగ్రస్థానంలో భారత్
- ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ ప్రపంచకప్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో భారత షూటర్ల జోరు సాగుతోంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు స్వర్ణ, రజతాలు ఖాతాలో వేసుకున్నారు. రష్మిక సెహగల్–కపిల్ శర్మ అదిరిపోయే గురితో పసిడి పతకం ఖాతాలో వేసుకున్నారు. ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్ వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించిన రష్మిక–కపిల్ జోడీ... శనివారం మిక్స్‌డ్ ఈవెంట్ ఫైనల్లో 16–10 పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన వన్షిక–జొనాథన్ గావిన్ ఆంటోనీ జంటపై గెలుపొందింది. ఒర్టెగా కాస్ట్రో–లూకాస్ సెంచెజ్ (స్పెయిన్) ద్వయం కాంస్యం ఖాతాలో వేసుకుంది. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో రష్మిక–కపిల్ చెరో 291 పాయింట్లు స్కోరు చేసి 582 పాయింట్లతో అగ్రస్థానంతో ఫైనల్‌కు చేరారు. వన్షిక–జొనాథన్ ద్వయం 578 పాయింట్ల (287+291)తో రెండో స్థానం దక్కించుకుంది. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ క్వాలిఫయింగ్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జోడీలు పసిడి పతకం కోసం పోటీ పడగా... మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జంటల కాంస్య పతక పోరు జరిగింది. ఫైనల్లో ఆరంభం నుంచే రష్మిక–కపిల్ జంట ఆధిక్యం కొనసాగించింది. ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పురుషుల వ్యక్తిగత విభాగంలో పసిడి పతకం ఖాతాలో వేసుకున్న జొనాథన్... ఫైనల్లో విజృంభించినా... వన్షిక పలుమార్లు తడబడంతో ఈ జోడీ రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జూనియర్ మహిళల స్కీట్ విభాగంలో ఒలింపియన్ రైజా ఢిల్లాన్ రజత పతకం కైవసం చేసుకుంది. ఇటలీకి చెందిన అరియానా 53 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా... ఢిల్లాన్ 51 పాయింట్లతో రజతం నెగ్గింది. భారత్‌కే చెందిన మాన్సి రఘువంశీ 41 పాయింట్లతో కాంస్య పతకం దక్కించుకుంది. జూనియర్ మెన్స్ స్కీట్ విభాగంలో భారత షూటర్లు హర్‌మెహర్ సింగ్, అతుల్ సింగ్ రజావత్ వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచి పతకం కోల్పోయారు. మూడు రోజుల పోటీలు ముగిసేసరికి భారత్ 11 పతకాల (2 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలు)తో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇటలీ (2 స్వర్ణాలు, 1 రజతం) రెండో స్థానంలో ఉండగా... తటస్థ అథ్లెట్స్ రెండు స్వర్ణాలు గెలిచి మూడో స్థానంలో ఉన్నారు.



యువ భారత్ ఏడోసారి

'శాఫ్' చాంపియన్‌షిప్ కైవసం

చెన్నై: అండర్–17 దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) చాంపియన్‌షిప్‌లో భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. శనివారం కొలంబో వేదికగా జరిగిన ఫైనల్లో భారత జట్టు పెనాల్టీ షూటౌట్‌లో బంగ్లాదేశ్‌పై విజయం సాధించి ట్రోఫీ చేజిక్కించుకుంది. ఈ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడం ఇది ఏడోసారి. తుదిపోరు నిర్ణీత సమయంలో 2–2 గోల్స్‌తో సమం కాగా... అనంతరం విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన పెనాల్టీ షూటౌట్‌లో భారత్ 4–1తో ముందంజ వేసింది. భారత్ తరఫున డల్లామౌన్ గాంగ్టే (4వ నిమిషంలో), అజ్లాన్ షా (38వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. షూటౌట్‌లో భారత్ నుంచి డల్లామౌన్ గాంగ్టే, కొరో కొన్‌థోజమ్, ఇంద్ర రాణా, శుభమ్ పునియా విజయవంతం అయ్యారు. బంగ్లా నుంచి మనిక్ మాత్రమే గోల్ చేశాడు.

సరైన టోర్నీలు ఎంపిక చేసుకోవాలి!

సింధుకు సైనా నెహ్వాల్ సూచన ● గెలవగలిగే టోర్నీలే ఆడాలి ● వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ వ్యాఖ్య



ముంబై: భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట సింధుకు మరిన్ని టైటిల్స్ గెలిచే సత్తా ఉందని, ఎలా గెలవాలో కూడా తనకు బాగా తెలుసని... అయితే మూడు పదుల వయసును గుర్తించి ఇకపై ఆడాలని వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ సూచించింది. ఈ ఏడాది సింధుకు గడ్డు కాలం నడుస్తోంది. రెండు వరుస ఒలింపిక్స్‌లో పతకాల విజేత అయిన ఆమె ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క టైటిల్ కూడా గెలుపొందలేకపోయింది. ఒక్క ప్రపంచ చాంపియన్‌షిప్ మినహా చాలా టోర్నీల్లో మొదటి లేదంటే రెండో రౌండ్లలోనే నిష్క్రమించింది. గతనెల జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు క్వార్టర్ ఫైనల్స్ చేరింది. ఈ నేపథ్యంలోనే ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సైనా మాట్లాడుతూ.. తన సహచర షట్లర్‌కు పలు సూచనలు చేసింది. ఆ వివరాలు ఆమే మాటల్లోనే...

వయసు మాట వినాలి

వయసు పైబడిన తర్వాత ఆడలేరని కాదు... మునుపటిలా ఆడలేమన్నది వాస్తవం. దీన్ని దృష్టిలో ఉంచుకొనే మన ఆట కొనసాగించాలి. సింధు కూడా ఇదే చేయాలి. ఆమెలో గెలిచే సత్తా ఇంకా వుంది. అయితే వరుసగా అన్ని ఆడుతూ వుండటమే సరికాదు. ఇలా అన్ని కాకుండా కొన్ని ఎంపిక చేసిన టోర్నీలు, బాగా అచ్చొచ్చే సిరీస్‌లు, తను గెలుపొందగలననే ఈవెంట్లను ఎంచుకొని అందులో ఆడితేనే సింధుకు మేలు చేస్తుంది. మూడు పదుల వయసొచ్చాక వరుసబెట్టి ఆడటం, గెలవడం, ర్యాంకును నిలకడగా కొనసాగించడం చాలా కష్టం. ఫలానా ప్రపంచ చాంపియన్‌షిప్ లేదంటే ఆసియా చాంపియన్‌షిప్‌లో అదరగొడతాను అనుకునే టోర్నీల్లో దిగి పూర్తిస్థాయి ఆత్మవిశ్వాసంతో ఆడొచ్చు. గెలవొచ్చు.

ఆమెకు అన్నీ తెలుసు

ఈ సీజన్‌లో సింధు బరిలోకి దిగాల్సిన టోర్నీలు ఇంకా ఉన్నాయి. తప్పకుండా అందులో రాణించే సత్తా ఆమెకు వుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడం ద్వారా తనలో చేవ తగ్గలేదని నిరూపించుకుంది. తదుపరి టోర్నీల్లోనూ సింధు కచ్చితంగా మెరుగైన ప్రదర్శన ఇవ్వగలదు.

పురుషుల సింగిల్స్‌కు ఢోకా లేదు

భారత బ్యాడ్మింటన్‌లో పురుషుల సింగిల్స్ భవిష్యత్తుకు ఏ ఢోకా లేదు. లక్ష్యసేన్, ప్రియాన్షు రావత్, హెచ్.ఎస్. ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ ఇలా పలువురు షట్లర్లు ఉన్నారు. కానీ మహిళల సింగిల్సే కాస్త ఇబ్బందికరం. ప్రస్తుతం ఒక్క సింధు మినహా ఈ కేటగిరీలో చెప్పుకోదగ్గ ప్లేయరే లేదు. యువ షట్లర్లు మరింత మంది రావాలి. కొందరు అడపాదడపా బాగానే ఆడుతున్నారు కానీ నిలకడగా రాణించే వారే కరువయ్యారు. వచ్చే నెల జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్ జరుగనున్న నేపథ్యంలో భారత్ నుంచి ఎలాంటి ప్రతిభావంతులు వస్తారో చూడాలి. ప్రపంచ పురుషుల డబుల్స్‌లోనే సాత్విక్ సాయిరాజ్– చిరాగ్ షెట్టిలది అసాధారణ జోడీ. ప్రతీ టోర్నీని గెలవగలిగే సత్తా ఈ జంటకు ఉంది. సాత్విక్–చిరాగ్‌ల ఆటతీరును చూసినా... ప్రపంచంలోనే నంబర్‌వన్ జోడీ ఆటను చూసినా ఒకే తీరుగా ఉంటుంది.



దేశ రాజధాని న్యూఢిల్లీలో వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆరంభ వేడుకల్లో పారా అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్టోబర్ 5 వరకు కొనసాగనున్న ఈ మెగాటోర్నీలో భారత్ నుంచి 73 మంది పారా అథ్లెట్లు పాల్గొంటున్నారు. అందులో 54 మంది పురుషులు, 19 మంది మహిళలు ఉన్నారు. ఈ పోటీల్లో 104 దేశాలకు చెందిన రెండు వేల మందికి పైగా అథ్లెట్లు పాల్గొంటుండగా... 186 పతక ఈవెంట్లు జరగనున్నాయి.



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నవరాత్రి సందర్భంగా శనివారం నిర్వహించిన అభివ్యక్తి గార్బా మహోత్సవ్ విహంగ వీక్షణం. (ఇన్‌సెట్‌లో) నాట్యం చేస్తున్న ఓ మహిళ



రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో అభివ్యక్తి గార్బా మహోత్సవ్‌లో పాల్గొన్న ఓ మహిళ నృత్య విన్యాసం

గత ఏడాది అత్యంత క్లిష్టమైంది!

ప్రిన్స్ విలియం వ్యాఖ్య

లండన్: తన జీవితంలో 2024 సంవత్సరం అత్యంత కఠినమైనదని ప్రిన్స్ విలియం వ్యాఖ్యానించారు.గత ఏడాది విలియం భార్య కేట్, ఆయన తండ్రి కింగ్ చార్లెస్–3 ఇద్దరూ క్యాన్సర్ చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే లెవీ నిర్వహిస్తున్న 'ది రెలక్టెంట్ ట్రావెలర్' షోలో విలియం ఈ విషయాలు పంచుకున్నారు. 'షిట్స్ క్రీక్' నటుడు యూజీన్ లెవీ నిర్వహిస్తున్న ఆపిల్ టీవీ+ ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రివ్యూలో విలియం మాట్లాడుతూ.. '2024 నా జీవితంలోనే అత్యంత కఠినమైన సంవత్సరం అని నేను చెబుతాను. జీవితం మమ్మల్ని పరీక్షించాలని నిర్ణయించుకుంది.. ఆ పరీక్షను అధిగమించగలిగినప్పుడే మనమేమిటో తెలుస్తుంది.' అని వ్యాఖ్యానించారు. అక్టోబర్ 3న ప్రసారం కానున్న ఈ ఎపిసోడ్ ప్రివ్యూలో విలియం.. లెవీని విండ్సర్ కోట చుట్టూ తిప్పుతూ చూపించడం, వారిద్దరూ ఒక పబ్‌లో బీరు పంచుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న దృశ్యాలున్నాయి. కేట్ జనవరిలో తనకు క్యాన్సర్ నయమైందని ప్రకటించారు. ఇటీవల ఆమె అనేక బహిరంగ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ నెల ప్రారంభంలో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూకే **పర్యటనలో..** ఆయనకు రాజ మర్యాదలతో ఆహ్వానం పలకడంలో ఆమె, **విలియం కీలక పా**త్ర పోషించారు. కింగ్ చార్లెస్ కూడా గత సంవత్సరం చికిత్స **కోసం నెలల పా**టు విరామం తీసుకున్న తర్వాత దైనందిన జీవితంలో పాల్గొం**టున్నారు. కానీ** కింగ్ చార్లెస్–3, కేట్‌లు ఇద్దరూ తాము ఏ రకమైన క్యాన్సర్‌కు **చికిత్స చేయించు**కున్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

యూరప్ చుట్టూ డ్రోన్ గోడ

సరిహద్దుల్లో గుర్తు తెలియని డ్రోన్ల సంచారం నేపథ్యంలో ప్రతిపాదన

ఇందుకు రష్యానే కారణమని అనుమానాలు ● కొత్త ప్రాజెక్టుపై ఈయూ రక్షణ మంత్రుల అంగీకారం

బ్రస్సెల్స్: రష్యా– ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో యూరప్ దేశాలు మరిన్ని ఆత్మరక్షణ చర్యలకు నడుం బిగించాయి. రష్యా డ్రోన్లు, యుద్ధ విమానాలు తమ గగనతలంలోకి ప్రవేశించిన ఘటనలు ఇటీవలి కాలంలో తరచూ చోటుచేసుకుంటుండటం ఈ దేశాలను మరింత అప్రమత్తం చేసింది. రష్యా, ఉక్రెయిన్‌లతో తమకున్న సరిహద్దు గగనతలాల్లో చోటుచేసుకునే ఉల్లంఘనలను సకాలంలో గుర్తించి, అడ్డగించేందుకు సమగ్ర రక్షణ వ్యవస్థ, డ్రోన్ వాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని యూరోపియన్ యూనియన్(ఈయూ) దేశాలు నిర్ణయించాయి. శుక్రవారం బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరిగిన ఈయూ రక్షణ మంత్రుల వర్చువల్ సమావేశం ఈ మేరకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇటీవల పెరిగిపోయిన గగనతల ఉల్లంఘనలపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వీటిలో కొన్ని ఉల్లంఘనలకు రష్యానే కారణమంటూ దేశాలు నిందిస్తున్నాయి. అయితే, వీటికి తాము కారణం కాదని, ఉద్దేశపూర్వకంగా వీటిని ప్రయోగించామంటూ తమపై ఆరోపణలు వేయడం సరికాదని రష్యా అంటోంది. సభ్య దేశాల గగనతలంలోకి ప్రవేశించే రష్యా డ్రోన్లు, యుద్ధ విమానాలను కనిపించిన వెంటనే కూల్చేయాలంటూ నాటోకు ఆదేశాలిచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. చొరబాటు ఘటనలను నివారించేందుకు డ్రోన్ వాల్/ డ్రోన్ షీల్డ్ మాత్రమే సరైన పరిష్కారమనే అభిప్రాయానికి తాజాగా ఈయూ మంత్రులు వచ్చారు. 'ఈయూ, నాటోలను రష్యా పరీక్షిస్తోంది. మా స్పందన వేగంగా, దీటుగా, ఐక్యంగా ఉండాలి'అని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ పేర్కొన్నారు. ఈ చర్చల్లో 10 తూర్పు యూరప్ దేశాల మంత్రులతోపాటు ఉక్రెయిన్, నాటో అధికారులు పాలుపంచుకున్నారు. డ్రోన్ షీల్డ్‌ను పూర్తి చేసేందుకు కనీసం ఏడాది పట్టొచ్చని కుబిలియస్ చెప్పారు. 'సవివరమైన, సాంకేతికపరమైన రోడ్ మ్యాప్ రూపకల్పనకు ఆయా దేశాల రాయబారులు త్వరలోనే సమావేశమవుతారు. మా దృష్టంతా సమర్థవంతమైన ఉల్లంఘనల హెచ్చరికల వ్యవస్థను నెలకొల్పడంపైనే ఉంది'అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ ప్రతిపాదనపై వచ్చే వారం డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో జరిగే ఈయూ నేతల శిఖరాగ్రంలోనూ చర్చ జరుగుతుందన్నారు. అక్టోబర్ మరోసారి భేటీ అయ్యే ఈయూ రక్షణ మంత్రులు, తమ వెంట రక్షణ పరిశ్రమల ప్రతినిధులను కూడా తీసుకువస్తారని కుబిలియస్ వివరించారు. శుక్రవారం జరిగిన సమావేశం ఒక మైలురాయి వంటిదని అభివర్ణించారు. ఇప్పటి నుంచి అసలైన కార్యాచరణ మొదలవుతుందని వెల్లడించారు.

మార్చిలో ప్రతిపాదన వచ్చినా..

ఫిన్లాండ్, ఎస్టోనియా, లాట్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు డ్రోన్ వాల్ ప్రాజెక్టుపై కొన్ని నెలలుగా పనిచేస్తున్నాయని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ పేర్కొన్నారు. డ్రోన్ షీల్డ్ **ఏర్పాటుకు అవసరమైన నిధులు సమకూర్చాలంటూ మార్చిలో ఎస్టోనియా –** లిథువేనియాలు చేసిన వినతిని ఈయూ పట్టించుకోలేదు. అయితే, ఈలోగా పరిస్థితులు మారాయి. గురు, శుక్రవారాల్లో డెన్మార్క్‌తో తమ సరిహద్దులకు సమీపంలో డ్రోన్ల సంచారాన్ని గుర్తించామని జర్మనీ పేర్కొంది. దీంతో, డ్రోన్ గోడ అవసరాన్ని అందరూ గుర్తించారని కుబిలియస్ తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీన పోలెండ్ గగనతలంలోకి ప్రవేశించిన రష్యా డ్రోన్లను కూల్చి వేసేందుకు నాటో యుద్ధవిమానాలు రంగంలోకి దిగాయి. కేవలం చిన్న బెదిరింపునకే ఖరీదైన ప్రతిచర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. డ్రోన్ల సంచారం కనిపించడంతో **ఇటీవల డెన్మార్క్‌లోని విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది.** రష్యాతో సరిహద్దులు పంచుకుంటున్న ఇతర దేశాల్లోనూ ఇలాంటి భయాలే నెలకొన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు సైతం హైబ్రిడ్ యుద్ధం అనుభవాన్ని చవి చూస్తున్నాయని పోలెండ్ రక్షణ మంత్రి వ్లాడిస్లావ్ కోసినియక్–కమీజ్ అన్నారు. రష్యా నుంచి దీని తీవ్రంగా మరీ ఎక్కువగా ఉంది, వీటిపై సరైన రీతిలో స్పందించాల్సిన సమయం వచ్చిందని ఆయన తెలిపారు. యుద్ధ నౌక నుంచి లేదా మరేదైనా పడవ నుంచి డ్రోన్లను అత్యంత సులువుగా ప్రయోగించే ప్రమాదమున్నందున తూర్పు దేశాలే కాదు, మొత్తం యూరప్‌లోని దేశాలు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. సమగ్ర భద్రత కోసం ముందుకు రావాలన్నారు. ఇలా ఉండగా, కోపెన్‌హాగెన్‌లో వచ్చే వారం జరిగే శిఖరాగ్రాలకు కనీసం డజను మంది దేశాల నేతలు పాల్గొనే అవకాశం ఉంది. అయితే, డ్రోన్ బెడద తీవ్రంగా ఉన్నందున మిలటరీ యాంటీ డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన రుణ సాయం అందిస్తామని పొరుగునున్న స్వీడన్ ముందుకు వచ్చింది. ఈ వ్యవస్థ అనుమానాస్పద డ్రోన్లను కనిపెట్టిన వెంటనే కూల్చివేస్తుందని ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ చెప్పారు. దీనిపై డెన్మార్క్ సానుకూలంగా స్పందించింది.



సరిహద్దుల్లో డ్రోన్ల పహారా (ఊహాచిత్రం)

ఖైబర్‌లో పాక్ ఆర్మీ ఆపరేషన్

17 మంది టీటీపీ మిలిటెంట్లు హతం

పెషావర్: పాకిస్తాన్ భద్రతా బలగాలు శుక్రవారం ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లో చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)కి చెందిన 17 మంది మిలిటెంట్లు మృతి చెందారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఫ్రంటియర్ కార్ప్స్, పోలీసులు కలిసి కరక్ జిల్లాలో మిలిటెంట్ల కోసం గాలింపు చేపట్టారని, ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో ముల్లా నజీర్ గ్రూప్‌నకు చెందిన 17 మంది టీటీపీ మిలిటెంట్లు హతమయ్యారని పోలీసులు తెలిపారు. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనలో ముగ్గురు భద్రతా సిబ్బంది సైతం గాయపడ్డారన్నారు.

విదేశీ పర్యటనకు రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాలుగు దక్షిణ అమెరికా దేశాల పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన వివిధ రాజకీయ నాయకులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలతో సంభాషించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేరా తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటన ఎన్ని రోజులుంటుందన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, రాహుల్ గాంధీ తన పర్యటనలో బ్రెజిల్, కొలంబియా దేశాలను కూడా సందర్శిస్తారు. అక్కడ ఆయన విశ్వవిద్యాలయ విద్యార్థులతో ముచ్చటిస్తారు. ఆయా దేశాల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహిస్తారని, ఇది ప్రజాస్వామ్య, వ్యూహాత్మక బంధాలను బలోపేతం చేస్తుందని పార్టీ తెలిపింది.

మూడు దేశాల్లో రాయబారుల్ని వెనక్కి పిలిపించిన ఇరాన్

దుబాయ్: ఫ్రాన్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్‌ల్లోని తమ రాయబారుల్ని ఇరాన్ శనివారం వెనక్కి పిలిపించుకుంది. దేశ అణు కార్యక్రమంపై ఆదివారం రాత్రి 8 గంటల నుంచి ఐక్యరాజ్యసమితి ఆంక్షలు తిరిగి అమల్లోకి రానున్న నేపథ్యంలో ఇరాన్ ఈ చర్య తీసుకుంది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)కు సహకరించకపోవడం, అమెరికాలో నేరుగా చర్చలకు ఇరాన్ ముందుకు రాకపోవడంతో ఈ మూడు దేశాలు ఆంక్షల ప్రతిపాదనను ముందుకు తెచ్చాయని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, సంప్రదింపుల కోసమే ప్రభుత్వం రాయబారుల్ని వెనక్కి రప్పించినట్లు అధికార వార్తా సంస్థ ఇర్నా తెలిపింది. ఆంక్షల ఫలితంగా ప్రపంచ దేశాల్లోని ఇరాన్ ఆస్తులను స్తంభింపజేస్తారు. ఇరాన్‌తో ఇతర దేశాల ఒప్పందాలు నిలిచిపోతాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడం శిక్షార్హంగా పరిగణించడం వంటివి ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పంజాబీ గాయకుడు జవాండా

పరిస్థితి విషమం..ఐసీయూలో చికిత్స

సిమ్లా/చండీగఢ్: ప్రముఖ పంజాబీ గాయకుడు రణ్‌వీర్ జవాండా(35) ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. శనివారం ఉదయం హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా వైపు బైక్‌పై వెళుతూ బద్ది ఏరియాలో అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో తల, వెన్నెముకకు తీవ్ర గాయాలైన జవాండాను మధ్యాహ్నం పంజాబ్‌లోని మొహాలీలో ఉన్న ఫోర్టిస్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. జవాండా పరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఎమర్జెన్సీ, న్యూరోసర్జరీ విభాగం నిపుణులు ఆయన్ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారని వెల్లడించాయి. ఆయన కోలుకోవాలని ఆకాంక్షిస్తూ లూధియానా జిల్లాలోని పొనా గ్రామస్తులు స్థానిక గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జవాండా ప్రమాదం బారిన పడిన విషయం తెలియడంతో పలువురు ప్రముఖులు ఆస్పత్రికి చేరుకున్నారు.

ఒరెగాన్, పోర్ట్‌ల్యాండ్‌లకూ ఆర్మీ: ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలోని నగరాలకు ఫెడరల్ బలగాలను పంపించే వివాదాస్పద చర్యలను అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తున్నారు. దేశీయ ఉగ్రవాదుల భరతం పట్టేందుకు పోర్ట్‌ల్యాండ్, ఒరెగాన్‌లకు కూడా బలగాలను పంపించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం ప్రకటించారు. అవసరమైతే బలగాలకు పూర్తి అధికారాలను అప్పగిస్తామన్నారు. యుద్ధ పరిస్థితులున్న పోర్ట్‌ల్యాండ్‌ను కాపాడేందుకు అవసరమైన బలగాలను సమకూర్చాలని తన సొంత ట్రూత్ సోషల్ మీడియా ద్వారా రక్షణ శాఖను ఆయన ఆదేశించారు. యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాలను కాపాడేందుకు బలగాలను పంపించాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే లాస్ ఏంజెల్స్, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాల్లో నేషనల్ గార్డులను మోహరించడం తెల్సిందే. షికాగో, బాల్టిమోర్‌లకూ పంపిస్తామని ఇటీవల బెదిరించారు. పోర్ట్‌ల్యాండ్‌లో ఉన్న ఐసీఈ కార్యాలయం వద్ద తరచూ ఆందోళనలు, హింసాత్మక ఘటనలు జరగడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వారి ఓట్ల కోసం రాహుల్ ప్లాన్: అమిత్ షా

పట్నా/అరారియా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కలిసి చొరబాటుదార్లకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. బిహార్‌లో ఎన్డీయే మళ్లీ అధికారంలోకి వస్తే ఒక్క చొరబాటుదారును కూడా వదలకుండా బయటకు పంపుతుందని తెలిపారు. అరారియాలో శనివారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. 'రాహుల్ బాబా ఇటీవలే రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా ఒక యాత్ర చేపట్టారు. ఓటర్ల జాబితాలో చొరబాటుదార్ల పేర్లు చేర్పించడమే రాహుల్ బాబా, లాలు యాదవ్‌ల లక్ష్యం. సీమాంచల్‌లో వీరి ఉద్దేశాలను మనం సాగనిద్దామా?'అని పార్టీ కార్యకర్తలను ఆయన ప్రశ్నించగా అందరూ లేదు, లేదని ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో 160కి పైగా సీట్లు ఎన్డీయే గెలుచుకుని, అధికారంలోకి వస్తే ప్రతి ఒక్క చొరబాటుదారునూ వెళ్లగొడతామన్నారు. 243 సీట్లున్న బిహార్ అసెంబ్లీకి త్వరలోనే ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది.

స్వదేశానికి రష్యా మహిళ, పిల్లలు

కర్ణాటక హైకోర్టు అనుమతి

బెంగళూరు: కర్ణాటకలోని ఒక గుహలో నివసిస్తూ పట్టుబడిన రష్యా మహిళ, ఆమె ఇద్దరు మైనర్ కుమార్తెలు స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ప్రయాణ పత్రాలను జారీ చేయవచ్చని కేంద్ర ప్రభుత్వానికి కర్ణాటక హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. పిల్లల తండ్రిగా చెప్పుకొంటున్న ఇజ్రాయెల్ జాతీయుడు డ్రోర్ శ్లోమో గోల్డ్‌స్టెయిన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి బి.ఎం.శ్యామ్ ప్రసాద్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మైనర్ పిల్లలను వెంటనే దేశం నుంచి పంపించేయవద్దని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ గోల్డ్‌స్టెయిన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నీనా కుటీనాగా అనే రష్యన్ మహిళ, ఆమె పిల్లలు జూలై 11న కుమ్టా తాలూకాలోని గోకర్ణ సమీపంలోని రామతీర్థ కొండల్లోని గుహలో కనిపించారు. ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి దాదాపు రెండు నెలల పాటు తగిన నివాస పత్రాలు లేకుండా అక్కడ నివసించినట్లు అధికారులు తెలిపారు. భారతదేశంలో తన పిల్లలు ఎక్కడున్నారో గుర్తించలేకపోయానంటూ వారి తండ్రి గోల్డ్‌స్టెయిన్ గత డిసెంబర్‌లో గోవాలోని పనాజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం జరిగిన విచారణలో, కుటీనా, ఆమె కుమార్తెలకు రష్యా కాన్సులేట్ అక్టోబర్ 9 వరకు మాత్రమే చెల్లుబాటయ్యే అత్యవసర ప్రయాణ పత్రాలను జారీ చేసినట్లు కోర్టు నమోదు చేసింది. అలాగే, వీలైనంత త్వరగా రష్యాకు తిరిగి వెళ్లడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తూ కుటీనా స్వయంగా కాన్సులేట్‌కు చేసిన విన్నపాన్ని కూడా న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. కస్టడీకి సంబంధించిన ప్రక్రియలు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, పిల్లల శ్రేయస్సుకు విఘాతం కలిగించేలా వారిని దేశం నుంచి పంపించడం సరికాదని గోల్డ్‌స్టెయిన్ కౌన్సిల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే, భార్య, పిల్లలు గుహలో ఏకాంతంగా ఎందుకు నివసించవలసి వచ్చిందనే దానిపై గోల్డ్‌స్టెయిన్ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేదని కోర్టు వ్యాఖ్యానించింది. పిల్లల సంక్షేమం, రష్యాకు తిరిగి వెళ్లాలనే తల్లి అభ్యర్థన, వారి ప్రయాణానికి సహాయం చేయడానికి రష్యా ప్రభుత్వం సిద్ధంగా ఉండటం వంటివి.. ఇతర అంశాల కంటే ముఖ్యమని ధర్మాసనం పేర్కొంది. శుక్రవారం విచారణ సందర్భంగా, రష్యా మహిళ రెండో కుమార్తెకు సంబంధించిన డీఎన్ఏ నివేదిక అందిందని, దానిని రష్యా ప్రభుత్వానికి అందజేసినట్లు అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్ కోర్టుకు తెలియజేశారు. దీని ఆధారంగా, రష్యా ప్రభుత్వం వారికి పౌరసత్వం , రష్యాకు ప్రయాణించడానికి అత్యవసర ప్రయాణ పత్రాలను జారీ చేసిందని వివరించారు.

గాజాలో 70 మంది పాలస్తీనియన్ల మృతి

వైమానిక దాడులు, కాల్పులు ఆపని ఇజ్రాయెల్ ఆర్మీ

డెయిర్ అల్–బలాహ్: గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన వైమానిక దాడులు, కాల్పుల ఘటనల్లో కనీసం 70 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర, సెంట్రల్ గాజాపై శనివారం ఉదయం నుంచి ఈ దాడులు కొనసాగాయని అల్ జెజీరా తెలిపింది. మృతుల్లో కనీసం 36 మంది గాజా నగరంలోని వారేనని పేర్కొంది. నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని ఓ నివాసంపై జరిగిన దాడిలో కుటుంబంలోని 9 మంది చనిపోయారని అల్ ఔదా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గాజా నగరంలోని టుఫాలో జరిగిన మరో దాడిలో 11 మంది మృతి చెందారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులేనని అల్ అహ్లీ ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. షటి శరణార్థి శిబిరంపై జరిగిన మరో దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు షిఫా ఆస్పత్రి పేర్కొంది. గాజాలోని వేర్వేరు చోట్ల ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చిన వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. గాజా నగరాన్ని పూర్తిగా ఆక్రమించుకునేందుకు భారీగా సైన్యాన్ని రంగంలోకి దించిన ఇజ్రాయెల్.. వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలంటూ ప్రజలకు హెచ్చరికలు కొనసాగిస్తోంది. దీంతో, ఇప్పటి వరకు 3 లక్షల మందికి పైగా నగరాన్ని విడిచి వెళ్లిపోగా, తాము ఎక్కడికి వెళ్లలేమంటూ మరో 7 లక్షల మంది భవనాల శిథిలాలు, టెంట్లలోనే ఉండిపోయారు. గడిచిన రెండు వారాల్లో ఇజ్రాయెల్ ఆర్మీ జరిపి వైమానిక దాడుల్లో రెండు క్లినిక్‌లు ధ్వంసమయ్యాయని స్థానికులు తెలిపారు. ఔషధాలు, పరికరాలు, ఆహారం, ఇంధనం లేకపోవడంతో మరో రెండు ఆస్పత్రులను నిర్వాహకులు మూసివేయాల్సి వచ్చిందన్నారు. చాలా మంది పేషెంట్లు, సిబ్బంది ఆస్పత్రులను వదిలి వెళ్లిపోతున్నారు. చాలా తక్కువ సంఖ్యలో వైద్యులు, నర్సులు మాత్రమే కదల్లేని రోగులు, ఇంక్యుబేటర్లలో ఉంచిన చిన్నారులకు వైద్య సాయం అందిస్తున్నారు. ఇజ్రాయెల్ దాడులు తీవ్ర రూపం దాల్చడంతో తమ సేవలను నిలిపివేస్తున్నామని 'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్'గ్రూపు వైద్యులు శుక్రవారం ప్రకటించారు. గాజాలో హమాస్ లక్ష్యంగా చేపట్టిన తమ ఆపరేషన్ పని పూర్తయ్యాకే ఆగుతుందని ఐరాస జనరల్ అసెంబ్లీలో తోటి ప్రపంచ దేశాల నేతల సమక్షంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు జరగడం గమనార్హం. 2023 అక్టోబర్ 7న హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రారంభించిన దాడుల్లో ఇప్పటి వరకు 65 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 1.67 లక్షల మంది గాయపడ్డారు. బాధితుల్లో సగానికి పైగా మహిళలు, చిన్నారులేనని గాజా ఆరోగ్య విభాగం చెబుతోంది.



గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్ వేపై 'థార్' పల్టీలు

ముగ్గురు విద్యార్థినులు సహా ఐదుగురు మృత్యువాత

గురుగ్రామ్: ఢిల్లీ–గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం వేకువజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లా విద్యార్థినులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ 'థార్' డివైడర్‌ను ఢీకొట్టి పలుమార్లు పల్టీలు కొట్టింది. దీంతో, అందులోని ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని ఎబోలా క్లబ్‌లో ఆరుగురూ మద్యం తాగారని, వీరి వాహనం 90 కిలోమీటర్లకు పైగా వేగంతో వెళ్తూ ఉదయం 4.30 గంటల సమయంలో యూ–టర్న్ తీసుకునే సమయంలో అదుపు తప్పి ప్రమాదానికి గురైందని పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు వాహనం పైకప్పు రెండుముక్కలైందని, శకలాలు 100 మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా పడిపోయాయన్నారు. మృతుల్లో రాయ్‌బరేలీకి చెందిన జడ్జి చంద్రమణి మిశ్రా కుమార్తె ప్రతిష్ఠ(25), ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ కుమార్తె లావణ్య(26) లా స్టూడెంట్లు కాగా ఆదితి సోని(24) డిగ్రీ చదువుతోంది. మిగతా ఇద్దరినీ ఆదిత్య ప్రతాప్ సింగ్(30), గౌతమ్(31)గా గుర్తించారు. గాయపడిన కపిల్ శర్మ(27) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బారాబంకీ, మౌ జిల్లాల్లోనూ ఉద్రిక్తతలు

పలువురిపై కేసులు, అరెస్టులు

● భారీగా బలగాల మోహరింపు

బరేలీ/బారాబంకీ/వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో 'ఐ లవ్ మహ్మద్'కార్యక్రమంపై తలెత్తిన వివాదం ముదిరింది. శుక్రవారం బరేలీలో ఆందోళనకారులు పోలీసులతో తలపడటం తెల్సిందే. ఈ నేపథ్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి ఇల్లిల్లూ సోదాలు జరిపి గొడవలకు కారణమైన వారిని అరెస్ట్ చేశారు. పోలీసులపై రాళ్లు రువ్వడం , దుకాణాలు, వాహనాలకు నిప్పుపెట్టిన ఘటనల్లో పాలుపంచుకున్న 500 మందిని గర్తించామని ఉన్నతాధికారులు తెలిపారు. ఇదంతా కుట్ర ప్రకారమే జరిగిందంటూ 8 మందిపై కేసులు నమోదు చేశారు. అయితే, పొరుగునున్న బారాబంకీలోని ఫైజుల్లాగంజ్‌లో 'ఐ లవ్ మహ్మద్'అని ఉన్న బ్యానర్‌ను తొలగించారన్న వార్తలు రావడంతో శనివారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బ్యానర్ చించినట్లు ఆరోపణలున్న ధన్ని అనే వాచ్‌మన్ ఇంటిని కొందరు ధ్వంసం చేశారు. అక్కడికి సమీపంలోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలో ఇదంతా రికార్డయ్యింది. దీన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. ఫైజుల్లాగంజ్‌లో శాంతియుత వాతావరణం నెలకొందని ఎస్పీ అజయ్ సింగ్ చెప్పారు. అదేవిధంగా, మౌ జిల్లా నయా బజార్ ప్రాంతంలో శుక్రవారం ప్రార్థనల అనంతరం కొందరు 'ఐ లవ్ మహ్మద్'అని నినాదాలు చేస్తూ ఊరేగింపు చేపట్టారు. ఈ ఘటన వీడియో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని మౌ ఎస్పీ ఇలమారన్ చెప్పారు. వారణాసిలోని సిగ్రాలో ఈ నెల 22వ తేదీన 'ఐ లవ్ మహ్మద్'పోస్టర్లు, బ్యానర్లు చేబూని, నినాదాలతో ర్యాలీ చేపట్టిన 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతర వర్గాల ప్రజల్లో తమ ఆధిపత్యం ప్రదర్శించుకునేందుకు కొందరు ఈ కొత్త ఒరవడిని మొదలుపెట్టారని పోలీసులు అంటున్నారు.

మత పెద్ద రజా అరెస్ట్

బరేలీలో ఘర్షణలకు ప్రేరేపించారనే ఆరోపణలపై ఇత్తెహాద్–ఇ– మిల్లత్ పరిషత్ ప్రెసిడెంట్ మౌలానా తౌకీర్ రజాను పోలీసులు అరెస్ట్ చేశారు. 'ఐ లవ్ మహ్మద్'కు మద్దతుగా రజా ర్యాలీకి పిలుపునివ్వడం ఉద్రిక్తతకు దారి తీసిందని, ప్రణాళిక ప్రకారం జరిగిన గొడవలకు ప్రధాన సూత్రధారి ఈయనేనని ఉన్నతాధికారులు తెలిపారు. రజా సహా 8 మందిని స్థానిక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించింది. వీడియో ఫుటేజీలో గుర్తించిన మరో 36 మంది వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించారనే ఆరోపణలపై రజా, మరో 25 మందితోపాటు గుర్తు తెలియని మరో 200 మందిపై ప్రేమ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఆందోళనకారులు ఒక పోలీస్ కానిస్టేబుల్ యూనిఫాంను చించివేశారన్నారు. బరేలీలో శనివారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, స్కూళ్లు, దుకాణాలు యథావిధిగా పనిచేశాయని డీఐజీ అజయ్ కుమార్ సాహ్నీ తెలిపారు. ఘర్షణలపై దర్యాప్తులో కొందరు రాజకీయ నేతల పేర్లు కూడా బయటకు వచ్చాయన్నారు. శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించాలని చూసే వారిపై గూండా చట్టం, జాతీయ భద్రతా చట్టాలను ప్రయోగిస్తామని హెచ్చరించారు. బరేలీ నగరంలో 8 వేల మందికిపైగా భద్రతా సిబ్బందిని మోహరించామని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వీరు ఇక్కడే ఉంటారని పేర్కొన్నారు.

బహమనీ రాజ్యస్థాపనకు సహాయం చేసిందెవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

పద్మనాయక వంశానికి మూలపురుషుడైన భేతాళనాయకుడికి నలుగురు కుమారులు. వారిలో దామానాయుడు, ప్రసాదిత్యనాయుడు తండ్రి రాజ్యాన్ని పాలిస్తూ, రుద్రమదేవి సేనానులుగా కాకతీయ రాజ్యంలో ప్రముఖ స్థానం పొందారు. రుద్రమదేవి అధికారంలోకి రాగానే బంధువర్గం తిరుగుబాటు చేసింది. మరోవైపు యాదవరాజులు ఓరుగల్లుపై దండెత్తారు. ప్రసాదిత్యానాయుడు ఈ చిక్కులను తొలగించి ఆమె అధికారాన్ని నిలబెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. కాకతీయ రాజ్యస్థాపనాచార్య, రాయపితామహాంక అనే ఇతడి బిరుదులు ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. కాకతీయ సామ్రాజ్య పరిరక్షణలో భాగంగా నాయంకర వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత ఇతడిదేనని వెలుగోటి వంశావళిని బట్టి తెలుస్తోంది.



కాకతీయానంతర యుగం

కాకతీయుల అనంతరం ఓరుగల్లు ఢిల్లీ సామ్రాజ్యంలో భాగమైంది. అదే సమయంలో మధుర కూడా ఢిల్లీ సుల్తానుల వశమైంది. ఆంధ్రనగరిగా పేరొందిన ఓరుగల్లు సుల్తాన్‌పూర్‌గా మారింది. జలాలుద్దీన్ హసన్‌షా మధురకు రాజుకాగా, ఓరుగల్లు ప్రాంతం దేవగిరి వజీరయిన మాలిక్ బుర్హన్ ఉద్దీన్ పాలనలోకి వచ్చింది. ఇతడికి సహాయంగా ఓరుగల్లులో మాలిక్ మక్బూల్ వజీర్ అయ్యాడు. ప్రతాపరుద్రుడి సేనానిగా పనిచేసిన నాగయ గన్నయ మతం మార్చుకొని మాలిక్ మక్బూల్ అయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఇందులో భాగంగా ఆంధ్రదేశంలోనూ స్వతంత్ర రాజ్య స్థాపన కోసం తిరుగుబాట్లు జరిగాయి.

ప్రతాపరుద్రుడి మరో సేనాని రేచర్ల సింగమ నాయకుడు స్వతంత్రించి దక్షిణ తెలంగాణలో పద్మనాయక రాజ్యాన్ని స్థాపించాడు. ప్రోలయ ఉత్తర తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాల నుంచి ముస్లింలను పారదోలి రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. దక్షిణ తీరాంధ్రలో 1325 నాటికే ప్రోలయ వేమారెడ్డి స్వతంత్రించాడు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో అరవీటి వంశానికి చెందిన సోమదేవరాజు స్వతంత్రించాడు. అనంతరం కంపిలిలో హరిహరరాయలు, బుక్కరాయలు స్వతంత్రరాజ్యాన్ని స్థాపించారు. నుస్రత్‌ఖాన్ బీదర్ సమీపంలో స్వతంత్ర రాజ్యస్థాపనకు యత్నించి విఫలమయ్యాడు. ఈ విధంగా కాకతీయ సామ్రాజ్య శిథిలాల నుంచి కంపిలి (విజయనగర), రెడ్డి, వెలమ, నాయక అనే నాలుగు స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి. ఈ రాజ్యాల స్థాపనతో ఆంధ్ర దేశంలో ముస్లింల అధికారం అంతమైంది. వీటిలో తెలంగాణతో సంబంధమున్న రాజ్యాల గురించి తెలుసుకుందాం.

ముసునూరి నాయకులు

ముసునూరు గ్రామం కృష్ణాజిల్లా ఉయ్యూరు తాలూకాలో ఉంది. నెల్లూరు జిల్లాలోనూ ఈ పేరుతో ఓ గ్రామం ఉంది. కానీ కృష్ణా జిల్లాలోని ముసునూరులో కోటశిథిలాలు ఉండటాన్ని బట్టి వీరి జన్మస్థలం ఇదే కావచ్చు. కమ్మ సామాజిక వర్గంలో ముసునూరి వారు ఉండటాన్ని బట్టి ముసునూరు నాయకులు కమ్మ కులస్థులు లేదా వారి పూర్వీకులై ఉంటారు. కాకతీయుల పతనానంతరం ముస్లింల వశమైన ఆంధ్రదేశంలో అసంతృప్తి చెలరేగింది. దీన్ని అవకాశంగా తీసుకొని ఈ వంశానికి చెందిన ప్రోలయ నాయకుడు భద్రాచలం ప్రాంతంలోని రేకపల్లి కేంద్రంగా ముస్లింలతో పోరాడాడు. ప్రోలయ నాయకుడికి అతడి పినతండ్రి కుమారుడైన కాపయనాయకుడు, వేంగి పాలకుడైన వేంగభూపాలుడు, రుద్రదేవుడు, అన్నమంత్రి సహకరించారు. ప్రోలయ ముస్లింలను పారదోలి రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు.

ప్రోలయకు సంతానం లేనందువల్ల అతడి మరణం తర్వాత కాపయనాయకుడు రాజయ్యాడు. సింగమనీడు, వేమారెడ్డిల సహకారంతో ముస్లింలపై పోరాటం కొనసాగించి 1336లో ఓరుగల్లు కోటను ఆక్రమించాడు. మాలిక్ మక్బూల్ పారిపోయాడు. ఓరుగల్లు రాజధానిగా ఉత్తర తెలంగాణను, కృష్ణానది నుంచి గోదావరి వరకు ఉన్న తీరాంధ్రను పాలించాడు. విస్తరణ కాంక్షతో రేచర్ల సింగమనేని రాజ్య భాగాలైన పిల్లలమర్రి, ఆమనగల్లు, వాడపల్లి ప్రాంతాలను ఆక్రమించి వాటి పాలకుడిగా ఎరబోతు లెంకను నియమించాడు. తీరాంధ్రను పాలించేందుకు ప్రతినిధులను నియమించాడు. కోడుకొండ్ల ప్రాంతంలో తన ప్రతినిధిగా కూన నాయకుడిని నియమించాడు. సబ్బినాడు (కరీంనగర్)కు ముప్పభూపాలుడిని రాజప్రతినిధిగా నియమించాడు. ఇతడు మడికి సింగనకు ఆశ్రయం కల్పించాడు. కాపయ నాయకుడు తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకుంటున్న సమయంలో హసన్ గంగూ(జాఫర్ ఖాన్) మహ్మద్‌బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేశాడు. అలాఉద్దీన్ బహమన్ షా అనే బిరుదుతో 1341లో గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఈ తిరుగుబాటు సమయంలో కాపయ నాయకుడు హసన్ గంగూకు సహాయం చేశాడు. కానీ హసన్ గంగూ కొంత కాలం తర్వాత ఓరుగల్లు మీద దాడి చేశాడు. కాపయ కౌలాస్ (నిజామాబాద్) దుర్గాన్ని వదులుకున్నాడు. హసన్ గంగూ 1356-57లో మరో సారి దండెత్తాడు. కాపయ ఈసారి భువనగిరి దుర్గాన్ని కోల్పోయాడు. నాటి నుంచి కొంత కాలం బహమనీ సుల్తాన్లకు భువనగిరి తూర్పు సరిహద్దుగా మారింది. విజయనగర బుక్కరాయల సాయంతో కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌ను అరికట్టడానికి ప్రయత్నించాడు. కానీ ఆ ప్రయత్నం సఫలం కాకపోగా కుమారుడైన వినాయక దేవుణ్ణి కోల్పోయాడు. కాపయ నాయకుడి చర్యకు ఆగ్రహించిన బహమనీ సుల్తాన్ హుమాయున్ గోల్కొండ పైకి తన సేనానిని, ఓరుగల్లుపై సఫదర్ ఖాన్‌ను దండయాత్రకు పంపాడు. కాపయ ఈసారి గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాల్ని కోల్పోయాడు. 1364-65లో బహమనీ సుల్తాన్‌తో సంధి చేసుకొని పై ప్రాంతంతో పాటు 300 ఏనుగులను, 2000 గుర్రాలను, 3 లక్షల రూపాయలను యుద్ధ నష్టపరిహారంగా చెల్లించాడు.

కాయప నాయకుడి వరుస పరాజయాలను అదనుగా తీసుకొని తీరాంధ్ర పాలకులు స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఉత్తర తీరాంధ్ర రెడ్ల ఆధీనంలోకి వెళ్లింది. తీరాంధ్ర చేజారే సమయంలోనే దక్షిణ తెలంగాణలో ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలను పాలిస్తున్న రేచర్ల సింగమనాయకుడు విజృంభించి కృష్ణా నదివరకు రాజ్యాన్ని విస్తరింపజేశాడు. తుంగభద్ర, అంతర్వేది ప్రాంతాలను కూడా అతడు ఆక్రమించాడు. దీనికి ఆగ్రహించిన కాపయ నాయకుడు సింగమనాయకుడిని హతమార్చాడు.

సింగమనాయకుని తర్వాత రాజైన అనపోతా నాయకుడు తన తండ్రి మరణానికి కారణమైన కాపయ మీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఓరుగల్లు మీద దండయాత్ర చేశాడు. 1366 (1367-68 అని మల్లంపల్లి సోమశేఖర శర్మ అభిప్రాయం)లో కాపయను సంహరించి ఓరుగల్లు, భువనగిరి తదితర దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు. ఇంతటితో ముసూనూరి వంశం అంతరించింది. ఈ చరిత్రను బట్టి 30 ఏళ్లపాటు ఉత్తర తెలంగాణ ప్రాంతాలు ముసునూరి వంశ పాలనలో ఉన్నాయని తెలుస్తోంది.

పద్మనాయకులు (1326-1482)

పద్మనాయక వంశానికి మూలం రేచర్ల రెడ్లు. రేచర్ల నామిరెడ్డి మేనల్లుడైన చెవ్విరెడ్డి (భేతాళరెడ్డి /భేతాళనాయకుడు) పద్మనాయక వంశానికి మూలపురుషుడు. బేతిరెడ్డి, చెవ్విరెడ్డి మొదలైన పేర్లు వీరిని రెడ్డి తెగకు చెందినవారని సూచిస్తుండగా, సేనా నాయకత్వాన్ని సూచించే నాయుడు బిరుదును కూడా పద్మనాయకులు ధరించడాన్ని బట్టి వీరు రెడ్లు కాకపోవచ్చని భావించారు. కానీ వీరికి రెడ్లతో దగ్గర సంబంధం ఉందని చరిత్రకారుల అభిప్రాయం. సురవరం ప్రతాపరెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చెవ్విరెడ్డి వంశీయులే వైష్ణవమతాన్ని స్వీకరించి సంస్కరణ మార్గంలో పయనించి వెలమలై రేచర్ల పద్మనాయకులయ్యారు. పిఠాపురం, బొబ్బిలి, జటప్రోలు, వెంకటగిరి సంస్థానాధిపతులు ఈ తెగకు చెందిన వారే. కాకతీయుల సామంత మాండలికుల్లో రేచర్ల పద్మనాయకులు చివరి వరకూ అత్యంత విశ్వాసపాత్రులుగా ఉన్నారు. వీరు నల్లగొండ జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాడు ప్రాంతాలను మహాసామంతులుగా పాలించారు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం రేచర్ల పద్మనాయకులు ఢిల్లీ సుల్తాన్లను,బహమనీ సుల్తాన్లను అరికట్టి తెలంగాణను పాలించారు. వీరు తెలంగాణేతర ప్రాంతాలను జయించినా.. కొంత కాలం తర్వాత వాటిని కోల్పోయేవారు. అదే విధంగా ఇతరులు తెలంగాణ ప్రాంతాలను ఆక్రమించినా వీరు తిరిగి పొందగలిగేవారు. మిర్యాలగూడ తాలూకాలోని ఆమనగల్లు వీరి జన్మస్థలం. వీరికి ముందు ఆమనగల్లు రాజధానిగా రేచర్ల రెడ్లు, కందూరి చోడులు పరిపాలించారు. పద్మనాయక వంశానికి మూలపురుషుడైన భేతాళనాయకుడిని గణపతి దేవుడు ఆమనగంటి పాలకుడిగా నియమించాడు.


మాదిరి ప్రశ్నలు

1. కాకతీయుల కాలంలో ప్రసిద్ధ 'కంచుగంట' తయారీ కేంద్రాలు?
   1) పానగల్లు, భువనగిరి
   2) పానగల్లు, చండూరు
   3) చండూరు, నిర్మల్
   4) చండూరు, భువనగిరి
2. కాకతీయుల కాలంలో కత్తుల తయారీకి పేరొందిన ప్రాంతం?
   1) నిర్మల్ 2) చండూరు
   3) పానగల్లు 4) బోధన్
3. తెలుగులో తొలి స్వతంత్ర కవిగా, ఆదికవిగా పేరొందింది ఎవరు?
   1) నరహరి 2) పాల్కురికి సోమనాథుడు
   3) జీనవల్లభుడు 4) రుద్రదేవుడు
4. దేశీయతకు (భాషలో, ఛందస్సులో, వస్తువులో) స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన కవి?
   1) వేములవాడ భీమకవి
   2) పాల్కురికి సోమనాథుడు
   3) నన్నయ 4) ఎర్రన
5. కాకతీయులు ఎవరి కాలం నుంచి శైవమతాన్ని అవలంబించారని చరిత్రకారుల అభిప్రాయం?
   1) మొదటి ప్రోలరాజు 2) రెండో ప్రోలరాజు
   3) రెండో బేతరాజు 4) రుద్రదేవుడు
6. కాకతీయుల కాలంలో 'కాలముఖశైవ' కేంద్రంగా ప్రసిద్ధి చెందింది?
   1) జోగిపేట 2) అలంపురం
   3) హనుమకొండ 4) ఇంద్రపురి
7. కాకతీయుల కాలంలో ప్రసిద్ధ వైష్ణవ కేంద్రం?
   1) జోగిపేట 2) ఇంద్రపురి
   3) ధర్మపురి 4) అలంపురం
8. కిందివాటిలో వైష్ణవ మతానికి సంబంధించిన రచన?
   1) పండితారాధ్య చరిత్ర 2) బసవ పురాణం
   3) జినేంద్రకల్యాణాభ్యుదయం
   4) రంగనాథ రామాయణం
9. తొలిసారిగా తెలుగులో శాసనాలు వేయించిన కాకతీయ రాజెవరు?
   1) మొదటి ప్రోలరాజు 2) రెండో ప్రోలరాజు
   3) మొదటి బేతరాజు 4) రెండో బేతరాజు
10. నీతిసారం గ్రంథ రచయిత?
    1) జాయపసేనాని 2) రుద్రదేవుడు
    3) ప్రతాపరుద్రుడు 4) నరహరి కవి
11. మమ్మటుడి 'కావ్య ప్రకాశాని'కి వ్యాఖ్యానం ఏది?
    1) చిత్తానురంజనం 2) స్మృతిదర్పణం
    3) తర్కరత్నాకరం 4) నీతిసారం
12. కావ్యప్రకాశానికి వ్యాఖ్యానం రాసింది ఎవరు?
    1) బ్రహ్మశివకవి 2) మయూరకవి
    3) జాయపసేనాని 4) నరహరి
13. నరహరి కవి ఏ ప్రాంతానికి చెందినవారు?
    1) భువనగిరి 2) కొలనుపాక
    3) హనుమకొండ 4) పానగల్లు
14. స్మృతిదర్పణం, తర్కరత్నాకరం గ్రంథాలను రాసిందెవరు?
    1) జాయపసేనాని 2) నరహరి కవి
    3) మయూరకవి 4) నాగదేవకవి
15. 'నృత్తరత్నావళి' గ్రంథ రచయిత?
    1) పాల్కురికి సోమన
    2) నరహరి కవి 3) జాయపసేనాని
    4) చక్రపాణి రంగనాథుడు
16. శివశక్తి దీపిక, గిరిజాధినాయక శతకాలను రచించిందెవరు?
    1) జాయపసేనాని 2) పాల్కురికి సోమన
    3) చక్రపాణి రంగనాథుడు
    4) విశ్వేశ్వర దేశికుడు
17. గణపతిదేవుడి దీక్షాగురువు?
    1) కృష్ణమాచార్యులు 2) విశ్వేశ్వరదేశికుడు
    3) శరభాంకుడు 4) శివదేవయ్య
18. 'శివతత్త్వ రసాయనం' గ్రంథ రచయిత?
    1) శరభాంకుడు 2) శివదేవయ్య
    3) విశ్వేశ్వరదేశికుడు 4) కృష్ణమాచార్యులు
19. తెలంగాణకు చెందిన తొలి వైష్ణవ కవి?
    1) గంగాధర కవి 2) కృష్ణమాచార్యులు
    3) శివదేవయ్య 4) శరభాంకుడు
20. తెలుగులో తొలి వచనాలైన 'సింహగిరి వచనాల'ను రచించిందెవరు?
    1) కృష్ణమాచార్యులు 2) శివదేవయ్య
    3) శరభాంకుడు 4) గంగాధరకవి
21. 'రాజరుద్రీయం' గ్రంథ రచయిత?
    1) శివదేవయ్య 2) గంగాధర కవి
    3) కొలని రుద్రదేవుడు 4) శరభాంకుడు
22. కృష్ణమాచార్యులు ఏ ప్రాంత నివాసి?
    1) ఓరుగలు 2) జోగిపేట
    3) భువనగిరి 4) సంతవూరు
23. మహాభారతాన్ని నాటకరూపంలో రచించిన కవి?
    1) శేషాద్రి రమణ కవులు 2) గంగాధర కవి
    3) మంచన 4) శివదేవయ్య

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 2	5) 3
6) 2	7) 3	8) 4	9) 4	10) 2
11) 1	12) 4	13) 1	14) 2	15) 3
16) 3	17) 2	18) 3	19) 2	20) 1
21) 3	22) 4	23) 2		

ప్రౌఢ మానవునిలో దంతాల సంఖ్య?



మాదిరి ప్రశ్నలు

1. వైద్యుడు ఒక వ్యక్తికి నిమ్మ, ఉసిరి, జామకాయలు తినాలని సలహా ఇచ్చాడు. ఆ వ్యక్తిలో ఏ వ్యాధి లక్షణాలను గుర్తించి ఉండవచ్చు?
   1) రికెట్స్ 2) రేచీకటి
   3) బెరి బెరి 4) స్కర్వీ
2. వ్యాధులకు సంబంధించి కింది వాటిలో ఏ రెండు సరైనవి?
   ఎ. బోదకాలు వ్యాధి ఉకరేరియా బ్రాంక్రాఫ్టి అనే క్రిమి వల్ల వస్తుంది
   బి. మలేరియా పరాన్న జీవికి ఒక అతిథేయి క్యూలెక్స్ దోమ
   సి. మెదడు వాపు వ్యాధి క్యూలెక్స్ దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది
   డి. బోదకాలు వ్యాధి అనాఫిలస్ దోమ వల్ల కలుగుతుంది
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, డి 4) సి, డి
3. లైంగిక ద్విరూపకత అంటే?
   1) స్త్రీ, పురుష జీవులు ఒకే లక్షణాలను కలిగి ఉంటాయి
   2) స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలు ఒకే జీవిలో ఉంటాయి
   3) స్త్రీ, పురుష జీవులు బాహ్య లక్షణాల్లో వేర్వేరు లక్షణాలను కలిగి ఉంటాయి
   4) అంతర్గత వ్యవస్థలు వేరుగా ఉన్నా, బాహ్యంగా స్త్రీ, పురుష జీవులు ఒకే లక్షణాలతో ఉంటాయి
4. కిరణ జన్య సంయోగ క్రియ జరిగిందని తెలుసుకోవడానికి చేసే పరీక్ష ఏది?
   1) KOH పరీక్ష 2) గ్లిసరిన్ పరీక్ష
   3) అయోడిన్ పరీక్ష 4) లైట్ స్క్రీన్ పరీక్ష
5. పశువులు కలుషితమైన మేత తినడం వల్ల ప్రబలే వ్యాధి ఏది?
   1) ఆటలమ్మ 2) గంబోరో వ్యాధి
   3) మేడ్-కౌ వ్యాధి 4) రేబిస్ వ్యాధి
6. కలుపు మొక్కలను చేత్తో లాగే యడం, దున్నడం, కత్తిరించడం, కాల్చేయడం లాంటివి ఏ రకమైన పద్ధతి కిందకి వస్తాయి?
   1) రసాయన పద్ధతి 2) బ్రాడ్ కాస్టింగ్ పద్ధతి
   3) భౌతిక పద్ధతి
   4) జీవ క్రియా విధాన పద్ధతి
7. చర్మంలోని మెలనిన్ ఏ కిరణాల నుంచి రక్షణ ఇస్తుంది?
   1) అతినీల లోహిత కిరణాలు
   2) పరావర్తన కిరణాలు 3) ఎక్స్ కిరణాలు
   4) అన్ని రకాల కాంతి కిరణాలు
8. కనుపాప తారక చేసే క్రియను దేని క్రియతో పోల్చవచ్చు?
   1) కెమెరా కటకం 2) కెమెరా డయాఫ్రం
   3) కెమెరా ఫిల్మ్ 4) కెమెరా ఫ్లాష్
9. ఏ పాములు న్యూరో టాక్సిన్లను కలిగి ఉంటాయి?
   1) కట్ల పాము 2) రక్త పింజర
   3) పైథాన్ 4) బురద పాము
10. శ్లేష్మంలో కలిగే రసాయనాల వాసనను గ్రహించేవి?
    1) జిహ్వ గ్రాహకాలు
    2) ఘ్రాణ గ్రాహకాలు
    3) శ్రవణ గ్రాహకాలు
    4) స్పర్శ గ్రాహకాలు
11. నిల్వ చేసే ప్రక్రియలో 'క్యూరింగ్' అంటే?
    1) ఈస్ట్‌ను ఉపయోగించి ఆల్కహాల్‌ను తయారు చేయడం
    2) పాలను పెరుగుగా మార్చి నిల్వ చేయడం
    3) పాలను వేడి చేసి మీగడను వేరు చేయడం
    4) కాటేజ్ జున్నును కొన్ని పద్ధతుల ద్వారా మార్చడం
12. కిణ్వ ప్రక్రియ అనేది ఏ వాయువు లేనప్పుడు ఈస్ట్ కణాలు జరిపే ఒక రకమైన శ్వాసక్రియ?
    1) CO_2 2) H_2
    3) O_2 4) CO
13. ఏ దేశస్థులు జిగట విరేచనాలు, ఎల్లో జ్వరానికి ఎక్కువ ప్రతినిరోధకత కలిగి ఉంటారు?
    1) ఆఫ్రికన్లు 2) యూరోపియన్లు
    3) భారతీయులు 4) అమెరికన్లు
14. రిఫ్రిజరేటర్లలో ఆహార పదార్థాలను నిల్వ చేసే సరైన ఉష్ణోగ్రత?
    1) 5°C-15°C 2) 4°C-10°C
    3) 20°C-25°C 4) 0°C-10°C
15. నూనె గింజలనిచ్చే మొక్కలు, వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి కిందివాటిలో సరి కాని జత ఏది?
    ఎ. సన్ ఫ్లవర్ - హీలియాంథస్ ఏన్యూనస్
    బి. ఆవాలు-సిసమమ్ ఇండికమ్
    సి. వేరుసెనగ - అరాఖిస్ హైపోజియా
    డి. పామ్ - ఇలుసిస్ గైనన్సిస్
    1) ఎ, సి 2) బి, సి
    3) బి, డి 4) ఎ, డి
16. మొక్క సాధారణ నామం, అందులో ఉండే ఔషధానికి సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
    ఎ. తులసి - కేంపర్
    బి. పెరూవియన్ - క్వినైన్
    సి. పాయిసన్ నట్ - మార్ఫిన్
    డి. డెడ్లీవైట్‌షేడ్ - బ్రూసిన్
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
17. శరీరంలో పాకకుండా, అపాయం చేయని వ్రణాలను ఏమంటారు?
    1) మాలిగ్నెంట్ గడ్డలు 2) బినైన్ గడ్డలు
    3) కార్సినోమా 4) సార్కోమా
18. ఆస్టియోసైట్ కణాలు ఏ కణజాలంలో ఉంటాయి?
    1) మృదులాస్థి 2) కండర
    3) అస్థి 4) సంయోజక
19. ప్రౌఢ మానవునిలో దంతాల సంఖ్యకు సంబంధించి సరైంది?
    1) 36 2) 38 3) 32 4) 34
20. చిన్న పిల్లల జఠర రసంలో మాత్రమే కనిపించే ఎంజైమ్?
    1) పెప్సిన్ 2) ట్రిప్సిన్
    3) ఎంటిరోకైనేజ్ 4) రెనిన్
21. నెమరువేసే జంతువుల్లో 'జాలకం' అనేది?
    1) జీర్ణాశయంలో మూడో గది
    2) జీర్ణాశయంలో రెండో గది
    3) జీర్ణాశయంలో మొదటి గది
    4) జీర్ణాశయంలో నాలుగో గది
22. కిందివాటిలో సరైన జత ఏది?
    ఎ. తుమ్మ - రెసిన్
    బి. సింకోనా - క్వినైన్
    సి. రబ్బరు చెట్టు - లేటెక్స్
    డి. వివృత బీజాలు - టానిన్
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
23. మూత్రపిండంలో నిమిషానికి ఏర్పడే మూత్ర పరిమాణం?
    1) 90 మి.లీ. 2) 75 మి.లీ.
    3) 100 మి.లీ. 4) 120 మి.లీ.
24. మంచినీటిలో ఎక్కువ భాగం వేటిలో/ ఎక్కడ ఉంటుంది?
    1) నదులు 2) సముద్రాలు
    3) సరస్సులు
    4) ధ్రువ ప్రాంతాల్లో మంచు రూపంలో
25. శ్వాసక్రియలో అంత్య పదార్థాలుగా ఏర్పడేవి?
    1) O_2, CO_2 మిశ్రమం
    2) CO_2, N_2 3) CO_2, H_2O
    4) H_2O, O_2
26. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ అంటే?
    1) భూమిపై ఎక్కువ మొక్కలు ఉండటం
    2) వాతావరణంలోని CO_2 వల్ల భూమి ఉష్ణోగ్రత పెరగడం
    3) చెట్లతో కప్పిన ఇళ్లలో చల్లగా ఉండటం
    4) పర్యావరణంలో మార్పు కోసం ఆకు పచ్చని చెట్లు పెంచడం
27. మృత్తిక ఏర్పడే పద్ధతిని ఏమంటారు?
    1) ఫెదరింగ్ 2) వార్మింగ్
    3) విదరింగ్ 4) ఫిక్సింగ్
28. మానవునిలో కేంద్రకం లేని రక్త కణం?
    1) లింఫోసైట్ 2) బేసోఫిల్
    3) మోనోసైట్ 4) ఎరిత్రోసైట్
29. కిందివాటిలో ఏ విత్తనాల్లో అధిక శాతం ప్రోటీన్లు ఉంటాయి?
    1) వేరుసెనగ 2) పొద్దు తిరుగుడు
    3) సోయా చిక్కుడు 4) బఠాని
30. అప్పుడే జన్మించిన శిశువులో నిమిషానికి శ్వాసక్రియ రేటు?
    1) 32 సార్లు 2) 20 సార్లు
    3) 15 సార్లు 4) 22 సార్లు
31. కిరణజన్య సంయోగ క్రియను సూచించే సరైన రసాయన సమీకరణం?
    1) $12CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
    2) $6CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
    3) $6CO_2 + 12H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$
    4) $12CO_2 + 6H_2O \rightarrow C_6H_{12}O_6 + 6O_2 + 9H_2O$
32. కాండం పెరుగుదల, ఫైటోహార్మోన్లకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) జిబ్బరిలిన్లు.. ఆక్సిన్ల సమక్షంలో ప్రోత్సహించవు
    2) ఆక్సిన్లు ప్రోత్సహిస్తాయి
    3) ఆబ్‌సిసిక్ ఆమ్లం ప్రోత్సహిస్తుంది
    4) ఇథైలీన్ ప్రోత్సహిస్తుంది
33. పరధీయ నాడీ వ్యవస్థలో 43 జతల నాడులుంటాయి. వీటిలో కపాల, వెన్ను నాడులకు సంబంధించి సరైంది ఏది?
    1) వెన్ను నాడులు 30 జతలు; కపాల నాడులు 13 జతలు
    2) కపాల నాడులు 12 జతలు; వెన్ను నాడులు 31 జతలు
    3) వెన్ను నాడులు 12 జతలు; కపాల నాడులు 31 జతలు
    4) కపాల నాడులు 9 జతలు; వెన్ను నాడులు 34 జతలు
34. శిశువు నీరసించి, శుష్కించి ఉంటాడు. కాళ్లు, చేతులు పుల్లల్లాగా మారతాయి. కడుపు ఉబ్బి ఉంటుంది. రోమాలు పెర గవు. అతిసార వ్యాధితో బాధపడతాడు. ఈ లక్షణాలు ఏ వ్యాధికి సంబంధించి నవి?
    1) క్యాషియోర్కర్ 2) స్కర్వీ
    3) మరాస్మస్ 4) రికెట్స్
35. స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో అండ కణం ఫలదీకరణం చెందే భాగం ఏది?
    1) గర్భాశయం 2) యోని
    3) ఫాలోపియన్ నాళం 4) స్త్రీ బీజకోశం
36. పారమీషియంలో శారీరక క్రియలను నియంత్రించేది ఏది?
    1) స్థూల కేంద్రకం 2) సూక్ష్మ కేంద్రకం
    3) ప్రవాస ప్రాక్కేంద్రకం
    4) స్థిర ప్రాక్కేంద్రకం
37. కప్ప 'స్పాన్'లలో ఉండే కణాలు ఏ రకమైనవి?
    1) శుక్ర కణాలు 2) అండ కణాలు
    3) శుక్ర మాతృ కణాలు
    4) అండ,శుక్ర కణాలు కలిసి ఉంటాయి
38. ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే నిర్మాణం ఏది?
    1) పీయూష గ్రంథి మధ్య లంబిక
    2) కాలాంచిక
    3) పీయూష గ్రంథి పర లంబిక
    4) థైరాయిడ్ గ్రంథి
39. కిందివాటిలో అంకురచ్ఛదం ఉండని విత్తనం?
    1) ఆముదం 2) మొక్కజొన్న
    3) వరి 4) చిక్కుడు
40. హెచ్ఐవీ వైరస్ మానవునిలో ప్రవేశించే విధానాలకు సంబంధించి సరైంది ఏది?
    ఎ. వ్యాధిగ్రస్థుల దుస్తులు, ఆహారం పంచుకున్నప్పుడు వ్యాపిస్తుంది
    బి. వ్యాధిగ్రస్థులతో లైంగిక సంపర్కం వల్ల వ్యాప్తి చెందుతుంది
    సి. దగ్గుతున్న వ్యాధిగ్రస్థుడి తుంపరల ద్వారా వ్యాపిస్తుంది
    డి. వైరస్ సోకిన రక్తం ఎక్కించడం ద్వారా వ్యాపిస్తుంది
    1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) బి, డి
41. పరాగ రేణువు, స్త్రీ బీజ కణాల స్థితులు వరుసగా?
    1) ఏక స్థితిక, ద్వయ స్థితిక
    2) ఏక స్థితిక, ఏక స్థితిక
    3) ద్వయ స్థితిక, ఏక స్థితిక
    4) ద్వయ స్థితిక, ద్వయ స్థితిక
42. ముత్యం లభించే జీవులకు సంబంధించిన వర్గం ఏది?
    1) సీలెంటరేటా 2) ఎఖైనోడెర్మేటా
    3) మొలస్కా 4) అనెలిడా
43. తేనెపట్టులోని మైనాన్ని తిని పట్టులోని గదులను నాశనం చేసే కీటకం ఏది?
    1) వాక్స్ మాత్ 2) లక్క కీటకం
    3) నల్లి 4) ఈగ
44. బోంబెక్స్ మోరీ అనేది కిందివాటిలో ఏ జీవి శాస్త్రీయ నామం?
    1) లక్క కీటకం 2) పట్టు పురుగు
    3) తేనెటీగ 4) నల్లి
45. 'రాగులు' శాస్త్రీయ నామం ఏమిటి?
    1) ట్రిటికమ్ వల్గేర్ 2) జియా మేస్
    3) సోర్గం వల్గేర్ 4) ఎల్యూసిన్ కొరకానా
46. 'హెన్ని' అనేది ఏ రెండు జీవుల సంకరణ ఫలితం?
    1) మగ గాడిద, ఆడ గాడిద
    2) మగ గుర్రం, ఆడ గాడిద
    3) మగ గాడిద, ఆడ గుర్రం
    4) మగ గుర్రం, ఆడ గుర్రం
47. 'కేంపర్' ఏ మొక్క నుంచి లభిస్తుంది?
    1) నల్ల మందు మొక్క 2) నక్స్ వామిక్
    3) ఆసిమమ్ ఫాన్‌క్టమ్
    4) సింకోనా అఫిసినాలిస్
48. కుడి కర్ణికా-జఠరికా రంధ్రం వద్ద ఉండే కవాటం ఏది?
    1) అగ్ర ద్వయ కవాటం
    2) పుపుస కవాటం 3) మిట్రల్ కవాటం
    4) అగ్ర త్రయ కవాటం
49. కండరాల్లో జరిగే అవాయు శ్వాసక్రియ లో పైరువిక్ ఆమ్లం ఏవిధంగా మారుతుంది?
    1) గ్లూకోస్ 2) NADH
    3) లాక్టిక్ ఆమ్లం 4) ATP
50. కండర సంకోచాలకు సంబంధించిన నాడులు ఏవి?
    ఎ. జ్ఞాన నాడులు
    బి. అభివాహి నాడులు
    సి. చాలక నాడులు
    డి. అపవాహి నాడులు
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, సి 4) ఎ, డి

సమాధానాలు

1) 4	2) 2	3) 3	4) 3	5) 3
6) 3	7) 1	8) 2	9) 1	10) 2
11) 4	12) 3	13) 1	14) 4	15) 3
16) 1	17) 2	18) 3	19) 3	20) 4
21) 2	22) 2	23) 4	24) 4	25) 3
26) 2	27) 3	28) 4	29) 3	30) 1
31) 3	32) 2	33) 2	34) 3	35) 3
36) 1	37) 2	38) 3	39) 4	40) 4
41) 2	42) 3	43) 1	44) 2	45) 4
46) 2	47) 3	48) 4	49) 3	50) 2

వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జనరల్ సైన్స్



మాదిరి ప్రశ్నలు

1. చల్లని నీరు నింపిన గాజు గ్లాసు బయటి భాగం తడిగా ఎందుకు అవుతుంది?
   1) గాజు గ్లాసు ద్వారా నీరు విస్తాపన చెందడం వల్ల
   2) వాతవరణంలో నీటి ఆవిరి గ్లాసుపై ద్రవీభవించడం వల్ల
   3) పరిసరాల ఉష్ణోగ్రతను గ్లాసు అందుకోలేకపోవడం
   4) గ్లాసు, పరిసరాల మధ్య ఉష్ణరాశి వినిమయం లేకపోవడం
2. విశ్వవ్యాప్తంగా విస్తారంగా ఉన్న మూలకం ఏది?
   1) హైడ్రోజన్ 2) హీలియం
   3) ఆక్సిజన్ 4) నైట్రోజన్
3. సాయంకాల చుక్క అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?
   1) బుధుడు 2) శుక్రుడు 3) తోకచుక్క
   4) రాత్రులు మనకు కనిపించే వెలుగు చారలు
4. భారతదేశంలోని పరిశోధన ప్రయోగశాలల పితామహుడు అని ఏ శాస్త్రవేత్తకు పేరు?
   1) ఎస్.ఎస్. బట్నాగర్
   2) విక్రమ్ సారాబాయ్
   3) ప్రపుల్ చంద్ర రే 4) రాజారామన్న
5. వంటగది నుంచి వెలువడే వ్యర్థాలు భూమిలో కుళ్లి సేంద్రియ ఎరువుగా మారే ప్రక్రియ ఒక
   1) ఉష్ణ మోచక చర్య 2) ఉష్ణ గ్రాహక చర్య
   3) ఉష్ణ రసాయన చర్య
   4) తిరోగమన రసాయన చర్య
6. కింది వాటిలో బహుళ పరావర్తన ధ్వనిపై ఆధారపడి పనిచేసే పరికరాలు ఏవి?
   1) మెగాఫోన్ 2) స్టెతస్కోప్
   3) లౌడ్ స్పీకర్ 4) పైవన్నీ
7. 'ఏకో-రేజింగ్' అని దేనిని అంటారు?
   1) శరీర అంతర్భాగాల పరిమాణాన్ని కొలవడం
   2) సమాచార తరంగాల విస్తరణ దూరం
   3) మిస్సైల్ యొక్క దూరాన్ని
   4) అతి ధ్వనులను ఉపయోగించి నీటి లోపల ఉన్న వస్తువుల మధ్య దూరాన్ని కనుగొనడం
8. వయోలిన్, పియానో నుంచి వెలువడే స్వరాల మధ్య భేదాన్ని తెలియజేసే సంగీత స్వర లక్షణం
   1) కీచుదనం 2) తీవ్రత
   3) నాణ్యత 4) ఆవర్తన కాలం
9. ఒక ప్లాస్టిక్ సీసా అడుగున త్రిభుజాకారంలో ఉన్న గుర్తులో '1' అనే అంకె ఉంది. ఇది దేనిని సూచిస్తుంది?
   1) అధిక సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   2) అల్ప సాంద్రత ఉన్న పాలి ఎథిలీన్
   3) పాలీ ఎథిలీన్ టెరిఫ్తాలేట్ 4) పాలీ స్టైరీన్
10. ఒక వ్యక్తి చత్వారంతో బాధపడుతున్నాడు. అతడిని వైద్యుడు పరీక్షించి ఏ కటకాలు ఉన్న కంటి అద్దాలను ఉపయోగించాలని సూచిస్తాడు?
    1) తక్కువ నాభ్యాంతరం ఉన్న ద్వికుంభాకార కటకాలు
    2) ఎక్కువ నాభ్యాంతరం ఉన్న పుటాకార కటకాలు
    3) ద్వినాభ్యాంతర కటకాలు
    4) ద్విపుటాకార కటకాలు
11. కంటి శుక్లాల వల్ల కంటిలోని ఏ భాగం దెబ్బ తింటుంది?
    1) రెటీనా 2) కటకం
    3) కనుపాప 4) కార్నియా
12. రెండు అట్ట ముక్కలను అతి దగ్గరగా ఉంచి వాటి మధ్య గాలి ఊదితే అవి
    1) ఎక్కడికి కదలవు
    2) దూరంగా జరుగుతాయి
    3) దగ్గరకు వస్తాయి
    4) దగ్గరికి వస్తూ, దూరంగా పోతూ కదులుతాయి
13. కింది వాటిలో ఉష్ణశక్తి తరంగాలు అని పిలిచే తరంగాలు ఏవి?
    1) రేడియో తరంగాలు
    2) అతినీల లోహిత కిరణాలు
    3) పరారుణ కిరణాలు
    4) పైవన్నీ
14. ఏకవర్ణ కాంతిని ఉద్గారించే కాంతి జనకం ఏది?
    1) పాదరస దీపం
    2) టంగ్స్టన్ హాలోజన్ దీపం
    3) సోడియం దీపం
    4) చలిమంట
15. ఒక పట్టకం ద్వారా కాంతిని పంపినప్పుడు అతి తక్కువగా విచలనం చెందే రంగు ఏది?
    1) ఎరుపు 2) ఆకుపచ్చ
    3) నీలం 4) వైలెట్
16. క్రేస్కోగ్రాఫ్‌తో దేన్ని కొలుస్తారు?
    1) హృదయ స్పందన 2) నాడీ స్పందన
    3) మొక్కల పెరుగుదల 4) స్ఫటిక నిర్మాణం
17. ఎల్ఈడీ ఉద్గారించే కాంతి రంగు ఏ అంశం పై ఆధారపడి ఉంటుంది?
    1) తిరోశక్మంపై 2) ఎల్ఈడీ పురోశక్మంపై
    3) ఎల్ఈడీ ద్వారా ప్రవహించే పురో విద్యుత్‌పై
    4) ఎల్ఈడీలోని అర్ధ వాహక స్వభావంపై
18. సౌర కుటుంబంలోని గ్రహాలన్నింటిలోనూ అత్యధిక వేడి కలిగిన గ్రహం ఏది?
    1) బుధుడు 2) శుక్రుడు
    3) యురేనస్ 4) శని
19. కింది వాటిలో ఏది పరమాణువు కేంద్రకంలో ఉండదు?
    1) ఫోటాన్ 2) ప్రోటాన్
    3) న్యూట్రాన్ 4) మెసాన్
20. ఓల్టా మీటరుతో దేనిని కొలుస్తారు?
    1) బ్యాటరీ 2) ఓల్టేజీ
    3) విద్యుత్ రసాయన తుల్యాంకం
    4) విద్యుత్
21. సరళ హరాత్మక చలనంలో ఉన్న ఒక వస్తువుకు గరిష్ట త్వరణం ఎప్పుడు కలిగి ఉంటుంది?
    1) మాధ్యమిక స్థానాల వద్ద
    2) దాని మార్గంలోని అన్ని స్థానాల వద్ద
    3) అంతిమ స్థానం, మాధ్యమిక స్థానం వద్ద
    4) అంతిమ స్థానం వద్ద
22. పరమాణు కేంద్రకంలోని కేంద్రక బలాలు
    1) బలమైన ఆకర్షణ బలాలు
    2) బలమైన వికర్షణ బలాలు
    3) బలహీనమైన ఆకర్షణ, వికర్షణ బలాలు
    4) గురుత్వాకర్షణ బలాలు
23. గాలిలో ప్రయాణించే విమానంపై పనిచేసే వాయు గతిక ఉత్థాపకాన్ని విశదీకరించే సూత్రం ఏది?
    1) బెర్నోలీ సిద్ధాంతం
    2) ఉత్ప్లవన సూత్రం
    3) పాజ్వేల్ సమీకరణం
    4) రేనాల్డ్ సంఖ్య
24. అత్యధిక అయనీకరణ సామర్థ్యం కలిగినవి
    1) X-కిరణాలు 2) ఆల్ఫా కణాలు
    3) గామా కిరణాలు
    4) బీటా కణాలు
25. రాకెట్ ప్రొపెలెంట్‌గా ఉపయోగించేది?
    1) నైట్రోజన్
    2) అమ్మోనియా
    3) ఆక్సిజన్
    4) హైడ్రాజీన్
26. సమ ఉష్ణోగ్రత ప్రక్రియలో
    ఎ) వ్యవస్థ ఉష్ణోగ్రత స్థిరంగా ఉండదు
    బి) వ్యవస్థకు, పరిసరాల మధ్య ఉష్ణ వినిమయం
    సి) వ్యవస్థ అంతర్గత శక్తి స్థిరం
    డి) పీడనం,ఘనపరిమాణం వ్యవస్థకు స్థిరం
    1) బి, సి 2) సి,డి
    3) ఎ, సి 4) ఎ, డి
27. కింది వాటిలో దేనిని ఉపయోగించుకుని ఒక వలయంలో కావల్సిన పౌనఃపున్యం ఉన్న ఏకాంతర విద్యుత్‌ను పొందవచ్చు?
    1) ట్రాన్స్‌ఫార్మర్ 2) పవర్ సప్లయ్
    3) ఆంప్లిఫయర్ 4) ఆసిలేటర్
28. గాజు పరిశ్రమల్లో ఉపయోగించే కల్లెట్ అంటే ఏమిటి?
    1) సోడియం సిలికేట్
    2) వర్ణ ద్రవ్యకాలు
    3) పగిలిన గాజు ముక్కలు
    4) చీనా మట్టి ముద్దలు
29. జీవ ప్రక్రియ జరిగే ఆవరణం?
    1) స్ట్రాటో ఆవరణం
    2) ట్రోపో ఆవరణం
    3) మీసో ఆవరణం
    4) అయానో ఆవరణం
30. అంతర గ్రహాలు అని ఏ గ్రహాలను అంటారు?
    1) సూర్యునికి భూమికి మధ్య ఉన్న గ్రహాలు
    2) సూర్యునికి బృహస్పతికి మధ్య ఉన్న గ్రహాలు
    3) వాయు స్థితిలోని గ్రహాలు
    4) ఉపగ్రహాలు లేని గ్రహాలు
31. వాన చినుకులు గోళాకారంగా ఉండటానికి కారణం?
    1) నీటి స్నిగ్ధత 2) నీటి తలతన్యత
    3) నీటి విసరణం 4) ద్రవాభిసరణ పీడనం
32. ఏ సిద్ధాంతంతో 'రామన్ ఫలితం'ను వివరంగా విశదీకరించవచ్చు?
    1) తరంగ సిద్ధాంతం 2) కణ సిద్ధాంతం
    3) విద్యుత్ అయస్కాంత సిద్ధాంతం
    4) క్వాంటం సిద్ధాంతం
33. MRIలో ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం ఏది?
    1) ఎక్స్-కిరణాలు 2) మైక్రో తరంగాలు
    3) రేడియో తరంగాలు 4) పరారుణ కిరణాలు
34. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ ద్రవ్యశక్తి తుల్యతా నియమం $E = mc^2$లో E : శక్తి m : ద్రవ్యరాశి c : ?
    1) ఒక స్థిరాంకం 2) ద్రవ్యవేగం
    3) ద్రవ్యరాశి వేగం 4) కాంతి వేగం
35. పదార్థంలో ఎలక్ట్రాన్‌ల ప్రవాహాన్ని ప్రభావితం చేసేవి?
    1) ఉష్ణీయ కంపనాలు 2) పరమాణువుల కల్మషం 3) స్ఫటిక లోపాలు 4) పైవన్నీ
36. పైరో విద్యుత్ ఉత్పత్తి దేని వల్ల జరుగుతుంది?
    1) సంపీడనం 2) ఉష్ణోగ్రత
    3) తన్యత 4) స్నిగ్ధత
37. సముద్రపు నీటి ఘనీభవ స్థానం కింది దేని వల్ల తగ్గుతుంది?
    1) లవణీయత పెరగడం వల్ల
    2) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
    3) ఆక్సిజన్ పెరగడం వల్ల
    4) నీటి సంక్షోభం పెరగడం వల్ల
38. సూపర్ నోవా అనేది ఒక
    1) నక్షత్ర మండలం 2) నక్షత్ర విస్ఫోటనం
    3) అత్యధిక భారం ఉన్న నక్షత్రం
    4) భారీ ద్రవ్యరాశి ఉన్న నక్షత్రం
39. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌లలో శీతలీకరణ పదార్థం ఏది?
    1) భార జలం 2) తేలిక జలం
    3) ద్రవ హీలియం
    4) ద్రవ సోడియం
40. డాప్లర్ ప్రభావం అనువర్తింప చేయగలిగే తరంగాలు?
    1) ధ్వని తరంగాలు
    2) కాంతి తరంగాలు
    3) రేడియో తరంగాలు
    4) పై మూడు రకాల తరంగాలు
41. నీటిలో ఏర్పడిన శబ్దతరంగం ఉపరితలంలోని గాలిలోకి ప్రవేశించినప్పుడు స్థిరంగా ఉండి తరంగం అభిలక్షణం?
    1) వడి 2) తరంగ దైర్ఘ్యం
    3) పౌనఃపున్యం 4) ఏదీ కాదు
42. సూర్యోదయం, సూర్యస్తమయ సమయాల్లో సూర్యుడు ఏ ఆకారంలో కనిపిస్తాడు?
    1) వృత్తాకారం
    2) కోల ఆకారం(oval shape)
    3) స్థూపాకారం 4) వక్రాకారం
43. గాలిలోని నీటి బిందువు ఏ విధంగా పని చేస్తుంది?
    1) అపసరణ కటకం 2) అభిసరణ కటకం
    3) కటకం వలె పనిచేయదు
    4) సమతల దర్పణం వలె పనిచేస్తుంది
44. అయస్కాంత పదార్థాలన్నీ కింది వాటిలో దేనివలన అయస్కాంత ధర్మాలను పోగొట్టుకుంటుంది?
    1) నీటిలో ముంచినప్పుడు
    2) నూనెలో ముంచినప్పుడు
    3) ఇనుప ముక్క వద్దకు తెచ్చినప్పుడు
    4) బాగా వేడి చేసినప్పుడు
45. ఒక వస్తువును మరొక వస్తువుతో రుద్దినప్పుడు ఆవేశం పొందింది. ఆ వస్తువు భారంలో మార్పు కింది ఏ విధంగా ఉంటుంది?
    1) భారం మారదు 2) స్వల్పంగా పెరగకపోవచ్చు
    3) స్వల్పంగా తగ్గుతుంది
    4) స్వల్పంగా పెరుగుతుంది లేదా తగ్గుతుంది
46. ఒక సిల్క్ గుడ్డతో గాజు కడ్డీని రుద్దిన రెండింటికి ఆవేశం కలగడానికి కారణం?
    1) ఘర్షణ వల్ల
    2) ఉపరితలాలు నునుపు కావడం వల్ల
    3) ఎలక్ట్రానుల మార్పిడి వల్ల
    4) ఎలక్ట్రానులు, ప్రోటానుల మార్పిడి వల్ల
47. x-కిరణాల అభిలక్షణం
    1) రుణావేశ కణాల ప్రవాహం
    2) ప్రోటానుల ప్రవాహం
    3) పరమాణు మూలం ఉన్న విద్యుదయస్కాంతాల వికిరణాల ప్రవాహం
    4) కేంద్రక మూలం ఉన్న విద్యుదయస్కాంత వికిరణాల ప్రవాహం
48. కంటి రెటీనాలోని లోపాలను సవరించడానికి ఉపయోగించే విద్యుదయస్కాంత వికిరణం?
    1) అతినీలలోహిత కిరణాలు
    2) పరారుణ కాంతి 3) ఎక్స్- కిరణాలు
    4) లేజర్
49. మానవుని శరీరంలో ఏర్పడిన ట్యూమర్ (కణితి) పరిమాణాన్ని అంచనా వేయడానికి ఉపయోగించే పరికరాల్లో కింది ఏ దృగ్విషయాన్ని ఉపయోగిస్తారు?
    1) వివర్తనం 2) ధృవణం
    3) వ్యతికరణం 4) విశ్లేషణం
50. కింది ఏ సంవత్సరాన్ని అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సంవత్సరంగా ప్రకటించారు?
    1) 1905 2) 2005
    3) 1995 4) 2015
51. శీతల ప్రదేశాల్లో ఉష్ణోగ్రత తగ్గిపోయినప్పుడు తటాకాలు, సరస్సుల్లోని నీరు ఉపరితలంపై గడ్డకట్టి అడుగు భాగంలో నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) నీటికి చాలా ఎక్కువ విశిష్టోష్ణం ఉండటం
    2) మంచు ఉష్ణ వాహకత్వం విలువ తక్కువగా ఉండటం
    3) నీటి ఘనీభవన ఉష్ణం ఎక్కువ
    4) తటాకాల అడుగు భాగాన ఉష్ణోగ్రత ఎక్కువ
52. ఒక ఎత్తైన కొండ పై నుంచి ఒక వస్తువును స్వేచ్ఛగా పతనం చెందేటట్లు చేశాం. వరుస సమాన కాల వ్యవధుల్లో ప్రయాణించే దూరాల నిష్పత్తి?
    1) 2:4:6 2) 1:3:7
    3) 1:2:3 4) 0:2:6:12
53. కదులుతున్న కుట్టు మిషన్ సూదికి ఏ రకమైన చలనం ఉంటుంది?
    1) స్థానంతర చలనం 2) భ్రమణ చలనం
    3) సరళ హరాత్మక చలనం 4) వృత్తాకార చలనం
54. ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం, ఉష్ణగతిక వ్యవస్థలో నియమం రూపాంతరం?
    1) ద్రవ్య వేగ నిత్యత్వ నియమం
    2) ఉష్ణగతిక శాస్త్ర రెండో నియమం
    3) శక్తి నిత్యత్వ నియమం
    4) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
55. శీతల యంత్రంలోని గాలి వ్యాకోచించడానికి ఏ శక్తిని వినియోగించుకుంటుంది?
    1) ద్రవ్య శక్తిని 2) బాహ్య ఉష్ణ శక్తిని
    3) తన అంతర్గత శక్తిని 4) తన ఉష్ణోగ్రతను

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 1	5) 1
6) 4	7) 4	8) 3	9) 3	10) 3
11) 2	12) 3	13) 3	14) 3	15) 1
16) 3	17) 4	18) 2	19) 1	20) 3
21) 4	22) 1	23) 1	24) 2	25) 4
26) 3	27) 4	28) 3	29) 2	30) 2
31) 2	32) 4	33) 3	34) 4	35) 4
36) 2	37) 1	38) 2	39) 4	40) 4
41) 3	42) 2	43) 2	44) 4	45) 4
46) 3	47) 3	48) 4	49) 1	50) 2
51) 2	52) 2	53) 3	54) 3	55) 3

Who among the following is the Son?

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.no.1-5): In these questions, the relationship between different elements is shown in the statements. Give answer

1) If only conclusion I follows.
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows.
4) If neither conclusion nor II follows.
5) If both conclusion I and II follow.

1. Statements:
D ³ M ³ P, R > P, D £ B, A £ P
Conclusion:
I. A < B II.A = B

2. Statements:
K > R ³ P, Q £ S = T, Q <P, O<R
Conclusion: I.O < K II.R > T

3. Statements:
X = P ³ C = Z, R = Y ³ X
Conclusion:
I. Y > C II. R = Z

4. Statements:
A > Y ³ B, P = A, P £ C, K £ B
Conclusion:
I. C > K II. K < A

5. Statements:
M £ L £ D, M ³ N, B > D, P = N
Conclusion:
I. D ³ N II. P < B

Directions (Q.no.6-12): Study the following information carefully to answer the given questions.

There are eight family members M, N, O, P, Q, R, S and T are sitting around a circular table facing the centre but not necessarily in the same order. Family members comprise of Grandfather, Grandmother, Father, Mother, Son, Daughter-in-law, Daughter and Son-in-law.

Father is second to the left of M who is second to the left of Daughter-in-law. T is third to the right of Son. T is neither Father nor Daughter-in-law. M is between O and P. Son-in-law is second to the left of Father. Grandfather is between Grandmother and Son. Mother is second to the left of O. N is neighbour of T but not the neighbour of S. R is facing S. N is not Daughter.

6. Who amongst the following sits third to the left of M?
1) Son-in-law 2) N 3) Q
4) Daughter 5) S

7. Four of the following five are alike in a certain way based on the given arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) O - Grandfather 2) M - Son
3) S - Daughter 4) N - Son-in-law
5) R- Grandmother

8. Who among the following is the Son?
1) M 2) O 3) P
4) N 5) None of these

9. Which of the following is true with respect to the given seating arrangement?
1) Father is an immediate neighbour of Mother
2) N sits second to the right of O
3) Daughter and Son are immediate neighbours
4) Grandfather sits to the immediate left of Grandmother
5) M sits second to the left of R

10. Who is T?
1) Grandfather 2) Son-in-law
3) Daughter 4) Mother
5) None of these

11. Who among the following sit between Grandmother and S?
1) R and Grandfather
2) P and Q 3) Grandfather and P
4) P and R 5) M and Daughter

12. Who among the following is Daughter?
1) P 2) T 3) Q
4) S 5) R

Directions (Q.no.13-18): Study the following information carefully to answer the given questions.

A well-established company located in an eight-floor building, a single flat in each floor, numbered one to eight (the ground floor is numbered 1, the floor above is numbered 2, and so on, and the top most floor is numbered 8).Eight friends M, N, O, P, Q, R, S and T are working in the company, each one being placed in each floor.Each floor of the building is named by a peculiar name such as - Altius, Haitius, Elitica, Fortius, Grandius, Citius, Zenith and Royale. Each person is working in different department- Audit, Human Resource, Corporate governance, Sales, Administration, Customer Service, Finance and Accounts, and each department is located in each floor but not necessarily in the same order given.

There are two floors between the floors of R and Q. R does not belong to Haitius and does not work on even numbered floor.

There is one floor between the floor of the person who is in Finance and the one which is named Zenith.

The person who is in Finance department belongs to Fortius and works on even numbered floor, but not on the top floor.

The person who is in Human Resource department is in Elitica and works on third floor.

R is not in Human Resource department. S is not related to either Zenith or Elitica. S does not work on a floor immediately above or immediately below the floor on which P works. P is not in Customer Service department and he never works in Royale, Haitius or Altius.

The floor of M, who is working in Corporate governance, is just above the floor of Administration and just below the floor in which Finance department is located. T, working in the Sales department, works in Grandius, is above the R's floor but not on the Top floor. There is only one floor above the floor in which Accounts department is situated. The person working in Administration is related to Citius and works on fourth floor. M does not work in Haitius or Altius. O is not in Accounts department and works neither in Fortius nor in Zenith.

13. Which of the following flats has Corporate governance department?
1) Haitius 2) Royale 3) Altius
4) Zenith 5) None of theseT

14. On which of the following floors does S works?
1) 8th 2) 3rd 3) 6th
4) 5th 5) None of these

15. The name of the flat in which Accounts department is located?
1) Haitius 2) Royale 3) Altius
4) Zenith 5) None of these

16. Who among the following works on the top most floor, i.e floor number 8?
1) N 2) P 3) S
4) O
5) None of these

17. Who among the following is in Customer Service department?
1) N 2) P 3) R
4) O 5) None of these

18. Who among the following works in Altius?
1) N 2) P 3) R
4) O
5) None of these

Directions(Q.no.19-23): in a certain instruction system, the different computation processes are written as follows:

(I) P % Q $ R means P is multiplied by the sum of Q and R
(II) P D Q © R means P is subtracted from Q and the resultant is divided by R
(III) P # Q * R means P is added to the resultant when Q is divided by R
(IV) P P Q @ R means the product of Q and R is subtracted from P

In each of the questions below, a set of instruction sequence is given. You are required to find out the outcome which should come in place of question mark (?) in each of the given sets of sequence.

19. 20 # 25 * 5 = M
M % 80 $ 20 = ?
1) 1660 2) 2500 3) 2800
4) 8250 5) 7240

20. 140 D 300 © 4 = Z
160 P Z @ 2 = ?
1) 80 2) 140 3) 60
4) 30 5) 70

21. 12 % 2 $ 8 = A
A D 200 © 8 = ?
1) 4 2) 2 3) 10
4) 3 5) 7

22. 20 % 10 $ 20 = T
T P 150 @ 4 = ?
1) 40 2) 100 3) 20
4) 0 5) 10

23. 35 # 300 * 15 = M
450 D 1000 © M = ?
1) 2 # 5 * 5 2) 5 P 3 @ 5
3) 8% 1 $ 2 4) 4 # 24 * 4
5) None of the above

Key with Solutions

(Q.no.1-5):

1) 3;
B ³ D ³ M ³ P ³ A
Hence, either I or II follows.


2) 1;
K > R > O
Hence, Conclusion I follows.
R ³ P > Q £ S = T
R and T cannot be compared. Hence, Conclusion II does'nt follows.

3) 3;
R = Y ³ X = P ³ C = Z
Hence, either I or II follows.

4) 5;
C ³ P = A > Y ³ B ³ K
Hence,C>K Conclusion I is true.
Hence, A>K. Conclusion II is also true.

5) 5;
P = N £ M £ L £ D < B
Hence, conclusion I & II are true.

(Q.no.6-12):



6) 2; 7) 4; (In all the options second person is immediate right of the first person)
8) 3; 9) 1; 10) 2; 11) 3; 12) 3;

(Q.no.13-18):

Floor	Person	Department	Name of the flat
8	P	AUDIT	ZENITH
7	N	ACCOUNTS	HAITIUS
6	S	FINANCE	FORTIUS
5	M	CORPORATE GOVERNANCE	ROYALE
4	Q	ADMINISTRATION	CITIUS
3	O	HUMAN RESOURCE	ELITICA
2	T	SALES	GRANDIUS
1	R	CUSTOMER SERVICE	ALTIUS

13) 2; 14) 3; 15) 1;
16) 2;
17) 3;
18) 3;
19) 2;
20 + 25 ÷ 5 = 25
25 (80 + 20) = 2500
20) 1;
300 - 140 = 160; 160 ÷ 4 = 40
40 × 2 = 80; 160 - 80 = 80
21) 3;
12 (2+8) = 120
200 - 120 = 80; 80 ÷ 8 = 10
22) 4;
20 (10 + 20) = 600;
600 - 150×4 = 0
23) 4;
35 + 300 ÷ 15 = 55
1000 - 450 = 550;
550 ÷ 55 = 10 4 + 24 ÷ 4 = 10